
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 296

శుక్రవారం 17-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నీట్ యూజీ-2025 పెన్, పేపర్‌తోనే..

- ఒకేరోజు-ఒకే షిఫ్టులో ఓఎంఆర్ విధానంలో పరీక్ష
- అక్రమాలకు తావు లేకుండా చూసేందుకే ఈ విధానమన్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ
- రాధాకృష్ణన్ కమిటీ సిఫారసులను పట్టించుకోని ఎన్‌టీఏ.... ఎన్‌ఎంసీ నిర్ణయం ప్రకారం పెన్, పేపర్ విధానానికే మొగ్గు

13లో

సెక్షన్-3 ప్రకారమే..
కృష్ణా జలాల పునఃపంపిణీ!

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తాజా నిర్ణయంతో మార్గం సుగమం

తెలంగాణకు అనుకూలంగా అడుగులు .. ఏపీకి ఎదురుదెబ్బ

- ఐఎస్‌డబ్ల్యూడీఏ-1956లోని సెక్షన్-3 కింద రెండు రాష్ట్రాల మధ్య 1,050 టీఎంసీల పంపిణీకి చాన్స్
- తెలంగాణ కోరుతున్నట్టుగా పూర్తైన, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశల్లోని ప్రాజెక్టులకూ నీటి కేటాయింపుల పరిశీలనకు అవకాశం
- సెక్షన్-3 కింద విచారించిన తర్వాతే పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 కింద విచారిస్తామన్న ట్రిబ్యునల్
- రాష్ట్ర ఐఏపై మధ్యంతర ఉత్తర్వులు
- సెక్షన్-89 కిందే తొలుత విచారణ జరపాలని కోరిన ఏపీ
- దీనికింద 'ప్రాజెక్టులవారీ'గా కేటాయింపులకు మాత్రమే అవకాశం
- ట్రిబ్యునల్ విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అందుబాటులో ఉన్న కృష్ణా జలాలు మొత్తం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య పునఃపంపిణీకి మార్గం ఏర్పడింది. అలాగే తెలంగాణ కోరుతున్న విధంగా ఇప్పటికే వాడకంలో ఉన్న ప్రాజెక్టులతో పాటు నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదనల దశలో ఉన్న ప్రాజెక్టులకు సైతం నీటి కేటాయింపులను కృష్ణా ట్రిబ్యునల్ పరిశీలించేందుకు అవకాశం చిక్కింది. తొలుత అంతర్రాష్ట్ర నదీ వివాదాల చట్టం (ఐఎస్‌డబ్ల్యూడీఏ) 1956లోని సెక్షన్-3 కింద.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీకి 2023 అక్టోబర్ 6న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన అదనపు రెఫరెన్స్ ప్రకారమే విచారణ నిర్వహించాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాతే ఏపీ కోరిన విధంగా రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 కింద విచారణ నిర్వహిస్తామని తెలిపింది. తెలంగాణ దాఖలు చేసిన ఇంటర్‌లొక్యూటరీ అప్లికేషన్ (ఐఏ)పై గురువారం ఢిల్లీలో విచారణ నిర్వహించిన ట్రిబ్యునల్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ట్రిబ్యునల్ విచారణకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ట్రిబ్యునల్ నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

సమాంతర విచారణ జరపలేం

ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్– 89 కింద రెండు రాష్ట్రాల సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్ ముగియడంతో

మిగతా 14వ పేజీలో ▶

డాకింగ్ సక్సెస్

అనుసంధానమైన స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు



- అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ సాంకేతికతను సాధించిన నాలుగో దేశంగా భారత్ ఘనత
- ఇస్రో కిరీటంలో మరో కలికితురాయి
- కొత్త సంవత్సరంలో బోణీ
- ప్రధాని సహా ప్రముఖుల హర్షాతిరేకాలు
- దేశ భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు స్పేడెక్స్ డాకింగ్‌ను తొలిమెట్టుగా అభివర్ణించిన మోదీ... చంద్రయాన్-4, గగన్‌యాన్ ప్రయోగాలకు ఈ సాంకేతికత దోహదపడుతుందన్న ఇస్రో శాస్త్రవేత్తలు

6లో

శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో
మూడో లాంచ్ ప్యాడ్

రూ. 3,984.86 కోట్లతో నాలుగేళ్లలో నిర్మాణం



- కేంద్ర కేబినెట్ ఆమోదం
- న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్ ప్రోగ్రామ్ సహా ఇస్రో భవిష్యత్ మిషన్‌లకు దోహదం... ఈ ప్రాజెక్టులో పరిశ్రమల భాగస్వామ్యానికి చోటు

6లో



8వ వేతన సంఘానికి ఓకే

ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ప్రధాని మోదీ

- వచ్చే ఏడాదితో 7వ వేతన సంఘం కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో నిర్ణయం
- కేంద్ర ఉద్యోగుల జీతభత్యాలు, వేతనాలు, అలవెన్సులు, ఇతర ప్రయోజనాల అంశాలను నిర్ణయించడంలో పే కమిషన్‌దే కీలకపాత్ర
- వేతన సంఘం సిఫార్సులు అమలైతే 50 లక్షల మంది కేంద్ర ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు చేకూరనున్న లబ్ధి

6లో



ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

17 మంది మావోయిస్టులు మృతి

- మృతుల్లో తెలంగాణ కేడర్‌కు చెందిన వారే అధికం?
- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో మావోల శిబిరంపై 2 వేల మంది భద్రతా బలగాల మెరుపు దాడి
- ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 దాకా కొనసాగిన కాల్పులు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

6లో

ప్రాజెక్టులకు అటవీ అనుమతులివ్వండి

అనుమతులు రాక ఆగిన 161 ప్రాజెక్టులు

- ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్‌కు మార్చేందుకు సహకరించండి
- కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతులు
- భూపేందర్ యాదవ్, కుమారస్వామితో భేటీ

2లో



కేంద్ర మంత్రి భూపేందర్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి

ఢిల్లీలోనూ ఇచ్చిన హామీలు అమలు చేస్తాం

- కాంగ్రెస్ మాట ఇచ్చిందంటే నిలబెట్టుకుంటుంది
- ఢిల్లీ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా
- రూ. 500కే గ్యాస్ సిలిండర్-ఉచిత సామగ్రి కిట్, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గ్యారంటీ కార్డుల ఆవిష్కరణ

2లో



సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

- ముంబైలోని బాంద్రావెస్ట్ నివాసంలో దాడికి పాల్పడిన దుండగుడు... దొంగతనం కోసం ఇంట్లోకి వచ్చి అఘాయిత్యం
- సైఫ్ శరీరంపై ఆరుచోట్ల గాయాలు.. వెంటనే ఆసుపత్రికి తరలింపు
- శస్త్రచికిత్స చేసి వెన్నెముక నుంచి కత్తి మొన తొలగించిన వైద్యులు
- తప్పిన ప్రాణాపాయం... నిలకడగా సైఫ్ ఆరోగ్యం
- నిందితుడి ఆచూకీ కోసం 10 ప్రత్యేక పోలీసు బృందాలు

6లో

నిధులెందుకు మళ్లించారు?

మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించిన ఈడీ అధికారులు

- ఫార్ములా ఈ-ఆపరేషన్ లిమిటెడ్‌కు చెల్లింపులపై ఆరా
- మీరు చెబితేనే అధికారులు నగదు బదిలీకి పాల్పడ్డారా?
- ఆర్బీఐ నిబంధనలు ఎందుకు పట్టించుకోలేదు?
- 7 గంటల పాటు ప్రశ్నల వర్షం.. అవసరమైతే మరోమారు రావాల్సి ఉంటుందని సూచన



విచారణ కోసం ఈడీ కార్యాలయానికి వస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బ్రిటన్‌కు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) ఖాతాల్లోకి హెచ్ఎండీఏ నిధులు ఎందుకు మళ్లించారు?, రేస్ నిర్వహణ ఒప్పందాలను అతిక్రమించి ఎఫ్ఈఓకు డబ్బులు చెల్లించాలని మీరు ఎందుకు ఆదేశించారు?, ఆర్థిక శాఖ, కేబినెట్ అనుమతి లేకుండానే నిధులు ఎందుకు చెల్లించాల్సి వచ్చింది?, మీరు చెబితేనే అధికారులు నగదు బదిలీకి పాల్పడ్డారా?, విదేశీ కంపెనీకి

మిగతా 2వ పేజీలో ▶

లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమా?

సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్

2లో



క్లుప్తంగా...

కొత్త ఏడాది.. కొత్త కొలువుల్లో..

- వివిధ నగరాల్లో వృత్తి నిపుణుల మనోగతం..
- లింక్డ్ఇన్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కొత్త సంవత్సరం రావడంతో పాటే కొత్త ఉద్యోగాల వేట కూడా ఊపందుకుంది. దేశవ్యాప్తంగా పలు నగరాల్లోని 82% మంది వృత్తి నిపుణులు ఈ ఏడాది కొత్త ఉద్యోగంలో చేరాలని కోరుకుంటున్నారు. ప్రముఖ అంతర్జాతీయ సామాజిక, ఉద్యోగ సమాచార వేదిక లింక్డ్ఇన్ ఈ విషయాన్ని వెల్లడించింది. వివిధ నగరాల్లో తాజాగా నిర్వహించిన అధ్యయన ఫలితాలను ఈ సంస్థ వెల్లడించింది. మార్పు కోసం ఆశిస్తున్నప్పటికీ.. గత సంవత్సర కాలంలో ఈ ప్రక్రియ కష్టతరంగా మారిందని 55% మంది నిపుణులు చెబుతున్నారు. వీరిలో 49% మంది ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నా.. స్పందన కొద్ది స్థాయిలో మాత్రమే వస్తోందంటున్నారు. హెచ్ఆర్ నిపుణులలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది కూడా ఇదే విధంగా భావిస్తున్నారు, అయినప్పటికీ.. ఉద్యోగ మార్కెట్ మెరుగుపడుతుందని నమ్ముతున్న 58% మంది కొత్త ఉద్యోగం సంపాదించగలమే ఆశావాదంతో ఉన్నారు.

మహిళలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

సీఎం, పీసీసీ అధ్యక్షుడికి మహిళా కాంగ్రెస్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: నామినేటెడ్ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరనున్నట్లు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో మహిళా కాంగ్రెస్ కీలకపాత్ర పోషించిందని, ప్రభుత్వ పదవుల్లో కూడా మహిళలకు అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. పీసీసీ పదవుల్లో కూడా మహిళలకు స్థానం కల్పించాలని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను కోరతామని తెలిపారు. మహిళా కాంగ్రెస్ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే సభ్యత్వ నమోదులో ముందంజలో నిలిచిందని, సభ్యత్వాన్ని బట్టి పదవులు ఇస్తారని అన్నారు. జిల్లాల వారీగా సభ్యత్వ నమోదును బట్టి కమిటీ సభ్యులకు సంబంధిత పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.

ప్రాజెక్టులకు అటవీ అనుమతులివ్వండి

అనుమతులు రాక ఆగిన 161 ప్రాజెక్టులు

- ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్‌కు మార్చేందుకు సహకరించండి
- కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతులు
- భూపేందర్ యాదవ్, కుమారస్వామితో భేటీ



గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రి కుమారస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘువీర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు వెంటనే మంజూరు చేయాలని విన్నవించారు. అనుమతుల జాప్యంవల్ల పలు ప్రాజెక్టులు నిలిచిపోయాయని తెలిపారు. ఆర్టీసీకి సంబంధించిన పలు అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా.. గురువారం ఆయన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులతో కలిసి పలువురు కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు. ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

పర్యావరణ అనుమతులు మంజూరు చేయండి

తెలంగాణలో చేపడుతున్న పలు ప్రాజెక్టులకు అటవీ, పర్యావరణ అనుమతులు వెంటనే ఇవ్వాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో ఢిల్లీలోని ఆయన కార్యాలయం ఇందిరా పర్యావరణ్ భవన్‌లో గురువారం సాయంత్రం సీఎం భేటీ అయ్యారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో రాష్ట్రంలో 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని తెలిపారు. 38 ప్రాజెక్టులకు వన్యప్రాణి సంరక్షణ చట్టాలపరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పీఎంజీఎస్‌వై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని వివరించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు అనుమతుల విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

ఆర్టీసీ బస్సుల మార్పునకు సహకరించండి

హైదరాబాద్‌లో వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆయన కార్యాలయంలో సీఎం భేటీ అయ్యారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద జీసీసీ పద్ధతిలో బస్సులు కేటాయించాలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు ఎలక్ట్రిక్ కిట్లు అమర్చి రిట్రో ఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉన్న విషయాన్ని కుమారస్వామికి వివరించారు. హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే 2,800 బస్సులను జీసీసీతో పాటు రిట్రో ఫిట్మెంట్ మోడల్ కింద కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను కూడా సీఎం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం వెంట మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నారు.

ఢిల్లీలోనూ ఇచ్చిన హామీలు అమలు చేస్తాం

- కాంగ్రెస్ మాట ఇచ్చిందంటే నిలబెట్టుకుంటుంది
- ఢిల్లీ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి భరోసా
- డీపీసీసీ కార్యాలయంలో రెండు గ్యారంటీ కార్డులు ఆవిష్కరణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మాదిరిగానే ఢిల్లీలోనూ కాంగ్రెస్ పార్టీ ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణలో ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేశామని, ఢిల్లీలోనూ ఎన్నికల సందర్భంగా హామీలు ఇస్తున్నామన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే మూడు గ్యారంటీలను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (డీపీసీసీ) కార్యాలయంలో మరో రెండు గ్యారంటీ కార్డులు రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. వాటిలో ఒకటి రూ.500కే గ్యాస్ సిలిండర్–ఉచిత సామగ్రి కిట్ (5 కేజీల బియ్యం, 2 కేజీల పంచదార, 1 లీటర్ వంట నూనె, 6 కేజీల పప్పులు, 250 గ్రాముల టీ పొడి) కాగా.. ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రెండవది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు.

మేం ఎన్నికల కోసం రాజకీయాలు చేయం

'తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే 25 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.22 వేల కోట్ల రుణమాఫీ చేశాం. స్వతంత్ర భారత చరిత్రలో ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలు కూడా ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ చేయలేదు. మరోవైపు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం. 53 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. మేం ఎన్నికల కోసం రాజకీయాలు చేయం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం. సోనియాగాంధీ తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి దానిని నిలబెట్టుకున్నారు. ఇప్పుడు ఢిల్లీ ప్రజలకు కూడా హామీలిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో ఈ రాష్ట్రంలో పేద ప్రజల స్థితిగతులు మెరుగు పడతాయి..'అని రేవంత్ చెప్పారు.

లిక్కర్ స్కాంలో అసలు పార్టనర్‌ను ఓడిస్తాం

'ప్రధాని మోదీ, ఢిల్లీ మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ పేర్లే వేర్వేరు కానీ.. చేతలు మాత్రం ఒక్కటే. ఆ ఇద్దరూ ఢిల్లీకి చేసింది ఏమీ లేదు. లిక్కర్ స్కాంలో ఒక పార్టనర్‌ను మేం తెలంగాణలో ఓడించాం, ఇప్పుడు అసలు పార్టనర్ (కేజ్రీవాల్)ను ఓడించడానికి ఢిల్లీకి వచ్చాం. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలి..'అని సీఎం విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ సాకారంలో జైపాల్‌రెడ్డి పాత్ర చిరస్మరణీయం

ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. గురువారం జైపాల్‌రెడ్డి జయంతి పురస్కరించుకొని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రేవంత్ నివాళులర్పించారు. జైపాల్‌రెడ్డి నైతిక విలువలకు కట్టుబడి పనిచేశారని, ఉమ్మడి ఏపీ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో బలమైన గళం వినిపించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు సురేష్ షెట్కార్, రఘువీర్, మల్లు రవి, ఎంఎల్ఏలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాయకులు రోహిణ్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఇందిరాభవన్‌లో 'పీవీ'కి చోటు

- కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయంలో పీవీ నరసింహారావు ఫొటోలు
- దివంగత నేతను ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్ విస్మరించిందన్న విపక్షాల విమర్శల నేపథ్యంలో ఆయనకు గుర్తింపు



కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన పీవీ చిత్రం

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ తమ నూతన కార్యాలయం ఇందిరా గాంధీ భవన్‌లో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు తగినంత గుర్తింపునిచ్చింది. పీవీని కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగానే విస్మరించిందని, ఆయన అంత్యక్రియలు సైతం దేశ రాజధానిలో జరగకుండా అడ్డుకుందన్న విమర్శలు తిప్పికొట్టేలా.. ఇందిరా భవన్‌లో ఆర్థిక సరళీకరణకు నాంది పలికిన మాజీ ప్రధానమంత్రి మూడు చిత్రపటాలను గోడలపై అలంకరించింది. ఇందులో ఒకటి సోనియాతో ఉన్న ఫొటో ఉండగా, అందులో ప్రియాంకాగాంధీ సైతం ఉన్నారు. మరొక దాంట్లో అప్పటి రాష్ట్రపతి శంకర్ దయాళ్‌శర్మతో కలసి రాష్ట్రపతి భవన్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు కిమ్ యంగ్ సామ్‌తో కలసి ఉన్నారు. ఇక మరొక ఫొటోలో రాజీవ్ గాంధీతో ఉన్నారు. యువకుడిగా ఉన్న మన్మోహన్ సింగ్ కూడా అదే ఫ్రేమ్‌లో ఉన్నారు. బుధవారం పార్టీ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రదర్శించిన కొత్త కార్యాలయం వీడియోలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు ప్రధాన మంత్రులు నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ, మన్మోహన్ సింగ్‌ల వారసత్వాన్ని ప్రేక్షకులకు చూపించగా, ఇందులో పీవీని ప్రత్యేకంగా ప్రస్తావించారు. పీవీ 1991 నుంచి 1996 వరకు ప్రధానిగా, 1992 – 1994 మధ్య కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించినప్పటికీ ఆయనను విస్మరించారన్న అపవాదు కాంగ్రెస్‌పై ఉంది.

విమర్శల నేపథ్యంలో..: 2004 డిసెంబర్‌లో పీవీ మరణించినప్పుడు ఆయన భౌతిక కాయాన్ని ఢిల్లీలో పార్టీ కార్యాలయంగా ఉన్న 24, అక్బర్ రోడ్‌కి రానీయకుండా కొందరు పార్టీ నేతలు అడ్డుకున్నారని విపక్షాలు పదేపదే కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నాయి. ఆయన ఎయిమ్స్‌లో మరణించినప్పటికీ ఉద్దేశపూర్వకంగా ఢిల్లీలో కాకుండా హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరిపించారనే ఆరోపణలున్నాయి. ఇప్పటివరకు కొనసాగిన ఏఐసీసీ పాత కార్యాలయంలో ఎక్కడా పీవీ ఆనవాళ్లు లేకపోవడంతో ఈ వాదనలకు బలం చేకూరింది. అయితే గత ఏడాది డిసెంబర్ 26న మరణించిన మన్మోహన్ సింగ్‌కు స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేయడంతో బీజేపీ తిరిగి పీవీ అంశాన్ని లేవనెత్తింది. బీజేపీకి చెందిన సీనియర్ నేత గౌరవ్ భాటియా ఈ విషయంలో కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ విమర్శల నేపథ్యంలోనే పీవీకి ఇందిరా భవన్‌లో సముచిత గౌరవాన్ని ఇచ్చారనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

భారీ పెట్టుబడులే లక్ష్యంగా..

- సింగపూర్‌కు సీఎం బృందం.. 3 రోజుల పర్యటన
- అక్కడి నుంచి స్విట్జర్లాండ్‌కు
- వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొననున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు సమీకరించే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం విదేశీ పర్యటనకు బయల్దేరింది. గురువారం రాత్రి ఢిల్లీ నుంచి సింగపూర్‌కు బయలుదేరిన బృందంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోపాటు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ బృందం 17, 18, 19 తేదీల్లో సింగపూర్‌లో పర్యటిస్తుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి సీఎం వివిధ కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతారు. సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)ని సందర్శించి నైపుణ్య అభివృద్ధికి ఆ యూనివర్సిటీ ఎంచుకున్న కోర్సులు, అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకారం అందించేందుకు ఈ వర్సిటీతో ఒప్పందం చేసుకుంటారు. సింగపూర్‌లో రివర్ ఫ్రంట్‌ను సందర్శిస్తారు. మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నందున అక్కడి రివర్ ఫ్రంట్ ఏరియా అభివృద్ధి చేసిన తీరుతెన్నులను పరిశీలిస్తారు. సింగపూర్ పర్యటన అనంతరం ఈ బృందం 20వ తేదీ ఉదయం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు చేరుకుంటుంది. 20 నుంచి 22వ తేదీ వరకు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు–2025లో పాల్గొంటుంది. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా భావిస్తోంది.

గత ఏడాదికి మించి ఆకర్షించేందుకు...

గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం ఆకర్షించింది. ఈసారి అంతకుమించి పెట్టుబడుల లక్ష్యంగా తమ పర్యటన సాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వ విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, ఉత్పాదక రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, వరల్డ్ క్లాస్ సిటీగా గ్రేటర్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లు, మెట్రో విస్తరణ దేశవ్యాప్తంగా అందరినీ ఆకర్షిస్తున్నాయి.

పార్టీ ఫిరాయింపులపై 'సుప్రీం'కు బీఆర్ఎస్

పదిమంది ఎమ్మెల్యేలపై రెండు పిటిషన్‌లు దాఖలు

- దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై ఎస్ఎల్‌పీ
- మిగతా ఏడుగురు ఎమ్మెల్యేలపై రిట్ పిటిషన్



సాక్షి, న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు చేపట్టేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 10 మంది ఎమ్మెల్యేలపై రెండు పిటిషన్లు దాఖలు చేసింది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానందల పేర్లతో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు అయ్యింది. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరెకపూడి గాంధీలపై బీఆర్ఎస్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్, తదితరుల పేర్లపై మరో రిట్ పిటిషన్ దాఖలైంది. గురువారం బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది మోహిత్‌రావు ఈ రెండు పిటిషన్లను సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరిన ఈ పది మందిపై అనర్హత వేటు వేసేలా శాసనసభ స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.

కనీసం నోటీసులు ఇవ్వలేదు

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు స్పీకర్ కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని ధర్మాసనానికి తెలిపారు. ఫిరాయింపులకు సంబంధించి గతంలో కేశం మేఘాచంద్ర కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఈ సందర్భంగా బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది. ఈ తీర్పు ప్రకారం..పార్టీ ఫిరాయింపులు, ఫిర్యాదులపై స్పీకర్ 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పిటిషన్‌లో పొందుపరిచింది. ఈ తీర్పును పరిగణనలోకి తీసుకొని పార్టీ మారిన 10 మందిపై నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అనర్హతపై స్పీకర్/ అసెంబ్లీ కార్యదర్శికి సూచించాలని బీఆర్ఎస్ సుప్రీంను కోరింది.

9 నెలలుగా స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు

దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై దాదాపు 250 పైగా పేజీలతో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఇందులో హైకోర్టు ఆదేశాలు, ఫిరాయింపులపై స్పీకర్‌కు అందజేసిన ఫిర్యాదులు, ఇతర అంశాలను కూడా జత చేశారు. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలపై సుమారు 500 పైగా పేజీలలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పది మందిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసి 9 నెలలైనా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని పిటిషన్‌లలో ప్రస్తావించారు. తమ పిటిషన్లపై హైకోర్టు ఆర్డర్ వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా కనీసం స్పీకర్ కార్యాలయం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

న్యాయబృందంతో హరీశ్ భేటీ

ముందుగా న్యాయవాది మోహిత్ రావు, ఇతర న్యాయ బృందంతో హరీశ్‌రావు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలు చేయాల్సిన ఎస్ఎల్‌పీ, రిట్ పిటిషన్లపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం హరీశ్‌రావు పర్యవేక్షణలో ఈ వ్యాజ్యాలను మోహిత్‌రావు సుప్రీంకోర్టులో ఫైల్ చేశారు.

వచ్చినప్పుడే చూద్దాం

ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో జాప్యం అవుతున్న కారణంగా బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ కోరుతుందని అందరూ ఎదురుచూశారు. ఇటీవల ఫార్ములా–ఈ రేసు వ్యవహారంలో పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలంటూ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ధర్మాసనం అత్యవసర విచారణను తిరస్కరించింది. ఈలోపే కేటీఆర్ ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఎమ్మెల్యేల అనర్హత వేటు అంశంపై అత్యవసరంగా విచారణ చేయాలని సుప్రీంను అడిగిన నేపథ్యంలో.. దీనికి ధర్మాసనం అంగీకరించదేమోనని అనుమానపడ్డ బీఆర్ఎస్.. విచారణకు ఎప్పుడు వస్తే అప్పుడే చూద్దాంలే అన్నట్టుగా మౌనంగా ఉంది.

లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం.. నువ్వు సిద్ధమా?

సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్

- ఎప్పుడు, ఎక్కడికి రావాలో డిసైడ్ చెయ్..
- కక్ష సాధింపు కోసం నాపై పెట్టిన కేసుల దర్యాప్తునకు ప్రజాధనం వృథా ఎందుకు?
- విచారణకు తాను పూర్తిగా సహకరిస్తానని వెల్లడి



ఈడీ విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'నీపై (సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి) ఏసీబీ, ఈడీ కేసులు ఉన్నాయి. నాపైనా ఏసీబీ, ఈడీ కేసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఫార్ములా ఈ–కార్ రేసు, ఓటుకు నోటు కేసులకు సంబంధించి రేవంత్‌ను, నన్ను ప్రశ్నలు అడగండి. నేను సమాధానం చెప్తాను. ఆయన కూడా జవాబు చెప్పాలి. దొంగెవరో? దొరెవరో? రాష్ట్రం మొత్తం చూస్తుంది. ఏ కోర్టు లేదా ఏ జడ్జి ముందైనా సరే.. లై డిటెక్టర్ పరీక్ష పెట్టండి.. నేను రెడీ. లై డిటెక్టర్ పరీక్ష ఎక్కడ పెట్టాలో.. టైం, ప్లేస్ నువ్వే డిసైడ్ చేయ్.. నీ ప్యాలెస్‌లోనైనా.. ఈడీ ఆఫీస్‌లోనైనా నేను సిద్ధం.. నువ్వు సిద్ధమా?'అని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. గురువారం ఈడీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'రాజకీయ వేధింపులు, కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రేవంత్ ప్రభుత్వం నా మీద అక్రమ కేసు పెట్టింది. విచారణ సంస్థలను గౌరవించి నేను ఏసీబీ, ఈడీ విచారణకు హాజరయ్యాను. రెండు సంస్థలు కూడా ఒకే రకమైన ప్రశ్నలు అడిగాయి. అన్నింటికీ నేను సమాధానాలు చెప్పాను. నిధుల బదిలీ పారదర్శకంగా జరిగింది. ఇందులో ఎక్కడ మనీలాండరింగ్ ఉందని ఏసీబీ, ఈడీ అధికారులను అడిగాను. ఏడు గంటలపాటు ప్రశ్నలడిగి నా నుంచి వివరాలు తీసుకున్నారు. ఏసీబీ, ఈడీలకు ఒక్కటే మాట చెప్పాను. మీరు ఎన్నిసార్లు పిలిచినా.. వచ్చి సమాధానం చెబుతాను. విచారణకు పూర్తిగా సహకరిస్తానన్నాను'అని కేటీఆర్ అన్నారు.

ప్రజాధనం వృథా ఎందుకు?

తనపై ప్రభుత్వం పెట్టిన కేసుల విచారణకు రూ.5–10 కోట్లు ఖర్చవుతుందని మీడియాలో చూశానని, అవినీతే జరగని కేసు విచారణకు ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం వృథా చేయడం ఎందుకని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఓటుకు నోటు కేసులో అడ్డంగా ఏసీబీకి రేవంత్ రెడ్డి దొరికిండు కాబట్టే నా మీద కూడా ఏసీబీ కేసు పెట్టిచ్చిండు. రేవంత్ మీద ఈడీ కేసు ఉంది కాబట్టే నా మీద ఈడీ విచారణ జరిపిస్తున్నారు. అసలు అవినీతే జరగని ఈ కేసులో అన్ని పైసలు వృథా చేయడం ఎందుకు? ఆ పైసలతో రైతు రుణమాఫీ చేయొచ్చు? ఇంకా ఏమైనా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయొచ్చు. రేవంత్ రెడ్డికి నేను ఒక ఆఫర్ ఇస్తున్నాను. హైకోర్టు న్యాయమూర్తికానీ, ఇంకెవరైనా న్యాయమూర్తి ముందు గానీ మీడియా సాక్షిగా లైవ్ డిబేట్‌కు పోదాం. అంతిమంగా న్యాయం, ధర్మం, నిజాయితీనే గెలుస్తాయి. హైకోర్టు, సుప్రీంకోర్టు, భారత న్యాయవ్యవస్థ మీద, న్యాయమూర్తుల మీద నాకు పూర్తి విశ్వాసం ఉంది'అని కేటీఆర్ పేర్కొన్నారు.

రేపు విచారణకు రండి

గ్రీన్ కో, ఏస్ నెక్ట్స్ జెన్‌కు ఏసీబీ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కారు రేసు కేసు దర్యాప్తులో ఏసీబీ వేగం పెంచింది. గ్రీన్ కో, ఏస్ నెక్ట్స్ జెన్ సంస్థల ప్రతినిధులు ఈ నెల 18న విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్, ఐఏఎస్ అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ అధికారులు విచారించారు. దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు ఫార్ములా–ఈ రేసుకు మొదట్లో స్పాన్సర్‌గా వ్యవహరించిన ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు దాని అనుబంధ సంస్థ గ్రీన్‌కో కార్యాలయాల్లో ఈనెల 7న ఏసీబీ బృందాలు సోదాలు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని మాదాపూర్ సైబర్ టవర్స్‌లో, మచిలీపట్నంలోని గ్రీన్‌కో కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. తాజాగా ఆ రెండు కంపెనీల ప్రతినిధులకు ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

నిధులెందుకు మళ్లించారు?

▶ మొదటి పేజీ తరువాయి

నగదు చెల్లింపులో ఆర్బీఐ నిబంధనలు ఎందుకు పట్టించుకోలేదు?, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు..ఈసీ అనుమతి తీసుకోవాలని మీకు తెలియదా?, ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వానికి చేకూరిన లబ్ధి ఏంటి?.. అంటూ మాజీమంత్రి కేటీఆర్‌పై ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. సుమారు ఏడు గంటలపాటు విచారణ కొనసాగింది. గురువారం ఉదయం 10.30 గంటలకు కేటీఆర్ బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన మొబైల్ ఫోన్‌ను అధికారులు సెక్యూరిటీ వద్ద డిపాజిట్ చేయించారు. అనంతరం మూడో అంతస్తులో జేడీ రోహిత్ ఆనంద్ ముందు ఓ న్యాయవాదితో కలిసి కేటీఆర్ విచారణకు హాజరయ్యారు. ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో మొత్తం ఐదుగురు సభ్యుల బృందం ప్రశ్నించింది. మధ్యలో కాసేపు భోజన విరామం ఇచ్చారు. సాయంత్రం 5–30 గంటల వరకు విచారణ కొనసాగింది.

రెండు డాక్యుమెంట్లు సమర్పించిన కేటీఆర్

ఈ నెల 8, 9వ తేదీల్లో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, అప్పటి ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ అందజేసిన డాక్యుమెంట్ల ఆధారంగా కూడా ఈడీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. అవసరమైతే మరోమారు విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని సూచించారు. వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్, ఆస్తుల వివరాలు ఆరా తీయగా, అన్నీ అందిస్తానని కేటీఆర్ తెలిపారు. అలాగే ఈడీకి రెండు డాక్యుమెంట్లను (ఫార్ములా–ఈ పైన నీల్సన్ సంస్థ రూపొందించిన నివేదిక, తెలంగాణ ఈవీ పాలసీ -2020) ఇచ్చిన కేటీఆర్ అందుకు సంబంధించి వారి నుంచి రశీదు తీసుకున్నట్లు తెలిసింది.

నిబంధనల ప్రకారమే చెల్లింపులు చేసినట్లు వెల్లడి

విశ్వసనీయ సమాచారం మేరకు.. కేటీఆర్ చాలా ప్రశ్నలకు విపులంగా సమాధానం ఇవ్వగా..నిధుల మళ్లింపు అంశం, నిబంధనలు ఎందుకు అతిక్రమించాల్సి వచ్చిందన్న ప్రశ్నల్లో కొన్నింటికి సమాధానాలు దాటవేశారు. మరికొన్నింటికి ముక్తసరిగా జవాబులిచ్చారు. మంత్రిగా తనకు అన్ని విషయాలు తెలుసని చెప్పారు. బిజినెస్ రూల్స్, ఆర్బీఐ నిబంధనల ప్రకారమే ఎఫ్ఈఓకు చెల్లింపులు జరిగాయని స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ డ్యామేజ్ కాకూడదనే ఎఫ్ఈవోకు చెల్లింపులు జరిపామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా హెచ్ఎండీఏ బోర్డు నుంచి మంజూరైన రూ.45.71 కోట్లకు సంబంధించి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేవని చెప్పారు. కేటీఆర్ చెప్పిన అంశాలన్నీ అధికారులు రికార్డ్ చేసినట్టు సమాచారం. ఎఫ్ఈఓ ప్రపోజల్స్ ఎవరు తీసుకొచ్చారు? కంపెనీనే నేరుగా సంప్రదించిందా? లేక ఇతర ప్రైవేట్ కంపెనీలు ఈ కార్ రేస్ ఫార్ములాను రాష్ట్రానికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశాయా? అనే కోణంలో కూడా ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈవెంట్ నిర్వహణకు స్పాన్సర్‌గా అగ్రిమెంట్ చేసుకున్న ఏస్ నెక్ట్స్ జెన్ సంస్థ గురించి కూడా ఆరా తీసినట్లు సమాచారం.

పటిష్ట బందోబస్తు .. ఉద్రిక్తత

కేటీఆర్ ఈడీ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉదయాన్నే పెద్ద సంఖ్యలో ఈడీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేటీఆర్ ఈడీ కార్యాలయంలోకి వెళుతున్న సమయంలో పార్టీ శ్రేణులు పెద్దపెట్టున జై తెలంగాణ నినాదాలతో ఆయన వాహనం వైపు దూసుకొచ్చారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కొంతసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవికుమార్, మన్నె క్రిశాంక్, సుమిత్రానంద్, పావని గౌడ్, కీర్తిలత గౌడ్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. సాయంత్రం 5–30 గంటలకు కేటీఆర్ తిరిగి వెళ్లే సమయంలోనూ కొందరు నాయకులు, కార్యకర్తలు అక్కడే ఉండి జై తెలంగాణ నినాదాలు చేశారు.

క్లుప్తంగా...

పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ వంద రోజుల ఉచిత శిక్షణ



సాక్షి, హైదరాబాద్: రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), బ్యాంకింగ్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న బీసీ అభ్యర్థులకు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ వందరోజుల ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఆయా ఉద్యోగాలకు సిద్ధమవుతున్న బీసీ అభ్యర్థులు ఫిబ్రవరి 9లోపు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల్లోపు ఉండాలని సూచించారు. ఈనెల 20 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కులను అర్హతగా తీసుకుని శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం లేదా బీసీ స్టడీసర్కిల్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

టీజీపీఎస్సీని సందర్శించిన బిహార్ సర్వీస్ కమిషన్ బృందం



సాక్షి, హైదరాబాద్: బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతినిధి బృందం గురువారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయాన్ని సందర్శించింది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియలో టీజీపీఎస్సీ అనుసరిస్తున్న విధానాలను ప్రత్యక్షంగా వీక్షించింది. అనంతరం టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో న్యాయపరమైన చిక్కులపై సుదీర్ఘంగా చర్చించారు. టీజీపీఎస్సీ తలపెట్టిన సీబీఆర్‌టీ (కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) విధానం అత్యంత మెరుగ్గా ఉందని, బిహార్‌లో ఈ విధానం అమలుకు ప్రయత్నిస్తామని బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతినిధులు సర్ప్ నారాయణ్ యాదవ్, నావల్ కిషోర్, ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ భగత్ వివరించారు. టీజీపీఎస్సీ విధానాలను ప్రశంసించారు.

మరో 20,000 సీట్లు కావాలి!



ఏఐసీటీఈకి రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల దరఖాస్తు

- తెలంగాణలో ఇప్పటికే 1.45 లక్షల సీట్లు
- దక్షిణాది రాష్ట్రాల నుంచే 50 వేల సీట్ల కోసం అప్లికేషన్లు
- త్వరలో రాష్ట్రంలో ఏఐసీటీఈ బృందాల పర్యటన
- సీట్లు పెంచే ముందు తమ అనుమతి తీసుకోవాలని ఏఐసీటీఈకి లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: అదనపు ఇంజనీరింగ్ సీట్ల కోసం దక్షిణాది రాష్ట్రాల నుంచి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)కి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ ఏడాది దాదాపు 50 వేల ఇంజనీరింగ్ సీట్లు అదనంగా కావాలని ఏఐసీటీఈకి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కాలేజీలు దరఖాస్తులు చేశాయి. తెలంగాణ నుంచి దాదాపు 20 వేల అదనపు సీట్ల కోసం దరఖాస్తులు అందాయి. అయితే సీట్లు పెంచే ముందు తమ అనుమతి తీసుకోవాలని, అప్పుడే అనుబంధ గుర్తింపు ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం ఏఐసీటీఈకి లేఖ రాసింది. మరోవైపు కారణాలు లేకుండా సీట్ల పెంపును తిరస్కరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కాలేజీలు అంటున్నాయి. ఏఐసీటీఈ వర్గాలు మాత్రం సీట్ల పెంపుపై తమకు అభ్యంతరం లేదని తెలిపాయి. రాష్ట్రంలో ఇప్పటికే 58 శాతం ఇంజనీరింగ్ సీట్లు కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లోనే ఉన్నాయి. కొత్త సీట్లు కూడా ఇదే బ్రాంచీలో ఉండే అవకాశం ఉంది.



దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల వివరాలు	రాష్ట్రం	2023	2024
	తమిళనాడు	2,75,830	3,08,686
	ఆంధ్రప్రదేశ్	1,60,014	1,83,532
	తెలంగాణ	1,25,344	1,45,557

దక్షిణాదిలోనే బీటెక్ సీట్లు అధికం

దక్షిణాది రాష్ట్రాల్లోనే అత్యధిక సంఖ్యలో ఇంజనీరింగ్ సీట్లున్నాయి. దేశంలోని మొత్తం సీట్లలో తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో 35 శాతం బీటెక్ సీట్లున్నాయి. దేశం మొత్తంలో 14.90 లక్షల బీటెక్ సీట్లుంటే.. తమిళనాడు 3.08 లక్షల సీట్లతో మొదటి స్థానంలో ఉంది. 1.83 లక్షల సీట్లతో ఏపీ రెండోస్థానంలో, తెలంగాణ 1.45 లక్షల సీట్లతో మూడోస్థానంలో ఉంది. సీట్లు పెంచుకోవడంలోనూ ఈ మూడు రాష్ట్రాలే అగ్రస్థానంలో ఉన్నాయి. మూడేండ్లుగా దేశంలో బీటెక్ సీట్లు గణనీయంగా పెరుగుతున్నాయి. అయితే 2014-15తో పోల్చితే సీట్ల సంఖ్య తక్కువగానే ఉండటం గమనార్హం. 2014-15లో దేశంలో 17.05 లక్షల ఇంజనీరింగ్ సీట్లుండగా, 2021-22 వరకు ఆ సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఆ తర్వాత మళ్లీ పెరగడం ప్రారంభమైంది.

50% మూడు రాష్ట్రాల్లోనే..

2024-25 విద్యా సంవత్సరంలో పెరిగిన బీటెక్ సీట్లల్లో 50 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. దేశం మొత్తంగా చూస్తే 50 శాతం సీట్లు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనే పెరిగాయి. తమిళనాడులో 32,856 సీట్లు పెరగగా, ఆంధ్రప్రదేశ్‌లో 23,518, తెలంగాణలో 20,213 సీట్లు పెరిగాయి.

జాతీయంగా వర్కింగ్ ప్రొఫెషనల్స్ బీటెక్ (ఈవినింగ్ బీటెక్) కోర్సును నిర్వహించేందుకు 400 - 500 విద్యా సంస్థలకు ఏఐసీటీఈ అనుమతినిచ్చింది. ఈ కాలేజీల్లో దాదాపు 40 వేల నుంచి 50 వేల సీట్లు పెరిగాయి.

ఈ విద్యా సంవత్సరంలో 2,906 కాలేజీలకు ఏఐసీటీఈ గుర్తింపునిచ్చింది. 1,256 కాలేజీలు సీట్లు పెంచుకున్నాయి.

జాతీయంగా కోర్ ఇంజనీరింగ్ బ్రాంచీల్లో ఆక్యుపెన్సీ రేషియో (సీట్ల భర్తీ నిష్పత్తి) 2021-22లో 72 శాతం ఉండగా, 2022-23కు వచ్చే సరికి 81 శాతానికి పెరిగింది.

త్వరలో ఏఐసీటీఈ పరిశీలన

తెలంగాణలో 23 ప్రైవేటు కాలేజీలుఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి కోర్సులను కోర్ గ్రూపుతో కాంబినేషన్‌గా అందించాలని ప్రతిపాదిస్తున్నాయి. అవసరమైన మౌలిక వసతులు తమకు ఉన్నాయని దరఖాస్తుల్లో పేర్కొన్నాయి. వీటిని స్వయంగా పరిశీలించేందుకు త్వరలో ఏఐసీటీఈ బృందాలు తెలంగాణలో పర్యటించనున్నాయి.

విద్యార్థులకు 'స్కిల్ స్ప్రింట్' ఇంటర్న్‌షిప్

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, జోగిందర్, మెహతా

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు 'టీ వర్క్స్', యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సంయుక్తాధ్వర్యంలో 'స్కిల్ స్ప్రింట్' పేరిట ప్రత్యేక ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. గురువారం ప్రోగ్రామ్ పోస్టర్‌ను సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్కిల్ స్ప్రింట్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ వ్యవధి 90 రోజులని, ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, రోబోటిక్స్, మేనేజ్‌మెంట్, సేల్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ తదితర రంగాల్లో డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. సంబంధిత పరిశ్రమల నిపుణులు మార్గనిర్దేశనం (మెంటార్ షిప్) చేస్తారని, సొంతంగా ప్రాజెక్టులను రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ శిక్షణను పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్కిల్స్‌వర్సిటీ ద్వారా అకడమిక్ క్రెడిట్స్ ఇస్తామన్నారు. ఆసక్తి గల కళాశాలలు, విద్యార్థులు టీ-వర్క్స్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. దీనికి సంబంధించిన వివరాలు yisu.in వెబ్‌సైట్లో దొరుకుతాయని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో టీ- వర్క్స్ సీఈవో తనికెళ్ల జోగిందర్, వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఛమాన్ మెహతాలు పాల్గొన్నారు.

సొంతం కాని వాటిపై అత్యాశ, సొంతం అయిన వాటిపై నిర్లక్ష్యం తగదు. జీవితంలోని అసంతృప్తికి ఈ రెండే ప్రధాన కారణం.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 17 జనవరి 2025

గాజాలో శాంతి సాధ్యమేనా!

బాంబుల మోత ఆగుతుందంటే... తుపాకులు మౌనం పాటిస్తాయంటే... క్షిపణుల జాడ కనబడదంటే... ఇనుప డేగల గర్జనలు వినబడవంటే... నిత్యం మృత్యువు వికటాట్టహాసం చేస్తున్నచోట హర్షాతిరేకాలు వ్యక్తం కావటం సహజమే. అందుకే 15 నెలలుపైగా... అంటే 467 రోజులుగా రాత్రింబగళ్లు ప్రాణభయంతో కంటి మీద కునుకు లేకుండా గడిపిన గాజా ప్రజానీకం వీధుల్లోకొచ్చి పండుగ చేసుకున్నారు. అటు హమాస్ చెరలో మగ్గుతున్నవారి కుటుంబసభ్యులు సైతం ఆనందోత్సాహాలతో ఉన్నారు. ఇజ్రాయెల్–మిలిటెంట్ సంస్థ హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని మధ్యవర్తులుగా వ్యవహరించిన అమెరికా, ఖతార్ ప్రతినిధులు బుధవారం రాత్రి ప్రకటించగానే ప్రపంచం, ప్రత్యేకించి పశ్చిమాసియా ఊపిరి పీల్చుకున్నాయి. 'నేను దేశాధ్యక్షపదవి స్వీకరించబోయే జనవరి 20 నాటికి బందీలకు స్వేచ్ఛ లభించకపోతే సర్వనాశనం ఖాయమ'ని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పక్షం రోజుల నాడు ప్రకటించారు. 'నా హెచ్చరిక ఫలించబట్టే కాల్పుల విరమణ ఒప్పందం సాకారమైంద'ని ఇప్పుడు ఆయన అంటుంటే... 'నా అనుభవంలోనే అత్యంత కఠినమైన ఈ చర్చల ప్రక్రియను మొత్తానికి సుఖాంతం చేయగలిగాన'ని ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ చెబుతున్నారు. ఈ ఘనత ఎవరి ఖాతాలో పడాలన్నది తేలకముందే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మొండికేస్తున్నారు. తొలుత ఒప్పందాన్ని స్వాగతించిన ఆయనే ఇంకా తేలాల్సినవి ఉన్నాయంటున్నారు. ఒప్పందంపై ఆమోదముద్ర వేసేందుకు నిర్వహించాల్సిన కేబినెట్ సమావేశాన్ని నిలిపివేశారు. ఈలోగా నిన్న, ఇవాళ గాజాపై ఇజ్రాయెల్ సాగించిన బాంబు దాడుల్లో 19మంది పిల్లలు సహా 80 మంది చనిపోయారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతుందా లేదా, ఈ ప్రాంతంలో తాత్కాలికంగానైనా శాంతి నెలకొంటుందా అన్న అంశంలో సందిగ్ధత ఏర్పడింది. సుదీర్ఘకాలం ఘర్షణలతో అట్టుడికినచోట సాధారణ పరిస్థితులు ఏర్పడటం అంత సులభమేమీ కాదు. అందునా ఇజ్రాయెల్‌తో వైరమంటే మామూలుగా ఉండదు.

ఇజ్రాయెల్ భూభాగంలోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి 2023 అక్టోబర్ 7న విచ్చలవిడిగా కాల్పులు జరిపి 1,200 మంది పౌరులను హతమార్చటంతో పాటు, 251 మందిని బందీలుగా తీసుకెళ్లటంతో ఇదంతా మొదలైంది. హమాస్ మతిమాలిన చర్య తర్వాత ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో గాజా, వెస్ట్‌బ్యాంక్‌లపై సాగించిన దాడుల పర్యవసానంగా ఇంతవరకూ కొందరు హమాస్ కీలకనేతలతో పాటు 46,700 మంది పౌరులు చనిపోయారు. ఇందులో అత్యధికులు పిల్లలు, మహిళలే. ఇతరులు నిత్యం చావుబతుకుల మధ్య రోజులు వెళ్లదీస్తున్నారు. ఇజ్రాయెల్ సైన్యం జారవిడిచే కరపత్రాలు సూచించిన విధంగా ఎటు పొమ్మంటే అటు వలసపోతూ అష్టకష్టాలు పడుతున్నారు. తిండీ, నీళ్లూ కరువై, అంతంతమాత్రం వైద్య సదుపాయాలతో జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. ఒక్కోటి 42 రోజులు (ఆరు వారాలు)ఉండే మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా అమలవుతుందా, మధ్యలో తలెత్తగల సమస్యలేమిటి అన్న ప్రశ్నలకు ఎవరి దగ్గరా సమాధానాల్లేవు. హమాస్ చెరలో ఇంకా 94 మంది బందీలు మిగిలారని, వారిలో 34మంది మరణించివుండొచ్చని ఇజ్రాయెల్ అంచనా. తొలి దశ అమల్లోవుండగా గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ దళాలు వైదొలగాలి. ఆ తర్వాత పాలస్తీనా ఖైదీల విడుదలకు బదులుగా 33 మంది బందీలను హమాస్ విడుదల చేస్తుంది. ఒకసారంటూ ఒప్పందం అమలు మొదలైతే ఇరువైపులా ఉన్న బందీలను దశలవారీగా విడుదల చేస్తారు. గాజాకు భారీయెత్తున సాయం అందటం ప్రారంభమవుతుంది. ఒప్పందం ప్రకారం తొలి దశ కొనసాగుతున్న దశలోనే ఇజ్రాయెల్ రెండోదశ కోసం హమాస్‌తో చర్చించటం మొదలెట్టాలి. రెండో దశకల్లా బందీలతోపాటు దాడుల సందర్భంగా హమాస్‌కు చిక్కిన ఇజ్రాయెల్ ఆడ, మగ సైనికులు పూర్తిగా విడుదలవుతారన్నది అంచనా. అప్పుడు మొదలుకొని తొలి దశలో వున్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం శాశ్వత కాల్పుల విరమణగా మారుతుంది. మూడో దశ అంతా పునర్నిర్మాణంపై కేంద్రీకరిస్తారు. హమాస్ బందీలుగా ఉంటూ మరణించినవారి మృతదేహాలను అప్పగించాలి. కేవలం మొదటి దశకు మాత్రమే ప్రస్తుత ఒప్పందం పరిమితమనీ... కొత్తగా చర్చలు జరిగాకే రెండు, మూడు దశలకు సంబంధించి తుది నిర్ణయం ఉంటుందనీ ఇప్పటికే నెతన్యాహూ ప్రకటించారు. తొలి దశ పూర్తయ్యాక మళ్లీ యుద్ధం తప్పదన్న హామీ ఇవ్వకపోతే తమ ఆరుగురు మంత్రులూ తప్పుకుంటారని తీవ్ర మితవాదపక్ష నాయకుడు, జాతీయ భద్రతా మంత్రి బెన్‌గివర్ హెచ్చరించటం తీసిపారేయదగ్గది కాదు. లెబనాన్‌లోని హిజ్బొల్లాతో ఉన్న రెండు నెలల కాల్పుల విరమణ ఒప్పందం ప్రస్తుతం అంతంతమాత్రంగానే ఉంది. అక్కడ ఇరువైపులా కాల్పులు జరగని రోజంటూ లేదు. ఆ ఒప్పందం కూడా ఈనెల 26తో ముగుస్తుంది. ఇప్పుడు హమాస్‌తో కుదిరిన ఒప్పందం గతి కూడా అలాగే ఉంటుందా అన్నది ప్రశ్నార్థకం.

సిరియాలో అసద్ నిష్క్రమణ, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా నిమగ్నమైవుండటం, ఇరాన్ బలహీనపడటం, ట్రంప్ ఆగమనం వంటి పరిణామాలతో హమాస్‌లో పునరాలోచన మొదలయ్యాకే ఈ ఒప్పందానికి అంగీకరించింది. ఎనిమిదినెలల నాడు దాదాపు ఇవే షరతులు ప్రతిపాదిస్తే ఆ సంస్థ తిరస్కరించటం గమనార్హం. మొత్తానికి పశ్చిమాసియా తెరిపిన పడటానికి అన్ని పక్షాలూ చిత్తశుద్ధి ప్రదర్శించటం అవసరం. దాడులతో ఎవరినీ అణిచేయలేమని ఇన్నాళ్ల చేదు అనుభవాల తర్వాతైనా ఇజ్రాయెల్ గుర్తిస్తే మంచిది. ఎన్ని లోటుపాట్లున్నా ఘర్షణలు అంతరించాలి. శాంతి చిగురించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.చవితి తె.5.30 వరకు (తెల్లవారితే శనివారం) తదుపరి పంచమి, **నక్షత్రం:** మఖ ప.1.26 వరకు తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.10.03 నుండి 11.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.52 నుండి 9.40 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.51 నుండి 11.54 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.42
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఉక్రెయిన్ యుద్ధంలో అంతిమ క్రీడలు

విశ్లేషణ



టంకశాల అశోక్

అమెరికా కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 20న బాధ్యతలు స్వీకరించనుండగా, రష్యా–ఉక్రెయిన్‌లు... యుద్ధంలో చివరి దశ క్రీడలు సాగిస్తున్నాయి. ట్రంప్ ఈ సమస్య పరిష్కారానికి తన ప్రతినిధిగా జనరల్ కీత్ కెల్లోగ్ అనే అనుభవజ్ఞుడిని నియమించారు. ట్రంప్ మొదటి అధ్యక్ష కాలంలో జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారైన కెల్లోగ్, ఉక్రెయిన్ యుద్ధ పరిష్కారంపై తన ఆలోచనలను ఇప్పటికే వివరించారు. ఈ పరిణామాల దృష్ట్యా రష్యా, ఉక్రెయిన్‌లు చర్చలకు సమ్మతిస్తూనే, అవి జరిగేలోగా యుద్ధంలో వీలైనంత పైచేయి కోసం ప్రయత్నిస్తున్నాయి.

చర్చలు అంటేనే ఎవరి షరతులు వారు విధిస్తారు. మధ్యవర్తి అయినవారు ఇరుపక్షాల మధ్య రాజీ కోసం ప్రయత్నిస్తూనే, తమవైపు నుంచి కొన్ని ప్రతిపాదనలు చేస్తారు. వాటిపై చర్చల క్రమంలో ఒక రాజీ కుదురుతుంది. అయితే ప్రస్తుత అంశంపై చర్చలు త్వరలోనే ప్రారంభం కావచ్చు గానీ, రాజీ ఎప్పటికి జరిగేదీ ఎవరూ చెప్పలేరు. వంద రోజులన్న జనరల్ కెల్లోగ్ అయినా!

ఉక్రెయిన్ తూర్పున తమ సరిహద్దుల వెంట గల డోన్ బాస్ ప్రాంతాన్నంతా పూర్తిగా తమకు వదిలి వేయటం, 2014 నుంచి తమ ఆక్రమణలో గల క్రిమియా దీవిని తిరిగి కోరక పోవటం, ఉక్రెయిన్ యూరోపియన్ యూనియన్‌లో చేరినా, ఎప్పటికీ నాటోలో చేరక పోవటం అన్నవి రష్యా షరతులు. బ్లాక్ సీలో గల క్రిమియా, ముఖ్యంగా చలికాలంలో ఆ సముద్రం ఘనీభవించదు గనుక నౌకా రవాణాకు రష్యాకు తప్పనిసరి అవసరం. ఉక్రెయిన్ నాటోలో చేరినట్లయితే రష్యా భద్రతకు తీవ్రమైన ముప్పు ఏర్పడుతుంది. సోవియట్ యూనియన్, వారి నాయకత్వాన ఉండిన వార్సా సైనిక కూటమి 1991లో రద్దయిన తర్వాత, అమెరికన్ నాటో కూటమి మాత్రం మరింత విస్తరిస్తూ, రష్యా సరిహద్దునే గల ఉక్రెయిన్‌ను కూడా చేర్చుకొన జూస్తుండటం మాస్కో భయానికి కారణం.

తక్షణం యుద్ధం ఆగితేనే చర్చలు

రష్యా దృష్టి నుంచి గల పరిస్థితులు ఇవి కాగా, ఉక్రెయిన్ షరతులు రెండు. ఒకటి–క్రిమియాను, ప్రస్తుత యుద్ధంలో రష్యా ఆక్రమించిన డోన్ బాస్ భూభాగాలను తమకు తిరిగి అప్పగించటం. రెండవది–నాటోలో చేరే స్వేచ్ఛ తమకు ఉండటం. డోన్ బాస్‌లో రష్యా ఇప్పటికి 20 శాతానికి పైగా భాగాన్ని ఆక్రమించింది. ఇక ట్రంప్ ప్రతినిధిగా జనరల్ కెల్లోగ్ సూచిస్తున్నది, మొదట యుద్ధం వెంటనే ఆగిపోవాలి. ఇరు సైన్యాలు ఎక్కడివక్కడ నిలిచి పోవాలి. తర్వాత చర్చలు ఆరంభమవ్వాలి. రష్యా ఆక్రమణలో గల భూభాగాలు కనీసం కొన్నింటిని వదులుకునేందుకు ఉక్రెయిన్ సిద్ధపడాలి. దానికి నాటో సభ్యత్వ విషయం నిరవధికంగా, కనీసం 20 ఏళ్లపాటు, వాయిదా వేయాలి. ఇందుకు రష్యా అంగీకరించనట్లయితే ఉక్రెయిన్‌కు తమ సహాయం కొనసాగిస్తారు. ఉక్రెయిన్ కాదంటే వారికి అన్ని సహాయాలూ నిలిపివేస్తారు.

వీటన్నింటిపై చర్చలు ఏ విధంగా పురోగమించవచ్చునన్నది అట్లుంచి కొన్ని విషయాలు గమనించాలి. యూరోపియన్ దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతునిస్తూ రష్యా ఆక్రమణలో గల డోన్ బాస్ ప్రాంతాన్ని, క్రిమియాను వదులుకునేందుకు జెలెన్ స్కీ సిద్ధపడవలసి ఉంటుందని సలహా ఇస్తున్నాయి. ఆ ప్రాంతాన్ని తిరిగి ఉక్రెయిన్ స్వాధీనం చేసేందుకు రష్యా ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించబోదని, అటువంటి షరతు వస్తే యుద్ధాన్ని కొనసాగించగలదని, అపుడు అమెరికా కూటమి ఎంత సహాయం చేసినా రష్యా మరిన్ని



భూభాగాలు ఆక్రమిస్తూ పోగలదని, ఉక్రెయిన్ పక్షాన తాము ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనే అవకాశం లేదని వారికి తెలుసు. తామూ, అమెరికా ఇప్పటికే ఎంత ఆధునిక ఆయుధాలనిచ్చినా రష్యాను ఉక్రెయిన్ నిలువరించలేక పోతున్నది. ఇప్పటికే రష్యా ఆక్రమణలో గల ప్రాంతాలను, క్రిమియాను వదులుకునేందుకు జెలెన్‌స్కీ సిద్ధంగా ఉన్న సూచనలున్నాయి. కానీ, రష్యా డిమాండ్ చేస్తున్నట్లు డోన్ బాస్ ప్రాంతం యావత్తునూ వదిలేందుకు ససేమిరా అంగీకరించక పోవచ్చు. అట్లాగే, తాము నాటోలో ఎన్నటికీ చేరక పోవటాన్ని. ఇందుకు బహుశా ట్రంప్ కూడా సమ్మతించకపోవచ్చు.

ట్రంప్ గెలుపుతో కొత్త చిక్కులు!

అమెరికా, యూరప్‌లకు కూడా కొన్ని ఆందోళనలున్నాయి. సోవియట్ యూనియన్ పతనం తర్వాత 10–15 సంవత్సరాలకు తమ అపారమైన సహజ వనరుల బలంతో పుతిన్ నాయకత్వాన తిరిగి పుంజుకోవటం ప్రారంభించిన రష్యా.. చైనా, ఇండియా తదితర అనేక దేశాలతో మైత్రీ సంబంధాల అభివృద్ధితో ఆర్థికంగా, ఆయుధ బలం రీత్యా ఈసరికి శక్తిమంతంగా మారింది. అటువంటి స్థితిలో పుతిన్ ఉక్రెయిన్‌తో ఆగక తమకు కూడా సవాలుగా మారగలరన్నది అమెరికా, యూరప్‌ల సందేహం. అందువల్ల రష్యాను ఉక్రెయిన్ యుద్ధంలో ఓడించదలచారు గానీ అదీ సాధ్యం కాదని ఆంక్షల వైఫల్యంతో, తమ ఆయుధాల వైఫల్యంతో అర్థమైంది. అందుకే ఇపుడు రాజీ ప్రయత్నాలను సమర్థిస్తున్నారు. అనూహ్యంగా ట్రంప్ గెలుపు వారికి కొత్త చిక్కులు తెచ్చి పెట్టింది. రష్యా పట్ల కొంత మెతకదనం కలవాడనే పేరు తన మొదటి హయాంలోనూ కలిగి ఉండిన ఆయన, ప్రస్తుత యుద్ధం వల్ల అందరికీ నష్టమేనంటూ అసలు యుద్ధాన్నే వ్యతిరేకించారు. జెలెన్‌స్కీ వైఖరిని విమర్శించి ఆయన వాదనలను కొట్టివేశారు. ఉక్రెయిన్‌కు బైడెన్ ప్రభుత్వం ఆయుధాలు, నిధులు ఇవ్వటాన్ని తప్పుపట్టారు. అంతటితో ఆగక నాటోను, యూరోపియన్ యూనియన్‌ను సైతం వేర్వేరు విషయాలపై తప్పుపట్టడం మొదలు పెట్టారు. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (మాగా) అనే తన నినాదానికి అనుగుణంగా ఫ్రాన్స్, జర్మనీ, కెనడా వంటి దేశాల నుంచి దిగుమతులపై సుంకాలు పెట్టించగలమని ప్రకటించారు.

ఐరోపా దేశాలకు అమెరికా భయం!

ఈ మార్పులను గమనించి, ఉక్రెయిన్ సందర్భంలోనే గాక ఇతరత్రా కూడా జంకిన యూరప్ నేతలు ట్రంప్‌కు నచ్చజెప్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్నికల ప్రచార సమయంలోనే కీడెంచి మేలెంచమన్నట్లు, ట్రంప్ రాక తర్వాత అమెరికా భాగస్వామ్యం పరిమితమైనప్పటికీ ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థిక సహాయాలు అదే స్థాయిలో కొనసాగించాలని తీర్మానాలు చేశారు. కానీ, తమ సైనిక, ఆర్థిక శక్తి రెండూ క్రమంగా బలహీన పడుతున్నందున అది సాధ్యం కాదని గ్రహించి రాజీ ఆలోచనలు మొదలు పెట్టారు. పాశ్చాత్య దేశాల నుంచి ఇప్పటికి ఉక్రెయిన్‌కు సుమారు 130 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందగా అందులో సగం అమెరికాదే. ఆయుధాలతో పాటు ఆర్థిక సహాయాన్ని ట్రంప్ నిలిపివేస్తే ఉక్రెయిన్ అక్షరాలా కుప్పకూలుతుంది. ఇది యూరోపియన్ దేశాలను భయపెడుతున్న అతి పెద్ద విషయం. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకున్నప్పుడు, ఉభయుల మధ్య రాజీని కుదర్చటం కెల్లోగ్‌కు సమస్య కాబోదు.

బేరసారాలకు ఇరు దేశాల ఎత్తుగడ

పోతే, పరిస్థితులు తనకు ప్రతికూలంగా మారే అవకాశాలున్నట్లు అమెరికా అధ్యక్ష ఎన్నికలు ప్రచార సమయంలోనే అనుమానించిన జెలెన్‌స్కీ రష్యాతో చర్చల సమయంలో పై చేయి సాధించలేక పోయినా కనీసం సమ ఉజ్జీ అయేందుకు కొన్ని ఎత్తుగడలను అనుసరించారు. తూర్పున విశాలమైన భూభాగాలను ఆక్రమించిన రష్యా, పోక్రొవ్ స్కీ అనే కీలకమైన నగరంపై దృష్టి కేంద్రీకరించింది. దానిని ఆక్రమిస్తే, ఆ మొత్తం ప్రాంతానికి గుండెకాయ వంటి కూడలి కేంద్రం తన అధీనమై ఉక్రెయిన్ తీవ్రంగా బలహీనపడుతుంది. ప్రస్తుతం ఆ నగరానికి కొద్ది కిలోమీటర్ల దూరానికి చేరిన రష్యన్ సేనలు, చర్చల లోగా దాని స్వాధీనానికి భీకర యుద్ధం సాగిస్తు న్నాయి. ఉక్రెయిన్ ఆ నగర రక్షణకు పోరాడుతూనే, రష్యాతో ఉత్తర సరిహద్దున గల కుర్స్క్ ప్రాంతంలోకి అకస్మాత్తుగా చొచ్చుకుపోయింది. చర్చలు జరిగినపుడు ఈ రెండు నగరాలు బేరసారాల కోసం ఉపయోగపడాలన్నది ఇరువురి ఎత్తుగడ. ఇటువంటి చివరి దశ యుద్ధ క్రీడలే మరికొన్ని సాగుతున్నాయి. రష్యా ఉత్తర కొరియన్ సేనలను రప్పించటం, ఉక్రెయిన్ యూరప్ సహాయంతో తన రాజకీయ బేరసారాల శక్తిని పెంచుకోజూడటం, రష్యా పైకి దీర్ఘ శ్రేణి క్షిపణుల ప్రయోగం వంటివన్నీ అవే. మొత్తానికి ఈ చివరి దశ క్రీడలకు జనవరి చివరిలోగా కొద్ది సమయమే మిగిలి ఉంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

తీసిన గోతిలోనే..!



'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' సంస్థ మూసివేత వార్త నాకేమీ సంతోషాన్ని కలిగించనప్పటికీ, సంబరాలు జరుపుకోకుండా మాత్రం ఉండలేకపోతున్నాను! ఆర్థిక రంగంలో మానవ కల్పిత విపత్తులను గుర్తిస్తామని తమ గురించి గొప్పగా చెప్పుకున్న ఈ నైతిక యోధుల సమూహం తాను బోధించిన నీతులను తానే ఆచరించలేకపోయింది.
– తహసీన్ పూనావాలా, పొలిటికల్ ఎనలిస్ట్

వీడ్కోలు ప్రసంగం



'ఏదైనా సాధ్యమే' అనే ఒకే ఒక మాటతో అమెరికాను నిర్వచించవచ్చునని నేను ఎప్పటికీ నమ్ముతాను. మనం అనుకున్నది ఏదైనా ఇక్కడ మాత్రమే సాధ్యం. నత్తిగా మాట్లాడే పిల్లవాడు జీవితంలో ఎదిగి అమెరికా అధ్యక్షుడిగా ఓవల్ ఆఫీస్‌లో కూర్చోవటం కూడా!
– జో బైడెన్, అమెరికా 46వ అధ్యక్షుడు

తమ దాకా వస్తే గానీ..!



ప్రభుత్వం రెసిడెంట్ డాక్టర్‌ల ఓవర్ టైమ్‌కు అదనంగా డబ్బు చెల్లించాలని భావించి, ఆ ఓవర్ టైమ్ ఐడియాను ప్రభుత్వానికి ఇచ్చిన ప్రొఫెసర్‌ల జీతం నుండి ఆ మొత్తాన్ని కట్ చేయాలని నిర్ణయించుకుంటే – నన్ను నమ్మండి – ఆ పాత ప్రొఫెసర్లందరూ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ గురించి మాట్లాడడం మొదలెడతారు!
– ఆదిత్యా గుప్తా, పీడియాట్రిక్ ఆంకాలజిస్ట్

నిజ స్వరూపం



ఒంటి నిండా బూడిద పులుముకున్న దిగంబర సన్యాసుల నేతృత్వంలో జరిగే సామూహిక స్నానాల కార్యక్రమంగా మహా కుంభమేళాను బీబీసీ అభివర్ణించింది. అదే బీబీసీ, ఇంగ్లండ్‌లోని ఒక నగ్నోత్సవాన్ని యూరప్‌లోనే అతి పెద్ద 'నేచరిస్ట్ ఫెస్టివల్' (సహజసిద్ధమైన వేడుక)గా కీర్తిస్తోంది! కొన్ని సంస్కృతులు బీబీసీకి సహజంగానే అమోదయోగ్యమైనవని గమనించండి.
– అన్షుల్ సక్సేనా, ఒపీనియనిస్ట్

మీడియా మునక



ఉత్తర భారతదేశంలోని వేలాది మంది మారుతీ సుజుకీ కార్మికులు తమను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను అప్రెంటీస్‌గా నియమించే పద్ధతిని నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే వారి ప్రదర్శనలు మీకు ఎక్కడా కనిపించవు. ఎందుకంటే, భారతీయ మీడియా మహా కుంభమేళాను కవర్ చేసే పనిలో మునిగి ఉంది.
– నేహా దీక్షిత్, జర్నలిస్ట్

ఇంకేదైనా కారణమా?!



తక్కువ బడ్జెట్ అపార్ట్‌మెంట్‌లు /బంగ్లాలకు కూడా ఈ రోజుల్లో భద్రత, సీసీటీవీ ఏర్పాట్లు ఉంటున్నాయి. సయీఫ్‌కి ఏదీ లేదా? ఇలాంటి వార్తలు వినటానికి విచిత్రంగా ఉంటాయి. (బాలీవుడ్ నటుడు సయీఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి ఒక ఆగంతకుడు చొరబడి ఆయన్ని ఆరుసార్లు కత్తితో పొడిచిన ఘటనపై).
– దేవబ్రత భట్టాచార్జీ, ఇంటర్నెట్ పర్సనాలిటీ

తీపి కబురు



మై డియర్ బెంగళూర్! జనవరి 17న మీ దగ్గర యూఎస్ కాన్సులేట్ ప్రారంభం కానుంది. ఇది కేవలం పీఎం నరేంద్ర మోదీ, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ల ప్రయత్నాల వల్ల మాత్రమే సాధ్యమయింది. వారికి కృతజ్ఞతలు చెప్పటానికి మన మైసూర్ పాక్‌ను మించి ఏముంటుంది? (మంత్రి జైశంకర్‌కు మైసూర్‌పాక్ స్వీట్ అందించిన వీడియోతో).
– తేజస్వీ సూర్య, బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు

ఇన్ బాక్స్

తొలితరం రాజకీయ దిగ్గజం

భారత స్వాతంత్ర్యోద్యమ తొలితరం మేరునగధీరుల్లో మహాదేవ గోవింద రనడే ఒకరు. 1943లో ఆయన శత జయంతి కార్యక్రమంలో డా॥ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ... 'రనడే కేవలం ఆజానుబాహుడు మాత్రమే కాదు; విశాల భావాలు కలిగిన వారూ, ప్రజల పట్ల సమదృష్టిని కలిగిన వారు కూడా' అని ప్రశంసించారు. ఓరిమి కలిగిన ఆశావాది. తన జీవిత కాలంలో 'వక్తృత్వోత్తేజక సభ', 'పూర్ణ సార్వజనిక సభ', 'మహారాష్ట్ర గ్రంథోత్తేజక సభ', 'ప్రార్థనా సమాజం' లాంటి సంస్థలను స్థాపించారు. తన సాంఘిక, మత సంస్కరణల ఆలోచనలకు అనుగుణంగా 'ఇందు ప్రకాష్' అనే మరాఠీ–ఆంగ్ల దినపత్రికను నిర్వహించారు.



మహాదేవ గోవింద రనడే

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా నిఫాడ్‌లో 1842 జనవరి 18న జన్మించారు. కొల్హాపూర్‌లోని ఒక మరాఠీ పాఠశాలలో చదివారు. తర్వాత ఓ ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు మారారు. 14 ఏళ్ల వయసులో బాంబేలోని ఎల్ఫిన్‌స్టన్ కళాశాలలో చేరారు. బాంబే విశ్వవిద్యాలయం మొదటి విద్యార్థుల్లో ఆయనా ఒకరు. 1867లో ఎల్ఎల్‌బీ పట్టా పుచ్చుకున్నారు. 1871లో పూనాలో సబార్డినేట్ జడ్జిగా నియమితులయ్యారు. ఆయన రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం గమనించిన ఆంగ్లేయులు 1895 దాకా ఆయనను బాంబే హైకోర్టుకు పంపే పదోన్నతికి అడ్డుపడుతూ వచ్చారు. ఆయన కొన్ని పాశ్చాత్య భావాలకు ప్రభావితులయ్యారు. అందరికీ విద్య, సమానత్వం, మానవత్వం వంటివి ఇందులో ప్రధాన అంశాలు. మత పరంగా హిందూమతంలో ఆయన చేయాలనుకున్న సంస్కరణలు ప్రార్థనా సమాజం స్థాపించడానికి ప్రేరణ. గోపాలకృష్ణ గోఖలే, బాల గంగా ధర తిలక్ వంటి స్వాతంత్ర్య సమర యోధులకు రాజకీయ గురువుగా పేరు పొందారు. తుదకు 1901 జనవరి 16న తుదిశ్వాస విడిచారు. నేటి స్వేచ్ఛా భారతానికి దారులు వేసిన ఆయన చిరస్మరణీయులు.

– యం. రాం ప్రదీప్; జేవీవీ సభ్యులు, తిరువూరు
(రేపు మహాదేవ గోవింద రనడే జయంతి)

వ్యవసాయ రంగమే దేశాభివృద్ధికి కీలకం

అభిప్రాయం



డా॥ ఎనుగొండ నాగరాజ నాయుడు

సాధారణంగా దేశాభివృద్ధికి పారిశ్రామిక రంగం, సేవల రంగం కీలకమైనవి. దీనికి భిన్నంగా మన దేశంలో వ్యవసాయ రంగమే కీలక రంగంగా మారింది. మూలధన సాంద్రత, సాంకేతిక పరమైన వనరుల ఉపయోగంతో పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. ఇక సేవల రంగంలోనైతే మానవ వనరుల నైపుణ్యం అంతంత మాత్రంగా ఉండడం వలన ఆ రంగ పురోగమనం స్వల్పంగానే ఉంది. ఫలితంగా దేశ ప్రగతికి వ్యవసాయ రంగమే నేడు ఆధారంగా ఉంది. మన ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక రైతు.

1950లలో 70 శాతం దేశ ప్రజలు వ్యవసాయ రంగం పైనే ఆధారపడి ఉండేవారు. ఆ శాతం 2024 నాటికి 54.6 శాతంగా ఉంది. అంటే ఇంకా ఎక్కువగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడే జీవిస్తున్నారన్నమాట! సాగు భూమి విస్తీర్ణం కూడా అమెరికా, చైనా తరువాత మన దేశంలోనే ఎక్కువ. అయితే రైతులకు ఇచ్చిన హామీలను మన పాలకులు నెరవేర్చనందు వలన పెట్టుబడికి చేసిన అప్పుకు వడ్డీ కూడా చెల్లించలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గత 30 ఏళ్లలో రైతులు, రైతు కూలీలు నాలుగు లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో డేటా తెలియజేస్తోంది. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వాలు సరైన గిట్టుబాటు ధరను కల్పించి, వాటిని కొనుగోలు చేసినప్పుడే రైతులు సుభిక్షంగా ఉంటారు. అలాగే దేశం కూడా! పొరుగు దేశమైన చైనాతో పోల్చుకుంటే మన రైతుల పరిస్థితి కడు దయనీయంగా ఉంది. 1980లో మనదేశంలో రైతుల తలసరి ఆదాయం 582 డాలర్లు కాగా, చైనాలో 307 డాలర్లు మాత్రమే! 2024 వచ్చేటప్పటికి చైనాలో రైతుల తలసరి ఆదాయం 25,015



డాలర్లకు పెరగగా మన రైతులు 10,123 డాలర్లు మాత్రమే పొందగలిగారు.

రైతుల ఉత్పత్తులకు మద్దతు ధర లభించకపోవడంతో 1990–91లో వ్యవసాయ రంగ వాటా జీడీపీలో 35 శాతం కాగా... 2022–23 లో 15 శాతానికి పడిపోయింది. వ్యవసాయ రంగంపై ఆధారపడిన శ్రామిక జనాభా మాత్రం 60 శాతం వరకు ఉంది. కొన్ని అధ్యయనాలు చెబుతున్నట్టుగా భారతీయ రైతులు అభివృద్ధి నిచ్చెనలో అట్టడుగున ఉండటమే కాకుండా... దాదాపు పాతికేళ్లుగా ఏటా నష్టాలను చవి చూస్తున్నారు. శాశ్వత పేదరికం నుండి రైతులను బయట పడేయడానికి ఏకైక మార్గం వ్యవసాయ ధరలకు హామీ ఇవ్వడం కోసం ఒక చట్టబద్ధమైన ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడం. కనీస మద్దతు ధరకు హామీ ఇచ్చే చట్టం మార్కెట్లను అస్తవ్యస్తం చేస్తుందని కేంద్రం కొన్నేళ్ళ క్రితం సుప్రీంకోర్టుకు తెలపడం గమనార్హం.

1991లో నూతన ఆర్థిక విధానాన్ని చేపట్టిన తరువాత వ్యవసాయ రంగం నుండి శ్రామికులు పారిశ్రామిక రంగానికి బదిలీ అవుతారని భావించడం జరిగింది. అలాగే గ్లోబలైజేషన్ వలన వ్యవసాయ ఉత్పత్తులు విదేశీ మార్కెట్లోకి వెళ్లడం వలన రైతులు లాభపడతారని అనుకున్నారు. ఈ విధానం వచ్చి 30 ఏళ్లు గడిచిపోయాయి. అయినా అనుకున్నవేవీ జరగలేదు.

ప్రపంచ వాణిజ్య సంస్థ ఆశయాలలో ముఖ్యమైనవి–విదేశీ వాణిజ్యం ద్వారా ప్రపంచ దేశాల ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, ఉద్యోగ కల్పన చేయడం, ఉత్పత్తులను ప్రపంచ వ్యాప్తంగా అమ్ముకుని లాభాలను ఆర్జించేటట్లు చేయడం! ఈ నేపథ్యంలో మన పాలకుల ప్రపంచ దేశాల ఆకలి తీర్చుతున్న భారత రైతుల ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లో అమ్మి లాభాలు పొందే విధంగా కార్యాచరణ చేపట్టాలి. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు సమకూర్చిన వనరులకు సమానంగా రైతులకు కూడా ఇచ్చినప్పుడే దేశం ప్రపంచానికి అన్నం పెట్టే స్థాయిలో ఉంటుంది.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రిన్సిపాల్
మొబైల్: 98663 22172

కాలమే మూల కారణం!

జ్యోతిర్మయం

కణ్వాది మహామునుల శాపం వలన పుట్టిన ముసలం యదువంశ క్షయానికి కారణమయింది. దారుకుడి ద్వారా శ్రీకృష్ణుడు కబురంపగా వచ్చి ద్వారకలో స్త్రీజనం, బాల బాలికలు, వృద్ధులు, గజ తురగాది జంతువుల సంరక్షణకు కావలసినదంతా చేశాడు అర్జునుడు. ఆకాశగంగ ప్రాంతంలోని ఒక కుటీరంలో ఏకాంతంగా కూర్చుని ఉన్న వ్యాసమహర్షి వద్దకు వెళ్ళి, జరిగినదంతా చెప్పి 'ఊహించడానికే అలవి కాని వినాశనం జరిగి మనసు శోకంతోను, భయంతోను నిండి పోయింది మహాత్మా!' అని బేలగా సాగిలపడ్డాడు.

అర్జునుడిలో ఆ బేలతనం యుద్ధం జరుగుతున్న రోజులలో ఎన్నడూ లేనిది. దుర్యోధనుడి మరణంతో అన్యాయం ఓడిపోయి న్యాయానికి విజయం లభించింది. అటువంటప్పుడు సర్వత్రా ఆనందోత్సాహాలతో కాలం గడవాలి. కాని ఆశ్చర్యకరంగా ఆ వాతావరణం కనపడదు. యుద్ధానంతరం ప్రాణాలతో మిగిలిన అందరి మనసులలోను, మాటలలోను నిస్తేజం ఆవరించి, అంతటా విచారమే తాండవిస్తోంది. ఎక్కడ చూసినా మృత వీరుల భార్యల రోదనలు; అవి సద్దుమణిగినపుడు నిశ్శబ్దం, నిర్వేదం! ధర్మరాజు రాజయ్యాక, ఇంక తాను చెయ్యాల్సింది ఏమీ లేదన్నట్లుగా శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోయాడు. శ్రీకృష్ణుడు ఉండగా అంత వినాశనం ఎలా సంభవమైంది? అని ఆశ్చర్యంతో అర్జునుడు అడిగిన ప్రశ్నకు 'జరగాల్సినదిగా నియతమైన పనిని జరగనివ్వకుండా అడ్డుకోవడం దేనికని భావించి శ్రీకృష్ణుడు ఉపేక్షించి ఊరకున్నాడు కాని, తలుచుకుంటే ముల్లోకాలలో ఏ విషయాన్నైనా తారుమారు చేయగల శ్రీకృష్ణుడు, కణ్వాది మునుల శాపాన్ని పక్కకు మళ్ళించే శక్తి లేనివాడు కాదు!' అని సమాధానం చెప్పాడు వ్యాసుడు. కాలమహిమను అర్థం చేసుకోవడాన్ని గురించి ఆంధ్ర మహాభారతం, మౌసలపర్వంలో ఇలా వివరించాడు.

తే. కాలమూలంబు సర్వంబు గాన దీని/ కొందు తలపులు దక్కి మీ రుత్తమంపు/గతికి జనుడు నిశ్చింత వికారతనులు/విడిచి యార్యజనంబులు వినుతి సేయ.

'జగత్తులో సంభవించే అన్ని పరిణామాలకూ కాలమే మూలకారణం. కాబట్టి, కాలమహిమను గురించిన దుఃఖాన్ని పక్కన పెట్టి, ఇక్కడి వికారమైన శరీరాలను నిశ్చింతగా వదిలి, ఉత్తమ గతులను పొంది వెళ్ళిపొండి!' అని వ్యాసుడు తన సందేశంగా చెప్పాడు.

– భట్టు వెంకటరావు

బీజేపీలో 'జిల్లా అధ్యక్ష లొల్లి'

- నియామక ప్రక్రియలో అనుసరిస్తున్న తీరుపై కొందరు నేతలు, కార్యకర్తల అసహనం
- జిల్లాకు ఐదేసి పేర్లతో ఆశావహుల లిస్ట్ సమర్పించాలన్న హైకమాండ్
- కొందరు పరిశీలకులు దీన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారన్న అనుమానాలు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకానికి ముందే లొల్లి షురూ అయ్యింది. నియామక ప్రక్రియకు సంబంధించి అనుసరిస్తున్న విధానంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు చిర్రుబుర్రుమంటున్నారు. కొన్ని జిల్లాల్లోనైతే ఏకంగా ఈ ప్రక్రియను తప్పుబడుతూ జాతీయ నాయకత్వానికి ఫిర్యాదులు పంపేందుకు కూడా సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్, మెదక్ పరిధిలోని జిల్లాలు, హైదరాబాద్, ఇతర జిల్లాల్లో కూడా ఇలాంటివి జరుగుతున్నట్టుగా కొందరు పార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా జిల్లా అధ్యక్షుల నియామకం సందర్భంగా అభిప్రాయసేకరణలో వెల్లడైన వ్యక్తులను కాకుండా ఇతరులకు అధ్యక్షులుగా అవకాశం కల్పించారని కొందరు నేతలు ఉదహరిస్తున్నారు. అప్పట్లో కొందరిని జిల్లా అధ్యక్షులుగా నియమించడంపై కేడర్ కొట్టుకుందని, బహిరంగంగానే విమర్శలు గుప్పించారని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కూడా రాష్ట్ర పార్టీ నేతలు జిల్లాల్లో పర్యటించి కేడర్ నుంచి చేపడుతున్న అభిప్రాయసేకరణ, దాని ఆధారంగా జాతీయ పార్టీకి పంపుతున్న ఆశావహుల జాబితాలపై కారాలు, మిరియాలు నూరుతున్నారు.

కొందరు అభిప్రాయ సేకరణ జరపకుండానే..

కొన్ని జిల్లాల పరిశీలకులుగా వెళుతున్న కొందరు స్వతంత్రంగా వ్యవహరించకుండా, నిజమైన అభిప్రాయసేకరణ జరపకుండా ఎవరి ప్రభావానికో లోనై ఆశావహుల జాబితాను సిద్ధం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా జిల్లాల్లో పర్యటించిన పరిశీలకులు పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అధ్యక్షుడి నియామకంపై పూర్తిస్థాయిలో అభిప్రాయ సేకరణ జరపకుండానే జాబితాలు సిద్ధం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. జిల్లా అధ్యక్ష పదవులు ఆశిస్తున్న వారి కార్లలోనే కొందరు పరిశీలకులు తిరగడంతోపాటు వారికి సంబంధించిన ఫామ్‌హౌస్‌లలో కూర్చొని ఆశావహుల జాబితాను తయారు చేస్తున్నారని మరికొందరు ఆరోపణలు చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో ఎక్కువ మంది జిల్లా అధ్యక్షుడిగా కోరుకుంటున్న వ్యక్తి పేరు కాకుండా తమకు నచ్చిన వారి పేర్లతో లిస్ట్ సిద్ధం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధ్యక్షుల నియామకానికి ఒక్కో జిల్లా నుంచి ఐదేసి మంది పేర్లతో జాబితాలు తయారు చేసి పంపించాలన్న జాతీయ నాయకత్వం ఆదేశాలను సైతం కొందరు నేతలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారనే వాదనలు వస్తున్నాయి. రాష్ట్ర నేతలు సమర్పించిన జాబితాల ఆధారంగా ఒకట్రెండు రోజుల్లోనే జిల్లా అధ్యక్షులను ప్రకటించే అవకాశాలున్నాయి. దీంతో సమర్థులైన వారికి ఈ పదవి లభిస్తుందా లేదా అనే ఆందోళనను కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నారు. సంస్థాగతంగా చూస్తే.. తెలంగాణ రాష్ట్రాన్ని పార్టీ పరంగా మొత్తం 38 జిల్లాలుగా విభజించారు. హైదరాబాద్ నగరాన్ని నాలుగు జిల్లాలుగా (హైదరాబాద్ సెంట్రల్, మలక్‌పేట–భాగ్యనగర్, గోషామహల్– గోల్కొండ, మహంకాళి సికింద్రాబాద్) రంగారెడ్డి అర్బన్, రూరల్ జిల్లాలు, మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్, రూరల్ జిల్లాలు, ఇలా వివిధ జిల్లా శాఖలున్నాయి.

యాదగిరి క్షేత్రంలో నిత్యకల్యాణం పునః ప్రారంభం



ఆలయంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యకల్యాణం పునఃప్రారంభమైంది. ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ఆరు రోజుల పాటు అధ్యయనోత్సవాలు జరగడంతో శ్రీసుదర్శన నారసింహ హోమం, శాశ్వత, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలను రద్దు చేశారు. అధ్యయనోత్సవాలు బుధవారం ముగియడంతో గురువారం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, శాశ్వత, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవాన్ని ఆచార్యులు ఆగమశాస్త్ర ప్రకారం ప్రారంభించారు. నిత్య కైంకర్యాలు సైతం కొనసాగాయి.

'బార్‌కోడ్'తో భక్తులకు వస్త్రాల విక్రయం

- భద్రాద్రి దేవస్థానం నిర్ణయం



భద్రాద్రి రామాలయంలో బార్‌కోడ్ విధానాన్ని ఫీడ్ చేస్తున్న ఉద్యోగి

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను ఇకపై సరసమైన ధరలకు తిరిగి భక్తులకు విక్రయించనున్నారు. గతంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు వారు నిర్ణయించిన ధరకే అమ్మేవారు. అయితే టెండర్ గడువు ముగియగా.. పలుమార్లు కొత్త టెండర్లను ఆహ్వానించారు. ఇంతవరకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఈనెల 24న మరోసారి పిలవాలని నిర్ణయించారు. కాగా, కాంట్రాక్టర్లు టెండర్ దక్కించుకునేంత వరకు దేవస్థానం ఆధ్వర్యంలోనే వస్త్రాల విక్రయం చేపట్టాలని నిర్ణయించిన అధికారులు.. ఈ ప్రక్రియను గురువారం ప్రారంభించారు. పలు ఆలయాల్లో వస్త్రాల విక్రయాన్ని పరిశీలించిన ఈఓ రమాదేవి.. భద్రాద్రిలో కూడా బార్‌కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. స్వామి వారి కోసం భక్తులు కొనుగోలు చేసిన వస్త్రాల ధర కంటే ఎక్కువ రేటుకు అమ్మకుండా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం బార్‌కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో స్వామివారి వస్త్రాలు ఇకపై భక్తులకు సరసమైన ధరలోనే దక్కనున్నాయి. కొత్తగా ఎవరైనా టెండర్ దక్కించుకున్నా ఇదే పద్ధతి అవలంబిస్తామని ఈఓ రమాదేవి 'సాక్షి'కి తెలిపారు.

బీటెక్ విద్యార్థినిపై అత్యాచారం

- రంగారెడ్డి జిల్లాలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: ఓ కామాంధుడు బీటెక్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని (18) మంగళ్‌పల్లి క్రాస్ రోడ్డు సమీపంలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి పండుగకు ఇంటికి వెళ్లిన ఆమె సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో 15న మధ్యాహ్నం తిరిగి హాస్టల్‌కు చేరుకుంది. భవనం కింది భాగంలో యజమానికి సంబంధించిన రియల్ ఎస్టేట్ ఆఫీస్ ఉంది. ఇతని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలానికి చెందిన ఎ.అజిత్ (22) రాత్రి వేళ అప్పుడప్పుడు ఆఫీసులో పడుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన అనంతరం హాస్టల్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న విద్యార్థిని గది తలుపు కొట్టాడు. పక్క గదిలోని తన స్నేహితురాలేమోనని భావించిన ఆమె తలుపు తెరవగానే లోనికి చొరబడిన అజిత్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె అరుపులు విన్న పక్కగదిలోని ఓ విద్యార్థిని.. ఈ విషయాన్ని తన బంధువుకు ఫోన్ చేసి చెప్పగా, అతను డయల్ 100కు కాల్‌చేసి సమాచారమిచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకునేలోపే నిందితుడు పరారయ్యాడు. ఆ యువతిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు. కాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

బెట్టింగ్ అప్పులు.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



భానుప్రకాశ్

అబ్దుల్లాపూర్‌మెట్: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై.. ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దగూడేనికి చెందిన ఎద్దుల భానుప్రకాశ్ (19) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. సంక్రాంతి సెలవులకు సొంతూరుకు వెళ్లిన భానుప్రకాశ్ బుధవారం సాయంత్రం హాస్టల్‌కు చేరుకొని స్నేహితులతో గడిపాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన భానుప్రకాశ్..రాత్రి 12 గంటల సమయంలో బెట్టింగ్‌లో రూ. 6 వేలు పోగొట్టుకున్నాడని తోటి విద్యార్థులు తెలిపారు. అందరూ నిద్రపోయాక హాస్టల్ పెంట్‌హౌస్ వద్దకు వెళ్లిన భాను టవల్‌తో ఇనుప మెట్లకు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు చూసేసరికి మెట్లకు వేలాడుతూ ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో భానుప్రకాశ్‌కు రూ.లక్షల్లో అప్పులు అయ్యాయని పలువురు విద్యార్థులు చెప్పారు.

అప్పుల బాధతో యువ రైతు బలవన్మరణం

- మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో ఘటన



కృష్ణ

కౌడిపల్లి (నర్సాపూర్): అప్పుల బాధతో యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో గురువారం ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లె కృష్ణ (23) తండ్రి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వ్యవసాయం, సెంట్రింగ్, కూలీపనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. గత ఏడాది చెల్లెలు పెళ్లికి తెలిసిన వారి వద్ద రూ.2 లక్షల వరకు అప్పులు చేశాడు. అలాగే, పొలంలో బోర్లు వేసేందుకు రూ. లక్ష వరకు అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చేమార్గం లేక దిగులు పడేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ కారణంతో పనులకు కూడా సరిగా వెళ్లలేకపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రమైనా కృష్ణ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి పల్లె భిక్షం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



8వ వేతన సంఘం ఏర్పాటు

ప్రధాని ఆమోదం ● లబ్ధి పొందనున్న కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లు

న్యూఢిల్లీ: దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎనిమిదో వేతన సంఘం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. 8వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రధాని మోదీ గురువారం ఆమోదముద్ర వేయడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం ప్రధాని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో మీడియా సమావేశంలో వెల్లడించారు. అయితే వేతనసంఘాన్ని ఏ తేదీన ఏర్పాటుచేస్తారో ఆయన వెల్లడించలేదు. ఈసారి ఫిట్‌మెంట్ 2.57 రెట్లకు బదులు 2.86 రెట్లు ఉండొచ్చనే విశ్లేషణలు వెలువడ్డాయి. ఒకవేళ ఫిట్‌మెంట్ ఎక్కువగా ఉంటే దానికి తగ్గట్టే మూలవేతనం, దానికి హౌస్ రెంట్ అలవెన్సులు, ఇతరత్రాలు కలుపుకుని జీతభత్యాల్లో భారీ పెంపు ఉండొచ్చు. వేతన సంఘం ఏర్పాటయ్యాక అది చేసే సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలుచేస్తే కేంద్ర ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్ల జీతభత్యాలు పెరగనున్నాయి. ఏడో వేతన సంఘం కాలపరిమితి 2026 ఏడాదిలో ముగియనుంది. స్వాతంత్ర్యం వచ్చిన 1947 ఏడాది నుంచి ఇప్పటిదాకా ఏడుసార్లు వేతనసంఘాన్ని ఏర్పాటుచేశారు. చివరిసారిగా 2016లో ఏడో వేతన సంఘం అమల్లోకి వచ్చింది. ''7వ పే కమిషన్ వచ్చే ఏడాదితో ముగుస్తుంది. కొత్త కమిషన్ ఏర్పాటుకు ఏడాది కాలముంది. ఈలోపే పూర్తిస్థాయిలో సలహాలు, స్వీకరించడానికి సరిపడా సమయం ఉండటం కలిసొచ్చే అంశం'' అని మంత్రి వైష్ణవ్ అన్నారు. జీతభత్యాలు, వేతనాలు, అలవెన్సులు, కరువు భత్యం, ఇతర లబ్ధి ప్రయోజనాలను నిర్ణయించడంలో పే కమిషన్‌దే కీలక పాత్ర. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలతో పే కమిషన్ విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరుపుతుంది. తగు సూచనలు, సలహాలను స్వీకరిస్తుంది.

ఏడో కమిషన్ ఏం చెప్పింది?

ఏడో పే కమిషన్‌ను 2014లో ఏర్పాటుచేయగా అది 2016 జనవరి ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వానికి తన సిఫార్సులను అందజేసింది. 7వ వేతన సంఘం గత వేతన విధానాల్లో సంస్కరణలు తెస్తూ జీతభత్యాల లెక్కింపులో సులభతర విధానాన్ని ప్రవేశపెట్టింది. నెలకు కనీస వేతనం రూ.18,000 ఉండాలని, గరిష్ఠ వేతనం రూ.2.5 లక్షలు ఉండాలని సిఫార్సు చేసింది. మూలవేతనంతో పోలిస్తే చేతికొచ్చే జీతం 2.57 రెట్లు ఎక్కువగా ఉండాలని సూచించింది. కనీస గ్రాట్యుటీ చెల్లింపు రూ.20 లక్షలు ఉండాలని సిఫార్సుచేసింది. అంతకుముందు 2006 ఏడాదిలో వచ్చిన ఆరో పే కమిషన్ నెలకు కనీస వేతనం రూ.7,000, కార్యదర్శిస్థాయి ఉద్యోగికి గరిష్ఠ వేతనం రూ.80,000 చెల్లించవచ్చని సిఫార్సు చేసింది. 1.86 రెట్లు ఫిట్‌మెంట్ ఉండాలని, గ్రాట్యుటీ రూ.10 లక్షలు ఇవ్వాలని, సరిపడా హౌస్ రెంట్ అలవెన్సు ఇవ్వాలని సూచించింది.

అరకోటి మంది ఉద్యోగులకు లబ్ధి

జీతభత్యాలను పెంచుతూ ఎనిమిదో కమిషన్ ఇచ్చే సిఫార్సులతో దాదాపు అరకోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లు లబ్ధిపొందనున్నారు. ఒక్క ఢిల్లీలోనే 4 లక్షల మంది ఉద్యోగులు ఉంటారని అంచనా. వీరిలో రక్షణ శాఖతోపాటు ఢిల్లీ రాష్ట్రపరిధిలో పనిచేసే ఉద్యోగులూ ఉంటారు. అంటే ఫిబ్రవరి ఐదున జరగబోయే అసెంబ్లీ ఎన్నికలపై తాజా పే కమిషన్ ఏర్పాటు వార్త ప్రభావం చూపే అవకాశం ఉంది. ఢిల్లీ పరిధిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగుల ఓట్లను కొల్లగొట్టే ఎత్తుగడతో మోదీ సర్కార్ పే కమిషన్ ఏర్పాటుపై హడావుడిగా నిర్ణయం తీసుకుందనే వార్తలొచ్చాయి. ఏడో పే కమిషన్ సిఫార్సులను అమలుచేయడం వల్ల ప్రభుత్వంపై 2016–17 ఆర్థికసంవత్సరంలో రూ.1 లక్ష కోట్ల వ్యయభారం పడింది. అయితే పెరిగిన వేతనాలను ఉద్యోగులు ఖర్చుచేయడంతో దేశంలో వినిమయం పెరిగి దేశార్థికం బాగుపడుతుందనే వాదనలూ ఉన్నాయి. సాధారణంగా సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగుల జీతభత్యాల సవరణకు ప్రతి పదేళ్లకు పే కమిషన్ ఏర్పాటుచేయడం ఆనవాయితీగా వస్తోంది. చాలావరకు పే కమిషన్ సిఫార్సులను పరగణనలోకి తీసుకుని రాష్ట్రాలు సైతం తమ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలపై ఓ నిర్ణయానికొస్తాయి.

డాకింగ్ సక్సెస్

అనుసంధానమైన స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు

ఇస్రో విజయకిరీటంలో మరో కలికితురాయి ● ప్రధాని మోదీ హర్షం



డాకింగ్ దిశగా కదులుతున్న ఉపగ్రహం
(ఇస్రో విడుదల చేసిన చిత్రమిది)

సూళ్లూరుపేట/ సాక్షి బెంగళూరు: సొంతంగా భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న ఇస్రో కలను సాకారం చేసేలా స్పేడెక్స్ జంట ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ (డాకింగ్) విజయవంతమైంది. దీంతో ప్రపంచంలో డాకింగ్ సాంకేతికతను సాధించిన నాలుగోదేశంగా భారత్ అవతరించింది. అత్యంత క్లిష్టమైన డాకింగ్‌ను పూర్తిచేసి ఇస్రో మరోసారి తన సత్తా చాటింది. దీంతో నూతన సంవత్సరంలో ఇస్రో విజయాల బోణీ కొట్టింది. ఇంతకాలం అమెరికా, రష్యా, చైనాలకు మాత్రమే సాధ్యమైన ఈ ఫీట్‌ను సాధించి ఇస్రో తన కీర్తికిరీటంలో మరో కలికితురాయిని చేర్చుకుంది. గురువారం ఉదయం 9 గంటలకు చేజర్ (ఎస్‌డీఎక్స్01), టార్గెట్ (ఎస్‌డీఎక్స్02) అనే జంట ఉపగ్రహాలను అనుసంధానించామని, డాకింగ్ తర్వాత వీటిని ఒకే ఉపగ్రహంగా కంట్రోల్ చేస్తున్నాం. త్వరలో మళ్లీ వీటిని దూరంగా విడగొడతాం. వీటి మధ్య ఇంధన, విద్యుత్ సరఫరా వ్యవస్థల బదిలీని పరీక్షిస్తాం'' అని ఇస్రో గురువారం ప్రకటించింది. '' అంతరిక్ష చరిత్రతో భారత్ తన పేరును 'డాకింగ్'చేసింది. స్పేడెక్స్ మిషన్ ద్వారా చరిత్రాత్మక స్థాయిలో డాకింగ్ విజయవంతమైంది. ఈ చిరస్మరణీయ క్షణానికి సాక్షిగా నిలిచినందుకు గర్విస్తున్నాం'' అని ఇస్రో 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టింది. ఇస్రో తన డాకింగ్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఉద్దేశించిన స్పేడెక్స్ ప్రయోగం విజయవంతమవడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ''అద్భుత ఘనత సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఈ మిషన్‌లో పాలు పంచుకున్న సిబ్బందికి నా శుభాకాంక్షలు. భారత భవిష్యత్ ప్రతిష్టాత్మక అంతరిక్ష ప్రయోగాలకు ఈ డాకింగ్ తొలిమెట్టు'' అని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

వైఫల్యాల నుంచి విజయం దాకా

గత ఏడాది డిసెంబర్ 30వ తేదీన పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (పీఎస్‌ఎల్‌వీ– సీ60) రాకెట్ ద్వారా స్పేస్ డాకింగ్ ఎక్స్‌పరిమెంట్(స్పేడెక్స్) మిషన్‌ను చేపట్టారు. ఇందులోభాగంగా చెరో 220 కేజీల బరువైన చేజర్, టార్గెట్ ఉపగ్రహాలను ప్రయోగించిన 15 నిమిషాల తర్వాత 475 కిలోమీటర్ల పొడవైన వేర్వేరు వృత్తాకార కక్ష్యల్లో ప్రవేశపెట్టారు. తర్వాత వాటిని నెమ్మదిగా ఒకే కక్ష్యలోకి తీసుకొచ్చారు. వాటిని అనుసంధానించేందుకు పలుమార్లు ప్రయత్నించారు. కానీ వేగాల్లో సారూప్యత లేకపోవడంతో డాకింగ్ సాధ్యంకాలేదు. చివరిసారిగా జనవరి 12వ తేదీన ఒకే కక్ష్యలో కేవలం 15 మీటర్ల సమీపానికి తీసుకొచ్చారు. తర్వాత దూరాన్ని కొంచెం కొంచెంగా తగ్గిస్తూ మూడు మీటర్ల సమీపానికి తీసుకొచ్చారు. అయితే భూమ్మీది కమాండ్ సెంటర్ నుంచి స్పష్టంగా వీక్షించేందుకు సరిపడా వెలుతురు లేక, అననుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా డాకింగ్‌ను నిలిపేసి మళ్లీ వాటిని సురక్షిత దూరాలకు పంపేశారు. ఎట్టకేలకు గురువారం ఉదయం 9 గంటలకు అంతరిక్షంలో అత్యంత వేగంగా ప్రయాణించే ఈ రెండు ఉపగ్రహాలను అత్యంత కచ్చితత్వంతో ఒకదానికొకటి జోడించేందుకు మళ్లీ డాకింగ్‌కు ప్రయత్నించారు. టార్గెట్ ఉపగ్రహం నుంచి 15 మీటర్ల దూరంలో ఉన్న చేజర్ ఉపగ్రహాన్ని తొలుత అత్యంత జాగ్రత్తగా 3 మీటర్ల సమీపానికి తెచ్చారు. లేజర్ రేంజ్ ఫైండర్, డాకింగ్ సెన్సార్లను ఉపయోగించి ఎట్టకేలకు చేజర్ ఉపగ్రహాన్ని టార్గెట్ ఉపగ్రహంతో డాకింగ్ చేశారు. భవిష్యత్తులో నిర్వహించబోయే చంద్రయాన్–4, గగన్‌యాన్ ప్రయోగాలకు కూడా ఈ డాకింగ్ సాంకేతికత దోహదపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన స్పేడెక్స్ ప్రయోగం బృందానికి ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ అభినందనలు తెలియజేశారు.

ఇస్రోకు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: అంతరిక్షంలో ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు వైఎస్సార్‌సీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. 'అంతరిక్షంలో ఉపగ్రహాలను విజయవంతంగా డాకింగ్ చేయడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు అద్భుతమైన మైలురాయిని సాధించారు. ఈ విజయంతో భవిష్యత్‌లో భారత్ చేపట్టే ప్రతిష్టాత్మక అంతరిక్ష కార్యక్రమాలకు కీలకమైన ముందడుగు పడింది. ఈ సందర్భంగా ఇస్రోకు అభినందనలు' అంటూ గురువారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు.

శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్

- రూ.3,984.86 కోట్లతో నాలుగేళ్లలో నిర్మాణం
- ప్రధాని అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీ ఆమోదం
- ప్రస్తుతం శ్రీహరికోటలో రెండు లాంచ్ ప్యాడ్‌లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ అంతరిక్ష మౌలిక సదుపాయాల్లో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావించే కీలక నిర్ణయాన్ని కేంద్ర మంత్రివర్గం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఇస్రో మూడో లాంచ్ ప్యాడ్‌ను నిర్మించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. శ్రీహరికోటలో రూ.3,984.86 కోట్లతో నాలుగేళ్ల వ్యవధిలో పూర్తి చేయాలని ప్రధాని మోదీ అధ్యక్షతన గురువారం జరిగిన కేబినెట్ భేటీ తీర్మానించింది. ఇది అందుబాటులోకి వస్తే ప్రస్తుతం ఉన్న రెండో లాంచ్ ప్యాడ్‌కు కీలకమైన బ్యాకప్‌గా నిలవనుంది. కొత్త లాంచ్ ప్యాండ్ ప్రస్తుతమున్న రెండింటికి మించి సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. న్యూ జనరేషన్ లాంచ్ వెహికల్(ఎన్‌జీఎల్‌వీ) ప్రోగ్రామ్ సహా ఇస్రో యొక్క ప్రతిష్టాత్మక భవిష్యత్తు మిషన్‌లకు ఎంతో సహాయకారి కానుంది. 2035కల్లా భారతీయ అంతరిక్ష కేంద్రం(బీఏఎస్)ను నెలకొల్పడంతోపాటు 2040కల్లా చంద్రుడిపైకి మానవ సహిత యాత్ర చేపట్టాలనే బృహత్ లక్ష్యాలు ఇస్రో ముందున్నాయి. అందుకే, వచ్చే 25, 30 ఏళ్ల అవసరాలను తీర్చేలా ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటోంది.

రెండు ప్యాడ్‌లపైనే ఆధారం

భారతీయ అంతరిక్ష రవాణా వ్యవస్థలు పూర్తిగా రెండు లాంచ్ పాడ్‌లపై ఆధారపడి ఉన్నాయి. పీఎస్‌ఎల్‌వీ మిషన్ల కోసం 30 ఏళ్ల క్రితం మొదటి లాంచ్ ప్యాడ్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీనిని స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్(ఎస్ఎస్ఎల్‌వీ) కోసం సైతం వాడుతున్నారు. క్రయోజెనిక్ దశ కారణంగా జీఎస్‌ఎల్‌వీ మిషన్‌ల అవసరాలను ఇది తీర్చలేకపోతోంది. అదేవిధంగా, 20 ఏళ్ల క్రితం ఏర్పాటైన రెండో లాంచ్ ప్యాడ్ జీఎస్‌ఎల్‌వీ, ఎల్‌వీఎం–3 మిషన్ల సేవలందిస్తోంది. చంద్రయాన్–3, గగన్‌యాన్ మిషన్ల కోసం దీనినే వాడుతున్నారు.



శ్రీహరికోట

రెండో లాంఛ్ ప్యాడ్‌కు బ్యాకప్‌గా..

ఇస్రో తదుపరి జనరేషన్ లాంచ్ వెహికల్స్ (ఎన్‌జీఎల్‌వీ) ప్రయోగాల కోసం శ్రీహరికోటలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, రెండో లాంచ్ ప్యాడ్‌కు బ్యాకప్‌ను అందుబాటులోకి తేవడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని కేంద్ర మంత్రి వైష్ణవ్ తెలిపారు. కొత్త లాంచ్ ప్యాడ్ భవిష్యత్తులో ఇస్రో చేపట్టే మానవ సహిత అంతరిక్ష యాత్రలకు దన్నుగా నిలువనుంది. నాలుగేళ్లలో ఇది పూర్తి అవుతుందని ఆయన పేర్కొన్నారు. మూడో లాంఛ్ ప్యాడ్ కేవలం నెక్స్ట్ జనరేషన్ వెహికల్స్ మాత్రమే కాకుండా సెమీ క్రయోజనిక్ స్టేజ్‌తో లాంఛ్ వెహికల్ మార్క్–3(ఎల్వీఎం3)వాహనాలకు, అలాగే ఎన్జీఎల్వీ యొక్క అధునాతన అంతరిక్ష యాత్రలను సపోర్ట్ చేసేలా ప్యాడ్‌ను డిజైన్ చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో పరిశ్రమల విస్తృత భాగస్వామ్యానికి వీలు కల్పించనున్నారు. లాంఛ్ ప్యాడ్‌లను ఏర్పాటు చేయడంలో ఇస్రో మునుపటి అనుభవాన్ని ఉపయోగించడం, ఇప్పటికే ఉన్న లాంచ్ కాంప్లెక్స్ సౌకర్యాలను గరిష్ఠంగా ఉపయోగించడం కూడా దీనిలో ఒక భాగమే.

మరిన్ని విశేషాలు

విస్తరణ: రెండో లాంచ్ ప్యాడ్‌లో సమస్యలు తలెత్తిన సందర్భాల్లో జీఎస్‌ఎల్‌వీ ప్రయోగాలు అంతరాయం లేకుండా బ్యాకప్‌గా పనిచేస్తుంది.

ఎన్‌జీఎల్‌వీ సామర్థ్యాలకు తగ్గ ఏర్పాట్లు: నూతన తరం లాంచ్ వెహికల్స్ (ఎన్‌జీఎల్‌వీ) కుతుబ్ మినార్‌కు మించి అంటే 72 మీటర్ల కంటే ఎక్కువగా అంటే 91 మీటర్ల ఎత్తులో ఉంటాయి. అదేవిధంగా, ఎన్‌జీఎల్‌వీ అత్యధిక పేలోడ్‌ను అంటే 70 టన్నుల పేలోడ్‌ను సైతం భూమికి దిగువ కక్ష్యలోకి తీసుకెళ్లే విధంగా దీనికి రూపకల్పన చేస్తారు.

సైఫ్ అలీ ఖాన్‌కు కత్తిపోట్లు



ముంబైలోని బాంద్రావెస్ట్ నివాసంలో దాడికి పాల్పడిన దుండగుడు

- దొంగతనం కోసం ఇంట్లోకి వచ్చి అఘాయిత్యం
- సైఫ్ శరీరంపై ఆరుచోట్ల గాయాలు.. వెంటనే ఆసుపత్రికి తరలింపు
- శస్త్రచికిత్స చేసి, వెన్నెముక నుంచి కత్తి మొన తొలగించిన వైద్యులు
- తప్పిన ప్రాణాపాయం... నిలకడగా సైఫ్ ఆరోగ్యం

ముంబై: బాలీవుడ్ చిత్ర పరిశ్రమ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రముఖ నటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సైఫ్ అలీ ఖాన్(54)పై గుర్తు తెలియని దుండగుడు కత్తితో దాడికి దిగాడు. ఈ ఘటనలో నటుడికి తీవ్రగాయాలయ్యాయి. మహారాష్ట్ర రాజధాని ముంబైలో సంపన్నులు నివాసం ఉండే బాంద్రా వెస్ట్ ప్రాంతంలో ఉన్న సద్గురు శరణ్ భవనం 12వ అంతస్తులో సైఫ్ సొంత ఫ్లాట్‌లో గురువారం తెల్లవారుజామున 2 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో ఇంట్లో సైఫ్ భార్య కరీనాకపూర్ ఖాన్‌తో కుమారులు, ఇతర కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. దుండగుడి దాడిలో గాయపడి రక్తమోడుతున్న సైఫ్‌ను ఆయన పెద్ద కుమారుడు ఇబ్రహీం, పనిమనుషులు వెంటనే ఆటోలో సమీపంలోని లీలావతి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స ప్రారంభించడంతో ప్రాణాపాయం తప్పింది. రెండు బలమైన కత్తిపోట్లు సహా మొత్తం ఆరు చోట్ల గాయాలయ్యాయని డాక్టర్లు చెప్పారు. వెన్నుముక నుంచి 2.5 అంగుళాల కత్తి మొనను ఆపరేషన్ ద్వారా తొలగించారు. సైఫ్‌కు ఎలాంటి ప్రాణాపాయం లేదని, ప్రస్తుతం కోలుకుంటున్నారని తెలిపారు. సైఫ్‌పై దాడిపట్ల బాలీవుడ్



సైఫ్ నివసిస్తున్న సద్గురు శరణ్ భవనం



సీసీ ఫుటేజీలో నమోదైన అనుమానితుడి చిత్రం

నటులతోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు భద్రత కల్పించాలని కోరారు. మరోవైపు ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వ పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండాపోయిందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

ప్రత్యేక బృందాలతో గాలింపు

సైఫ్‌పై దాడి ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే బాంద్రా పోలీసులు రంగంలోకి దిగారు. ఘటనా స్థలానికి చేరుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేశారు. రాత్రిపూట ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించడంతోపాటు దొంగతనం కోసం వచ్చి హత్యాయత్నానికి పాల్పడడంతో సెక్షన్ 331(4), సెక్షన్ 311 కింద కేసు పెట్టారు. సాక్ష్యాధారాల కోసం సీసీటీవీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. సైఫ్‌పై దాడి తర్వాత దుండగుడు మెట్లు దిగి పారిపోయినట్లు గుర్తించారు. వీపున తగిలించుకున్న ఓ బ్యాగ్‌తో అతడు పారిపోతున్న దృశ్యాలు ఆరో అంతస్తులో తెల్లవారుజామున 2.33 గంటల సమయంలో రికార్డయ్యాయి. స్థానికంగా మొబైల్ ఫోన్ల డేటాను పోలీసులు వడపోశారు. దుండుగుడి ఆచూకీ కనిపెట్టడానికి పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అతడి ఫోటోను విడుదల చేశారు. దుండగుడి దాడిలో సైఫ్ పనిమనిషికి సైతం గాయాలయ్యాయి. దుండగుడితో జరిగిన పెనుగులాటలో ఆమె స్వల్పంగా గాయపడ్డారు. బాధితురాలి నుంచి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. స్టేట్‌మెంట్ రికార్డు చేశారు.

అసలేం జరిగింది?

దొంగతనం కోసమే దుండగుడు సైఫ్ ఫ్లాట్‌లోకి ప్రవేశించినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సైఫ్, కరీనా దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి తమ ఫ్లాట్‌లో నిద్రిస్తున్న సమయంలో అలికిడి వినిపించింది. అప్పటికే సైఫ్ చిన్న కుమారుడు జహంగీర్ గదిలో మాటువేసిన దుండగుడి కదలికలను పనిమనిషి గమనించి బిగ్గరగా కేకలు వేసింది. అలారం మోగించింది. దాంతో అతడు ఆమెపై కత్తి దూశాడు. ఈ శబ్దాలు వినిపించి నిద్రనుంచి మేల్కొన్న సైఫ్ అలీ ఖాన్ ఆ గదిలోకి వచ్చి దుండగుడిని అడ్డుకొనేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య చాలాసేపు పెనుగులాట జరిగింది. వాగ్వాదం చోటుచేసుకుంది. సైఫ్‌ను దుండగుడు కత్తితో విచక్షణారహితంగా పొడిచి తక్షణమే మెట్ల మార్గం గుండా పరారయ్యాడు. ఫైర్ ఎగ్జిట్ ద్వారా అతడు సైఫ్ ఫ్లాట్‌లో ప్రవేశించినట్లు పోలీసులు చెప్పారు. సైఫ్ కుమారుడి గదిలో నాలుగు గంటలపాటు నిశ్శబ్దంగా నక్కి ఉండి, అవకాశం కోసం ఎదురు చూశాడని, అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగతనానికి ప్రయత్నించాడని తెలిపారు. కారు అందుబాటులో లేకపోవడంతో సైఫ్‌ను ఆయన కుమారుడు, సహాయకులు ఆటోలో ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన బాధితుడికి న్యూరో సర్జన్ డాక్టర్ నితిన్ డాంగే, కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ లీనా జైన్, అనస్థీషియాలజిస్టు డాక్టర్ నిషా గాంధీ శస్త్రచికిత్స చేశారు. ఆరు చోట్ల గాయాలైనట్లు తెలిపారు. మెడ, వెన్నుముక భాగంలో సర్జరీ చేశారు. ఎడమ చెయ్యి, మెడ కుడి భాగంలో రెండు లోతైన గాయాలున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, త్వరలో పూర్తిస్థాయిలో కోలుకుంటారని వెల్లడించారు.

నిప్పులు చెరిగిన ప్రతిపక్షాలు

మహారాష్ట్రలో శాంతి భద్రతలు దారుణంగా క్షీణిస్తున్నాయని ఎన్సీపీ(శరద్ పవార్) అధ్యక్షుడు శరద్ పవార్ ఆరోపించారు. బాంద్రాలో ఇటీవలే ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడని, ఇప్పుడు సైఫ్‌పై దాడి జరిగిందని చెప్పారు. ఇవన్నీ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. హోంశాఖ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వద్దే ఉందని, శాంతిభద్రతల పరిరక్షణపై ఇకనైనా దృష్టి పెట్టాలని సూచించారు. ముంబైలో ఎవరికీ రక్షణ లేదని శివసేన(ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్ విమర్శించారు.

కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జీన్స్, టీ–షర్టు ధరించిన దుండుగుడు సైఫ్ చిన్నకుమారుడు జహంగీర్ గదిలోకి ప్రవేశించాడు. తొలుత తనను గమనించి కేకలు వేసిన పని మనిషి ఎలియామ ఫిలిప్స్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ క్రమంలో ఆమెను బంధించాడు. కోటి రూపాయలు ఇస్తేనే వదిలేస్తానంటూ బేరం పెట్టాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న సైఫ్ అదేమీ పట్టించుకోకుండా అతడిని ధైర్యంగా ఎదిరించాడు.

ఏఐ కంటెంట్‌కు లేబులింగ్ తప్పనిసరి

రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం ఆదేశం

న్యూఢిల్లీ: ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేసే ఏఐ జనరేటెడ్ కంటెంట్ వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం ఆదేశించింది. ఏఐ సాంకేతికతతో రూపొందించిన చిత్రాలు, వీడియోలు, ఆడియోలపై 'ఏఐ జనరేటెడ్/డిజిటల్లీ ఎన్‌హాన్స్‌డ్/ సింథటిక్ కంటెంట్ వంటి లేబుల్స్ జతచేయాలంటూ నిబంధనను విధించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌ఫేక్ కారణంగా తప్పుడు సమాచారం ప్రచారంలోకి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ ఇటీవల హెచ్చరించడం తెల్సిందే. తప్పుడు సమాచారం ఎన్నికల ప్రక్రియపై నమ్మకాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గతేడాది లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సోషల్ మీడియా వేదికల వినియోగంపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. ఫిబ్రవరి 5న జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు డిజిటల్ ప్రచారకులను నియమించుకున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల డిస్క్లైమర్లను ఎన్నికల సంఘం తప్పనిసరి చేసింది.

సుప్రీం జడ్జిగా జస్టిస్ చంద్రన్ ప్రమాణం



న్యూఢిల్లీ: పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె. వినోద్ చంద్రన్ గురువారం సుప్రీంకోర్టు జడ్జిగా ప్రమాణం చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆయనతో ప్రమాణం చేయించారు. అత్యున్నత న్యాయస్థానంలో మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 34. కాగా, జస్టిస్ చంద్రన్ రాకతో జడ్జీల సంఖ్య 33కు చేరుకుంది. జస్టిస్ చంద్రన్‌ను సుప్రీంకోర్టు జడ్జీగా నియమించాలంటూ ఈ నెల 7న కొలీజియం సిఫారసు చేయడం, 13న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడం తెలిసిందే. 2011 నవంబర్ 8న కేరళ హైకోర్టు జడ్జిగా నియమితులైన జస్టిస్ వినోద్ చంద్రన్ 2023 మార్చి 29న పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

రిపబ్లిక్ వేడుక ముఖ్య అతిథిగా సుబియాంతో



న్యూఢిల్లీ: జనవరి 26న భారత 76వ గణతంత్ర వేడుకలకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా రానున్నారు. ఈనెల 25 నుంచి 26 వరకు ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. ఈ వివరాలను విదేశీ వ్యవహారాల శాఖ గురువారం ప్రకటించింది. భారత్, ఇండోనేసియా మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని తెలిపింది. ఈ పర్యటన ఇరు దేశాల నాయకత్వానికి ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్షకు, పరస్పర ప్రయోజనాలకు, ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై చర్చించడానికి అవకాశం కల్పిస్తుందని పేర్కొంది. భారత్ ఏటా గణతంత్ర వేడుకలకు ప్రపంచ నాయకులను ఆహ్వానిస్తుంది. 2024లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, 2023లో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్‌సిసీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కోవిడ్ విజృంభణ కారణంగా 2021, 2022లో ఎవరినీ ఆహ్వానించలేదు. 2020లో బ్రెజిల్ అధ్యక్షుడు, 2019లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు, 2018లో మొత్తం 10 ఆసియాన్ సభ్యదేశాల అధినేతలు గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు.

విన్యాసాలకు ధృవ్, తేజస్ దూరం

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అత్యాధునిక తేలికపాటి హెలికాప్టర్ ధృవ్‌తోపాటు, తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌లు ఈసారి గణతంత్ర దినోత్సవ వైమానిక విన్యాసాల్లో పాల్గొనడం లేదు. ఆర్మీ, వైమానిక దళం, నేవీల వద్ద మొత్తంగా 330 వరకు ధృవ్ హెలికాప్టర్లు ఉన్నాయి. ఇటీవల గుజరాత్‌లో తీరగస్తీ దళానికి చెందిన ధృవ్ జనవరి ఐదున పోరుబందర్ వద్ద కూలిన ఘటనలో సిబ్బంది మరణించడంతో సమగ్ర దర్యాప్తు ముగిసేదాకా వీటిని ఎలాంటి విన్యాసాల్లో వాడొద్దని నిర్ణయించారు. అందులోభాగంగానే వీటిని గణతంత్రవేడుకలకు దూరంపెట్టినట్లు తెలుస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

నక్సల్స్ క్యాంప్‌పై భద్రతా బలగాల మెరుపు దాడి ● 17 మంది మావోయిస్టులు మృతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చర్ల: మావోయిస్టు పార్టీకి మరో భారీ దెబ్బ తగిలింది. తెలంగాణ సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్‌లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని చెబుతున్నారు. వీరిలో తెలంగాణ కేడర్‌కే చెందిన వారే ఉన్నట్టు తెలుస్తోంది. మరో ఘటన.. బిజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో మావో యిస్టులు అమర్చిన మందుపాతర పేలిన ఘటనలో కోబ్రా బెటాలియన్ కానిస్టేబుళ్లు మృదుల్ బర్మన్, మహ్మద్ ఇషాఖ్ గాయపడ్డారు. వీరికి ఎలాంటి ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు.

రాష్ట్ర సరిహద్దుల్లో ఘటన

తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం(కే) మండల సరిహద్దులోని మారేడుబాక –ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పూజారి కాంకేర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల శిబిరం ఉన్నట్టు సమాచారం అందుకున్న బలగాలు గురువారం ఉదయం కూంబింగ్ ప్రారంభించాయి. మొత్తం రెండు వేల మంది జవాన్లు అడవులను జల్లెడ పట్టడం మొదలెట్టారు. ఉదయం 9 గంటల సమయంలో తొలిసారిగా కాల్పులు మొదలయ్యాయి. అప్పటి నుంచి రాత్రి 7 గంటల వరకు కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. రాత్రి 10 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం 17 మంది మావోయిస్టులు మృతిచెందారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అయితే మృతులు ఎవరు? ఎంత మంది చనిపోయారనే అంశంపై అధికారిక సమాచారం వెలువడలేదు.

గాజాపై ఆగని దాడులు..72 మంది మృతి

టెల్ అవీవ్: ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఖతార్‌లో బుధవారం కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలు ప్రశ్నార్థకంలో పడింది. అంగీకారం కుదిరిన అంశాలను హమాస్ ఉల్లంఘిస్తోందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గురువారం ఆరోపించారు. అందుకే తమ కేబినెట్ ఆదివారం నుంచి అమల్లోకి రావాల్సిన ఆ ఒప్పందంపై చర్చించి, ఆమోదం తెలిపేందుకు సమావేశం కాలేదని ఆయన ప్రకటించారు. మరో వైపు, ఒప్పందంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ బలగాలు తీవ్ర దాడులకు పాల్పడ్డాయి. తాజా దాడుల్లో కనీసం 72 మంది చనిపోయినట్లు గురువారం గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. గాజాలోని రెండు ఆస్పత్రులకు వచ్చిన మృతదేహాల ఆధారంగానే ఈ సంఖ్య చెబుతున్నామని, వాస్తవ సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుందని వివరించింది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ, బందీల విడుదలకు అంగీకారం కుదిరినట్లు కీలక మధ్యవర్తి ఖతార్‌తోపాటు, అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించినప్పటికీ ఇంకా కొన్ని అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయని నెతన్యాహు గురువారం అన్నారు. తన సంకీర్ణ ప్రభుత్వంలోని విభేదాలను సమసేలా చేసేందుకే నెతన్యాహు ఈ ప్రకటన చేశారా లేక, అసలా ఒప్పందమే ఆయనకు ఇష్టం లేదా అనే విషయం తెలియడం లేదని పరిశీలకులు అంటున్నారు. ఒప్పందంలోని కొన్ని అంశాలను ఉల్లంఘించడం ద్వారా పైచేయి సాధించేందుకు, మరికొన్ని డిమాండ్లు చేసేందుకు హమాస్ యత్నిస్తోందని నెతన్యాహూ కార్యాలయ వర్గాలు అంటున్నాయి. అందుకే, హమాస్ పూర్తిగా వెనక్కి తగ్గే వరకు కేబినెట్ ఈ ఒప్పందాన్ని చర్చించి, ఆమోదించేందుకు సమావేశం అయ్యే అవకాశం లేదని కుండబద్దలు కొట్టాయి. ఆ అంశాలేమిటన్న వివరాలను మాత్రం వెల్లడించలేదు. మధ్యవర్తులు ప్రకటించిన కాల్పుల విరమణ ఒప్పందానికి తాము కట్టుబడి ఉంటామని హమాస్ ప్రతినిధి ఇజ్జత్ అల్ రిష్క్ చెప్పారు.

అంతర్గతంగా తీవ్ర ఒత్తిళ్లు

హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలను సురక్షితంగా వెనక్కి తీసుకురావడంపై నెతన్యాహు తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో, హమాస్ పెట్టే షరతులన్నిటికీ తలూపే పక్షంలో తాము వైదొలుగుతామంటూ సంకీర్ణంలోని కొన్ని రాజకీయ పక్షాలు నెతన్యాహూను తీవ్రంగా హెచ్చరిస్తున్నాయి. ఆ రాజకీయ పార్టీలతో పనిలేకుండానే ఒప్పందాన్ని ఆమోదింపజేసుకునేంతటి బలం నెతన్యాహూకు ఉంది. అయినప్పటికీ, సంకీర్ణం బలహీనం కాకూడదనే ఉద్దేశంతోనే నెతన్యాహూ ఉన్నారని చెబుతున్నారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 17 । జనవరి । 2025



36 గంటల్లో పట్టేశారు..
పుప్పాలగూడలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసు మిస్టరీ వీడింది. 36 గంటల్లో కేసును ఛేదించిన నార్సింగి పోలీసులు.. మధ్యప్రదేశ్‌లో నిందితులను అరెస్టు చేశారు. -8లో



ఆహ్వానం.. ఘనం..
ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు నగరంలోని పలువురు ప్రముఖులతో పాటు మరికొందరికి ప్రధాని నుంచి ఆహ్వానం అందింది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 28.0/19.0
నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 28, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

మొరాయించిన అమ్యూజ్‌మెంట్ రేంజర్

ఉలిక్కిపడిన నుమాయిష్ సందర్శకులు



అబిడ్స్: ఎగ్జిబిషన్ అమ్యూజ్‌మెంట్ విభాగంలో రేంజర్ మొరాయించడంతో సందర్శకులు ఉలిక్కిపడ్డారు. నుమాయిష్‌లో గురువారం సాయంత్రం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అమ్యూజ్‌మెంట్ విభాగంలోని రేంజర్‌లో ఓ భాగం మీదకు వెళ్లగా.. మరో భాగం కిందకు వచ్చింది. కొద్ది క్షణాల్లో రేంజర్‌లోని బేరింగ్ ఆగిపోవడంతో పై భాగం అలాగే ఉండిపోయింది. అందులో ఉన్న సందర్శకులు అరుపులు, కేకలు పెట్టారు. గాలిలోనే కొంతసేపు రేంజర్ ఒక విభాగం ఉండడంతో అక్కడే ఉన్న వేలాది మంది సందర్శకులు, పోలీసులు సైతం భయభ్రాంతులకు గురయ్యారు. తేరుకున్న అమ్యూజ్‌మెంట్ నిర్వాహకులు, పోలీసులు రేంజర్ పైభాగంలో ఉన్న వారిని ఒక్కొక్కరిని కిందకు దించారు. ప్రమాదం నుంచి బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అమ్యూజ్‌మెంట్ విభాగంలో భద్రత ప్రమాణాలు పాటించేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని సందర్శకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాణాలతో చెలగాటం ఆడే పలు విభాగాలు ఇందులో ఉన్నాయని.. ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నకిలీ పత్రాలతో రూ. 8.5 కోట్ల రుణాలు

- ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థకు ఏజెంట్ల టోకరా
- కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ పత్రాలు సృష్టించి వాటిని ష్యూరిటీగా పెట్టి ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.8.5 కోట్లు రుణం తీసుకుని మోసం చేసిన ఇద్దరిపై నగర సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్స్ రోడ్డులో ఉన్న కాన్ఫిన్ హోమ్స్ లిమిటెడ్ సంస్థ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) సేవలు అందిస్తోంది. ఇది వివిధ రకాలైన ఆస్తులను తనఖా పెట్టుకొని రుణాలు ఇస్తుంటుంది. ఈ సంస్థకు పని చేస్తున్న ఏజెంట్లు వేణు, శ్రీనివాస్‌లకు దీని కార్యకలాపాలపై పూర్తి అవగాహన ఉంది. దీంతో ఈ ద్వయం పథకం ప్రకారం నకిలీ పత్రాలతో రుణాలు తీసుకోవాలని భావించారు. 1983 కంటే ముందు జరిగిన క్రయవిక్రయాలకు సంబంధించిన భూ లావాదేవీలు ఈసీలో (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) కనిపించవు. ఈ లూప్ హోల్‌ను ఆధారంగా చేసుకున్న వీరిద్దరు కథ నడిపించారు. 2022–23 మధ్యలో అనేక మంది నుంచి ఆస్తి పత్రాలు సంగ్రహించి, వీటి ఆధారంగా నకిలీ పత్రాలు సృష్టించారు. నకిలీ డాక్యుమెంట్లను ఆధారంగా చేసుకుని ఘట్‌కేసర్, ఎస్ఆర్ నగర్‌ల్లోని కాన్ఫిన్ సంస్థ బ్రాంచ్‌ల్లో 36 మంది పేర్లతో దరఖాస్తు చేసి రూ.8.5 కోట్ల రుణాలు తీసుకున్నారు. ఓ దశలో ఈ లావాదేవీలపై అనుమానం వచ్చిన సంస్థ అంతర్గత విచారణ జరిపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సిబ్బంది సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

అభ్యంతరాల మధ్య మొదలైన మల్టీలెవల్ పార్కింగ్ పనులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును ఆనుకుని జీహెచ్ఎంసీ వాక్‌వే ఒకటో పార్కింగ్ లాట్‌లో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. కేబీఆర్ పార్కు వాకర్లు, సందర్శకులు ఇక్కడ మల్టీలెవల్ పార్కింగ్ అవసరం లేదని అభ్యంతరాలు, నిరసనలు వ్యక్తం చేస్తుండగానే.. మరోవైపు జీహెచ్ఎంసీ నిర్మాణ పనులు చేపట్టింది. వాహనదారుల నుంచి పార్కింగ్ ఫీజు దండుకోవడానికి, డిజిటల్ ప్రకటన బోర్డులతో ఆదాయం గడించేందుకు ప్రైవేటు వ్యక్తులు ఈ నిర్మాణానికి తెరలేపారని, జీహెచ్ఎంసీ ఇందుకు తలూపింది. ఇక్కడ మల్టీలెవల్ పార్కింగ్ అవసరం లేదని, ఉన్న స్థలంలో పార్కింగ్ సరిపోతుందని డిమాండ్లు వెల్లువెత్తుతున్నా జీహెచ్ఎంసీ అధికారులు పెడచెవిన పెట్టారు. ఇక్కడ మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణ పనులు పూర్తయితే సుమారు 1500 గజాల ఖరీదైన జీహెచ్ఎంసీ స్థలం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మారనుంది. ఈ విషయంలోనే స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణం జరిగితే జీహెచ్ఎంసీ వాక్‌వే కూడా ఇబ్బందికరంగా మారుతుందని వాకర్లు ఆరోపిస్తున్నారు. మొత్తానికి జీహెచ్ఎంసీ పనులైతే ప్రారంభించడం గమనార్హం.





చిన్నారుల తలలకు హెల్మెట్లు పెట్టి రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ తదితరులు

ట్రాఫిక్ సెన్స్ ఎంతో అవసరం

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్
- నుమాయిష్‌లో పోలీస్ స్టాల్ ప్రారంభం

అబిడ్స్: ట్రాఫిక్ అవగాహన, ట్రాఫిక్ సెన్స్ వాహనదారులకు మెండుగా ఉంటే ఎలాంటి ప్రమాదాలు జరగవని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నుమాయిష్‌లో పోలీస్ స్టాల్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. నుమాయిష్ ద్వారా వచ్చే ఆదాయంతో విద్యారంగ వ్యాప్తికి నిర్వాహకులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తన చిన్నప్పటి నుంచి నుమాయిష్‌ను సందర్శించి ఎంతో ఉల్లాసంగా గడిపేవాడినని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ..... చిన్నప్పటి నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా చుక్ చుక్ రైల్‌లో సీపీ సీవీ ఆనంద్‌తో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు ప్రయాణించారు. కార్యక్రమంలో డీసీపీలు రాహుల్ హెగ్డే, వెంకటేశ్వర్లు, కవిత, అశోక్‌కుమార్, డీసీపీ రామ్‌దాస్ తేజ, ఏసీపీలు చంద్రశేఖర్, ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్లు విజయ్‌కుమార్, బాలాజీ, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్ రెడ్డి, ప్రతినిధులు ఆర్.సుకేష్ రెడ్డి, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.





కలర్.. కమాల్!

వాహన అద్దాల 'రంగు' ముదురుతోంది!!

లోపలి భాగం స్పష్టంగా కనిపించకుండా ఏర్పాటు
- సుప్రీం కోర్టు ఆదేశాలూ బేఖాతర్
- సామాన్యులతో పాటు ప్రజాప్రతినిధులదీ ఇదే పంథా
- నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: 'కార్లు ఇతర వాహనాల అద్దాలపై రంగు ఫిల్మ్‌లు తదితరాలు ఉండకూడదు. ఆయా వాహనాల్లోని లోపలి భాగం స్పష్టంగా బయటికి కనిపించేలా ఉండాలి' అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా గతంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలివి. వీటి అమలు నగరంలో క్రమక్రమంగా మసకబారుతోంది. అనేక వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వేసుకుని సంచరిస్తున్నా పోలీసుల చర్యలు మాత్రం నామమాత్రంగా మారాయి.

70.. 50 శాతం కాంతి ప్రసారం కచ్చితం..

వాహనాల్లో జరుగుతున్న నేరాలు, ప్రమాదాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం 2012లో కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వీటిని అమలు చేయాల్సిన బాధ్యతను రాష్ట్రాల డీజీపీలు, కమిషనరేట్ల కమిషనర్ల ద్వారా ఆయా ట్రాఫిక్ విభాగాలకు అప్పగించింది. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం వాహనాల ముందు వెనుక అద్దాలు 70 శాతం, పక్క తలుపులకు ఉన్న అద్దాలు 50 శాతం కాంతి ప్రసారకాలుగా (విజువల్ లైట్ ట్రాన్స్‌మిషన్) ఉండాల్సిందే. ప్రస్తుతం అనేక వాహనాలకు ఇది కేవలం 30, 10 శాతంగానే ఉంటోంది. ఫిల్మ్‌లతో పాటు ఇతర ఏ విధమైనవీ అద్దాలపై నిర్దేశిత ప్రమాణాలకు మించి ఉండకూడదు. కార్లను తయారు చేసే కంపెనీలు కచ్చితమైన ప్రమాణాలతో అద్దాలను రూపొందిస్తాయి. వీటినే కొనసాగిస్తే ఉత్తమమని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. అయితే.. అనేక మంది ఆ అద్దాలపై ఫిల్మ్‌లు వేసుకుంటున్నట్లు వివరిస్తున్నారు.

ఆ రెండు కేటగిరీలకే మినహాయింపు..

బ్లాక్ ఫిల్మ్‌తో కూడిన అద్దాల వాహనాలు వినియోగిస్తున్న వారిలో సామాన్యులే కాదు.. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు సైతం ఉంటున్నారు. సెలబ్రిటీలు కూడా తమకు పబ్లిక్ ప్లేసుల్లో అభిమానులతో అనవసర ఇబ్బందులు వస్తాయనే సాకుతో వినియోగిస్తున్నారు. ప్రజాప్రతినిధులైతే ఏకంగా భద్రతా కారణాలు చెబుతున్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం బ్లాక్ ఫిల్మ్ నిబంధన నుంచి కేవలం జెడ్, జెడ్‌ప్లస్ కేటగిరీ భద్రతలో ఉండే అత్యంత ప్రముఖులకు మాత్రమే మినహాయింపు ఉంది. అదీ కేవలం అధీకృత వాహనాలు, భద్రతాపరమైన అంశాల్లో మాత్రమే. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో అత్యున్నత అధికారుల వాహనాలకు సైతం ఫిల్మ్ లేని అద్దాలతో కూడిన వాహనాలనే వినియోగించాల్సి ఉంది.

మినహాయింపు పొందటం ప్రహసనమే...

ఓ ప్రముఖుడు లేదా వ్యక్తికి భద్రత కల్పించాలన్నా, గన్‌మెన్‌లను ఏర్పాటు చేయాలన్నా దానికి సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్సార్సీ) సిఫార్సులు తప్పనిసరి. అలాగే ఈ బ్లాక్ ఫిల్మ్ నిబంధన నుంచి జెడ్, జెడ్ ప్లస్ కేటగిరీల్లో ఉన్న వారు కాకుండా ఇతరులు మినహాయింపు పొందాలంటే దానికి పెద్ద ప్రహసనమే ఉంది. రాష్ట్ర స్థాయిలో హోమ్ సెక్రటరీ నేతృత్వంలో డీజీపీ తదితరులతో ఏర్పాటయ్యే అత్యున్నత స్థాయి ప్రత్యేక కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి. ఈ కమిటీ దరఖాస్తుతో పాటు దరఖాస్తుదారుడి పూర్వాపరాలను పరిశీలించి, వివిధ కోణాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కమిటీ కేవలం భద్రతాపరమైన అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని మినహాయింపులు ఇవ్వాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. 'సుప్రీం' తీర్పులో ప్రస్తావన లేనందున వాహనాల వెనుక, పక్క అద్దాలకు లోపలి వైపు నుంచి కర్టెన్లు వేసుకుంటే ఎలాంటి అభ్యంతరం ఉండదని అధికారులు చెబుతున్నారు.



అప్పట్లో పక్కాగా అమలు..

- ప్రస్తుతం నగర పోలీసు కమిషనర్‌గా ఉన్న సీవీ ఆనంద్ గతంలో సిటీ ట్రాఫిక్ విభాగం చీఫ్‌గా వ్యవహరించారు. అప్పట్లోనే సుప్రీం కోర్టు తీర్పు కూడా రావడంతో పక్కాగా అమలు చేశారు. ఉల్లంఘనులకు జరిమానాలు విధించడానికి ముందు కొన్ని రోజుల పాటు ప్రచారం చేశారు. ఆపై ప్రత్యేక డ్రైవ్స్ ప్రారంభించారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 100 కింద తొలుత రూ.500 చొప్పున, ఆపై రూ.వెయ్యి చొప్పున జరిమానాలు విధించారు. సుప్రీం కోర్టు ఆదేశాలు దేశ వ్యాప్తంగా అందరికీ శిరోధార్యం కావడంతో జిల్లాల నుంచి నగరానికి వచ్చే వాహనాలకూ వర్తింపజేశారు.
- కొన్ని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఫిల్మ్‌లు కలిగి ఉన్న వాహనాలను ఆపి, రోడ్లపైనే తొలగించారు. వాహనాల అద్దాలపై ఉన్న ఫిల్మ్ పరిమాణాన్ని కొలవడానికి టింట్ మీటర్ల కూడా వినియోగించారు. ఫిల్మ్ వినియోగం వద్దని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలంటూ సాధారణ పరిపాలన శాఖ, పోలీసు వాహనాలకు సంబంధించి పోలీసు రవాణా విభాగం, కమిషనరేట్లలోని సంబంధిత విభాగాలు, హైకోర్టు రిజిస్ట్రార్‌లతో పాటు అన్ని విభాగాల అధిపతులకు (హెచ్ఓడీ) లేఖలు సైతం రాశారు.

విద్యకు మొదటి ప్రాధాన్యం

మంత్రి సీతక్క



జ్యోతి ప్రజ్వలనతో శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క తదితరులు

చైతన్యపురి: రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యమిస్తోందని మంత్రి సీతక్క అన్నారు. గురువారం కొత్తపేటలోని సరూర్‌నగర్ సంక్షేమ గురుకులాల కళాశాలలో సంక్షేమ గురుకుల విద్యాలయాలు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ శిక్షణ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గురుకులాల్లో ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె చెప్పారు. తోటమాలి మొక్కలను ఎలా జాగ్రత్తగా సంరక్షిస్తారో అదే రకంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని పండిట్ జవహర్ లాల్ చెప్పేవారని గుర్తు చేశారు. తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మితమవుతుందని, ఆ భవిష్యత్ టీచర్లు, ప్రిన్సిపాల్స్ చేతుల్లో ఉంటుందన్నారు. టీచర్లు నిత్య విద్యార్థుల్లా ఉండాలని సూచించారు. తాను హాస్టల్‌లో ఉండి చదువుకున్నానని, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ చేసి ఇప్పుడు మరో పీజీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. హాస్టల్ జీవితం ఆనందదాయకంగా ఉండాలని, అందించే ఆహారం సొంత కుటుంబాన్ని గుర్తు చేసుకునేలా ఉండాలని మంత్రి సీతక్క సూచించారు.

రా'బంధు'లెవరో?

- అసెంబ్లీ ఎన్నికల ముందు రుణ వితరణలు
- బీసీలు, మైనారిటీలకు రూ.లక్ష చొప్పున అప్పు
- ప్రస్తుతం యూనిట్లపై ఆరా తీస్తున్న అధికారులు
- అయోమయానికి గురవుతున్న లబ్ధిదారులు
- మనుగడలో లేని సగానికి పైగా యూనిట్లు



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంజూరు చేసిన బీసీ, మైనారిటీ బంధు యూనిట్లపై అధికార యంత్రాంగం ఆరా తీస్తోంది. వంద శాతం సబ్సిడీతో రూ. లక్షల విలువైన యూనిట్లను మంజూరు చేసింది. అప్పట్లో లబ్ధిదారుల ఎంపిక నుంచి చెక్కుల పంపిణీ వరకు వ్యవహారమంతా స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే సాగింది. తాజాగా సంక్షేమ శాఖల నుంచి లబ్ధిదారులు ఫోన్ల తాకిడి పెరిగింది. 'యూనిట్ల పరిశీలనకు వస్తున్నాం.. షాపు చిరునామా చెప్పండి' అంటూ ఫోన్లు వస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. వాస్తవంగా బీసీ, మైనారిటీ బంధు కింద రూ.లక్ష లబ్ధి పొందిన వారిలో సగానికిపైగా యూనిట్లను నెలకొల్పనట్లు తెలుస్తోంది. రుణ మంజూరుకు సిఫారసులు చేసిన వారికి కొంత ముట్టజెప్పి మిగితాది తమ అవసరాలకు ఖర్చు చేసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా యూనిట్లపై విచారణ ప్రారంభం కావడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు.

గ్రేటర్‌లో 7,200 యూనిట్లు..

గ్రేటర్ పరిధిలో సుమారు 7,200 యూనిట్లు మంజూరైనట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో బీసీ బంధు కింద మొదటి విడతగా నియోజకవర్గానికి 300 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వృత్తి, చిరు వ్యాపారాల కోసం రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించారు. వాస్తవంగా గ్రేటర్ పరిధిలో సుమారు 65 వేల మందికి పైగా చేతి, కులవృత్తిదారులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 20,724, మేడ్చల్‌లో 22 వేల 87 మంది, రంగారెడ్డి జిల్లాలో సుమారు 20 వేలకుపైగా దరఖాస్తులు అందినట్లు బీసీ సంక్షేమ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

మొదటి విడత పంపిణీ తర్వాత రెండో విడతలో మిగిలిన అర్హులైన వారికి అందిస్తామని ప్రకటించినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో వాటి ప్రస్తావనే లేకుండా పోయింది.

ఎన్నికల సమయంలో..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వంద శాతం సబ్సిడీతో బీసీ, మైనారిటీ బంధు పథకాలను అమలు చేసింది. నిజానికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రతీ యేటా సబ్సిడీతో కూడిన బ్యాంక్ లింకేజీ ఆర్థిక చేయూత కోసం దరఖాస్తులను స్వీకరిస్తూ వచ్చింది. అందులో కేవలం 80 శాతం సబ్సిడీతో కూడిన బ్యాంక్ లింకేజీ కింద రూ.లక్ష రుణం మాత్రమే మంజూరు చేసి మిగతా సబ్సిడీ రుణాలను పెండింగ్‌లో పెడుతూ వచ్చింది. అయితే.. రూ. లక్ష రుణం కోసం కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులను రావడంతో అర్హులను గుర్తించి లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను గుర్తించినా నిధుల విడుదల కాకపోవడంతో ఆర్థిక సాయం మంజూరు పెండింగ్‌లో పడిపోతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం బీసీ, మైనారిటీ బంధు పథకం ప్రకటించి వంద శాతం సబ్సిడీని వర్తింపజేసింది. అయితే.. రుణ సహాయం పొందిన వారిలో సగానికి పైగా యూనిట్లు ఏర్పాటు చేయకపోవడంతో అసలు తలనొప్పి ప్రారంభమైంది.

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే 100 శాతం పెనాల్టీ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసేవారికి లైసెన్స్ ఫీజుతో పాటు 100 శాతం పెనాల్టీ విధించనున్నట్లు అధికారులు హెచ్చరించారు. లైసెన్స్ పొందేంత వరకు నెలకు 10 శాతం ఫైన్ కూడా అదనంగా విధించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు కమిషనర్ ఇలంబర్తి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ట్రేడ్ లైసెన్సులున్న వారు పెనాల్టీలు లేకుండా ఉండేందుకు ఈ నెలలోగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు 25 శాతం పెనాల్టీ, ఏప్రిల్ 1 నుంచి 50 శాతం పెనాల్టీ పడుతుందని పేర్కొన్నారు.

పెనాల్టీలు పడకుండా ఉండేందుకు మీసేవ కేంద్రాలు, జీహెచ్ఎంసీ పౌరసేవ కేంద్రల్లో సంప్రదించి రెన్యువల్ చేయించుకోవచ్చని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు లైసెన్సులు పొందని వారు ఆన్‌లైన్ ద్వారా కానీ.. మీసేవ కేంద్రాల ద్వారా కానీ తాజాగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌ను (www. ghmc.gov.in) చూడాలని ఇలంబర్తి సూచించారు.

ఎక్కడైనా అంతే.. ఆరోగ్యం గల్లంతే!

ప్రైవేట్ హోటళ్లే కాదు.. ప్రభుత్వ సంస్థల్లోనూ అదే తీరు

- టూరిజం ప్లాజాలోని 'మినర్వా' ఆహారంలో బొద్దింక
- వినియోగదారుడి ఫిర్యాదుతో వెలుగు చూసిన ఘటన

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో చిన్న హోటళ్లలోనే కాదు, బడా స్టార్ హోటళ్లలోనూ ప్రజలకు వడ్డించే ఆహారంపై గ్యారంటీ లేదు. ఇటీవలి కాలంలో రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ విభాగం నిర్వహించిన తనిఖీల్లో ఎంతో పేరెన్నికగన్న ఫైవ్‌స్టార్ హోటళ్లలోనూ వంటగదుల బండారం బట్టబయలైంది. నిల్వ ఉంచిన ఆహారం, కనీస జాగ్రత్తలు లేకపోవడం కూడా వెలుగు చూడటం తెలిసిందే. హైదరాబాద్ బిర్యానీతో పాటు ఇతరత్రా ఆహారాలకు ఎంతో పేరున్నప్పటికీ, ఫుడ్ సేఫ్టీ లేకపోవడం కూడా అదే స్థాయిలో ఉంది. అందుకే ఫుడ్ సేఫ్టీఅండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ర్యాంకుల్లోనూ తెలంగాణకు దక్కింది అధమ స్థానమే. అయినా నగరంలో హోటల్ నిర్వాహకుల తీరు మారలేదు. మిగతా ప్రాంతాల్లో ఎలా ఉన్నప్పటికీ, ప్రభుత్వరంగ సంస్థల్లోని హోటళ్లలో ఆహారం కల్తీ కాదని, తగిన జాగ్రత్తలు తీసుకుంటారని చాలామంది భావిస్తారు. కానీ.. అది కూడా నిజం కాదని, అన్ని హోటళ్ల మాదిరిగానే అక్కడా ప్రజారోగ్యంపై శ్రద్ధ లేదని వెల్లడైంది.

నీళ్లు నమిలిన మేనేజర్లు..

నగరంలోని ప్రజాభవన్‌కు సమీపంలోనే ఉన్న టూరిజం కార్పొరేషన్‌కు చెందిన ప్లాజాలోని 'మినర్వా'లోని పప్పు కర్రీలో ఓ వినియోగదారుకు బొద్దింక కనిపించింది. దీంతో హతాశుడైన అతను ఇదేమని మేనేజర్లను ప్రశ్నిస్తే.. నీళ్లు నమిలారు. పొరపాటైందని అన్నారు. మీరు తరచూ వస్తుంటారుగా సార్.. ఇంతకు ముందు ఎప్పుడూ ఇలా కాలేదుగా అన్నారు. తనకు ఎదురైన అనుభవాన్ని పేర్కొంటూ.. వీడియోలు సహా అతను సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం వైరల్‌గా మారింది. ఇలాంటి ఆహార వడ్డనతో ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం జరుగుతుందని, తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రెగ్యులర్ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఫిర్యాదు అందగానే జీహెచ్ఎంసీ అధికారులు మినర్వాలో తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరించారు.

లోపాలు వెలుగులోకి వస్తున్నా..

నగరంలో కొంత కాలంగా ఎక్కడ తనిఖీలు నిర్వహించినా ప్రమాణాలు పాటించకపోవడం, ఫుడ్ సేఫ్టీ లేకపోవడం బట్టబయలవుతూనే ఉన్నాయి. అయినా.. ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. లోపాలు వెల్లడవుతున్నప్పటికీ, నిర్వాహకులపై తగిన చర్యలు లేకపోవడం వల్లే పరిస్థితిలో మార్పు రావడం లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. టూరిజం ప్లాజాలో గదులు దొరకడం అందరికీ సాధ్యం కాదు. వాటికి ఎంతో డిమాండ్ ఉంది. దేశ, విదేశీ పర్యాటకులెందరో విడిది చేసే టూరిజం ప్లాజాలోని హోటల్‌లోనే పరిస్థితి ఇలా ఉండటాన్ని చూసి ప్రజలు బయట ఎక్కడ తినాలన్నా భయపడాల్సి వస్తోంది.



పప్పులో కనిపిస్తున్న బొద్దింక

నగదు ఇస్తానని..

- వృద్ధుడికి టోకరా
- రూ.75వేలు బదిలీ చేయించుకుని పరారీ

మలక్‌పేట: నగదు ఇస్తానని చెప్పి గుర్తుతెలియని వ్యక్తి ఓ వ్యాపారి నుంచి రూ. 75 వేలు గూగుల్‌పేకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని పరారైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అక్బర్‌బాగ్ డివిజన్, ఆంధ్రాకాలనీకి చెందిన తిప్పన జనార్దన్‌రెడ్డి మలక్‌పేట సూపర్‌బజార్‌లో జిరాక్స్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం యాక్టీవాపై అక్కడికి వచ్చిన గుర్తు తెలియని జనార్దన్‌రెడ్డిని మాటల్లో పెట్టాడు. అత్యవసర పరిస్థితి ఉన్నందున రూ.75 వేలు గూగుల్ పే చేయాలని, నగదు ఇస్తానని కోరాడు. అతడి మాటలు నమ్మిన జనార్దన్‌రెడ్డి నగదు బదిలీ చేశాడు. నగదు బైక్ డిక్కీలో ఉందని తీసుకొస్తానని బయటికి వచ్చిన అతను అక్కడి నుంచి పరారయ్యాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు స్థానిక యూకో బ్యాంకులో తన అకౌంట్ ఫ్రీజ్ చేయించాడు. కాగా అగంతకుడు అప్పటికే అందులో నుంచి రూ.50 వేలు డ్రా చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.

36 గంటల్లో పట్టేశారు..

- జంట హత్యల కేసులో వీడిన మిస్టరీ
- ముగ్గురు నిందితుల అరెస్టు
- హత్య చేసి మధ్యప్రదేశ్‌కు పరారీ
- హైదరాబాద్‌కు తీసుకువస్తున్న పోలీసులు



సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

మణికొండ: పుప్పాలగూడలో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో మిస్టరీ వీడింది. 36 గంటల్లో కేసును ఛేదించిన నార్సింగి పోలీసులు నిందితులను మధ్యప్రదేశ్‌లోని సిధి జిల్లాలో గురువారం అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బిందు(25) అనే యువతి సెక్స్‌వర్కర్‌గా పని చేసేది. ఈ నేపథ్యంలో ఆమెకు రాహుల్‌కుమార్ సాకేత్ అనే యువకుడితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారిద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో రాహుల్ కుమార్ సాకేత్ వీడియో తీసేందుకు యత్నించాడు. అందుకు అభ్యంతరం చెప్పిన బింధు అతడితో గొడవ పడి అక్కడినుంచి వచ్చేసింది. ఈ విషయాన్ని అంకిత్ సాకేత్(27)కు చెప్పింది. దీంతో ఆగ్రహానికి లోనైన అంకిత్, రాహుల్‌ను మందలించాడు. ఈ కారణంగా వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తనను మందలించాడనే కోపంతో రాహుల్, అంకిత్ సాకేత్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయంలో తనకు సహాయం చేయాలని తన మిత్రులు రాజ్‌కుమార్ సాకేత్, సుఖేంద్ర కుమార్ సాకేత్‌లను కోరాడు. పథకం ప్రకారం ఈనెల 11న రాహుల్‌కుమార్ సాకేత్, అంకిత్‌తో పాటు తన స్నేహితులతో కలిసి మరోమారు బిందును తీసుకుని ఆటోలో పుప్పాలగూడలోని అనంత పద్మనాభస్వామి దేవాలయం గుట్టలపైకి వచ్చారు. సుఖేంద్రకుమార్ సాకేత్ బిందుతో కలిసి ఉండగా రాహుల్ కుమార్, రాజ్‌కుమార్, అంకిత్ సాకేత్‌ను అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లి కత్తితో పొడిచి, బండ రాయితో మోది దారుణంగా హత్య చేశారు. ఈ సందర్భంగా అంకిత్ ఎదురుతిరగడంతో వారిద్దరికీ గాయాలయ్యాయి. అనంతరం ముగ్గురూ కలిసి బింధు వద్దకు వచ్చి ఆమెను తలపై బండ రాయితో మోది హత్య చేశారు.

మధ్యప్రదేశ్‌కు పరార్

హత్య అనంతరం నిందితులు ముగ్గురూ మృతుల వద్ద ఉన్న సెల్‌ఫోన్లను తీసుకుని 12న తెల్లవారుజామున తమ స్వస్థలమైన మధ్యప్రదేశ్‌కు పారిపోయారు. 14న ఉదయం గుట్టపై మృతదేహాలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. నిందితుల వద్ద ఉన్న మృతుల సెల్‌ఫోన్ల ఆధారంగా వారు మధ్యప్రదేశ్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లిన ప్రత్యేక బృందం గురువారం వారిని అదుపులోకి తీసుకుంది. వారి నుంచి మృతుల సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిని స్థానిక కోర్టులో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

తుక్కు కోసం వెళ్తే ట్రాలీ కూడా దొరికింది!

- స్క్రాప్ చోరీ కోసం గోదాంలోకి నలుగురు దొంగలు
- అక్కడ ఉన్న వాహనంతో సహా సరుకు చోరీ
- సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల: పాతబస్తీ ప్రాంతానికి చెందిన నలుగురు దొంగలు జీడిమెట్ల పరిధిలో ఉన్న ఓ స్క్రాప్ గోదాంను టార్గెట్ చేశారు. అందులో ఉన్న తుక్కు చోరీ చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీ రాత్రి తాళాలు పగులకొట్టి గోదాంలోకి వెళ్లిన వారికి తుక్కుతో పాటు టాటా ఏస్ ట్రాలీ కూడా కనిపించింది. దాని తాళాలు సైతం అందుబాటులో ఉండటంతో దొంగిలించిన స్క్రాప్‌ను అందులోనే వేసుకుని ఉడాయించారు. వివిధ సీసీ కెమెరాల్లో రికార్డైన ఫీడ్ ఆధారంగా నిందితులను గుర్తించి పట్టుకున్నట్లు బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ తెలిపారు. జీడిమెట్ల ఠాణాలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గోపిరెడ్డి బాలకృష్ణ అనే వ్యక్తి జీడిమెట్ల పరిధిలోని రాంరెడ్డినగర్‌లో స్క్రాప్ గోదాం నిర్వహిస్తున్నారు. ఈ నెల 9న రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో గోదాం, గేటుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. రాగి వైరుతో సహా అనేక వస్తువులు ఉంటాయని ఈ గోదాంపై కన్నేసిన పాతబస్తీలోని కాలపత్తర్ వాసులు సయ్యద్ ఫెరోజ్, మహ్మద్ అలం, అస్లాం ఖాన్, రాజేంద్రనగర్‌కు చెందిన మహ్మద్ గఫూర్, సోహైల్ అదే రోజు రాత్రి తాళాలు పగులకొట్టి గోదాంలోకి ప్రవేశించారు. వారికి అక్కడ రాగి వైరు, సామానుతో పాటు ఓ ట్రాలీ కూడా కనిపించింది. ఆ సమీపంలోనే దాని తాళాలు సైతం ఉండటంతో చోరీ చేసిన సొత్తు అందులోనే వేసుకుని ఉడాయించాలని నిర్ణయించుకున్నారు. దీంతో రెండు వేల కేజీల రాగి వైరుతో పాటు గోదాంలో ఉన్న ఇతర లోహ వస్తువులను ట్రాలీలో వేసుకుని పరారయ్యారు. మర్నాడు ఉదయం తన గోదాంకు వచ్చిన బాలకృష్ణ చోరీ జరిగినట్లు గుర్తించి జీడిమెట్ల ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన గోదాం, దానికి దారి తీసే మార్గాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న 150 సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్‌ను పరిశీలించారు. వాటిలో కనిపించిన దృశ్యాల ఆధారంగా పాత నేరగాళ్లయిన సయ్యద్ ఫెరోజ్, ఆలంలను గుర్తించారు. ఫెరోజ్‌పై 2011లో పంజగుట్ట, ఆలంపై 2023లో హయత్‌నగర్ ఠాణాల్లో చోరీ కేసులు నమోదయ్యాయి. వారి కదలికలపై పోలీసులు నిఘా ఉంచిన పోలీసులు గురువారం ఉదయం గాజులరామారం చౌరస్తాలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఫెరోజ్, ఆలం, అస్లాం ఖాన్, గఫూర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరిచ్చిన సమాచారంతో రూ.7.64 లక్షల నగదు, ట్రాలీ, వెయ్యి కేజీల కాపర్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సోహైల్ కోసం గాలిస్తున్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన ఏసీపీ హన్మంత్‌రావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజులను డీసీపీ అభినందించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



వినయ్ భాస్కర్ భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న పోలీసులు

అమీర్‌పేట: విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ గుండె పోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..బాపట్లకు చెందిన వినయ్ భాస్కర్ (53) ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో డ్యూటీకి వచ్చాడు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గుండె పోటు రావడంతో సిబ్బంది అతడిని అమీర్‌పేటలోని వెల్‌నెస్ ఆసుపత్రికి తరలించారు. సీపీఆర్ చేయడంతో సాధారణ స్థితికి వచ్చాడు. ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స అందిస్తుండగా అర్థరాత్రి రెండో సారి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వినయ్ భాస్కర్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ గోపాల్ సిబ్బందితో కలిసి బోయిన్ పల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.కో–ఆపరేటివ్ సొసైటీ నుంచి రూ.50 వేలు, శాఖ తరఫున రూ.30 వేలు ఆర్థికసాయం అందజేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మద్యం మత్తులో..

- ఎదురెదురుగా రెండు కార్లు ఢీ
- మణికొండలో భారీగా నిలిచిపోయిన వాహనాలు



రోడ్డుపై నిలిచిన వాహనాలు



విరిగిన స్కార్పియో టైర్

మణికొండ: మద్యం మత్తు రెండు కార్ల ప్రమాదానికి కారణమైన సంఘటన మణికొండ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన వెంకట సుబ్బయ్య తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఫుల్లుగా మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రాయదుర్గం ప్రాంతానికి చెందిన చిన్నగౌడ్ తన స్కార్పియోలో మర్రిచెట్టు సర్కిల్ వైపు వెళుతున్నాడు. అదే సమయంలో మర్రిచెట్టు సర్కిల్ నుంచి ఓయూ కాలనీ వైపు వస్తున్న శాంత్రో కారులో వస్తున్న వెంకటసుబ్బయ్య ఎస్‌బీఐ బ్యాంకు ముందుకు రాగానే ఎదురుగా వస్తున్న స్కార్పియోను వేగంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో స్కార్పియో ముందు టైరు విరిగిపోగా, శాంత్రో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. శాంత్రో కారులో బెలూన్ ఓపెన్ కావడంతో ఎవరికీ గాయాలు కాలేదు. వెంకట సుబ్బయ్య అతిగా మద్యం తాగటం, డ్రైవింగ్ లైసెన్స్ సైతం లేకుండా అతి వేగంగా కారు నడపటంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు పారిపోగా, డ్రైవింగ్ చేస్తున్న వెంకట సుబ్బయ్యను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రాత్రి 8 గంటల సమయంలో ప్రమాదం జరగటంతో రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రాయదుర్గం పోలీసులు వాహనాలు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పాత నేరస్తుడి పనే..

- భారీ చోరీ కేసులో నిందితుడి అరెస్టు
- 24 గంటల్లోనే కేసును ఛేదించి సొత్తు రికవరీ చేసిన పోలీసులు



దాసరి రక్షక్‌రాజ్

బంజారాహిల్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్‌లో జరిగిన భారీ చోరీ కేసు బంజారాహిల్స్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇందిరానగర్‌కు చెందిన లోవకుమారి, వీరవెంకటరమణ దంపతులు సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ నెల 12న ఇంటికి తాళం వేసి రాజమండ్రికి వెళ్లారు. ఇంటి భద్రతను ఇంట్లో కిరాయికి ఉండే తిరుమలరెడ్డికి అప్పగించారు. అయితే సినిమా షూటింగ్‌లలో హెల్పర్‌గా పనిచేసే తిరుమలరెడ్డికి నాలుగు రోజుల క్రితం ఫేస్‌బుక్‌లో బోరబండ కార్మికనగర్‌కు చెందిన దాసరి రక్షక్‌రాజ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ మూడు రోజులుగా ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఈ నెల 13న రాత్రి తిరుమలరెడ్డి ఆహ్వానం మేరకు రక్షక్‌రాజ్ అతడి ఇంటికి వచ్చాడు. ఇద్దరూ కలిసి మద్యం తాగారు. పీకలదాకా మద్యం తాగిన తిరుమలరెడ్డి నిద్రపోయాడు. అదే అదునుగా అంతకముందే సదరు ఇంటి యజమానుల వివరాలు ఆరా తీసిన రక్షక్‌రాజ్ వారు లేరని తెలుసుకున్నాడు. బండరాయితో ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.25 లక్షల నగదు, 20 తులాల బంగారు ఆభరణాలతో తన స్కూటీపై ఉడాయించాడు. రంగంలోకి దిగిన బంజారాహిల్స్ క్రైమ్ పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా బైక్‌పై ఇద్దరు వచ్చిన దృశ్యాలు, వెళ్లేటప్పుడు ఒక్కడే వెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. తిరుమలరెడ్డితో వచ్చిన వ్యక్తి ఎవరని ఆరా తీయగా తనకు మూడు రోజుల క్రితమే పరిచయం ఏర్పడిందని చెప్పాడు. దీంతో పోలీసులు రక్షక్‌రాజ్ ఫోన్ నెంబర్ ఆధారంగా గురువారం ఉదయం అతడిని కార్మికనగర్‌లోని అతడి ఇంట్లో అదుపులోకి తీసుకున్నారు. బీరువాలో దాచిన నోట్ల కట్టలు, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. 2020లో జూబ్లీహిల్స్‌లో ఓ చోరీ కేసులో జైలుకు వెళ్లి వచ్చినట్లుగా గుర్తించారు. ఎనిమిది నెలల క్రితం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనే చోరీకి యత్నించి పోలీసులకు చిక్కినట్లుగా విచారణలో వెల్లడైంది. కిరాయిదారు తిరుమలరెడ్డికి రక్షక్‌రాజ్ ఫేస్‌బుక్‌లో పరిచయమైనట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. చోరీ సొత్తు పూర్తిగా పట్టుబడడంతో అటు బాధితులు, ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పక్క షాప్‌లో గిరాకీ ఎక్కువగా ఉందని..

- పెట్రోల్ పోసి నిప్పంటించిన మహిళ
- నిందితురాలి రిమాండ్

అల్వాల్: పక్క షాపులో తన షాప్‌లో కంటే గిరాకీ ఎక్కువగా ఉంటుందని అక్కసుతో పతంగుల దుకాణంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన మహిళను అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మచ్చబొల్లారం ప్రధాన రహదారి బాలాజీ రైస్ మిల్ వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా లక్ష్మి, విశాల్ అనే వ్యక్తులు పతంగుల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో విశాల్ దుకాణానికి గిరాకీ ఎక్కువగా ఉండేది. దీంతో అసూయకు లోనైన లక్ష్మి ఈ నెల 13న రాత్రి విశాల్ దుకాణంపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా లక్ష్మిని నిందితురాలిగా గుర్తించారు. గురువారం ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్య



మల్లారెడ్డి (ఫైల్)

కీసర: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంగూడ గ్రామానికి చెందిన ఇందిరాల మల్లారెడ్డి (24) గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బంధువు చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం..

రెండు బైక్‌లు, ఫర్నిచర్ దగ్ధం

కేపీహెచ్‌బీకాలనీ: షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ రెస్టారెంట్‌లో మంటలు ఎగిసిపడి విలువైన వస్తువులు దగ్ధమైన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.అడ్డగుట్ట సొసైటీకి చెందిన నాగం శ్రీనివాస్‌రెడ్డి స్థానికంగా కంచుకోట రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున రెస్టారెంట్‌లో మంటలు చెలరేగడాన్ని గుర్తించిన స్థానికులు అతడికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అతను ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న వారు మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో రెస్టారెంట్‌లోని ఫర్నిచర్, ఏసీలు, ఫ్రిజ్‌లు, రెండు కంప్యూటర్లు, వంట సామాగ్రి, బైక్‌లు కాలిపోయినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చునని తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తలనొప్పి తాళలేక..

ఉరి వేసుకుని బాలిక ఆత్మహత్య

జవహర్‌నగర్: తలనొప్పి తాళలేక ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీరామ్‌నగర్‌కు చెందిన రమావత్ విజయ కుమార్తె వేణుహాసిని (17) గత కొంత కాలంగా మైగ్రేన్‌తో బాధపడుతుంది. నొప్పి తాళలేక గత మూడు రోజులుగా మతిస్థిమితం లేనట్లుగా ప్రవర్తిస్తుంది. గురువారం ఉదయం చదువుకుంటానని చెప్పి గదిలోకి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపులు పగలగొట్టి చూడగా వేణుహాసిని చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మైగ్రేన్ కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద.మధ్య రైల్వేలో మొట్టమొదటి మహిళా చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వేలో మొట్ట మొదటి మహిళా ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా కె.పద్మజ బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1991 బ్యాచ్‌కి చెందిన అధికారి అయిన పద్మజ ఈ నియామకానికి ముందు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. ఇక దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా ఎన్. రమేష్ సికింద్రాబాద్ రైల్‌నిలయంలో బాధ్యతలు స్వీకరించారు.

పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో ముగ్గురి రిమాండ్

అల్వాల్: అన్న కుమార్తెను ప్రేమిస్తున్నాడన్న కోపంతో ఓ యువకుడి ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో అల్వాల్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మచ్చబొల్లారం, గోపాల్‌నగర్ ఎరుకల బస్తీకి చెందిన ప్రకాష్, హేమలత దంపతుల కుమారుడు ప్రదీప్ అదే ప్రాంతంలోని వివేకానందకు చెందిన బైక్ షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. వివేకానంద అన్న కుమార్తెతో ప్రదీప్‌కు ఏర్పడిన పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. దీంతో వివేకానంద పలుమార్లు అతడిని హెచ్చరించాడు. అయినా ప్రదీప్ వైఖరిలో మార్పురాకపోవడంతో ఆగ్రహానికి లోనైన వివేకానంద, ప్రదీప్, అతడి కుటుంబసభ్యులను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి తన స్నేహితులు పవన్, ఎల్లేష్‌తో కలిసి పెట్రోల్ తీసుకుని ప్రదీప్ ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రదీప్ అక్కడి నుంచి పరారయ్యాడు. వివేకానంద ఇంట్లో ఉన్న ప్రదీప్ తల్లిదండ్రులు ప్రకాష్, హేమలతలతో పాటు ఇంటి తలుపులపై పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. ఈ ఘటనలో ప్రకాష్ తీవ్రంగా గాయపడగా, పక్కింట్లో ఉండే దిలీప్ అనే వ్యక్తి కుమార్తె చిన్నారి చాందిని (4) రెండు కాళ్లకు మంటలంటుకున్నాయి. గురువారం నిందితుడు వివేకానంద స్వయంగా అల్వాల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు., అతడికి సహకరించిన పవన్, ఎల్లేష్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా జేపీదర్గా గంధోత్సవం

- పాల్గొన్న భక్తజనం
- బాబాకు గంధం సమర్పించిన ఎమ్మెల్యే, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్

కొత్తూరు: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గంధోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇన్ముల్‌నర్వ గ్రామం హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీలు బాబాకు గంధం సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... జేపీ దర్గాకు దేశ వ్యాప్తంగా ఖ్యాతి ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో బాబా దర్శనం కోసం వస్తారని తెలిపారు. గత ప్రభుత్వాలు దర్గా అభివృద్ధిపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దర్గా దర్శనం కోసం వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు, వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా బస్టాండ్, తాగునీరు, వసతి, మరుగుదొడ్లతో పాటు పలు వసతులను కల్పించనున్నట్లు వివరించారు. ఉత్సవాల నేపథ్యంలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు నేతృత్వంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శివశంకర్‌గౌడ్, హరినాథ్ రెడ్డి, ఖాజా, ఖాలేద్, సిరాజ్, తస్లీమ్, రషీద్, షౌకత్, కృష్ణ, ఆగీరు రవికుమార్‌గుప్త, శేఖర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా

మహిళల చేతికి సోలార్ పవర్

దేవుడి మాన్యాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు

- మహిళా సమాఖ్యల ఆర్థిక అభ్యున్నతి దిశగా అడుగులు
- ఆలయ భూములను గుర్తించే పనిలో రెవెన్యూ యంత్రాంగం
- మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు నాలుగెకరాల భూమి అవసరం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పేద, మధ్య తరగతి మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఆలోచనలో భాగంగా ప్రభుత్వ, దేవాదాయ శాఖ భూముల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. తద్వార విలువైన దేవుడి మాన్యాలు కబ్జాకాకుండా కాపాడటంతో పాటు మహిళలకు ఆర్థిక భరోసా ఇవ్వొచ్చని భావిస్తోంది. ఇందుకోసం రెవెన్యూ అధికారులు ప్రాణాళిక రూపొందించారు. ఏ దేవుడి పేరున? ఏ గ్రామంలో? ఎంత భూమి ఉందో? గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించనున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులు బ్యాంకర్లతో చర్చలు కూడా జరిపారు. సోలార్ ప్లాంట్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, డిస్కం గ్రిడ్‌లకు అనుసంధానం చేయనున్నారు. వచ్చే డబ్బులతో బ్యాంకు రుణాలను తీర్చడంతో పాటు మహిళల ఆర్థిక పురోగతికి బాటలు వేయనున్నారు.

24 ఏళ్ల పాటు విద్యుత్ ఉత్పత్తి

జిల్లాలో 21 మండల మహిళా సమాఖ్యలు, 788 గ్రామ మహిళా సంఘాలు, 19,209 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 2,06,116 మంది సభ్యులు ఉన్నారు. వివిధ బ్యాంకులు వీరికి ఏటా రూ.వెయ్యి కోట్ల వరకు రుణాలు ఇస్తున్నాయి. ప్రస్తుతం విద్యుత్ కోసం పూర్తిగా థర్మల్, హైడల్ పవర్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. డిమాండ్ మేరకు వనరులు లేకపోవడంతో సరఫరాలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. అదే ఒక్కసారి సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే.. 24 ఏళ్ల పాటు విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే కనీసం నాలుగెకరాల భూమి అవసరమవుతోంది. అదే ఖాళీ గా ఉన్న ప్రభుత్వ, దేవాదాయ శాఖ భూముల్లో వీటిని ఏర్పా టు చేయడం ద్వారా స్థానిక అవసరాలు తీర్చడంతో పాటు మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది.

జిల్లాలోని దేవుడి భూములివే..

- మాడ్గుల మండలం అర్కపల్లిలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయం పేరున 34 ఎకరాలు.
- ఇంజాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పేరున 74.15 ఎకరాలు.
- యాచారం మండలంలోని ఓంకారేశ్వరాలయానికి 1,450 ఎకరాలు.
- పెండ్యాల లక్ష్మీనరసింహ్మాస్వామి దేవాలయానికి 360 ఎకరాలు.
- అమ్మపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి 222 ఎకరాలు.
- మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వ రస్వామి దేవాలయానికి 33.12 ఎకరాలు.
- జెన్నాయిగూడలోని క్షేత్రగిరి లక్ష్మీనరసింహ్మాస్వామి దేవాలయానికి 800 ఎకరాలు.
- కడ్తాల్‌లోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి 41.29 ఎకరాలు ఉన్నట్లు సమాచారం.
- ఈ స్థలాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

31వ గ్లోబల్ పీస్ అండ్ ఎక్సలెన్సీ అవార్డులు

లిబర్టీ: వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి గ్లోబల్ పీస్ అండ్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభాపాటవాలు కనబరుస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్సలెన్స్ అవార్డు – 2015 పేరిట ఈ నెల 31వ తేదీన 6.30 గంటలకు గోవా విలేజ్ రిసార్ట్స్‌లో అవార్డుల ప్రదాన ఉత్సవం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్య, వైద్యం, సాంస్కృతిక శాంతి సామరస్యం, మత సామరస్యం, సామాజిక సేవ వంటి అనేక రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి అవార్డులు ప్రదానం చేసి సత్కరించి ప్రోత్సహించనున్నట్లు అన్నారు.

చెత్తను తొలగించేందుకు ప్రత్యేక వాహనం


వాహనంతో చెత్తను తొలగిస్తున్న వాహనం

ఖైరతాబాద్: చెత్తను తొలగించేందుకు జటాయు గార్బేజ్ పికప్ ప్రత్యేక వాహనంతో చెత్తను తొలగించే డెమో కార్యక్రమాన్ని ఖైరతాబాద్ డివిజన్‌లో గురువారం నిర్వహించారు. లా మెట్రిక్ కంపెనీకి చెందిన జటాయు గార్బేజ్ పికప్ వాహనం ఒకేసారి ట్యాంక్‌లోకి పెద్దమొత్తంలో చెత్తను పైప్‌గొట్టం ద్వారా నేరుగా ట్యాంక్‌లోకి పీలుస్తుంది. ఈ వాహనం డెమోను ఖైరతాబాద్ డివిజన్‌లో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, మెట్రిక్ కంపెనీ ప్రతినిధి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్యూషన్ ఫీజు బకాయిల చెల్లింపు చివరి తేదీ 25

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు ట్యూషన్ ఫీజు బకాయిలు చెల్లించడానికి చివరి తేదీ జనవరి 25 అని విద్యార్థి సేవల విభాగాధిపతి డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇప్పటికే అడ్మిషన్ పొంది ఉండి సకాలంలో ఫీజు చెల్లించలేకపోయిన వారు జనవరి 25వ తేదీలలోపు ట్యూషన్ ఫీజు బకాయిలను ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలన్నారు. విశ్వవిద్యాలయ హెల్ప్‌డెస్క్ నెంబర్లు 040-23680222/333/444/555 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నివాళులు


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్లు

రహమత్‌నగర్: రహమత్‌నగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అల్‌బర్ట్ ఖురైషీ సతీమణి శోభారాణి (58) గురువారం ఉదయం మరణించారు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆమె భౌతికకాయం వద్ద పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. నగరంలోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు శోభారాణి ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరం ప్రతినిధులు రాకేష్ క్రిష్టఫర్, పీటర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డికి నివాళి

సనత్‌నగర్: కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని గురువారం నెక్లెస్‌రోడ్డులోని స్ఫూర్తి స్థల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి పాల్గొని నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఎస్.జైపాల్‌రెడ్డి చేసిన కృషిని ఈ సందర్భంగా చిన్నారెడ్డి గుర్తుచేశారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే మేధావి జైపాల్‌రెడ్డి అని కొనియాడారు.

చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-92లోని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో ఈనెల 10వ తేదీన చోరీ జరగగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పొన్నాల లక్ష్మయ్య, ఆయన భార్య అరుణాదేవి సమీపంలోని టీటీడీ టెంపుల్‌లో వేంకటేశ్వరస్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ఇంటికి తిరిగి వచ్చారు. మరుసటి రోజు తెల్లవారుజామున అరుణాదేవి లేచి చూసేసరికి ఇంట్లోని జ్యూవెలరీ బాక్స్ బాత్‌రూమ్ సమీపంలో కనిపించింది. ఆందోళన చెందిన వారు బీరువా తెరిచి చూడగా అందులో ఉండాల్సిన రూ.1.50 లక్షల నగదు, బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఫిలింనగర్ పోలీసులు పాత నేరస్తుల కదలికలపై దృష్టిపెట్టారు. అనుమానితులను విచారిస్తుండటంతోపాటు పొన్నం ఇంటి పరిసరాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న సీఆర్‌పీలు
- 33 అంశాల సేకరణపై దృష్టి
- ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించే ప్రక్రియ
- ఖైరతాబాద్‌లో మొదలైన కార్యక్రమం

బంజారాహిల్స్: మొన్నటి వరకు సమ్మెలో ఉన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు సర్వే బాట పట్టారు. హామీల అమలుకు ప్రభుత్వం హామీనివ్వడంతో సమ్మె విరమించిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ) క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. బడి నుంచి డ్రాప్ అవుట్ అవుతున్న విద్యార్థులను గుర్తించేందుకు వీరు రంగంలోకి దిగారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్ డివిజన్ల పరిధిలో షేక్‌పేట, ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2 మండలాల పరిధిలో ఈ సర్వే ప్రారంభమైంది. 6-14 ఏళ్లలోపు, 15-19 ఏళ్ల వయస్సు కలిగిన వారు చదువుకోకపోవడానికి గల కారణాలను ఈ పర్యటనలో సీఆర్‌పీలు ఆరా తీసి గుర్తించే పనిలో పడ్డారు.

33 అంశాల సేకరణపై దృష్టి..

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే పత్రంలో 33 అంశాలను పొందుపర్చారు. సర్వేకు వెళ్తున్న రీసోర్స్‌పర్సన్స్ డ్రాప్ అవుట్ అయిన విద్యార్థి పేరు, తల్లిదండ్రులు, ఆధార్ సంఖ్య,


(ఫైల్)..


బడి బయట పిల్లల గుర్తింపు సర్వే చేస్తున్న సిబ్బంది

అడ్రస్, మాతృభాష, చదువుకు దూరం కావడానికి గల కారణాలను ఈ ప్రత్యేక పత్రంలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఏ ఒక్క అంశాన్నీ కూడా తేలికగా తీసుకోవద్దని విద్యాశాఖ అధికారులు ఇప్పటికే సర్వేలో పాల్గొంటున్న సీఆర్‌పీలకు సూచించారు. దీంతో బస్తీలు, మురికివాడలు, మార్కెట్లు, దుకాణాలు, హోటళ్లు, బస్టాపులు, రైల్వేస్టేషన్లు, అడ్డా కూలీలు తదితర ప్రాంతాల్లోకి వెళితే సదరు పిల్లలను గుర్తించే పనిలో పడ్డారు. ఈ పిల్లలంతా ఏవిధంగా ఉంటున్నారు, ఎందుకు ఉంటున్నారు, ఎవరు అక్కడ పనిలో పెట్టారు అనే అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను కూడా..

ప్రత్యేక అవసరాల పిల్లలను సైతం గుర్తించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. వ్యక్తిగతంగా పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సర్వేలో ఆరా తీయనున్నారు. వారి ఆర్థిక స్థితిగతులు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను నివేదికలో పొందుపరచనున్నారు. పాఠశాల విద్యతో పాటు ఇంటర్ చదువులకు దూరంగా ఉన్నవారిని గుర్తించేందుకు సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయడానికి వివిధ కోణాల్లో సీఆర్‌పీలు వివరాలు సేకరిస్తున్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు ఇటీవలే ఈ సర్వే ప్రారంభం కాగా ప్రతిఒక్కరికీ విద్య అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పక్కా ప్రణాళికలు రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టింది.గత ఏడాది కూడా విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఉన్న షేక్‌పేట, ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2 మండలాల పరిధిలో 106 మంది బడి బయట పిల్లలను గుర్తించారు. వీరందరినీ బడిలో చేర్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


బాధితునికి చెక్కును అందిస్తున్న సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్: ఆపద సమయంలో సీఎంఆర్‌ఎఫ్‌తో ఎంతో మేలు కలుగుతుందని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన కలిగిరి ఆనంద్‌కు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన తన కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారినపడినప్పుడు ప్రైవేటు ఆసుపత్రుల బిల్లులు భరించలేకలేని సమయంలో సీఎం సహాయ నిధి అండగా నిలుస్తుందన్నారు. అర్హులు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సీఎం సహాయనిధి బాధితులకు తొందరగా మేలు జరిగేందుకు కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

తాగునీటి, సీవరేజీ సమస్యలను పరిష్కరించండి

జీఎంకు కాంగ్రెస్ నాయకుల వినతి


జీఎం సమస్యలు వివరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో తాగునీటి, సీవరేజీ సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు జలమండలి జీఎం హరిశంకర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానిశంకర్ మాట్లాడుతూ చాలా బస్తీల్లో మంచినీరు లోప్రెషర్‌తో వస్తుందని వాపోయారు. దీనికి తోడు వేళాపాళ లేకుండా నీరు సరఫరా కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీల్లో కొత్త పైప్‌లైన్ల ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తాము చేసిన వినతిపై జీఎం సానుకూలంగా స్పందించారని భవాని శంకర్ తెలిపారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యార నాగరాజు, మాజీ డివిజన్ అధ్యక్షుడు జాఫర్‌హుస్సేన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలి


జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

వెంగళరావునగర్: నగరంలోని పారిశుద్ధ్య కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22వ తేదీన జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం యూసుఫ్‌గూడ జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద కరపత్రాన్ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కార్మికుల కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలనే నిబంధనను అమలు చేయాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బయో మెట్రిక్ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ యూనియన్ నేతలు నగేష్, అమల, కోమల, మల్లమ్మ, నరసమ్మ, లక్ష్మి, చంద్రకళ, రమ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమన్వయంగా ముందుకుసాగాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎక్కడెక్కడ ట్రాఫిక్‌కు అడ్డంకిగా స్తంభాలు, వైర్లు, గుంతలు, ఇతరత్రా సమస్యలు ఉన్నాయో వాటిని తొలగించి ట్రాఫిక్ సజావుగా సాగేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. అలాగే రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోళ్లు, కాలువలు ప్రమాదకరంగా ఉంటే సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లతో సమన్వయం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని వెల్లడించారు.

ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక ఇవ్వాలి

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదికను వెంటనే సమర్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలంటే కమిషన్ ఇచ్చే నివేదికని పరిగణలోకి తీసుకుంటారని ఆయన తెలిపారు. గురువారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థలను రిజర్వేషన్లు కల్పించేందుకు లెక్కలు తేల్చాలని డెడికేషన్ కమిషన్ నియమించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కమిషన్ నివేదికనిస్తేనే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని కుమారస్వామి పేర్కొన్నారు. డెడికేషన్ కమిషన్ సమగ్ర వివరాలను సేకరించి వెనువెంటనే ప్రభుత్వానికి అందజేయాలని ఆయన విన్నవించారు. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తుందని స్థానిక సంస్థల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు లేకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన అన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ఉస్మానియా వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ పరివర్తన విశేషమైన పరిణామం గురించి, అక్షరాస్యత అడ్డంకులను అధిగమించి సమాజంలోని అన్ని వర్గాలలో దాని పురోగతిని సాధించేలా ముందుకు సాగాలన్నారు. పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతికతతో ముఖ్యంగా కృత్రిమ మేధస్సుతో వ్యవహరించేటప్పుడు అపరిష్కృత సమస్యలపై దృష్టిపెట్టాలని విద్యావేత్తలు, విద్యార్థులకు ఆయన సూచించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడమే కాకుండా ఆలోచించడం ప్రారంభించాలని కోరారు. 'మనూ'లో వివిధ రంగాలలో చేపట్టే కార్యక్రమాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'మనూ' ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. ఫజల్ రహమాన్ మాట్లాడుతూ విద్య, పరిశ్రమల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడంలో సాంకేతిక ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ కోర్సు ప్రారంభం

'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'మనూ'లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ ప్రారంభించబోతున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ప్రకటించారు. ఇది మల్టీ డిసిప్లినరీ విధానంతో కూడిన కోర్సును స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద నిర్వహించబడుతుందన్నారు. ఇంజినీరింగ్‌లో డాటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, సమాచార విభాగంలో అంతర్జాతీయ స్థాయి అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా 'మనూ' ప్రొఫెసర్లు అబ్దుల్ వాహిద్, ప్రదీప్‌కుమార్, జమీల్ అహ్మద్, అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారి, గులామ్‌నబీ, బిస్వజిత్ బ్రహ్మచ ఎం.ఏ.హమీద్, సయ్యద్ ఇంతియాజ్ హసన్ ప్రసంగించారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీగణపతి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటాయన్నారు.

మోటామోవైరస్‌పై భయపడాల్సిన అవసరం లేదు

రాయదుర్గం: మోటామోవైరస్ (హెచ్‌ఎంపీవీ) అనేది ఒక శ్వాసకోశ వైరస్ అని దీనిపై భయపడాల్సిన అవసరం లేదని నానక్‌రాం గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రి కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కిషన్ శ్రీకాంత్ వెల్లడించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఇది ఇటీవలి కాలంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నా రు. ఇది చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం, అవగాహన పెంచుకోవడం చాలా అవసరమన్నారు. ఈ శ్వాసకోశ వైరస్‌ను డచ్ పరిశోధకులు 2001లోనే తొలిసారిగా గుర్తించారని గుర్తు చేశారు. సాధారణ జలుబు, ఫ్లూ వంటి ఇతర శ్వాసకోశ వ్యాధుల మాదిరిగానే లక్షణాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధి పట్ల అవగాహన ఏర్పాటు చేసుకొని ముందు జాగ్రత్తలు పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలు చాలా తక్కువని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగిన ముందు జాగ్రత్తలు పాటించడమే కాకుండా వాకింగ్, యోగా, మెడిటేషన్ వంటివి చేయాల్సిన అవసరం కూడా ఉందని ఆయన గుర్తు చేశారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 13, క్యారెట్ 40, దొండ 45, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 37, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 25, చామగడ్డ 38, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 10-12, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎలాంటి తారతమ్యం లేకుండా సంక్షేమ ఫలాలు

- రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



గచ్చిబౌలి: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి తారతమ్యాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరగాలని ప్రతి పేదవాడికి సంక్షేమ పథకం అందేలా అధికారులు కృషి చేయాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడిగాంధీ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ కులగణన సర్వే ఆధారంగా రేషన్‌కార్డుల జారీ జరుగుతుందని, అందుకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం ఖరారు చేసిందన్నారు. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతరం జరిగే ప్రక్రియ అని ఆయన గుర్తు చేశారు. ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అధికారుల బృందాలు పర్యటించి అర్హులను గుర్తిస్తాయన్నారు. ఈ నెల 26వ తేదీన కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని ఆయన గుర్తు చేశారు. ఈ చక్కటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేదలవారు కన్నకల ఇందిరమ్మ ఇళ్లు అని, పేద వారికి భారం లేకుండా ప్రభుత్వం అన్ని రకాల నిర్ణయాలు తీసుకుంటుందని, పేదవారి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు.ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో తొలిదశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైతే సొంత స్థలం ఉంటారో వారి ఇంటి ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఈ చక్కటి అవకాశం ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తారని, ఎవరు ఇళ్లు వారు నిర్మించుకునే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తిస్తున్నారన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేయనివారు ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన


హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు గులాబీలు, చాక్లెట్లు అందజేస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్

బంజారాహిల్స్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తాలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్, ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి, ఇతర సిబ్బంది రోడ్డు భద్రతపై వాహనదారులకు పలు సూచనలు చేశారు. హెల్మెట్ ధరించి నిబంధనలను పాటిస్తున్న ద్విచక్ర వాహనదారులకు గులాబీపూలు, చాక్లెట్లు అందజేశారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అప్పుడే ప్రాణాలను కాపాడుకోవచ్చునని సూచించారు. సీటుబెల్టు ధరించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ మంచిది కాదని, రాంగ్‌రూట్ ప్రయాణాల వల్ల ఇతరుల ప్రాణాలు పోతాయని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించని వాహనదారులను ఆపి తప్పనిసరిగా పెట్టుకోవాలని హెచ్చరించారు.


వాహనదారులకు గులాబీని అందజేస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్

జూబ్లీహిల్స్‌లో...

జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ పోలీసులు గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు హెల్మెట్ ధరించడంతో వారికి గులాబీ పూలు ఇచ్చి అభినందించారు. అంతేకాకుండా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి పలు సూచనలు చేశారు.

నెక్లెస్ రోడ్డులో...

ఖైరతాబాద్: జనవరి నెలను రోడ్ సేఫ్టీ నెలగా ప్రకటించిన నేపథ్యంలో గురువారం సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు నెక్లెస్ రోడ్డులో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు.అదేవిధంగా హెల్మెట్ ధరించిన వాహనదారులకు ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆనంద్, ఎస్‌ఐ సిద్ధులు సిబ్బందితో కలిసి గులాబీపూలు అందజేసి అభినందనలు తెలిపారు. హెల్మెంట్ ధరించని వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెచ్చరించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


గులాబీపూలతో అభినందనలు తెలుపుతున్న ట్రాఫిక్ పోలీసులు

18న 'నవ్వుల నజరానా'

చిక్కడపల్లి: హైదరాబాద్ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ దర్శకుడు, రచయిత జంధ్యాల జయంతి సందర్భంగా 'వినోద భోజనంబు' శీర్షికతో నవ్వుల నజరానా నిర్వహిస్తున్నామని క్లబ్ డైరెక్టర్లు ఎల్ఎల్ఆర్ మూర్తి, శరత్‌చంద్ర, మోహనకృష్ణ, కేకే రామచంద్రమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న తెలుగు విశ్వవిద్యాలయంలోని ఓపెన్ ఆడిటోరియంలో సాయంత్రం 5.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ప్రిన్సిపాళ్ల పదోన్నతుల్లో అక్రమాలపై విచారణ చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్ల పదోన్నతుల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. గురువారం ఓయూలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్.కె వెంకన్న, కార్యదర్శి డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ ఉన్నతాధికారులు గత నెల 31న 14 మంది గురుకుల డిగ్రీ కాలేజీల అధ్యాపకులకు నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించారని ఆరోపించారు. సీనియార్టీ, రోస్టర్ విధానం పాటించకుండా కంబైండ్ సీనియార్టీ లిస్టు బహిర్గతం చేయకుండా, అకాడమిక్, రీసెర్చ్ స్కోర్ 110 వరకు లేకున్నా, 2018 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ (పీవో)ను సైతం తుంగలో తొక్కి పదోన్నతలు కల్పించారని వివరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాల ప్రకారం 10 మంది అధ్యాపకులకు నిర్దీత అకాడమిక్ అండ్ రీసెర్చ్ స్కోర్ 110 లేదని, ఐదుగురివి నకిలీ పీహెచ్‌డీ డిగ్రీలని, ఒకరికి 34 సంవత్సరాలకు బదులు 29 ఏళ్లకే ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించారన్నారు. ప్రిన్సిపాల్స్ పదోన్నతుల్లో జరిగిన అక్రమాలపై విద్యాశాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వెంటనే విచారణ చేపట్టాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు బోధనేతర సిబ్బంది వినతి



బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగ భద్రత, టైం స్కేల్ పదోన్నతి కల్పించాలని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి కాంట్రాక్టు బోధనేతర ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. గురువారం రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్‌టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సూర్యచందర్, అధ్యక్షుడు కట్టా వెంకటేష్ ఆధ్వర్యంలో బాలకిష్టారెడ్డిని కలిసి కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను వివరించినట్లు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయకుండా 25 ఏళ్ల నుంచి తక్కువ వేతనంతో పనిచేయిస్తున్నారని చైర్మన్‌కు వివరించినట్లు చెప్పారు. టైంస్కేల్ ఉద్యోగులుగా పదోన్నతి కల్పించాలని, ఉట్టిచేతులతో సాగనంపకుండా ఉద్యోగ విరమణ సమయంలో రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, తక్కెళ్ల చేతన్, చేర్యాల శ్రీనివాస్, వీణా, అరవింద, మాళీ, సతీష్, రాగిణి, నరేందర్, బాలరాజు, రాజ్యలక్ష్మీ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువుకు ఉత్తమ శిష్యులు ఉండటం అదృష్టం

చిక్కడపల్లి: ప్రముఖ నాట్యగురువు సుజాతామూర్తి శిష్యురాలు గాయత్రి కాట్రపల్లి కూచిపూడి నాట్యరంగ ప్రవేశం గురువారం శ్రీసిద్ధ కృష్ణ కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో గురువారం త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై జరిగింది. తొలి అంశంగా గాయత్రి తన నాట్యాన్ని ప్రఖ్యాత నాట్య గురువు డాక్టర్ శోభా నాయుడు రూపకల్పన చేసిన గణేశ్ స్తుతి ఆరంభించి నారాయణ తీర్థ తరంగం అలోకలే బాలకృష్ణం లయబద్ధంగా నర్తించారు. ప్రముఖ నాట్యగురువు సలాది మృణాళిని మాట్లాడుతూ.. ఉత్తమ గురువుకు ఉత్తమ శిష్యులు ఉండటం ఇరువురి అదృష్టమని అభినందించారు. మృదంగ కళాకారుడు రఘునందన్, కూచిపూడి నాట్య కళాకారిణి ఊర్వశి సతీష్, నర్తకిగా గాయత్రికి అభినందన తెలిపారు. గాయత్రి తన కుటుంబ సభ్యులు తాత కెకె గుప్తాలతో కలసి గురువు సుజాతను సత్కరించారు.

మహా కుంభమేళా..

భక్త జనసంద్రం





తెలుగు రాష్ట్రాల నుంచి 10 లక్షలమందికిపైగా భక్తులు

- 177 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసిన దక్షిణమధ్య రైల్వే
- ప్రయాగ్‌రాజ్, అయోధ్య,వారణాసి ప్యాకేజీలతో ట్రావెల్స్ సంస్థలు
- భారీగా పెరిగిన విమాన చార్జీలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచంలోనే అతిపెద్ద వేడుకైన మహాకుంభమేళాకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లనున్నారు. ఈ మేరకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. సంక్రాంతి వేడుకలు, శబరిమల సందర్శన కూడా ముగియడంతో భక్తజనం కుంభమేళాకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ మేరకు టూర్స్, ట్రావెల్స్ సంస్థలు, పర్యాటక సంస్థలు ప్రత్యేక ప్యాకేజీలతో భక్తులను ఆకట్టుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి 10 లక్షల మందికిపైగా వెళ్లనున్నట్లు అంచనా. మరోవైపు కుంభమేళా కోసం దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం రైల్వే శాఖ 3 వేల ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయగా, తెలుగు రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే 177 రైళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. రెగ్యులర్ రైళ్లకు అదనపు బోగీలను జత చేస్తున్నట్లు అధికారులుమ తెలిపారు. బస్సులు, రైళ్లు, విమానాలతోపాటు సొంత వాహనాల్లోనూ జనం పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నారు.

రైళ్లలో వంద శాతం ఆక్యుపెన్సీ

హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల నుంచి వారణాసి, లక్నో, రెక్సల్, పట్నా తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే రెగ్యులర్ రైళ్లలో ఫిబ్రవరి నెలాఖరు వరకు ఎలాంటి బుకింగ్ సదుపాయం లేదు. అన్ని రైళ్లలో రిగ్రెట్ దశకు చేరుకుంది. ప్రత్యేక రైళ్లన్నీ 90 శాతం నుంచి 100 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో ప్రత్యేక రైళ్లలోనూ డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఏ రోజుకు ఆ రోజు అనూహ్యమైన డిమాండ్ కనిపిస్తోందని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రయాణికుల డిమాండ్, రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇప్పటి వరకు 177 రైళ్లను అదనంగా ఏర్పాటు చేయగా, రానున్న రోజుల్లో మరిన్ని రైళ్లను నడిపేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు.

ఒక్కరికి రూ.45 వేల పైనే...

భక్తులు మహాకుంభమేళాలో పాల్గొని పుణ్యస్నానం ఆచరించడాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ఈ మేరకు 10 నుంచి 20 మంది దంపతులు కలిసి ఒక బృందంగా మహాకుంభమేళాకు వెళ్తున్నట్లు హిమాయత్‌నగర్‌కు చెందిన ఒక ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఇలా వచ్చేవారి కోసం మినీబస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కనీసం వారంపాటు కొనసాగనున్న ఈ పర్యటనలో మహాకుంభమేళాతోపాటు అయోధ్య, వారణాసి తదితర పుణ్యక్షేత్రాలను కూడా సందర్శిస్తారు. ఇందుకనుగుణంగా ప్యాకేజీలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని సంస్థలు భోజనం, వసతి, రవాణా తదితర సదుపాయాలతో కలిపి ప్యాకేజీలను అందజేస్తుండగా కొన్నిసంస్థలు హైదరాబాద్, విజయవాడ, విశాఖ తదితర నగరాల నుంచి కేవలం రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి తిరిగి వచ్చేందుకు టూరిస్ట్ బస్సుల్లో రూ.15 వేలకుపైగా చార్జీ విధిస్తున్నారు. అక్కడి నుంచి పలు పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు నాలుగు రాత్రులు, ఐదు పగళ్లకు కలిపి రూ.25 వేల చొప్పున ప్యాకేజీలు ఉన్నాయి. మహాకుంభమేళాకు వెళ్లేందుకు సగటున ఒక భక్తుడు రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయవలసి వస్తుంది. సాధారణ రోజుల్లో అయితే కేవలం రూ.20 వేలల్లోనే అయోధ్య, వారణాసి వంటి ప్రాంతాలను సందర్శించి వచ్చే అవకాశం ఉంటుందని సికింద్రాబాద్‌కు చెందిన ఒక ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి మురళి తెలిపారు.

ఫ్లైట్ చార్జీ రూ.20 వేలు..

విమాన చార్జీలు కూడా చుక్కలను తాకుతున్నాయి. హైదరాబాద్ నుంచి వారణాసికి సాధారణ రోజుల్లో రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు చార్జీ ఉంటుంది. ఇది రూ.18 వేల నుంచి రూ.20 వేలకు పెరిగింది. అయినప్పటికీ టికెట్లు లభించడం లేదని పలువురు ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ప్రయాణికుల రద్దీ ఇంకా ఎక్కువయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు విమాన చార్జీలు కూడా పెరగవచ్చని ట్రావెల్స్ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

పక్కా ప్రణాళికతో వెళ్లండి



మహాకుంభమేళాకు ఇప్పటికే లక్షలాదిగా జనం తరలి వస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే దారాలన్నీ జనసంద్రంగా మారాయి. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వెళ్లేవారు ప్యాకేజీలపై స్పష్టమైన అవగాహనతో ప్రణాళికలు వేసుకోవడం మంచిది.

- హరికిషన్, వాల్మీకి టూర్స్ అండ్ ట్రావెల్స్

ఫ్లైట్లకు డిమాండ్ పెరిగింది



కొద్ది రోజులుగా ఫ్లైట్స్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. బుకింగ్స్ కూడా లభించడం లేదు. ఫ్లైట్ బుకింగ్ కోసం వేచిచూడటం మంచిది. చార్జీల్లో హెచ్చుతగ్గులను గమనించి బుక్ చేసుకోవాలి.

-మురళి వడ్ల, టూరిస్ట్ ఆపరేటర్

సొంత వాహనం సో బెటర్

రైళ్లు, బస్సులు, విమానాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొంతమంది భక్తులు సొంత వాహనాల్లో వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆధ్యాత్మికయాత్రతోపాటు వారం, పది రోజులు నచ్చిన ప్రాంతాల్లో పర్యటించేందుకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకొని బయలుదేరుతున్నారు. ఫ్యామిలీ టూర్‌గా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నగరంలో నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమాలు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయి.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫోటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో గాంధీ శిల్ప మేళా ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి, ఈటల, మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారెంటీల్లో భాగంగా ఈ నెల 26 నుంచి ఎకరాకు రూ.6 వేల రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాలను అమలు చేస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో రూ.44 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డిలతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అంతకుముందు కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహేందర్ రెడ్డి జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నుంచి రాష్ట్రంలో రైతులకు ఎకరాకు రూ.6 వేల రైతుభరోసా, అర్హులైన ఇళ్ల స్థలం ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాలను ప్రభుత్వం అమలుపరుస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో రూ.38 కోట్ల అమృత్ పథకం నిధులతో 5 మంచి నీటి ట్యాంకులు, రూ. 6 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, యూజీడీలు, రూ. 25 లక్షల నిధులతో తుమ్మ చెరువుకట్టకు కంచె ఏర్పాటు పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, జిల్లా గ్రంథాలయాల మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ గుర్తింపునకు ఉర్దూ దోహదం

వీరనారి చాకలి ఐలమ్మ ఉమెన్ వర్సిటీ సదస్సులో వక్తలు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపులో ఉర్దూ భాష, సాహిత్యం పాత్ర ఎనలేనిదని, సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యత పెంచిందని వక్తలు కొనియాడారు. అసఫ్ జాహి రాజవంశానికి సంబంధించిన 300 సంవత్సరాల చరిత్రాత్మక, సాహిత్య ప్రయాణపు వేడుకలను కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వేదికగా ఘనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు కొనసాగే ఈ అంతర్జాతీయ సమావేశపు మొదటి రోజు వేడుకల్లో అసఫ్ జాహి రాజవంశ 9వ నిజాం హిస్ హైనెస్ రౌనక్ యార్ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రౌనక్ యార్ ఖాన్ మాట్లాడుతూ ఉర్దూను సంస్కృతి, సామరస్యం భాషగా ప్రోత్సహించడంలో వివిధ రచయితలు, కవుల కృషిని గుర్తించాల్సిన అవసరముందన్నారు. కేంద్ర మాజీమంత్రి ఎం.ఎం.పల్లం రాజు మాట్లాడుతూ అసఫ్ జాహి రాజవంశ వారసత్వం రాచరిక మూలాలను మాత్రమే కాకుండా దేశ సంస్కృతి, భాష, సాహిత్యంపై లోతైన ప్రభావాన్ని చూపించిందన్నారు. అనంతరం ఉర్దూ భాష కవిత్వంపై దృష్టి సారించిన ఉత్తమ పరిశోధకులకు అవార్డులను అందించారు. సమావేశాల్లో ఆ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ సూర్య ధనంజయ్, ఉర్దూ విభాగం ప్రొఫెసర్ ఎస్. నసీమ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ప్రవేశాలకు నోటిఫికేషన్

దరఖాస్తు గడువు ఫిబ్రవరి 15



పోస్టర్ విడుదల చేసిన వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, దారుసలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్తంగా ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్)లో ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పోస్టర్ ఆవిష్కరించారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, మార్చిలో హైదరాబాద్‌లో అర్హత పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ పోర్టల్‌గానీ, వెబ్‌సైట్‌గానీ, 040-23680441/453 నెంబర్లలోగానీ సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ పుష్పాచక్రపాణి, మేనేజ్‌మెంట్ విభాగం డీన్ ఆనంద్ పవార్, రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి, అపోలో హాస్పిటల్ అధికారిణి విజయరుద్రరాజు, కిమ్స్ కాలేజీ ప్రిన్సిపాల్ రవికుమార్, యూనివర్సిటీ అధికారులు రబీంద్రనాథ్ సోలమన్, పల్లవీ కాబ్డే, కిరణ్మయి, డాక్టర్ వెంకటేశ్వర్లు, భోజు శ్రీనివాస్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో క్రమశిక్షణ అవసరం



జూనియర్ అసిస్టెంట్ల మూడో బ్యాచ్‌కు శిక్షణలో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: ఉద్యోగులు విధి నిర్వహణలో క్రమశిక్షణ, పనిలో పారదర్శకత, తోటి వారికి ఆదర్శంగా ఉండాలని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ అన్నారు. జలమండలికి కొత్తగా కేటాయించిన జూనియర్ అసిస్టెంట్ల మూడో బ్యాచ్‌కు శిక్షణను గురువారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. సమర్థవంతంగా పనిచేసి బోర్డు ప్రతిష్టను కాపాడేవిధంగా పని చేయాలన్నారు. రెండు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్.. వారికి బోర్డు గురించి వివరించారు. బోర్డు విధి విధానాలు, అంతర్గత శాఖలు, సేవలు, నిబంధనలు, ఉద్యోగుల సౌకర్యాలు తదితర వాటి గురించి చెప్పారు. అనంతరం వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

చిన్నయ సూరి తెలుగు వ్యాకరణ సిద్ధాంతకర్త



చిక్కడపల్లి: తెలుగు భాషా వ్యాకరణాన్ని సులభ శైలిలో అందించిన చిన్నయ సూరి శైలిలో అందించిన చిన్నయ సూరి వ్యాకరణ సిద్ధాంతకర్త అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. చిక్కడపల్లి గురువారం త్యాగరాయ గానసభలో 'పరవస్తు చిన్నయ సూరి యాదిలో..'సంసర్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొలేటి దామోదర్ మాట్లాడుతూ.. తెలుగు భాష వికాసానికి సూరి రచనలు దోహదం చేశాయన్నారు. బాలల కథ రచయిత చొక్కాపు రమణ మాట్లాడుతూ.. చిన్నయ సూరి రచించిన నీతి చంద్రిక కథలు పిల్లలకు ఆసక్తి కలిగి వినోదంగా ఉండే రీతిలో నీతి నిజాయితీల విలువలు గురించి అవగాహన కలిగిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనా మూర్తి, కవి పెద్దురి వెంకటదాసు, గాయని డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

'స్విమ్మింగ్ క్వీన్' విక్టోరియా

ఇంగ్లిష్ చానల్‌ను ఈదిన విక్టోరియాకు ఘన సన్మానం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: క్వీన్ విక్టోరియా దేశం గర్వించదగ్గ క్రీడాకారిణి అని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పి.వి నిరంజన్ రెడ్డి అన్నారు. ఇంగ్లిష్ చానల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా గంధం క్వీన్ విక్టోరియా గుర్తింపు పొందడం అందరికీ గర్వకారణమని అన్నారు. మరో 7 చానళ్లలో ఈదడానికి సిద్ధ అవుతున్న నేపథ్యంలో ఆమెను గురువారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో పూలమాల, మెమెంటో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు 11 గంటల్లో 77 కిలోమీటర్లపాటు ఇంగ్లిష్ చానల్‌లో పిన్ స్విమ్మర్‌గా ఈదారని, ఇది స్విమ్మింగ్ ఎవరెస్ట్ అని కొనియాడారు. అనంతరం తమ వంతు సాయంగా నిరంజన్‌రెడ్డి 5 వేల రూపాయల చెక్కును ఆమెకు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సైకం మనోహర్ రెడ్డి, కోశాధికారి మద్దెల దశరథ్, క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, ఇంటర్నేషనల్ మాజీ రీజినల్ కౌన్సిలర్ ఎస్.మురళీకృష్ణ, క్లబ్ మాజీ అధ్యక్షులు సలిపెల రమేష్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, శైలజామోహన్, నిమ్మల రాజశేఖర్, టి.సైకెలాబ్‌బాబు, పద్మాగౌడ్, వెంకటస్వామిగౌడ్, జీవన్ ఆదిత్య, రఘురాంరెడ్డి, కృష్ణ, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.



క్వీన్ విక్టోరియాను సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి

మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

24న మంచిర్యాలలో ఐక్యత సభ

సుందరయ్య విజ్ఞానకేంద్రం: మహిళలపై జరుగుతున్న హింస, వేధింపులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటం చేయాలని పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ఈ నెల 24న మంచిర్యాలలో జరిగే ఐక్యత సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సంధ్య మాట్లాడుతూ మహిళలు నిరంతరం పోరాడుతున్నప్పటికీ నిత్యం ఎన్నెన్నో దారుణాలు, హింసలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధికి శాస్త్రీయ భావాజాలాన్ని అందించే వారిని హతమార్చుతున్న విశ్వ హిందూ పరిషత్, సంఘ్ పరివార్, భజరంగ్‌దళ్ లాంటి సంస్థలకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, ప్రధాన కార్యదర్శి అందే మంగళప్రద, జి.ఝాన్సీ, ఊకే పద్మ, భారతి, గీతా, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పీవోడబ్ల్యూ ఐక్యత సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవోడబ్ల్యూ సంధ్య తదితరులు

విద్యార్థులే సాంకేతిక విప్లవ సారథులు



ఉద్యమోత్సవ్‌లో పాల్గొన్న అతిథులు

కీసర: ప్రపంచంలో సాంకేతిక విప్లవం కొనసాగుతోందని, అందులో విద్యార్థులను సారథులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కళాశాలలపై ఉందని ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ గిరీష్ కుమార్ బాసిన్ అన్నారు. గురువారం చీర్యాలలోని గీతాంజని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, ఏఐసీటీఈ సంయుక్తంగా నిర్వహించిన ఇన్వెస్టర్స్ నెట్‌వర్క్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరీష్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతోపాటు ఇతర నైపుణ్యాలను పెంపొందించుకునేలా విద్యాసంస్థలు ప్రోత్సహించాలని సూచించారు. నేషనల్ స్టార్టప్ డేలో భాగంగా గీతాంజలిలో ఉద్యమోత్సవ్-2025 నిర్వహించడం అభినందనీయమన్నారు. పెట్టుబడిదారులు, విద్యార్థుల మధ్య వారధిగా ఉద్యమోత్సవ్ ఉంటూ అంకుర్ సంస్థల ఏర్పాటుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ సూర్యకుమార్, గీతాంజలి చైర్మన్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ కుమార్ సువర్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ । శుక్రవారం ।
17 । జనవరి । 2025

ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఈ నెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు నగరంలోని పలువురు ప్రముఖులతో పాటు మరికొందరికి ప్రధాని నుంచి ఆహ్వానం అందింది. ఇందులో ప్రముఖులు 31 మంది ఉండగా.. వివిధ రంగాల్లో విశేష ప్రతిభను కనబరిచిన 41 మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపిక చేశారు. మొత్తం 72 మంది గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నారు. దేశ వ్యాప్తంగా 10వేల మందిని ఎంపిక చేసినట్లు అధికారిక సమాచారం. ఈ నేపథ్యంలో నగరంలోని అంబర్ పేటకు చెందిన ఫిలిగ్రీ కళాకారులు కృష్ణాచారి, గౌరిదేవి దంపతులు, మొయినాబాద్‌కు చెందిన బాత్కు అశ్విని, మహేశ్వరం బీసీ హాస్టల్ విద్యార్థి గొల్ల అక్షయ్ ఉన్నారు. - సాక్షి, సిటీబ్యూరో



ఆహ్వానం.. ఘనం..

ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌కు పిలుపు

- నగరం నలుమూలల నుంచి 41 మంది
- ప్రముఖులతో కలిపి మొత్తం 72 మంది ఎంపిక
- గణతంత్ర వేడుకల వీక్షణకు ఆహ్వానం..
- జాబితాలో కళాకారులు కృష్ణాచారి, గౌరిదేవి దంపతులు
- ప్రధాని నుంచి ప్రత్యేక లేఖలు







వారిరువురూ వృత్తి రిత్యా నగిషీ కళాకారులు.. వారసత్వంగా వచ్చిన వృత్తిపై మామకారాన్ని పెంచుకున్నారు. అంతటితో ఆగకుండా తమ వృత్తికి కళాత్మకతను జోడించి వివిధ కళారూపాలను తీర్చిదిద్దారు. తమ కళతో అందరినీ మెప్పించి అనేకమందిని ఆకర్షించారు. తమలోని భిన్నమైన కళతో ప్రముఖుల నుంచి శభాష్ అనిపించుకుంటున్నారు. వారే అంబర్‌పేట డీడీ కాలనీలో నివసించే కృష్ణాచారి, గౌరిదేవి దంపతులు..

– అంబర్‌పేట

గత 30 ఏళ్లుగా వెండితో ఫిలిగ్రీ కళారూపాలను తయారు చేస్తూ తమదైన ముద్ర వేసుకున్నారు. వీరి కళను గుర్తించి కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డులను అందించి అభినందించింది. వీరి ఫిలిగ్రీ కళలో చేస్తున్న కృషికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు గుర్తించి పలు అవార్డులను అందించి సత్కరిస్తున్నాయి.

గణతంత్ర వేడుకలకు..

ఫిలిగ్రీ కళలో వీరి ప్రతిభను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకలకు వీరిని ఆహ్వానించింది. 2025 జనవరి 26న జరిగే వేడుకల్లో పాల్గొనాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటికే కబురు అందింది. ఈ నెల 23న ఢిల్లీకి చేరుకోవాల్సిందిగా కోరింది. దీంతో కృష్ణాచారి, గౌరిదేవి దంపతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దేశ గణతంత్ర వేడుకలకు తమను ప్రత్యేకంగా ఆహ్వానించడంతో ఎంతో గర్వంగా ఉందన్నారు. ఢిల్లీ వెళ్లడానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నామని వారు సాక్షితో వెల్లడించారు.

వివిధ కళారూపాలు..

వెండితో గత 30 ఏళ్లుగా వివిధ కళారూపాలను రూపొందిస్తున్నామన్నారు. ప్రజలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో అతిథుల జ్ఞాపికలు అందించేందుకు తమను సంప్రదించి ప్రత్యేక కళారూపాలను తయారు చేయించుకుని వెళ్తారన్నారు. వెండితో చార్మినార్, హైటెక్ సిటీ, చారిత్రాత్మక గుర్తులు, వీణ, రాట్నం, వెండి బుట్టలు వంటి కళారూపాలను రూపొందించామన్నారు. అవసరమైన వారికి తాము చెప్పిన రీతిలో అందిస్తామంటున్నారు.



కళను గుర్తించి..

కృష్ణాచారి శ్రమ, కళను గుర్తించి 2006 అప్పటి రాష్ట్రపతి ప్రతిభపాటిల్ జాతీయ అవార్డు అందజేశారు. తన సతీమణి గౌరిదేవికి 2009లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జాతీయ అవార్డు అందజేశారు. వీటితో పాటు రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులను ఈ దంపతులు అందుకున్నారు. ఫిలిగ్రీ కళ తరపున రాష్ట్ర, దేశ బృందాల్లో వీరు చోటు సంపాదించుకుని తమదైన ముద్ర వేస్తున్నారు.



మహేశ్వరం బీసీ హాస్టల్ విద్యార్థి గొల్ల అక్షయ్




మహేశ్వరం : దేశ రాజధాని ఢిల్లీలో జరిగే కర్తవ్య ఫరేడ్ విక్షించడానికి ప్రధాన మంత్రి యశస్వి పథకం కింద తెలంగాణ నుండి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం బీసీ హస్టల్లో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థి గొల్ల అక్షయ్ ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రదర్శన కారులు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆదర్శంగా నిలిచన వారిని, ఇలా తెలంగాణ రాష్ట్రం నుండి 31 మందిని ఎంపిక చేశారు. ఇందులో మహేశ్వరం బీసీ హస్టల్‌లో ఉంటూ స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న గొల్ల అక్షయ్‌ని ఎంపిక చేశారు. అక్షయ్ స్వగ్రామం కొల్పూరు, మండలం మగనూర్, నారాయణపేట్ జిల్లా. నీరుపేద కుటుంబానికి చెందిన అక్షయ్ తల్లి చిన్న తనంలో మరణించడంతో గొర్లకాపరి అయిన తండ్రి రంగప్ప కుల వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన ఇద్దరి పిల్లలనూ 2021లో మహేశ్వరం బీసీ హస్టల్‌లో చేర్పించారు. అక్షయ్ చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనభరుస్తున్నాడు. హస్టల్ వార్డెన్ కృష్ణ ప్రోత్సాహంతో ఓబీసీ, ఈబీసీ విద్యార్థులకు ప్రధాన మంత్రి యశస్వి పథకం కింద ఆర్థిక సాయాన్ని సంవత్సరానికి రూ.2 లక్షల ఉపకార వేతనం ప్రత్యేకంగా అందిస్తోంది. అక్షయ్ ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొయినాబాద్ నుంచి బాత్కు అశ్విని..



మొయినాబాద్ రూరల్ : రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నుంచి బాత్కు అశ్విని ముఖ్య అతిథిగా ఆహ్వానితులయ్యారు. ఈ మేరకు ఢిల్లీ హోం శాఖ విడుదల చేసిన స్పెషల్ కేటగిరి తెలంగాణ జాబితాలో 31 మంది ప్రత్యేక అతిథుల పేర్లల్లో అశ్విని ఆహ్వానం పొందారు. వివిధ రంగాలు, ప్రభుత్వ పతకాల వినియోగదారుల జాబితాలో మొయినాబాద్ మాడల్ మండల సమైక్యకు చెందిన బాత్కు అశ్విని ఆహ్వానం పొందడంతో ఆమె హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోస్టరీ కాఫీ.. హైదరాబాద్ రిటర్న్స్..

- నగరంలో కాఫీ సంస్కృతికి నాంది పలికిన రోస్టరీ కాఫీ హౌస్
- ఫిన్‌లాండ్ వరకూ కొనసాగిన ప్రశస్తి
- కోకాపేట్‌లో కొత్త శాఖ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: కాఫీ కలర్చర్‌లో హైదరాబాద్ నుంచి ఫిన్లాండ్ వరకూ తన ప్రత్యేకతను చాటుకున్న రోస్టరీ కాఫీ హౌస్ తిరిగి తన ప్రస్థానాన్ని నగరంలో పునఃప్రారంభించింది. కోకాపేటలో నూతన శాఖను ఏర్పాటు చేసిన రోస్టరీ కాఫీ హౌస్ నగరవాసులకు మరోమారు వినూత్న కాఫీ రుచులను అందించనుంది. హైదరాబాద్‌లో కాఫీ సంస్కృతికి మార్గదర్శనిగా పేరుగాంచిన ఈ కేఫ్.. బంజారా హిల్స్‌లో మొదటి శాఖను ప్రారంభించి మంచి ఆదరణను పొందింది. అనంతరం లక్నో, జైపూర్, ఢిల్లీ, కోల్‌కతా, నోయిడా వంటి ఇతర నగరాలకు విస్తరించడమే కాకుండా అంతర్జాతీయంగా ఫిన్లాండ్‌లో కూడా తన కాఫీ సిగ్నేచర్‌ను కొనసాగించింది. రోస్టరీ కాఫీ హౌస్ 2.ఓలో భాగంగా మళ్లీ నగరంలో 9వ అవుట్‌లెట్ ఆవిష్కరించిడంతో కాఫీ లవర్స్ సోషల్‌మీడియా వేదికగా పోస్టులతో సందడి చేస్తున్నారు.

మనం నివసించే ఇళ్లు డిజైన్ చేయడానికి ఆర్కిటెక్చర్ ఉన్నట్లే.. ఇటీవల నగర కల్చర్‌లో భాగంగా మారిపోతున్న పెట్స్ అవసరాలు తీర్చడానికి బార్కిటెక్చర్ అందుబాటులోకి వస్తోంది. నగరానికి చెందిన స్టార్టప్ ఎస్‌వీఏజీ పెట్ హోమ్స్ దేశంలోనే తొలిసారి పెంపుడు జంతువుల కోసం విల్లాలు, పాడ్స్, డిజైనర్ ఫర్నిచర్ రూపొందిస్తోంది. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు కొన్ని డిజైన్లను ప్రదర్శించారు.

- నాంపల్లి



పెట్స్ కోసం.. బార్కిటెక్చర్..

- అందుబాటులో ప్రత్యేకంగా విల్లాలు, ఫర్నిచర్, పాడ్స్
- నగరంలో ప్రారంభించిన ఎస్‌వీఏజీ స్టార్టప్
- రూ.15 వేల నుంచి రూ.5 లక్షల వరకూ ధరలు



జాగిలాల వంటి పెంపుడు జంతువుల పరిశ్రమలో బార్కిటెక్చర్ కొత్త ఒరవడి సృష్టించనుందని నిర్వాహకులు చెబుతున్నారు. కోవిడ్ తర్వాత పెంపుడు జంతువులను, ముఖ్యంగా జాగిలాలను దత్తత తీసుకోవడం పెరిగింది. ఈ స్టార్టప్ సంస్థ శునకాలు విశ్రాంతి తీసుకోవడానికి, ఆహారం తీసుకోడానికి, అవి సురక్షితంగా ఉండటానికి అనువైన డిజైన్లతో ఉపరణాలు రూపొందిస్తోంది. వినూత్నమైన పెంపుడు జంతువుల కోసం వినూత్న గృహాలు, పావ్ షెల్టర్/పావ్ స్లీపింగ్ స్పేస్‌లకు రూపమిస్తోంది. ఆరామ్‌ఘర్‌లోని తయారీ కేంద్రంలో ప్రస్తుతం 25 రకాలు ఉత్పత్తులు రూపొందుతున్నాయి. త్వరలో మరో 50 డిజైన్లు అదనంగా వచ్చి చేరనున్నాయి. ఈ ఉత్పత్తులు రూ.15 వేల నుంచి రూ.5 లక్షల మధ్య ధర ఉంటున్నాయి. ఎస్‌వీఏజీ సంస్థ వచ్చే ఏడాది నాటికి లక్ష ఫర్నిచర్ల విక్రయం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ అంకుర సంస్థ బార్కీ ఫౌండేషన్‌నూ ప్రారంభించింది.

వీధి కుక్కల కోసం..

సంస్థ ఏరాప్టు చేసిన ఫౌండేషన్ వీధి కుక్కల కోసం పని చేయనుంది. నగరంలో నాలుగు లక్షలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయని అంచనా. తమ ఉత్పత్తులను విక్రయించడం ద్వారా వచ్చే లాభాల్లో కొంత వీధి కుక్కల కోసం కేటాయించనుంది. ఈ క్రమంలో సేవ చేసే స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేయనుంది.





నగరంలో జిరో ఫెస్టివల్..

- రెండు రోజులపాటు సంగీత నేపథ్యంగా నిర్విరామ సందడి
- అరుణాచల్, మణిపూర్ ప్రాంతాల నుంచి కళాకారులు
- నగరానికి చెందిన పలువురు సంగీతకారుల ప్రదర్శన
- ఫిబ్రవరి 1 నుంచి రెండు రోజుల పాటు కార్యక్రమాలు



సాక్షి, సిటీబ్యూరో : అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ప్రసిద్ధ సంగీతోత్సవం.. నగరానికి రానుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలకు, పేరొందిన అవుట్ డోర్ మ్యూజిక్ ఫెస్టివల్.. ఇప్పుడు జిరో ఆన్ టూర్ పేరిట దేశవ్యాప్త టూర్‌కు సిద్ధమైందని, ఇందులో భాగంగా తమ తొలి ప్రదర్శనకు నగరాన్ని వేదికగా ఎంచుకుందని వివరించారు. నగరంలోని తారామతి బారాదరిలో ఫిబ్రవరి 1 నుంచి 2 రోజుల పాటు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 11 గంటల వరకూ ఈ సంగీతోత్సవం కొనసాగుతుందన్నారు. ఈ సంగీతోత్సవంలో పంజాబీ ఫోక్ రాక్ గాయకుడు రబ్బీ షేర్‌గిల్, అరుణాచల్‌కు చెందిన ఇండీ ఆర్టిస్ట్ తాబా చాకె, మణిపూర్ జానపద సంచలనం మంగ్‌కా, మిజోరమ్ నుంచి ప్రత్యేక హోమ్‌లతో పాటు దక్షిణాది సంగీత సంచలనాలు రామ్ మిరియాల, శక్తిశ్రీ గోపాలన్, చౌరాస్తా బ్యాండ్స్ పాల్గొంటున్నాయని, ఈ సంగీత పండుగకు గిటార్ ప్రసన్న, జ్యోతీ హెగ్డే, ఫ్లూటిస్ట్ జెఎ జయంత్, రెహ్మత్-ఎ-ముస్రాత్ ఖవ్వాలీలు మరో ఆకర్షణగా పేర్కొన్నారు. ఇవే కాకుండా స్థానిక చెఫ్స్, కళాకారులు, ఔత్సాహిక వ్యాపారులకు కూడా భాగం కల్పిస్తున్నామని, స్టోరీ టెల్లింగ్ సెషన్స్, వర్క్‌షాప్స్ ఉంటాయన్నారు.

జానపద జాతర

- 23, 24 తేదీల్లో సెంటర్ ఫర్ ఫోక్ కల్చర్ స్టడీస్, ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహణ
- సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్టిస్టులు, స్కాలర్స్‌కు ఘనసత్కారం

రాయదుర్గం : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో 'ఫోక్ ఫెస్ట్–2025' కార్యక్రమాన్ని భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులపాటు ఈనెల 23, 24 తేదీల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ ఫోక్ కల్చర్ స్టడీస్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హెచ్‌సీయూ ఐఓఈ, తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్నారు. హెచ్‌సీయూ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం గణశ్యామ్‌కృష్ణ, ప్రొఫెసర్లు వైఏ సుధాకర్‌రెడ్డి, పీఎస్ కనకదుర్గ, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ జ్యోతిర్మయిశర్మ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొంటారు. మణిపూర్ హావో సంగీత కళాకారులు పద్మశ్రీ రెవ్బాన్ మషాంగ్వా, పశ్చిమబెంగాల్ కళాకారుడు పూర్ణేందు దాస్ 'బౌల్' ప్రదర్శన, వర్క్‌షాప్‌లో పదచిత్ర కళాకారుడు రంజిత్ పాల్గొంటారు. తమిళనాడుకు చెందిన ఆర్ముగమ్ బృందం పరాయ్, కరగట్టమ్ ప్రదర్శన, బిహు నృత్యాన్ని కళాకారులు మనీంద్ర రాజ్బోంగ్షి, దంజిత్‌బర్మన్, ధ్రుభనందరే, తెలంగాణ ఒగ్గుడోలు ప్రదర్శనను డాక్టర్ ఒగ్గు రవిబృందం, ఫోక్ పాటల ప్రదర్శనలో డాక్టర్ లింగశ్రీనివాస్ తెలంగాణనుంచి, గంగాసౌరవ్ కేరళ, వర్కల మనుమతి బృందంచే తెలంగాణ పేరిణి ప్రదర్శన వంటి కార్యక్రమాలు ఉంటాయి. దీంతోపాటు చిత్ర ప్రదర్శన, ఎగ్జిబిషన్, పత్రసమర్పణ కార్యక్రమాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తారు.



క్లుప్తంగా...



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

కృత్రిమమేధ ద్వారా విద్యాసంస్కరణలు సాధ్యమే

డిఫెన్స్ పరిశోధన విభాగం పూర్వ కార్యదర్శి డాక్టర్ సతీష్‌రెడ్డి

రాయదుర్గం: కృత్రిమమేధ ద్వారా విద్యారంగంలో సంస్కరణలు సాధ్యమేనని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, రక్షణ పరిశోధన విభాగ పూర్వ కార్యదర్శి డాక్టర్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సహకారంతో తక్కువ, మధ్యస్థ ఆదాయం కలిగిన దేశాల్లో కృత్రిమమేధ ద్వారా విద్యారంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై ప్రత్యేక సమావేశం గురువారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోనే సుమారు 20వేల మంది కృత్రిమమేధ రంగంలో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ 'ఎస్కీ'డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, రీసెర్చ్ టీమ్ ఆర్థికవేత్త డాక్టర్ శారదాశ్రీనివాసన్, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వీసీ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు.

ఆ భూములను గిరిజనులకే ఇవ్వాలి

బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: వెలిమల గ్రామంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను వారికే కేటాయించాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ఈ భూములపై కొందరు ప్రభుత్వ పెద్దల కన్ను పడిందన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లోని శంకర్‌పల్లి, రామచంద్రాపురం మండలాల మధ్యలో ఓ భూమికి సంబంధించి వివాదం కొనసాగుతోందన్నారు. శంకర్‌పల్లి మండలం కొండకల్, రామచంద్రాపురం మండలం వెలిమల గ్రామ శివారు మధ్యలో గల 429 ఎకరాల్లో 180 ఎకరాల భూమిని వివిధ పరిశ్రమలకు కేటాయించారని, సర్వే సెటిల్మెంట్‌లో భాగంగా వెలిమల గ్రామానికి కొత్త సర్వే నంబర్లు కేటాయించారని చెప్పారు. మొత్తం 429 ఎకరాల్లో చివరకు 85 ఎకరాలు మిగిలాయని, ఈ భూమిలో సాగు చేసుకుంటున్న తమకు పట్టాలివ్వాలని గిరిజనులురెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, ఈ భూమిని తిరిగి గిరిజనులకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం మరో లగచర్లగా మార్చవద్దని కోరారు.

ట్యాక్స్ పేరుతో సీఎం రేవంత్ వసూళ్లు

ఢిల్లీకి రూ.500 కోట్లు పంపాడు: కేఏ పాల్



హనుమకొండ: సీఎం రేవంత్‌రెడ్డి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నాడని, ట్యాక్స్ పేరుతో రూ.500 కోట్లు వసూలు చేసి ఢిల్లీలో కాంగ్రెస్ కార్యాలయ భవన నిర్మాణానికి పంపారని ఆరోపణలున్నాయని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ అన్నారు. గురువారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు, కేసీఆర్ దేశమంతా తిరుగుతూ ప్రధాని మోదీని హిట్లర్ అని, భార్యను, తల్లిని వదిలేశాడని తిట్టని తిట్లు అన్నీ తిట్టారని, 50 రోజులు జైలులో పెట్టగానే చంద్రబాబుకు ప్రధాని మోదీ దేవుడయ్యారన్నారు. తానా లీడర్లు అవినీతిపరులని, కోట్లలో డబ్బులు కొట్టేసి చంద్రబాబుకు ఇస్తున్నారని, తానా కోశాధికారి చంద్రబాబు, పవన్ కల్యాణ్, రేవంత్‌రెడ్డికి ఫండ్స్ ఇచ్చారని అన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి లంబాడీల స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు.

కేఎల్ వర్సిటీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో కేఎల్ యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్ష మొదటి విడత ఫలితాలను వర్సిటీ ఉపకులపతి డాక్టర్ పార్థసారథివర్మ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రవేశ పరీక్షకు లక్ష మంది హాజరుకాగా, 80 శాతం మంది అర్హత సాధించారన్నారు. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంకులు, మార్కుల ఆధారంగా స్కాలర్‌షిప్ ద్వారా ఫీజులో మినహాయింపు ఇస్తామని తెలిపారు. రెండో విడత ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షను ఫిబ్రవరి 7, 9 తేదీల్లో నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు. ఫలితాలను www.kluniversity.in వెబ్‌సైట్ ద్వారా లేదా 9648229999 ఫోన్‌నంబర్ ద్వారా పొందవచ్చు.

ప్రజా ప్రతినిధులే ఫైనల్!

నాలుగు సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి సర్వే షురూ

- ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు.. కొత్త రేషన్‌కార్డుల జారీ
- లబ్ధిదారుల ఎంపికలో అధికారులు, సిబ్బంది బిజీ బిజీ
- తుది జాబితాల రూపకల్పనలో మంత్రులు, ఎమ్మెల్యేలదే కీలకపాత్ర!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ప్రజాప్రతినిధులే కీలక పాత్ర పోషించనున్నారు. లబ్ధిదారులను అధికారులు ప్రాథమికంగా ఎంపిక చేసిన తర్వాత జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులతో తుది జాబితా సిద్ధం కానుంది. ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు, కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ షురూ కానుంది. దీంతో గురువారం నుంచి దాదాపుగా అన్ని ప్రధాన ప్రభుత్వ శాఖలు రంగంలోకి దిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు ఇచ్చిన సూచనలతో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయికి తరలివెళ్లింది. రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, ఎంఏయూడీ, హౌసింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది అర్హులను గుర్తించడంలో బిజీగా ఉన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనుంది. 21, 22 తేదీల్లో గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహించనున్నారు. అర్హులు, అనర్హుల జాబితాను ఈ సభల్లో ప్రకటించే అవకాశం ఉంది. 23, 24 తేదీల్లో జిల్లా స్థాయిల్లో తుది జాబితా సిద్ధం కానుంది. తుది జాబితాను రూపొందించే క్రమంలో ప్రజా ప్రతినిధుల నిర్ణయం కీలకం కానుంది. స్థానికంగా ఉన్న రాజకీయ, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ అర్హుల ఎంపికలో ఎమ్మెల్యేలు కీలక పాత్ర పోషించనున్నారు. ఎమ్మెల్యేల సిఫారసులతో తుదిరూపు దిద్దుకున్న జాబితా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి వెళుతుంది. ఆ జాబితా ప్రకారమే 26వ తేదీన లబ్ధిదారుల ప్రకటన ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు చెపుతున్నాయి.

భూభారతిలోకి సాగు యోగ్యం కాని భూములు

రైతుభరోసా పథకం కింద సీజన్‌కు రూ. 6,000 చొప్పున వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో సాగు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు ప్రస్తుతం ఫీల్డ్ సర్వే జరుగుతోంది. సాగు యోగ్యం కాని భూములను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల వ్యవసాయ విస్తరణాధికారులు పరిశీలించి, భూ భారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. 20వ తేదీ వరకు ఈ ప్రక్రియ పూర్తి చేసి గ్రామసభల్లో నివేదిస్తారు. గ్రామసభల్లో వచ్చే విజ్ఞాపనల ఆధారంగా స్థానిక ఎమ్మెల్యే ఆమోదంతోనే అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు.

రేషన్‌కార్డు ఆధారంగా కుటుంబం గుర్తింపు

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలుగా నమోదై ఉండి సంవత్సరంలో కనీసం 20 రోజుల పాటు వ్యవసాయ కూలీగా పనిచేసిన వారి కుటుంబాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని ప్రభుత్వం పేర్కొంది. ఒక కుటుంబంలో ఎంత మంది కూలీలు ఉన్నా, ఆ కుటుంబం మొత్తానికి కలిపి ఒక్కో సీజన్‌కు రూ.6 వేల చొప్పున రెండు సీజన్లకు ఏటా రూ.12 వేలు ఈ పథకం కింద చెల్లించనున్నారు. ఈ మేరకు అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించే పనిలో అధికారులున్నారు. అయితే కుటుంబాన్ని నిర్ధారించేందుకు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలిసింది. అయితే రేషన్‌కార్డులు గత కొన్నేళ్లుగా అప్‌డేట్ కాకపోవడంతో కుటుంబంలోని వారికి పెళ్లిళ్లై, వేర్వేరు కుటుంబాల్లో నివసించే పక్షంలో వారిని గుర్తించడంలో గ్రామసభలు కీలకం కానున్నాయి. ఇక్కడ వచ్చిన ఫిర్యాదులు, సూచనలను కూడా స్థానిక ఎమ్మెల్యేల దృష్టికే తీసుకెళ్లి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు!

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వేలో ఏ కుటుంబానికి రేషన్‌కార్డు లేదనేది సిబ్బంది నమోదు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 20 లక్షల కుటుంబాలు కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తుండగా, కార్డుల్లో పేర్ల చేర్పుల కోసం లక్షలాది మంది వెయిటింగ్‌లో ఉన్నారు. ఎమ్మెల్యేలకు రేషన్‌కార్డుల అంశం కీలకం కాబట్టి అర్హులైన వారందరికీ ఇప్పించేందుకు ప్రయత్నించే అవకాశం ఉందని ఓ ప్రజా ప్రతినిధి పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతోనే తిప్పలు

నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రతి నియోజకవర్గంలో కొత్తగా ఇళ్ల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఇప్పటికే ఫీల్డ్ సర్వే కూడా పూర్తయింది. లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. కాగా ఒక్కో గ్రామం నుంచి ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారనేదే ప్రధాన సమస్యగా మారనుంది. ఇప్పటికే సొంత స్థలం ఉన్న వారికి తొలి ప్రాధాన్యత అని ప్రభుత్వం చెప్పడంతో ఎమ్మెల్యే విచక్షణ మేరకు ఆయా నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పల్లె నుంచి నగరానికి తిరుగు పయనం



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్/ చౌటుప్పల్ రూరల్: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన వారు తిరుగుపయనమయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వైపు వాహనాలు బారులుతీరాయి. దీంతో గురువారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వాహనాల రద్దీ నెలకొంది. హైదరాబాద్ మార్గంలో ఉదయం నుంచి వాహనాల రాక పెద్ద ఎత్తున సాగుతూనే ఉంది. జంక్షన్లు, క్రాసింగ్‌ల వద్ద వాహనాలు సాఫీగా ముందుకుసాగేందుకు, ప్రమాదాల నివారణకు పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల కూడలి ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించారు.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద సాఫీగా..

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు సాఫీగా సాగాయి. టోల్‌ప్లాజాలో 16 గేట్లు ఉండగా, హైదరాబాద్ వైపు 12 గేట్ల నుంచి వాహనాలను పంపించారు. విజయవాడ వైపు నుంచి వస్తున్న వాహనాలకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా జాతీయ రహదారిపై హైవే అథారిటీ అధికారులు గుర్తించిన 17 సమస్యాత్మక ప్రాంతాలతోపాటు ప్రతి గ్రామ స్టేజీ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.

మొక్కు తీర్చుకుని వస్తూ మృత్యుఒడికి..

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం ● మరో ఘటనలో ఇద్దరు మృతి



ప్రేమలత (ఫైల్)



ప్రసన్నలక్ష్మి (ఫైల్)



అక్షిత (ఫైల్)



వైద్విక్ (ఫైల్)

మోత్కూరు/భువనగిరి: మొక్కు తీర్చుకోవడానికి షిర్డీ వెళ్లిన ఓ కుటుంబం ప్రయాణిస్తున్న వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. అలాగే సంక్రాంతి పండుగకు సొంతూరు వెళ్లి తిరిగివస్తున్న వారి కారు అదుపుతప్పి లారీ కింద ఇరుక్కోవడంతో ఇద్దరు మృతిచెందారు. మృతిచెందిన వారిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మహారాష్ట్రలోని గంగాపూర్ వద్ద ఓ ఘటన చోటుచేసుకోగా, భువనగిరి జిల్లా కేంద్రం సమీపంలో మరో ఘటన చోటుచేసుకుంది. వివరాలు..

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామానికి చెందిన శ్యాంసెట్టి కృష్ణమూర్తి, ప్రేమలత దంపతులు తమ కొడుకు, కోడలుతో సరూర్‌నగర్ గ్రీన్‌పార్కు ఏరియాలో నివాసం ఉంటూ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. వీరికి మనవడు పుట్టిన సందర్భంగా మొక్కుతీర్చుకోవడానికి షిర్డీకి వెళ్లాలని అనుకున్నారు. భోగి పండుగ రోజు పెద్ద కూతురు ప్రసన్నలక్ష్మి, చిన్న కూతురు బజ్జూరి స్రవంతి కుటుంబాలతో కలిసి హైదరాబాద్ నుంచి ప్రైవేట్ బస్సులో వెళ్లి షిర్డీ సాయిబాబా దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత స్థానికంగా తుఫాన్ వాహనం కిరాయికి తీసుకొని ఔరంగాబాద్‌లోని మినీ తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఔరంగాబాద్ – షిర్డీ మధ్యలో గంగాపూర్ వద్ద బుధవారం రాత్రి వీరు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టడంతో శ్యాంసెట్టి ప్రేమలత (57) ఆమె కుమారుడి కొడుకు వైద్విక్ (6 నెలల బాలుడు), పెద్ద కూతురు తొల్పునూరి ప్రసన్నలక్ష్మి (42)తో పాటు ప్రసన్నలక్ష్మి పెద్ద కూతురు తొల్పునూరి అక్షిత (21) మృతిచెందారు. ప్రేమలత పెద్ద అల్లుడు శ్రీనివాస్, ప్రసన్నలక్ష్మి రెండో కూతురు శరణ్యతో పాటు ప్రేమలత భర్త కృష్ణమూర్తి, కుమారుడు వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారు ఔరంగాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రేమలత చిన్న కూతురు బజ్జూరి స్రవంతి, అల్లుడు రాంబాబుతో పాటు వీరి కుమారుడు, కుమార్తె ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం ఔరంగాబాద్ నుంచి స్వగ్రామానికి తరలించారు.

సంక్రాంతి పండుగకు వచ్చి వెళ్తూ...





చైత్ర (ఫైల్)



అనూష (ఫైల్)

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకట్రాంతండాకు చెందిన గుగులోతు రవి, భూక్య సంతోష్ బావాబావమరుదులు. రవికి భార్య భవాని, కుమార్తె మోక్ష ఉండగా.. సంతోష్‌కు భార్య అనూష (26), ఇద్దరు కుమార్తెలు ప్రణశ్విని, చైత్ర (6) ఉన్నారు. రవి, సంతోష్‌లు కుటుంబాలతో కొంతకాలంగా హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఉంటున్నారు. రవి, సంతోష్‌లు తమ భార్యాపిల్లలతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు కారులో స్వగ్రామం వెంకట్రాంతండాకు వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరారు. సంతోష్ కారు నడుపుతుండగా.. అతడి భార్య అనూషతో పాటు చిన్న కుమార్తె చైత్ర అతడి పక్కన కారు ముందు భాగంలో కూర్చున్నారు. మిగతావారు వెనక కూర్చున్నారు. గురువారం తెల్లవారుజామున 6.30 గంటల సమయంలో భువనగిరి జిల్లా కేంద్రానికి సమీపంలోని రాయగిరి వద్దకు రాగానే వరంగల్-హైదరాబాద్ హైవే బైపాస్ రోడ్డుపై ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా ఇండికేటర్ వేయకుండా పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లోకి ఒక్కసారిగా టర్న్ తీసుకున్నాడు. వెనకాలే వస్తున్న వీరి కారు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. కారు లారీ కింది భాగంలో ఇరుక్కుపోవడంతో నుజ్జునుజ్జు అయ్యింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును జేసీబీ సహాయంతో బయటకు తీయగా.. అప్పటికే అనూష, చైత్ర మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మిగతా ఐదుగురిని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. భూక్య సంతోష్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రబాబు, ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్ తెలిపారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన రవి భార్య భవాని 8 నెలల గర్భంతో ఉంది. ఆస్పత్రికి తరలించిన అనంతరం వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహించారు. కడుపులో ఉన్న శిశువుకు ఎలాంటి ప్రమాదం లేదని తేల్చారు.

ఎస్టీ గురుకుల సొసైటీలో ఇష్టారాజ్యం!

- ఎస్టీ సంక్షేమ శాఖ అజమాయిషీకి చెక్‌పెట్టే వ్యూహం
- సొసైటీలోకి ఆ శాఖ అధికారులు రాకుండా నిబంధనల మార్పు
- బైలాస్‌కు విరుద్ధమైన మార్పులతో ప్రభుత్వానికి ప్రతిపాదన
- గిరిజన సంక్షేమ శాఖ అధికారుల తీవ్ర అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)పై దాని మాతృ సంస్థ అయిన గిరిజన సంక్షేమ శాఖ అజమాయిషీకి చెక్ పెట్టేందుకు.. సొసైటీలోని కొందరు పావులు కదుపుతున్నారు. సొసైటీలోకి ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు వచ్చేందుకు వీలు లేకుండా నిబంధనలు మార్చి ప్రభుత్వ ఆమోదం కోసం పంపారు. సొసైటీ అధికారులకే పదోన్నతులు ఇచ్చి ఆయా పోస్టుల్లో నియమించేలా నిబంధనలు రూపొందించారు. ఈ మార్పులను ప్రభుత్వం ఆమోదిస్తే బోర్డుపై గిరిజన సంక్షేమశాఖ పట్టు కోల్పోతుందని, బోర్డు అధికారులదే ఇష్టారాజ్యం అవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నిబంధనలు ఏం చెబుతున్నాయి?

టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్‌కు మాతృసంస్థ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ. బడ్జెట్ కేటాయింపులు మొదలు.. పరిపాలనకు సంబంధించిన ప్రతి అంశానికి ఆమోదం ఈ శాఖ అనుమతితోనే జరుగుతుంది. సొసైటీకి సంబంధించి నిర్ణయాలు తీసుకునే అధికారం సొసైటీ ఉన్నతాధికారికి ఉన్నప్పటికీ, పరిపాలనా అజమాయిషీ అంతా మాతృ సంస్థ కనుసన్నల్లోనే జరుగుతుంది. టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ పరిధిలో అదనపు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ఉప కార్యదర్శి (అడ్మిన్) పోస్టుల్లో గిరిజన సంక్షేమ శాఖకు చెందిన అధికారులు డిప్యుటేషన్‌పై కొనసాగుతారు. సొసైటీ బైలాస్‌లో ఈ మేరకు నిబంధనలు పొందుపర్చారు. ఇప్పుడు ఈ నిబంధనలనే మార్చాలని సొసైటీ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. మాతృసంస్థకు చెందిన అధికారులు సొసైటీలో పనిచేసే అవకాశం లేకుండా, సొసైటీకి చెందిన అధికారులకు పదోన్నతులు కల్పించి ఆ పోస్టుల్లో నియమించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ప్రభుత్వానికి ఫిర్యాదుల వెల్లువ

గిరిజన గురుకుల సొసైటీ పరిధిలో నిబంధనల మార్పుపై ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు భగ్గుమంటున్నారు. ఈ అంశంపై ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. సొసైటీలో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకునేందుకే మాతృసంస్థకు చెందిన అధికారులను అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని లిఖితపూర్వక ఫిర్యాదులు సమర్పించారు. సొసైటీ కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ తదితర అంశాల్లో కీలకంగా వ్యవహరించే మాతృసంస్థ అధికారులను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎస్టీ గురుకుల సొసైటీలో సంయుక్త కార్యదర్శిగా పోస్టింగ్ పొందిన ఓ అధికారిని ఏడాది కాలంగా విధుల్లో చేరకుండా అడ్డుకున్నారని గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సంఘ ప్రతినిధి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే న్యాయపోరాటానికి సైతం వెనుకాడబోమని హెచ్చరించారు.

ముసాయిదా ప్రతిపాదనలు సిద్ధం!

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై బీసీ డెడికేటెడ్ కమిషన్ కసరత్తు కొలిక్కి

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ఏర్పాటైన డెడికేటెడ్ బీసీ కమిషన్ పరిశీలన ప్రక్రియ దాదాపు ఓ కొలిక్కి వచ్చింది. ఉమ్మడి జిల్లాల వారీగా పర్యటనలు చేపట్టడంతోపాటు కమిషన్ కార్యాలయంలో పలు దఫాలుగా వినతులు, అర్జీలు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ చేపట్టిన కమిషన్.. తాజాగా ముసాయిదా ప్రతిపాదనలు రూపొందించినట్టు సమాచారం. ఈ ప్రతిపాదనలను అతిత్వరలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లేందుకు డెడికేటెడ్ కమిషన్ సన్నద్ధమవుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్ 4వ తేదీన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావును ఈ కమిషన్‌కు చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. కమిషన్‌కు సభ్య కార్యదర్శిగా బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి బి.సైదులును నియమించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను నిర్దేశించే విధంగా సమగ్ర నివేదికను నెలరోజుల్లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉమ్మడి జిల్లా కేంద్రంగా బహిరంగ విచారణ

డెడికేటెడ్ కమిషన్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా బహిరంగ విచారణ చేపట్టింది. బీసీ కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు, మేధావులు ఇలా అన్ని వర్గాల నుంచి వినతులు స్వీకరించింది. కమిషన్ కార్యాలయంలో పలు విడతలుగా బహిరంగ విచారణ చేపట్టింది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులు, అర్జీలను స్వీకరించిన తర్వాత వాటిని లోతుగా పరిశీలించినట్టు సమాచారం. తెలంగాణ బీసీ కమిషన్ చేపట్టిన అధ్యయనాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా సేకరించి విశ్లేషించినట్టు తెలిసింది. ఈ క్రమంలో ముసాయిదా జాబితాను తయారు చేసింది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టింది. కులాల వారీగా లెక్కలపై స్పష్టత కోసం ఈ సర్వే చేపట్టినట్లు పలు సందర్భాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఈ సర్వేకు సంబంధించిన సమాచారం ఇప్పటివరకు బహిర్గతం కాలేదు. ఈ సర్వేకు సంబంధించిన సమాచారం ఆధారంగా మరింత స్పష్టంగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వొచ్చని డెడికేటెడ్ కమిషన్ భావిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం రూపొందించిన ముసాయిదా ప్రతిపాదనల్లో సర్వేకు సంబంధించిన సమాచారాన్ని జోడించిన తర్వాత పూర్తిస్థాయి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు సమాచారం.

హత్యచేసి... పూడ్చిపెట్టి.. ఆ పక్కనే వంటావార్పు..

- కోడల్ని చంపి ఇంట్లోనే పాతిపెట్టిన అత్తింటివారు
- మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సుధీర్ కేకన్



మృతదేహాన్ని పాతిపెట్టిన చోటును పరిశీలిస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీలో భర్త, అత్తామామ, ఆడపడుచు కలిసి ఓ వివాహితను కిరాతకంగా చంపి ఇంటి ఆవరణలోనే గొయ్యితీసి పూడ్చిపెట్టారు. పూడ్చిపెట్టిన ప్రాంతంలో అలుకు చల్లారు. సమీపంలోనే వంటావార్పు చేశారు. జిల్లా కేంద్రంలో సంచలనం రేపిన ఈ ఘటనలో పూడ్చిపెట్టిన చోటుగా అనుమానించిన ప్రదేశంలో గురువారం పోలీసులు తవ్వించగా మృతదేహం బయటపడింది. పది రోజుల క్రితం కోడలు నాగమణిని అత్తింటివారంతా కలిసి హత్య చేసి అనుమానం రాకుండా ఇంటి ఆవరణలో గొయ్యితీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఎవరికి అనుమానం రాకుండా ఆ గొయ్యవరకే పేడతో అలుకు చల్లి వదిలేశారు. పది రోజుల నుంచి నాగమణి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వాళ్లు ఆరాతీయగా, మృతురాలి కుటుంబ సభ్యులు పొంతనలేని సమాధానాలు చెప్పారు. ఆ ఇంట్లోని చిన్నపిల్లలను అడుగగా నాగమణిని చంపి గొయ్యితీసి పాతిపెట్టారని చెప్పారు. దీంతో కాలనీవాసులు కుటుంబ సభ్యులను గట్టిగా నిలదీయడంతో ఈ నెల 14వ తేదీన ఇంటికి తాళం వేసి గుట్టుచప్పుడు కాకుండా ఉడాయించారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాక్షి కథనంతో రంగంలోకి పోలీసులు..

మహిళ మిస్సింగ్‌పై 'హత్యచేసి... పూడ్చి పెట్టారా.. వివాహితను చంపినట్లు ప్రచారం'శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన ఎస్పీ సుధీర్ కేకన్, పోలీసుశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేసి అనుమానితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ భగవాన్‌రెడ్డి సమక్షంలో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ సిగ్నల్ కాలనీలో మహిళను హత్యచేసి పూడ్చి పెట్టినట్లుగా ప్రచారం జరిగిన ప్రాంతంలో తవ్వించగా మృతదేహం లభ్యమైంది. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ సుధీర్ కేకన్, డీఎస్పీ ఎన్.తిరుపతిరావు పరిశీలించి స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పోస్టుమార్టం నివేదిక తరువాత పూర్తి వివరాలు

టౌన్ సీఐ దేవేందర్ మాట్లాడుతూ మహిళ మృతిపై అనుమానాస్పదంగా కేసు నమోదు చేశామని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక, పూర్తిస్థాయిలో విచారణ అనంతరం నిందితుల వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. తనిఖీలో టౌన్ ఎస్సైలు శివ, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రాజకీయాల్లో మచ్చలేని నేత జైపాల్‌రెడ్డి

పాలమూరు జిల్లాకు ఆయన పేరు పెట్టాలి: స్పీకర్ గడ్డం ప్రసాద్



సనత్‌నగర్(హైదరాబాద్): రాజకీయాల్లో మచ్చలేని నేతగా ముందు వరుసలో కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి నిలుస్తారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. నెక్లెస్‌రోడ్డులోని స్ఫూర్తిస్థల్‌లో నిర్వహించిన జైపాల్‌రెడ్డి 83వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో భాగంగా పార్లమెంట్‌లో ముఖ్య భూమిక పోషించారని, పాలమూరు జిల్లాకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని కోరారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సమకాలీన భారత రాజకీయాల్లో మొదటగా నిలిచే గొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా జైపాల్‌రెడ్డిని కొనియాడారు. రాష్ట్ర సాధనలో జైపాల్‌రెడ్డి ముఖ్యపాత్రను పోషించారని, దీనిని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జైపాల్‌రెడ్డికి నివాళులు అర్పించిన వారిలో సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, కోదండరాం, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, సుదర్శన్‌రెడ్డి, ఉత్తమ్ పద్మావతిరెడ్డి, యశస్విని, జైవీర్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, మాజీమంత్రి జానారెడ్డి, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, కేవీపీ రామచందర్‌రావు, డీజీపీ జితేందర్, కలెక్టర్ అనుదీప్, మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఉన్నారు. గాంధీభవన్‌లో జైపాల్‌రెడ్డి జయంతి నిర్వహించారు.


మమ్మల్ని గర్వపడేలా చేశావు

చిన్న కుమార్తె వర్ష స్నాతకోత్సవం సందర్భంగా వైఎస్ జగన్ భావోద్వేగ ట్వీట్



సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రతిష్టాత్మక కింగ్స్ కాలేజ్ నుంచి మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఫైనాన్స్) పట్టా పుచ్చుకున్న సందర్భంగా కుమార్తె వర్షారెడ్డికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'వర్షమ్మకు అభినందనలు. అత్యంత ప్రతిష్టాత్మకమైన కింగ్స్ కాలేజ్ లండన్‌లో చదివి పట్టభద్రురాలవడంతోపాటు, డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించి మాకు ఎంతో గర్వకారణమయ్యావు. ఆ దేవుడి ఆశీస్సులు నీపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.' అని స్పందించారు. ఈ సందర్భంగా తన కుటుంబంతో దిగిన ఫొటోను కూడా పోస్ట్ చేశారు.

ప్రతిష్టాత్మకం... కింగ్స్ కాలేజీ లండన్!



ఇంగ్లాండ్‌లోని 'కింగ్స్ కాలేజీ లండన్' ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక విశ్వ విద్యాలయాల్లో ఒకటి. ఈ విఖ్యాత విశ్వవిద్యాలయాన్ని 1829లో నాటి ఇంగ్లాండ్ రాజు కింగ్ జార్జ్ 4.. రాయల్ చార్టర్ ద్వారా స్థాపించారు. అంతర్జాతీయ స్థాయి బోధనలో, అత్యాధునిక పరిశోధనల్లో ఈ యూనివర్సిటీకి ప్రపంచ వ్యాప్తంగా గొప్ప గుర్తింపు ఉంది. ఈ యూనివర్సిటీలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 14 మందికి ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి లభించడం విశేషం. ప్రస్తుతం 147 అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్, 195 పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ అందిస్తున్న 'కింగ్స్ కాలేజీ లండన్'లో, 185 దేశాలకు చెందిన 23వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

నీట్ యూజీ-2025
పెన్, పేపర్‌తోనే..

ఒకేరోజు- ఒకే షిఫ్టులో ఓఎంఆర్ విధానంలో పరీక్ష

- అక్రమాలకు తావు లేకుండా పరీక్ష నిర్వహణకే ఈ విధానం: ఎన్‌టీఏ

సాక్షి, న్యూఢిల్లీ/ హైదరాబాద్: పేపర్ లీకేజీలు, ఇతర వివాదాల నేపథ్యంలో నీట్ యూజీ-2025పై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కీలక ప్రకటన చేసింది. దేశంలో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్-2025 పరీక్షను ఆఫ్‌లైన్ మోడ్‌లో అంటే పెన్, పేపర్ (ఓఎంఆర్ విధానం) పద్ధతిలో నిర్వహించనున్నట్లు గురువారం ప్రకటించింది. పేపర్ లీక్, ఇతర అక్రమాలను నిరోధించేందుకు ఈసారి దేశవ్యాప్తంగా 'ఒకే రోజు- ఒకే షిఫ్టు'లో ఈ పరీక్షను నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఖరారు చేసిన మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఎంబీబీఎస్‌తోపాటు బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్‌ఎంఎస్ కోర్సులకు యూనిఫామ్ నీట్ యూజీ పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది. నీట్ యూజీ ఫలితాల ఆధారంగా నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి కింద బీహెచ్‌ఎంఎస్ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తారు. దీంతోపాటు సాయుధ దళాలకు వైద్య సేవలందించే ఆసుపత్రుల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో చేరాలనుకునే మిలిటరీ నర్సింగ్ సర్వీస్ అభ్యర్థులు కూడా నీట్ అర్హత సాధించాల్సి ఉంటుంది. నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సుకూ నీట్ యూజీ కోర్సులో అర్హత సాధించాల్సి ఉంటుందని ఎన్టీఏ తెలిపింది.

ఆన్‌లైన్ పరీక్షపై మల్లగుల్లాలు

గత సంవత్సరం నీట్-2024లో చోటు చేసుకున్న లీక్ వ్యవహారాల నేపథ్యంలో నీట్ యూజీ- 2025ని జేఈఈ మెయిన్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలనే డిమాండ్లు వచ్చాయి. దీంతో ఎన్‌టీఏ నిర్వహించే పరీక్షల్లో పారదర్శకతను పెంచే సూచనలు చేసేందుకు ఇస్రో మాజీ చైర్మన్ ఆర్ రాధాకృష్ణన్ నేతృత్వంలో కేంద్రం ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ విస్తృత సమాలోచనలు జరిపి 'మల్టీ సెషన్ టెస్టింగ్, మల్టీ స్టేజ్ టెస్టింగ్ 'విధానంలో నీట్‌ను.. 'మల్టిట్యూడ్ సబ్జెక్ట్ స్ట్రీమ్స్'విధానంలో 'కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) పరీక్షలను నిర్వహించాలంది. ఇందుకోసం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని తెలిపింది. తాజాగా కేంద్ర విద్య, ఆరోగ్యశాఖలు జరిపిన చర్చల్లో పాత ఓఎంఆర్ పద్ధతికే మొగ్గుచూపుతూ నిర్ణయం తీసుకున్నారు. అయితే అవకతవకలకు ఆస్కారం లేకుండా ఒకే రోజు- ఒకే షిఫ్టు విధానాన్ని అవలంబించాలని నిర్ణయించారు. 'నీట్ యూజీ-2025ని ఆన్‌లైన్‌లో నిర్వహించాలా? పెన్, పేపర్ పద్ధతిలో నిర్వహించాలా? అనే అంశంపై కేంద్ర విద్య, ఆరోగ్యశాఖలు చర్చించాయి. ఆ తర్వాతే ఈ పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించాం. ఎన్‌ఎంసీ నిర్ణయం ప్రకారం, నీట్-యూజీ-2025ని పెన్, పేపర్ పద్ధతిలోనే నిర్వహిస్తాం. ఒకే రోజు, ఒకే షిఫ్టులో పరీక్ష ఉంటుంది'అని ఎన్‌టీఏ వర్గాలు చెప్పాయి.

దేశంలోనే అతిపెద్ద పరీక్ష

దేశంలో అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యే పరీక్షగా నీట్‌కు పేరుంది. 2024లో ఏకంగా 24 లక్షల మందికిపైగా ఈ పరీక్ష రాశారు. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లోని దాదాపు 1.08 లక్షల ఎంబీబీఎస్ సీట్ల భర్తీ కోసం ఏటా నీట్ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తుంది. ఇందులో దాదాపు 56 వేల సీట్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉన్నాయి. నీట్‌లో సాధించే మార్కుల ఆధారంగా విద్యార్థులకు వివిధ కోర్సుల్లోనూ ప్రవేశాలు లభిస్తాయి.

ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఓటీపీ ఆధారిత ధ్రువీకరణ కోసం మొబైల్ నంబర్‌తోపాటు ఆధార్‌ను లింక్ చేయాలని ఎన్‌టీఏ గతంలో కోరింది. అభ్యర్థులు తమ పదోతరగతి సర్టిఫికెట్ ప్రకారం ఆధార్ క్రెడెన్షియల్స్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. సరళమైన దరఖాస్తు ప్రక్రియ కోసం ఆధార్ ఉపయోగిస్తున్నట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఆధార్‌లోని ఫేస్ అథెంటికేషన్ పద్ధతి వల్ల అభ్యర్థుల గుర్తింపు వేగవంతం, సులభతరమవుతుందని వెల్లడించింది. దీనివల్ల ప్రవేశ పరీక్షలోని అన్ని ప్రక్రియలు సునాయాసంగా పూర్తవుతాయని తెలిపింది. నీట్ యూజీ-2025 రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. సిలబస్‌ను ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు.

4 రోజుల శిశువుకు
కీహోల్ సర్జరీ

సాక్షి, హైదరాబాద్: అరుదైన సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న శిశువుకు అరుదైన రీతిలో కీహోల్ సర్జరీ చేసి ప్రాణాపాయం తప్పించారు హైదరాబాద్‌లోని లిటిల్ స్టార్ ఆసుపత్రి వైద్యులు. ఈ సర్జరీ వివరాలను బంజారాహిల్స్‌లోని లిటిల్ స్టార్, షి ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఆసుపత్రిలో గురువారం ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో వైద్యులు వెల్లడించారు. సౌదీ అరేబియాలో స్థిరపడిన మన దేశానికి చెందిన ఓ మహిళ కాన్పు కోసం భారత్‌కు వచ్చారు. అయితే గర్భస్థ శిశువుకు డయాఫ్రాం ఏర్పడలేదని, దీంతో గుండె భాగంలోకి పేగులు, లివర్, కిడ్నీలు చేరాయని పరీక్షల్లో తేలింది.

ఇది చాలా ప్రమాదకర పరిస్థితి. శిశువు మరణించే అవకాశం అధికంగా ఉంటుంది. దీంతో ఆ దంపతులు లిటిల్ స్టార్ హాస్పిటల్‌ను సంప్రదించారు. ఆసుపత్రి వైద్యుడు డా. సతీశ్ గంట ఆధ్వర్యంలో మహిళకు అత్యంత జాగ్రత్తగా డెలివరీ చేసి, అనంతరం అత్యాధునిక టెక్నాలజీ కీ హోల్ సర్జరీ ద్వారా శిశువుకు గుండె భాగంలోకి చేరిన అవయవాలను తిరిగి యథా స్థానంలోకి పంపారు. కేవలం నాలుగు రోజుల వయసున్న శిశువుకు కీ హోల్ సర్జరీ చేయడం అత్యంత అరుదని వైద్యులు తెలిపారు. ఈ సమావేశంలో బిడ్డ తల్లిదండ్రులు పాల్గొని ఆసుపత్రి వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు.



మిర్చి యార్డు ముఖద్వారం నమూనా

అత్యాధునికంగా ఖమ్మం మార్కెట్

రూ.100 కోట్లతో నిర్మాణాలు • త్వరలో పనులకు శంకుస్థాపన

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డు అధునాతన రూపం సంతరించుకోనుంది. ఈ యార్డుకు తెలంగాణ, ఏపీలోని వివిధ జిల్లాల నుంచి రైతులు మిర్చి పంట తీసుకొస్తుండగా సీజన్‌లో స్థలం సరిపోక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీనిని మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించడంతో ప్రభుత్వం నుంచి రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయి. డిజైన్ల రూపకల్పన బాధ్యతలను అజిలిటీ అనే కంపెనీకి అప్పగించడంతో వారు పని పూర్తిచేశారు. దీని ప్రకారం క్రయవిక్రయాలకు 6 షెడ్లు, మధ్యలో ఓ పాలనా భవనమే కాక ఆన్‌లైన్ బిడ్డింగ్, చిల్లీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. అలాగే, నిరంతరాయంగా విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలు, వ్యర్థాల రీసైక్లింగ్ సదుపాయం, విశాలమైన రహదారులు, సీసీ టీవీ నిఘా వ్యవస్థల వంటివి ఏర్పాటు చేయనున్నారు.

ఓఆర్‌ఆర్ – ట్రిపుల్‌ఆర్ మధ్య...

హైదరాబాద్‌లో 400 ఎకరాల స్థలంలో మెగా మార్కెట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరగగా, గురువారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్దవైన వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ మార్కెట్ల అభివృద్ధికి కసరత్తు చేస్తున్నామని తెలిపారు. ఇదే సమయంలో ఓఆర్‌ఆర్, ట్రిపుల్‌ఆర్ మధ్య విమానాశ్రయం సమీపాన రూ.వెయ్యి నుంచి రూ.2 వేల కోట్ల వ్యయంతో మార్కెట్ నిర్మిస్తామన్నారు.

ప్రత్యామ్నాయ బీర్లపై దృష్టి

- రాష్ట్రంలో కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా నిలిచిపోవడంతో అప్రమత్తమైన ఎక్సైజ్ శాఖ
- 4 బ్రూవరీస్‌లలో 2 షిఫ్టుల్లో బీర్లు తయారు చేసేలా కసరత్తు

సాక్షి, హైదరాబాద్: మార్కెట్‌లో బీర్ల కొరత రాకుండా ఉండేలా ఎక్సైజ్‌శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం డిపోల్లో ఉన్న స్టాక్‌ను జాగ్రత్తగా ఉపయోగించుకుంటూనే, వీలైనంత త్వరగా మిగిలిన బ్రాండ్ల బీర్లను మార్కెట్లోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతమున్న స్టాక్, రోజువారీ బీర్ల వినియోగాన్ని బట్టి మరో వారం రోజుల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రస్తుతానికి డిపోల్లో రేషన్ విధానం అమలు చేస్తున్నారు. వైన్‌షాప్ యజమానులు పెట్టిన ఇండెంట్, డిపోల్లో అందుబాటులో ఉన్న స్టాకును బట్టి అన్ని వైన్‌షాపులకు బీర్లు అందేలా చర్యలు చేపడుతున్నారు. మద్యం సరఫరా చేసేందుకు ఆసక్తి ఉన్న కంపెనీలను ఆహ్వానించాలని ఇటీవల సీఎం రేవంత్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కొత్త బ్రాండ్లు సరఫరా చేసేందుకు ఎవరైనా ముందుకొస్తే వారికి వెంటనే అనుమతులిచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

తయారీ సామర్థ్యం, మార్కెట్ రిసీవింగ్ ?

వాస్తవానికి రాష్ట్రంలో రోజుకు లక్ష నుంచి 1.25 లక్షల కేసుల వరకు బీర్లు అమ్ముడు అవుతాయి. ప్రస్తుతం చలికాలం కావడంతో బీర్ల డిమాండ్ తక్కువగానే ఉంది. అయితే రాష్ట్రంలో అమ్ముడయ్యే బీర్లలో 70 శాతం మేరకు కింగ్‌ఫిషర్ బీర్లే కావడం గమనార్హం. ఇప్పుడు కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలు ఏంటన్న దానిపై ఎక్సైజ్‌శాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో బీర్లు తయారు చేసే ఆరు బ్రేవరీస్‌లలో యూబీ(కింగ్‌ఫిషర్)కి చెందిన రెండు యూనిట్లు పనిచేయడం లేదు. మిగిలిన నాలుగు యూనిట్లు ఇతర కంపెనీల బ్రాండ్లను తయారు చేస్తున్నాయి. ప్రస్తుతం సరఫరా నిలిచిపోయిన కింగ్‌ఫిషర్ బీర్ల స్థానంలో ఆ నాలుగు యూనిట్ల ద్వారా ఇతర బ్రాండ్ల బీర్లను అదనంగా ఉత్పత్తి చేసే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా ఆ యూనిట్లలో రెండు షిఫ్ట్‌ల్లో పనిచేసే విధంగా అనుమతిచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయి. రెండు షిఫ్టుల్లో ఆ నాలుగు యూనిట్లు పని చేయించడం ద్వారా వచ్చే అదనపు బీర్లను మార్కెట్లోకి తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే, కింగ్‌ఫిషర్ స్థానంలో ఇతర బీర్లను మందుబాబులు ఇష్టపడతారా లేదా అన్న చర్చ కూడా ఎక్సైజ్ వర్గాల్లో జరుగుతోంది. అయితే గతంలో మార్కెట్లో లీడర్స్‌గా ఉన్న బ్రాండ్లు కొన్ని మన రాష్ట్రంలో తయారవుతున్నాయి. ఆయా బ్రాండ్లు కొన్ని కింగ్‌ఫిషర్ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం ఉంటుందని, ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా అదనపు బీర్ల ఉత్పత్తిని ప్రారంభించడం, కొత్త సరఫరాదారులకు అనుమతి ఇవ్వడం అనే అంశాలపై దృష్టి పెట్టి ఎక్సైజ్ శాఖ ముందుకెళుతోంది.

కాల్పులు జరిపి.. భారీగా నగదు కొల్లగొట్టి..



బీదర్ కాల్పుల్లో మరణించిన వెంకటేశం, శివ


హైదరాబాద్ కాల్పుల్లో గాయపడిన జహంగీర్


బీదర్‌లో నగదుతో ఉడాయిస్తున్న దుండగులు



రోషన్ ట్రావెల్స్ వద్ద పోలీసులు

తొలుత బీదర్‌లో ఏటీఎం వద్ద.. ఆపై హైదరాబాద్‌లో దొంగల కలకలం

బీదర్‌లో దుండగుల కాల్పుల్లో ఇద్దరు మృతి

హైదరాబాద్ మీదుగా రాయ్‌పూర్ వెళ్లే ప్రయత్నం

అఫ్జల్‌గంజ్‌లో బ్యాగు తనిఖీ చేస్తుండగా బస్సు సిబ్బందిపై కాల్పులు

నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

సినీఫక్కీలో ఘటన

సాక్షి, హైదరాబాద్/జహీరాబాద్ టౌన్: రాష్ట్ర సరిహద్దు కర్ణాటకలోని బీదర్‌లో, అనంతరం హైదరాబాద్‌లో గురువారం దుండగులు కలకలం సృష్టించారు. ఉదయం బీదర్‌లో ఇద్దరిని చంపి, సినీఫక్కీలో రూ.93 లక్షల దోపిడీకి పాల్పడిన దుండగులు సాయంత్రం హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్‌కు చేరుకున్నారు. ఇక్కడ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వెళ్లేందుకు ప్రయత్నించారు. తమ వద్ద ఉన్న డబ్బును చూసి ప్రశ్నించిన ట్రావెల్స్ సిబ్బందిపై కాల్పులు జరిపి పారిపోయారు. ఈ దోపిడీ దొంగల కోసం హైదరాబాద్, కర్ణాటక పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

బీదర్‌లో కాల్పులు జరిపి...

గురువారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో బీదర్‌లోని శివాజీ సర్కిల్ వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఎస్‌బీఐ ఏటీఎంల్లో నగదు నింపే సీఎంఎస్ సంస్థకు చెందిన వాహనంపై ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సెక్యూరిటీ గార్డు, సీఎంఎస్ ఉద్యోగులు గిరి వెంకటేశం, శివ కాశీనాథ్ మరణించారు. అనంతరం దుండగులు పారిపోతూ డబ్బు పెట్టెను బైక్‌పై పెడుతున్న క్రమంలో అది పలుమార్లు కిందపడింది. ఆ సమయంలో అందులో నుంచి రూ.5 నుంచి 7 లక్షల వరకు నగదు కిందపడింది. ఆ డబ్బులను అక్కడే వదిలేసి సుమారు రూ.93 లక్షలు తీసుకొని బైక్‌పై పారిపోయారు. సాయంత్రం 6 గంటల సమయానికి ఈ ఇద్దరు దొంగలూ హైదరాబాద్‌లోని అఫ్జల్‌గంజ్‌కు చేరుకున్నారు. సిటీ బస్టాప్‌లోఉన్న రోషన్ ట్రావెల్స్ నుంచి రాత్రి బస్సులో రాయ్‌పూర్ వెళ్లడానికి అమిత్‌కుమార్ పేరుతో టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. రాయ్‌పూర్ వెళ్లే ట్రావెల్స్ బస్సులను గౌలిగూడ ప్రాంతంలో మూసీ ఒడ్డున పార్క్ చేసి ఉంచుతారు. నగరంలో ప్రైవేట్ బస్సుల కదలికలు రాత్రి 10 గంటల తర్వాతే మొదలవుతాయి. ఈలోపు ఆయా ట్రావెల్స్ వద్ద ఉన్న ప్రయాణికులను నిర్వాహకులు చిన్న చిన్న బస్సుల్లో ఎక్కించుకుని గౌలిగూడలోని ట్రావెల్స్ బస్సుల వద్దకు చేరుస్తారు. ప్రయాణికులు చిన్న బస్సులో ఎక్కే ముందు వారి లగేజీని తనిఖీ చేస్తారు. కాగా, బీదర్‌కు చెందిన ఇద్దరు పోలీసులు సైతం రోషన్ ట్రావెల్స్ వద్ద ఉన్నారు. వివిధ పోలీసుస్టేషన్లలో నమోదైన నాన్–బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేయడానికి వీళ్లు బుధవారం హైదరాబాద్‌కు వచ్చారు. నగరంలో పని పూర్తి చేసుకున్న ఇద్దరూ రోషన్ ట్రావెల్స్ నుంచి రాయ్‌పూర్ వెళ్లడానికి గురువారం రాత్రి టికెట్లు బుక్ చేసుకున్నారు. వీళ్లూ యాదృచ్ఛికంగా దుండగులు ప్రయాణించే బస్సులోనే ఉన్నారు. బస్సు సిబ్బంది బీదర్ పోలీసులతో మాట్లాడుతుండటాన్ని గమనించిన దుండగులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో దుండగుల వద్ద ఉన్న రెండు బ్యాగుల్ని ట్రావెల్స్ ఇన్‌చార్జ్ సయ్యద్ జహంగీర్ రాత్రి 7.15 గంటల ప్రాంతంలో తనిఖీ చేసే యత్నం చేశారు. దుండగులు ప్రతిఘటిస్తున్నప్పటికీ జహంగీర్ ఓ బ్యాగును తెరిచి చూసి అందులో నగదు ఉన్నట్లు గుర్తించారు. దీంతో దుండగులు తమ వద్ద ఉన్న తుపాకీతో జహంగీర్‌పై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. బ్యాగులతో బయటకు పరిగెత్తుకొచ్చిన దుండగులు సిద్ధి అంబర్‌బజార్ మీదుగా నాంపల్లి వైపు పారిపోయారు. బీదర్‌లో జరిగిన ఉదంతంపై సమాచారం ఉండటం, నగదు బ్యాగ్‌లతో ఉన్న ఇద్దరు దుండగులు ఇక్కడ కూడా కాల్పులు జరపడంతో బీదర్ పోలీసులు కూడా దుండగులను పట్టుకోవడానికి యత్నించారు. వారు కొద్దిదూరం వెంటాడినా ట్రాఫిక్ కారణంగా పట్టుకోలేకపోయారు. స్వల్ప గాయాలైన జహంగీర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది.

పలు బృందాలతో గాలింపు

అఫ్జల్‌గంజ్ ఉదంతంపై సమాచారం అందుకున్న హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. శాంతిభద్రతల విభాగం, సీసీఎస్‌లతోపాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగాయి. అఫ్జల్‌గంజ్ నుంచి నాంపల్లి వరకు ఉన్న మార్గంలోని సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను విశ్లేషిస్తూ నిందితుల కోసం గాలిస్తున్నాయి. ఈ కాల్పులపై అఫ్జల్‌గంజ్ ఠాణాలో కేసు నమోదైంది. దుండగుల రూపురేఖలు, వ్యవహారశైలి తదితరాలపై బీదర్ పోలీసులతో చర్చించిన హైదరాబాద్ పోలీసులు ఇద్దరూ బీదర్‌లో దోపిడీకి పాల్పడిన వారిగా నిర్ధారణకు వచ్చారు. బీదర్‌లో, అఫ్జల్‌గంజ్‌లో లభించిన తూటాల క్యాట్రిడ్జ్‌లు కూడా ఒకే క్యాలిబర్‌గా నిర్ధారించారు.

ఫిబ్రవరిలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్

అధికారులు తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దు : మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ విభాగం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. తాగు నీటి విషయంలో వేసవి సన్నద్ధతలో భాగంగా గ్రామస్థాయిలో అన్ని కనెక్షన్లను మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ సిబ్బంది పరీక్షించనున్నారు. ఇందులో భాగంగా లీకేజీలు, తాగునీరు కలుషితం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా స్థానిక జలవనరులను సద్వినియోగం చేసుకునే విధంగా వీలున్న గ్రామాల్లో ప్రణాళికలు సిద్ధం చేస్తారు. గురువారం మిషన్ భగీరథ కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. 'అధికారులు ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దు' అని హెచ్చరించారు. 'మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దు. అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయండి' అని చెప్పారు. 'పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. రూ.300 కోట్ల జాతీయ ఉపాధిహామీ బిల్లులను బుధవారం విడుదల చేశాం' అని చెప్పారు.

సెక్షన్–3 ప్రకారమే..

▶ మొదటి పేజీ తరువాయి


ట్రిబ్యునల్ కార్యాలయం వద్ద ఏజీ, అధికారులతో మంత్రి ఉత్తమ్

ట్రిబ్యునల్‌లో ఇక విచారణను ప్రారంభించాల్సి ఉండగా, ఐఎస్‌డబ్ల్యూడీఏ చట్టంలోని సెక్షన్–3 కింద కేంద్రం అదనపు రెఫరెన్స్ జారీ చేసింది. దీంతో పాటు సెక్షన్–89 కింద కేంద్రం చేసిన రిఫరెన్స్ కూడా విచారణకు సిద్ధంగా ఉండగా, రెండింటినీ కలిపి విచారణ జరపాలని కోరుతూ తెలంగాణ ఐఏ దాఖలు చేసింది. దీనిపై ఏపీ అభ్యంతరం తెలిపింది. మరోవైపు సెక్షన్–3 కింద కేంద్రం జారీ చేసిన అదనపు రెఫరెన్స్‌ను సవాలు చేస్తూ ఏపీ సుప్రీం కోర్టులో వేసిన రిట్ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. అదనపు రెఫరెన్స్‌పై స్టే విధించాలని ఏపీ కోరగా, తమ తుది తీర్పునకు లోబడి ట్రిబ్యునల్ విచారణలో పాల్గొనవచ్చని ఆ రాష్ట్రానికి సుప్రీంకోర్టు సూచించింది. కాగా కేంద్రం జారీ చేసిన రెండు రెఫరెన్స్‌ల్లో కొన్ని అంశాలు ఒకేలా ఉండగా, మరికొన్ని అంశాలు లేవు. రెండు రిఫరెన్స్‌లను కలిపి విచారించి తాము ఒకే తీర్పు జారీ చేస్తే భవిష్యత్తులో సుప్రీంకోర్టులో ఏపీకి అనుకూలంగా తుది తీర్పు వస్తే ఇబ్బందులొస్తాయని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తాజాగా అభిప్రాయపడింది. అదే జరిగితే తమ తీర్పులోని నిర్ణయాలు, నిర్ధారణకు వచ్చిన అంశాలను రెండు రెఫరెన్స్‌ల వారీగా విభజించడం ఇబ్బందికరంగా మారుతుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే రెండు రెఫరెన్స్‌లను కలిపి విచారించడం కంటే వేర్వేరుగా విచారించడమే మేలని తేల్చి చెప్పింది.

తొలుత రెండో రిఫరెన్స్‌పై విచారణే సమంజసం

తొలుత ఏ రెఫరెన్స్‌పై విచారణ జరపాలన్న ప్రశ్న తలెత్తింది. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి జారీ చేసిన రెండో రెఫరెన్స్‌పై తొలుత విచారణ నిర్వహించడమే సమంజసమని ట్రిబ్యునల్ అభిప్రాయపడింది. 'ప్రాజెక్టుల వారీ'గా నీటి కేటాయింపులు జరపాలంటూ మొదటి రెఫరెన్స్‌లో ఉన్న అంశంతో పాటు మరికొన్ని ఇతర అంశాలతో రెండో రెఫరెన్స్‌కు సంబంధం ఉండడమే దీనికి కారణమని స్పష్టం చేసింది. అయితే మొదటి రెఫరెన్స్ కింద నిర్వహించిన సాక్షుల క్రాస్ ఎగ్జామినేషన్‌ను రెండో రెఫరెన్స్‌పై విచారణ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవడానికి ట్రిబ్యునల్ అంగీకరించింది. అయితే, రెండో రెఫరెన్స్ కింద నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌ను మొదటి రెఫరెన్స్ కింద పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టం చేసింది. ఇక ఆయా డాక్యుమెంట్లను పరిగణనలోకి తీసుకోవాలా? వద్దా? అనే అంశంపై విచారణ సమయంలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. రెండు రెఫరెన్స్‌ల కింద ఏపీ, తెలంగాణ దాఖలు చేసిన అభ్యర్థనలు, సాక్ష్యాలు, డాక్యుమెంట్లను రెండు రెఫరెన్స్‌లకు ఉమ్మడి రికార్డులుగా పరిగణించాలని తెలంగాణ తన ఐఏలో కోరడంతో ట్రిబ్యునల్ ఈ మిశ్రమ నిర్ణయం తీసుకుంది. తదుపరి విచారణను ఫిబ్రవరి 19 నుంచి 21 మధ్య నిర్వహిస్తామని తెలిపింది.

సెక్షన్- 89 ఏమిటి?

ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్-89లోని క్లాజు(ఏ) కింద బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గడువును కేంద్రం పొడిగించింది. గతంలో రాష్ట్రాల్లోని 'ప్రాజెక్టుల వారీ'గా నిర్దిష్ట కేటాయింపులు జరిగి ఉండకపోతే ఇప్పుడు జరపాలని ఇందులో (తొలి రెఫరెన్స్) ట్రిబ్యునల్‌ను కోరింది. నీటి లభ్యత లేని సమయాల్లో ప్రాజెక్టుల వారీగా నీటి విడుదల విషయంలో అమలు చేయాల్సిన అపరేషన్స్ ప్రోటోకాల్స్‌ను సిద్ధం చేయాలని క్లాజు(బీ) కింద సూచించింది. 'ప్రాజెక్టుల వారీ'గా అని సెక్షన్ 89 ఉండగా, అందులో ఏ ప్రాజెక్టు లొస్తాయన్న అంశంపై స్పష్టత కొరవడింది.


సెక్షన్ -3 ఏమిటి?

తెలంగాణ విజ్ఞప్తి మేరకు ఐఎస్‌డబ్ల్యూడీఏ–1956లోని సెక్షన్–3 కింద జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్‌కు అదనపు రెఫరెన్స్ (మరిన్ని విధివిధానాలను) జారీ చేస్తూ 2023 అక్టోబర్ 6న కేంద్ర జలశక్తి శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్మాణం పూర్తైన ప్రాజెక్టులతో పాటు నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదన దశలోని ప్రాజెక్టులకు సైతం ప్రాజెక్టుల వారీగా కృష్ణా జలాలను పంపిణీ చేయాలని ఇందులో కేంద్రం ఆదేశించింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్–89లోని క్లాజులు 89(ఏ), 89(బీ)లోని 'ప్రాజెక్టుల వారీగా' అనే పదానికి ఈ మేరకు విస్తృత అర్థాన్నిస్తూ గజిట్ నోటిఫికేషన్‌లో నిబంధన చేర్చింది. ఉమ్మడి ఏపీకి 75 శాతం నీటి లభ్యత ఆధారంగా కృష్ణా ట్రిబ్యునల్–1 గంపగుత్తగా 811 టీఎంసీలను కేటాయించగా, 65 శాతం లభ్యతతో 1005 టీఎంసీలను కృష్ణా ట్రిబ్యునల్–2 కేటాయించింది. ట్రిబ్యునల్ కేటాయించిన నీళ్లతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నాగార్జునసాగర్ ఎగువన లభ్యతలోకి వచ్చిన కృష్ణా జలాలను కలిపి రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాలని అదనపు రిఫరెన్స్‌లో కేంద్రం ఆదేశించింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తే, దానికి ప్రతిగా నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవడానికి గతంలో బచావత్ ట్రిబ్యునల్ వెసులుబాటు కల్పించింది. ఈ 80 టీఎంసీల్లో ఏ రాష్ట్రం వాడుకోని 45 టీఎంసీలను రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాల్సి ఉంది. ఈ 45 టీఎంసీలకు 1005 టీంఎసీలను కలిపి మొత్తం 1050 టీఎంసీలను సెక్షన్–3 కింద కృష్ణా ట్రిబ్యునల్–2 రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉంది. తాజాగా సెక్షన్–3 కిందే తొలుత విచారణ జరపాలని ట్రిబ్యునల్ భావించడంతో తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం వచ్చినట్లైంది. తెలంగాణలో ప్రతిపాదన/నిర్మాణం దశలోని పాలమూరు–రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్ఎల్బీసీ, నారాయణపేట–కొడంగల్ వంటి ప్రాజెక్టులకు సైతం నీళ్ల కేటాయించే అంశాన్ని ట్రిబ్యునల్ పరిశీలించడానికి వీలు కలిగింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 17-1-2025

వయసు పై బడడం అంటే కలల దారులు మూసివేయడం కాదు. గంభీర ఏకాంతవాసం కాదు. క్షణక్షణం ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవడం. 'వయసు పై బడింది' అని ఎప్పుడూ భారంగా అనుకోలేదు ఈ మహిళలు. 'ఈ వయసులో ఆటలేమిటీ!' అనే నిట్టూర్పు వారి నోటి నుంచి ఎప్పుడూ వినిపించలేదు. వెటరన్ అథ్లెట్స్‌లో సత్తా చాటుతూ నిత్యోత్సాహానికి నిలువెత్తు చిరునామాగా నిలుస్తున్నారు...


ఎల్. శిరీషా రెడ్డి


ఎం. లక్ష్మి



వి. విజయ


ఏనుగుల కోటేశ్వరమ్మ

వెటరన్... ఆపేదేలేదు!

ఇటీవల గుంటూరులో ఏపీ మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 6వ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో... రేస్ వాక్ విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకున్న శిరీషారెడ్డి, షాట్‌పుట్, జావెలిన్ త్రో, జంప్స్‌లో మూడు బంగారు పతకాలు గెలుచుకున్న ఎం.లక్ష్మి, పరుగులో మూడు బంగారు పతకాలు సాధించిన వి. విజయ... ఆత్మవిశ్వాసం, నిత్యోత్సాహం మూర్తీభవించిన మహిళలు.

గుంటూరుకు చెందిన విజయకు పదిహేనేళ్ల క్రితం భర్త చనిపోయాడు. ఇద్దరు కుమార్తెలలో ఒకరు దివ్యాంగురాలు. ఇళ్లలో పనిచేస్తూ, ఇంటి ముందు టిఫిన్ బండి పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం తాను పనిచేసే ఇంటి యజమాని కుమార్తె కోసం మైదానంలో అడుగుపెట్టింది. ఒక జిమ్ ట్రైనర్ సూచన ప్రకారం వెటరన్ అథ్లెటిక్స్ కోసం సాధన ప్రారంభించింది. పతకాలు సాధించడం ఇప్పుడామెకు పరిపాటిగా మారింది.

క్యాన్సర్ బారిన పడినప్పుడు 'ఇక నా పని అయిపోయింది' అని నిరాశలోకి వెళ్లిపోలేదు శిరీష. ఆ మనోధైర్యానికి కారణం...క్రీడా స్ఫూర్తి. నెల్లూరు చెందిన 71 ఏళ్ల శిరీషా రెడ్డికి ఆటల్లో గెలవడం వల్ల వచ్చినవి పతకాలు మాత్రమే కాదు. అంతకంటే విలువైన ఆత్మవిశ్వాసం తాలూకు శక్తులు!

విశాఖపట్టణానికి చెందిన 86 ఏళ్ల లక్ష్మి వయసు పాతికేళ్ల దగ్గరే ఆగిపోవడానికి కారణం ఆటలు! 'ఆటలు ఆనందాన్నే కాదు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి' అంటున్న లక్ష్మి ఆరోగ్య రహస్యం... క్రమశిక్షణ. ఆ ఉక్కు క్రమశిక్షణకు మూలం... ఆటలు.

'విరమణ అనేది ఉద్యోగానికే. ఆటలకు కాదు' అంటున్న నెల్లూరు జిల్లా కావలికి చెందిన 76 సంవత్సరాల కోటేశ్వరమ్మ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు గెలుచుకుంటోంది.

వెటరన్ అంటే మాటలు కాదు... గెలుపు దారిలో విరామం లేకుండా ఉత్సాహమే శక్తిగా పరుగులు తీయడమే అని చెప్పడానికి ఈ వెటరన్ అథ్లెట్లు తిరుగులేని ఉదాహరణ.

– మురమళ్ళ శ్రీనివాసరావు, సాక్షి, గుంటూరు

– కె.ఎస్., సాక్షి, కావలి, నెల్లూరు జిల్లా

క్యాన్సర్ నుంచి బయటపడి...



గత 35 ఏళ్ళ నుండి క్రీడాసాధన చేస్తున్నాను. 2011లో క్యాన్సర్ సోకింది. కొంత కాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాను. మొండి ధైర్యంతో దానిని సులభంగా జయించాను. 2021లో కాలు ఫ్రాక్చర్ అయ్యింది. ఆటలు ఆడడం కష్టమయ్యింది. అయినా వెనకడుగు వేయలేదు. ఏడు పదుల వయసులో ఎన్నో జాతీయ స్థాయి పతకాలు సాధించాను.

– ఎల్. శిరీషా రెడ్డి, నెల్లూరు

కావాలి... ఇలాంటి శక్తి

అంతర్జాతీయ వెటరన్ క్రీడాకారిణిగా రాణిస్తున్న నెల్లూరు జిల్లా కావలి పట్టణానికి చెందిన ఏనుగుల కోటేశ్వరమ్మ వయస్సు 76 ఏళ్లు. అయినా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అసమాన క్రీడా నైపుణ్యాన్ని ఆమె ప్రదర్శిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో 125, జాతీయ స్థాయిలో 115, అంతర్జాతీయ స్థాయిలో 17 పతకాలు సాధించింది. కావలిలోని జవహర్ భారతి కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించింది. పదవీ విరమణ చేసినప్పటికీ ఆటలపై ఆసక్తితో పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటూ విజేతగా నిలుస్తోంది. లక్షల రూపాయలు ఖర్చు అయ్యే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనడానికి తనకు వచ్చే పింఛన్ నగదును దాచుకొని వాటితో క్రీడాపోటీల్లో పాల్గొంటోంది.

ఆటలే ఆరోగ్యం... మహాభాగ్యం



సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియా, శ్రీలంక, జపాన్‌లలో బంగారు పతకాలు సాధించినప్పటికీ, స్వీడన్‌లో సాధించిన కాంస్య పతకం సంతోషాన్ని ఇచ్చింది. ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారులతో పోటీ పడి అన్నిరకాల ఫ్రీ పోటీల్లో విజేతగా నిలవడంతో చివరి పోటీల్లో పాల్గొనే అర్హత రావడమే చాలా గొప్ప విషయం. రోజూ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేస్తూనే ఉంటా. అందువల్లనే ఆరోగ్య సమస్యలు లేకుండా హుషారుగా ఉంటాను.

– ఏనుగుల కోటేశ్వరమ్మ

కష్టాల్లోనూ నవ్వడం నేర్చుకున్నా



ఆరు పదుల వయసు దాటినా కష్టాలు మాత్రం వెన్నంటే ఉంటున్నాయి. అందుకే అవి చుట్టుముట్టినప్పుడల్లా నవ్వుతోనే ఎదుర్కొంటాను. ఆ నవ్వుకు కారణం ఆటలు. పదకొండు అంతర్జాతీయ వెటరన్స్ పోటీల్లో మూడు బంగారు పతకాలతో సహా మొత్తం పదకొండు పతకాలు సాధించాను. గుంటూరులో జరిగిన పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించాను. ఊపిరి ఉన్నంత వరకు పోటీల్లో పాల్గొంటాను.

– వి.విజయ, గుంటూరు

86 = ఎనర్జిటిక్



ఉదయించే సూర్యుడు అస్తమించే వరకు తన విధి నిర్వర్తిస్తాడు. పుట్టుకకు, మరణానికి మధ్యలో ఉండే జీవితాన్ని సంతోషంగా, ఆరోగ్యంగా నడిపించాలనేది నా సిద్ధాంతం. నేను పూర్తి శాకాహారిని. ఎక్కడ పోటీలున్నా ఒంటరిగానే వెళతాను. క్రమశిక్షణకు ప్రాణం ఇస్తాను.

– ఎం.లక్ష్మి, 86, విశాఖపట్నం

సమ్‌థింగ్ స్పెషల్

అంబరాన మహాకుంభ సంబరం

ఆకాశం అంటే అనంతం... అనంతమైన భక్తి కూడా ఆకాశం లాంటిదే. తనలోని అనంతమైన భక్తిని ఆకాశ వేదికగా చాటింది ఇరవై నాలుగు సంవత్సరాల అనామికాశర్మ...


అనామికాశర్మ

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన స్కైడైవర్ అనామికా శర్మ బ్యాంకాక్ మీదుగా 13 వేల అడుగుల ఎత్తులో మహాకుంభ్ అధికారిక జెండాను ఎగరేసి చరిత్ర సృష్టించింది. అనామిక డేరింగ్ ఫీట్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. విమానం ఎక్కే ముందు ఆత్మవిశ్వాసంతో మహాకుంభ్ జెండాను అనామిక పట్టుకున్న దృశ్యాలు వైరల్ వీడియోలో ఉన్నాయి. అనామిక విమానం నుండి దూకడం, జెండా ఎగరవేస్తూ 'మహా కుంభ్ 2025'కు ప్రపంచానికి స్వాగతం పలికే దృశ్యాలు, బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపించే కుంభమేళ పాట అబ్బురపరుస్తాయి.

'ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సమ్మేళనమైన మహాకుంభ్ 2025కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలను ఆహ్వానిస్తున్నాను' అని అనామిక శర్మ ఈ వీడియోకు క్యాప్షన్ ఇచ్చింది.

ఈ వీడియోనే చూస్తూ నెటిజనులు అనామికను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

వాటిలో కొన్ని...

'అపూర్వ సాహసం, భక్తిభావం మేళవించిన దృశ్యం'

'మన సంస్కృతిని మరింత ఎత్తుకు తీసుకెళ్లారు'

'ఇది స్టంట్ కాదు. ప్రపంచానికి అందించిన శక్తిమంతమైన సందేశం'

అనామిక తండ్రి మాజీ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్. తండ్రి ఒడిలో సాహసాల ఓనమాలు నేర్చుకున్న అనామికకు ధైర్యంగా ముందుకు దూసుకెళ్లడమే తెలుసు. తాజా ఫీట్‌తో తన సాహసాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకువెళ్లింది.

'వీడియోను చూసి చాలామంది... మీకు భయంగా అనిపించలేదా అని అడిగారు. నిజం చెప్పాలంటే భక్తి భావంతో నాకు భయం కలగలేదు. ఒకటికి పదిసార్లు మనసులో మేరా భారత్ మహాన్ అనుకున్నాను' అంటోంది అనామిక.

పవిత్ర క్షేత్రమైన ప్రయాగ్‌రాజ్‌కు చెందిన అనామిక మన సంస్కృతి, సంప్రదాయాలను వింటూ పెరిగింది. 'మన సంస్కృతిలోని గొప్పదనం ఏమిటంటే, ఒక మంచి పని కోసం అందరూ ముందుకు వస్తారు. నేనేమిటి? నా స్థాయి ఏమిటి అని ఎప్పుడూ ఆలోచించరు. రామాయణంలో ఉడుత కథ దీనికి ఉదాహరణ. భరతమాత బిడ్డను అని చెప్పడానికి నేను చాలా గర్వపడతాను' అంటుంది అనామిక.

భవిష్యత్‌లో మరెన్నో సాహసాలు చేయడానికి సిద్ధం అవుతున్న అనామిక ట్రైన్‌డ్ స్కూబా డైవర్ కూడా.

మన దేశంలో 'స్కై సి లైసెన్స్' ఉన్న యంగెస్ట్ ఫీమేల్ స్కైడైవర్‌గా కూడా తన ప్రత్యేకతను చాటుకుంది.

హెల్దీ డైట్

చియా కర్డ్ పుడ్డింగ్



కావలసినవి: చియా సీడ్స్ (నల్ల గసగసాలు) – 4 టేబుల్ స్పూన్లు (రెండు గంటల సేపు నానబెట్టాలి); క్యారట్ తురుము – పావు కప్పు; బీట్ రూట్ తురుము– పావు కప్పు; కీరకాయ తురుము – పావు కప్పు; పెరుగు – కప్పు; పచ్చిమిర్చి – 2 (నిలువుగా తరగాలి); దానిమ్మ గింజలు – పావు కప్పు; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఇంగువ – చిటికెడు; తరిగిన కొత్తిమీర – టేబుల్ స్పూన్;

పోపు కోసం...: నెయ్యి– టీ స్పూన్; ఎండుమిర్చి– 2; కరివేపాకు – 2 రెమ్మలు; పచ్చి శనగపప్పు – గుప్పెడు; వేరుశనగపప్పు – గుప్పెడు.

తయారీ: ● ఒక పాత్రలో నానబెట్టిన చియా సీడ్స్, పెరుగు, ఉప్పు, ఇంగువ, పచ్చిమిర్చి, క్యారట్ , బీట్‌రూట్, కీరకాయ తురుము వేసి బాగా కలపాలి. ● ఒక బాణలిలో నెయ్యి వేడి చేసి అందులోఎండు మిర్చి, పచ్చిశనగపప్పు, వేరుశనగపప్పు వేయించి కరివేపాకు వేసి దించేయాలి. ఈ పోపును పెరుగు మిశ్రమంలో కలపాలి. చివరగా దానిమ్మ గింజలు, కొత్తిమీర చల్లి వడ్డించాలి.


డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పోషకాలు:

మ్యాక్రో న్యూట్రియెంట్స్:
- కేలరీలు – 230;
- ప్రొటీన్ – 8 గ్రాములు;
- కార్బోహైడ్రేట్‌లు – 20 గ్రాములు;
- ఫైబర్– 7 గ్రాములు;
- చక్కెర – 6 గ్రాములు;
- ఫ్యాట్ – 12 గ్రాములు;
- సాచ్యురేటెడ్ ఫ్యాట్ – 3 గ్రాములు;

మైక్రో న్యూట్రియెంట్స్:
- క్యాల్షియమ్– 280 మిల్లీగ్రాములు;
- ఐరన్– 2.5 మిల్లీగ్రాములు;
- మెగ్నీషియమ్– 90 మిల్లీగ్రాములు;
- పొటాషియమ్– 450 మిల్లీగ్రాములు;
- విటమిన్ సి– 8– 1– మిల్లీగ్రాములు;
- విటమిన్ ఏ – 350 మైక్రోగ్రాములు;
- ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్‌లు – 3–4 గ్రాములు

శారీ స్నీకర్స్

రెట్రో స్టైల్ ఎప్పుడూ బెస్ట్‌గా మార్కులు కొట్టేస్తూ ఉంటుంది. ఫుట్‌వేర్‌లోనూ కంఫర్ట్ మిస్ కాకుండా కలర్‌ఫుల్‌గా ఆకట్టుకుంటుంది. జిమ్, ఆఫీస్, క్యాజువల్ వేర్‌గా పేరున్న స్నీకర్స్ ఈ ఏడాది ఫుట్‌వేర్ ట్రెండ్‌లో ముందుండబోతున్నాయి. మెన్ అండ్ ఉమెన్ ఇద్దరూ కోరుకునే ఈ స్నీకర్స్ బ్రైడల్ వేర్‌గానూ పర్‌ఫెక్ట్ ఛాయిస్‌గానూ నిలుస్తున్నాయి.



తమ ప్రత్యేక రోజును మరింత చిరస్మరణీయంగా మార్చుకోవాలనుకునే వధువులకు స్నీకర్స్ సరైన ఎంపిక అవుతున్నాయి. ఈ స్టైలిష్ కిక్స్ సంప్రదాయ హైహీల్స్‌కు సౌకర్యవంతమైన, ఫ్యాషన్‌ని అందిస్తున్నాయి.

పెళ్లి వేడుక అనగానే సంగీత్, రిసెప్షన్ హంగామాలు కళ్లముందు కదలాడతాయి. హుషారెత్తించే డ్యాన్సులు, డీజే సాంగ్స్‌తో యువత ఆటాపాటల్లో మునిగితేలుతుంటారు. వీరి స్పీడ్ చిందులకు స్నీకర్స్ బెస్ట్ ఎంపిక. కాక్‌టెయిల్ పార్టీకి సంగీత్‌కి జిగేల్మనిపించే డ్రెస్సులే కాదు వాటికి పోటీగా నిలిచే హ్యాండ్‌క్రాఫ్టెడ్ స్నీకర్స్ కలర్‌ఫుల్‌గా ఆకట్టుకుంటున్నాయి.

కస్టమైజ్డ్

హీల్స్‌ను వదులుకుని ఫ్యాషన్ కంటే సౌకర్యాన్ని ఎంచుకుంటున్నారు ఈ తరం వధువులు. దీంతో ట్రెండ్‌ను తామే కొత్తగా సెట్ చేస్తున్నారు. దీంతో ఫుట్‌వేర్ నిపుణులు, డిజైనర్లు కలిసి అందరి దృష్టిని ఆకర్షించేలా స్నీకర్లు అందంగా తయారుచేస్తున్నారు. క్లాసిక్ వైట్ స్నీకర్స్‌తో కాకుండా అద్భుతమైన సాంప్రదాయ డిజైనర్ స్నీకర్లను అందిస్తున్నారు.







హీల్స్ నుంచి ఫ్లాట్

లెహెంగా స్నీకర్, శారీ స్నీకర్ .. అంటూ ఫ్యాబ్రిక్ మోడల్‌కు తగిన విధంగానే కాదు పూర్తి భిన్నమైన రంగులను ఫన్ ఇష్టపడే వధువులు ఎంచుకుంటున్నారు. హల్దీ, సంగీత్, బ్యాచిలర్ పార్టీలకు తగిన విధంగా తమ పాదరక్షలను కూడా ఎంచుకుంటున్నారు. ఎత్తున్న హీల్స్ నుంచి ఫ్లాట్‌గా ఉండే స్నీకర్స్‌ను ధరించడం వల్ల మడమల నొప్పి లేకుండా రెచ్చిపోయి డ్యాన్స్ చేయవచ్చు అనేది నవతరం ఆలోచన. వీటిలో గోటా ఎంబ్రాయిడరీ స్నీకర్స్, స్ట్రైప్ స్నీకర్స్, కాన్వాస్ స్నీకర్స్...గా అందుబాటులో ఉన్నాయి.

స్పెషల్ డిజైనింగ్‌కి ఆర్డర్

ఏ బ్రాండ్ స్నీకర్ అయినా వాటిని ప్రింటెడ్, లేస్, స్వరోస్కి, పూసలు, అద్దాలు, కుందన్స్‌తో అందంగా తీర్చిదిద్దుతున్నారు. సోషల్‌మీడియా వేదికగానూ కస్టమైజ్డ్ షూ/స్నీకర్స్ డిజైనింగ్‌కి ఆర్డర్ మీద అందంగా తయారు చేసి ఇస్తున్నారు.







ఫ్యాషన్ బ్యూటీ

డ్రెస్సుల వల్ల అలర్జీ!

చలిని తట్టుకోవడానికి ఈ సీజన్‌లో వేసే కొన్నిపనులు మేనిచర్మాన్ని దెబ్బతీసేలా ఉంటాయి. దురద, పొడిబారడంతోపాటు రకరకాల చర్మ సమస్యలు కనిపిస్తుంటాయి. వాటిలో ముఖ్యమైనవి...

ఫ్యాషన్ డ్రెస్సులు

- ఈ సీజన్‌లో చలి నుంచి రక్షణగా స్వెటర్లు, మందపాటి క్లాత్స్, షాలువా.. వంటివి ధరిస్తూ ఉంటాం. ఎక్కువ గంటలు లేదా రాత్రి మొత్తం ఇలాంటి డ్రెస్సుల్లో ఉంటే చర్మం దురద పెడుతుంది. అందుకని, పలచటి కాటన్ డ్రెస్ వేసుకోవాలి.
- కొన్ని డ్రెస్సులు వార్డ్ రోబ్‌లలో నెలల పాటు అలాగే ఉండిపోతాయి. ఈ సీజన్‌కి అవి సరైన ఎంపిక అని, వాటిని శుభ్రం చేయకుండా అలాగే వేసుకుంటే బాక్టీరియా చర్మానికి హాని చేస్తుంది. అందుకని, వార్డ్‌రోబ్ నుంచి తీశాక వెంటనే వేసుకోకుండా వాటిని ఆరుబయట గాలికి, కొద్దిపాటి ఎండకు వేసి తర్వాత ధరించాలి. కనీసం కొద్దిసేపు గాలికి ఆరవేయాలి.
- బిగుతుగా, మేని మొత్తం కవర్ చేసే దుస్తుల వల్ల బ్యాక్ యాక్నె పెరుగుతుంది. ఇలాంటప్పుడు ఎక్కువ గంటలు, బిగుతుగా ఉండే డ్రెస్సుల్లో ఉండకూడదు.
- షూ వంటివి వేసుకున్నప్పుడు వాటిలో చెమ్మ ఏర్పడుతుంది. డ్రయ్యర్‌తో షూ లోపల మొత్తం చెమ్మ లేకుండా చేసి, తర్వాత వాడుకోవాలి.

స్కిన్ కేర్ ప్రొడక్ట్స్



- ఈ కాలం చర్మం చాలా పొడిబారి ఉంటుంది. ఇలాంటప్పుడు స్క్రబ్, పీల్ చేయడం.. వంటి బ్యూటీ ట్రీట్‌మెంట్లు చేయించకూడదు. వైటెనింగ్ ప్రొడక్ట్స్ వాడటం వల్ల చర్మ రంధ్రాల్లోని సహజ తైలాలు పోయి, చర్మం నిస్తేజంగా మారుతుంది.
- చర్మం మృదువుగా ఉండటానికి రకరకాల బాడీ లోషన్స్‌కి బదులు క్రీమ్స్ వాడుకోవడం మేలు.

వేడికి హీటర్

చలి ఎక్కువ కాబట్టి టెంపరేచర్ కోసం రూమ్ హీటర్స్ వాడుతుంటారు. రాత్రి వేళ మొత్తం ఈ హీటర్స్‌లో ఉండటం వల్ల చర్మం డీ హైడ్రేట్ అయి త్వరగా పొడిబారుతుంది.

నూనె శాతం అధికంగా ఉండే అవకాడో, నట్స్.. వంటి విటమిన్ ఇ, ఎ ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల చర్మం నునుపుగా ఉంటుంది.


డాక్టర్ స్వప్నప్రియ,
క్లినికల్ డెర్మటాలజిస్ట్

● గేమింగ్

చీకటిని మింగిన సింహం



టాక్టికల్ రోల్–ప్లేయింగ్ గేమ్ 'ఫాంటమ్ బ్రేవ్: ది లాస్ట్ హీరో' ఈ నెల చివరిలో విడుదల కానుంది. 2004లో వచ్చిన 'ఫాంటమ్ బ్రేవ్'కు సీక్వెల్‌గా వస్తున్న గేమ్ ఇది. సముద్రప్రయాణంలో మరోన, యాష్‌లు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటారు. ఆ సవాళ్లను ఎలా అధిగమించారు అనేది ఈ వీడియో గేమ్ కథ.

అంతుచిక్కని రీతిలో దాడి చేసే దెయ్యాల నౌకలు, ఆఫ్రికాట్‌లాంటి దెయ్యాలు ఈ గేమ్‌లో కనిపిస్తాయి.

ఈ గేమ్‌లో ప్రధాన పాత్ర అయిన మరోన దెయ్యం అమ్మాయి ఆఫ్రీకాట్‌తో స్నేహం చేస్తుంది. ఒక లక్ష్యాన్ని ఉద్దేశించి చేసిన స్నేహం అది.

'సీక్వెల్ రావడానికి చాలా కాలం అయినా ఫాంటమ్ బ్రేవ్ క్రేజ్ ఎంతమాత్రం తగ్గలేదు' అంటున్నారు మేకర్స్. అది ఎంత నిజమో కొన్ని రోజుల్లో తెలుస్తుంది.

జానర్స్: టాక్టికల్ రోల్–ప్లేయింగ్
మోడ్: సింగిల్–ప్లేయర్ ప్లాట్
ఫామ్స్: నిన్‌టెండో స్విచ్, ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్

● మ్యూజిక్ వరల్డ్

నీడలా నీ వెంటే...



యువ తరం నోట అదే పనిగా వినిపిస్తున్న పాట....ఐ జస్ట్ వోక్ అప్ ఫ్రమ్ ఏ డ్రీమ్. ఈ సూపర్ హిట్ పాటలో కొన్ని చరణాలు...'రేపు అనేది ఎవరికీ హామీ ఇవ్వదు/నిన్నటిలాగే ఈరోజు కూడా నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను ప్రపంచం అంతం అయిపోతుంది/ ఇదే చివరిరోజు అనుకుంటూ నిన్ను ప్రేమిస్తాను భూమి మీద నా జీవితం ముగిసిన రోజు/ చిరునవ్వుతో కాసేపు నీతో మాట్లాడి చనిపోవాలనుకుంటున్నాను ఈ ప్రపంచం అంతం అయితే....నేను నీ పక్కనే ఉంటాను. నువ్వు ఎటు వెళితే అటు వస్తాను. నిన్ను రోజూ ప్రేమిస్తుంటాను....ఇదే చివరి రోజులా!' 'ఐ, ఐ జస్ట్ వోక్ అప్ ఫ్రమ్ ఏ డ్రీమ్/వేర్ యూ అండ్ ఐ హ్యాడ్ టు సే గుడ్‌బై
అండ్ ఐ డోన్ట్ నో వాంట్ ఇట్ ఆల్ మీన్స్
వేరెవర్ యూ గో, దట్స్ వేర్ ఐ విల్ ఫాలో నోబడీస్ ప్రామిస్డ్ టుమారో'....బిల్‌బోర్డ్ హాట్ 100 జాబితాలో లేడీ గాగా, బ్రూనో మార్స్‌ల 'డై విత్ ఏ స్మైల్' 17 నుంచి నెంబర్ వన్ 1కి చేరింది.

● ఇంగ్లీష్ ఇడియమ్స్

ప్లమ్ జామ్

జీతం, సౌకర్యాలు, ప్రతిష్ఠ...మొదలైన వాటిని దృష్టిలో పెట్టుకొని అత్యధికులు కోరుకునే ఉద్యోగం విషయంలో వాడే మాట...ప్లమ్ జామ్. ఉదా: ది మార్కెటింగ్ డైరెక్టర్ రోల్ ఎట్ ది టాప్ టెక్ కంపెనీ వాజ్ ఏ ప్లమ్ జాబ్ డ్యూ టు ఇట్స్ పెర్క్స్ అండ్ ఇన్నోవేటివ్ ఎన్విరాన్‌మెంట్.



బారెల్ ఆఫ్ లాఫ్స్

నవ్వు తెప్పించే సందర్భాలు, బాగా నవ్వించే వ్యక్తుల గురించి చెప్పే సమయంలో ఉపయోగించే మాట...బారెల్ ఆఫ్ లాఫ్స్. ఉదా: అవర్ ఫ్యామిలీ గేదరింగ్స్ ఆర్ ఆల్వేస్ ఏ బారియల్ ఆఫ్ లాఫ్స్. ఫిల్డ్ విత్ జోక్స్ అండ్ స్టోరీస్.

● కృషి

హీరోయిన్ల గొంతుక

సినిమా తారలకు డబ్బింగ్ చెబుతారని మనకు తెలిసిందే. సాధారణంగా మగవారికి మేల్ వాయిస్ ఆడవారికి ఫిమేల్ వాయిస్ ఆర్టిస్టులు ఉంటారు. కానీ, అమ్మాయిలకు అబ్బాయి డబ్బింగ్ చెబితే..! ఆశ్చర్యమనిపించక మానదు...


ఆద్య హనుమంత్

ఎంబీబీఎస్ చేసిన ఆద్య హనుమంత్ ఇప్పటి వరకు సమంత, సాయిపల్లవి, అవికాగోర్.. ఇలా తెలుగు, కన్నడ, మలయాళం, తమిళ సినిమా హీరోయిన్లకు డబ్బింగ్ చెప్పాడు. ఇప్పటి వరకు 175 సినిమాలలకు డబ్బింగ్ చెప్పిన ఆద్య హనుమంత్ తెలంగాణలోని మహబూబ్‌నగర్ వాసి. కర్ణాటకలోని రాయచూరులో ఉంటున్న ఆద్య హనుమంత్‌కి ఇలాంటి క్రేజీ వాయిస్ ఎలా అబ్బిందో, సినిమాలకు స్పెషల్ వాయిస్ ఆర్టిస్ట్‌గా ఎలా మారారో అతని మాటల్లోనే తెలుసుకుందాం.

నా వయసు ఇప్పుడు 22 ఏళ్లు. పదమూడేళ్ల వయసు నుంచి డబ్బింగ్ చెబుతున్నాను. స్కూల్ ఏజ్‌లో ఉన్నప్పుడు నా వాయిస్ బాగుంటుందని సీరియల్స్‌లోని చైల్డ్ ఆర్టిస్టులకు డబ్బింగ్ చెప్పించేవారు. తర్వాత్తర్వాత హీరోయిన్లకు నా వాయిస్ కనెక్ట్ అయ్యింది.

నాలుగు భాషల్లో...

సాధారణంగా ఇతర భాషల్లోని డబ్బింగ్ ఆర్టిస్టులు మన దగ్గర ఫేమస్‌గా ఉంటారు. నేను మాత్రం తెలంగాణ నుంచి తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ భాషల్లో డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా వర్క్ చేస్తున్నాను. సమంత, సాయిపల్లవి, ఐశ్వర్య, అవికా... ఇలా ప్రముఖ హీరోయిన్లందరికీ డబ్బింగ్ చెప్పాను.

ఒక పూట తిండి అయినా మానేస్తా!

నా గొంతు అమ్మాయిల మాదిరి ఉంటుందని, మరింత స్పెషల్‌గా ఉంటుందని అంతా అంటుంటారు. ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు. అదంతా దేవుడి దయ. ఇష్టమైన పని కావడంతో డబ్బింగ్, చదువు రెండింటినీ ప్రేమిస్తాను. కష్టంగా ఉన్నా ఒక పూట తిండి అయినా మానేస్తాను. కానీ, చదువుతో పాటు, డబ్బింగ్ రెండూ నాకు ప్రాణమే. ఎప్పుడు ఈ గొంతు మారిపోతుందో చెప్పలేను. కానీ, ప్రేక్షకులు ఎంత కాలం కోరుకుంటే అంత కాలం డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కొనసాగుతాను. ప్రత్యేకించి ప్రాక్టీస్ ఏమీ ఉండదు. డైలాగ్ మాడ్యులేషన్ మాత్రం పలికిస్తాను. అది అందరినీ ఆకట్టుకుంటుంది.

వెక్కిరించారు...

'ఆడపిల్లలా ఆ గొంతేంటి?' అని వేళాకోలం ఆడినవారు ఉన్నారు. మొహమ్మీదనే చులకనగా మాట్లాడిన వారూ ఉన్నారు. కానీ, మా అమ్మ ఒక సారి చెప్పింది. 'దేవుడు, నీకు మాత్రమే ఇంత ప్రత్యేకత ఎందుకిచ్చాడో గమనించు. మనం చేయాలనుకున్న పని సాధారణంగా ఉండకూడదు. ఎంత రిస్క్ అయినా ఒక్క అడుగు ముందుకే వేసి చూడు' అని చెప్పేది. ఆ మాటలు నాకు ఈ రోజు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకువస్తున్నాయి.

చాలా మంది తమ సమస్యలను నాతో చెప్పుకోవడానికి ఇష్టపడుతుండేవారు. దీంతో ఎంబీబీఎస్‌లో ఉన్నప్పుడు సైకియాట్రీ ఎంచుకోవాలనుకున్నాను. సైకియాట్రీలో పీజీ చేస్తున్నాను. మెడికల్, సినీ ఫీల్డ్‌ని రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ప్రయాణించాలనుకుంటున్నాను. శని, ఆదివారాలు డబ్బింగ్‌కి ఎంచుకుంటున్నాను. మిగతా రోజుల్లో చదువు, సంగీతానికి ప్రాధాన్యత ఇస్తాను. యూనివర్శిటీ ప్రొఫెసర్లు నాకు చాలా సపోర్ట్ చేస్తుంటారు.

వెలుగులోకి తెచ్చిన సోషల్ మీడియా...

సోషల్ మీడియా అనగానే అప్‌కమింగ్ స్టార్స్ అందరూ అక్కడే ఉంటారు. దీంతో నేనూ ఇన్‌స్టాగ్రామ్‌లో చురుకుగా ఉంటూ వచ్చాను. 'ఇట్లు మీ సీతా మహాలక్ష్మి' అనే పేజీ ప్రారంభించాను. సోషల్‌మీడియా ద్వారా ఎంతో మంది నాకు స్నేహితులయ్యారు. తెలుగు నుంచి తమిళ్, కన్నడ నుంచి తెలుగు ప్రముఖుల కవిత్వాలను అనువాదం చేస్తుంటాను. సోషల్ మీడియా ద్వారా తూర్పు గోదావరి జిల్లాలో సీతానగరంలోని ఓ కుటుంబానికి నాకు స్నేహం కుదిరింది. దీంతో సంక్రాంతి పండగకు సీతానగరం వచ్చేశాను. గోదావరి అందం, వారి పలకరింపులు, ఆప్యాయత, పిండివంటలు ఆస్వాదిస్తున్నాను.

ఎప్పటికీ వాయిస్ ఇలాగే ఉంటుంది అని చెప్పలేను. ఇప్పటికైతే చాలా ఎంజాయ్ చేస్తున్నాను. కర్నాటకలో ఉన్నా నాకు మాత్రం తెలుగు ఇండస్ట్రీనే బాగా సపోర్ట్ చేసింది. మంచి గుర్తింపు వచ్చింది'' అని చెబుతాడు ఈ ఫిమేల్ వాయిస్ ఆర్టిస్ట్.

– నిర్మలారెడ్డి

యువర్స్

● టెక్.. టాక్

వన్‌ప్లస్ 13 ఆర్



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
మెమోరీ: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16 జీబి ర్యామ్ వోఎస్: ఆండ్రాయిడ్ 15
బ్యాటరీ: 6000 ఎంఏహెచ్ రిజల్యూషన్: 1264×2780 పిక్సెల్స్

శాంసంగ్ ఏఐ స్కెచ్ టు ఇమేజ్



బొమ్మలు గీయడం ఇష్టపడేవాళ్లకు శాంసంగ్ వారి ఏఐ ఫీచర్ 'స్కెచ్ టు ఇమేజ్' ఉపయోగపడుతుంది. ఎస్ పెన్ లేదా వేలితో ఇష్టమైన బొమ్మను గీయవచ్చు. ఏమి గీయాలో ఏఐకి చెప్పడానికి టెక్స్ లేదా వాయిస్ ఉపయోగించవచ్చు. ఉదాహరణకు పిల్లి బొమ్మను స్కెచ్ చేసిన తరువాత దానికి స్పేస్ సూట్ ధరింపచేయాలని ఐడియా వస్తే 'స్పేస్ సూట్' అని టైప్ చేస్తే చాలు.

గెలాక్సీ రింగ్



సరికొత్త సైజ్ 14 మరియు 15 యుఎస్ రింగ్‌ల గురించి ప్రకటించింది శాంసంగ్. మార్పులతో వస్తున్న ఈ రింగ్ ప్రపంచవ్యాప్తంగా మరిన్ని మార్కెట్‌లలోకి అడుగుపెట్టనుంది. శాంసంగ్ హెల్త్ యాప్‌లో కొత్త గెలాక్సీ రింగ్ ఫీచర్‌లను కూడా శాంసంగ్ ప్రకటించింది. వీటిలో స్లీప్ ఎన్విరాన్‌మెంట్ రిపోర్ట్, స్లీప్ టైమ్ గైడెన్స్...మొదలైనవి ఉన్నాయి. కొత్త సైజ్ 14, 15 ఈ నెల 22 నుంచి మార్కెట్‌లోకి రానున్నాయి.

కలర్ ఆప్షన్స్: టైటానియం బ్లాక్, టైటానియం సిల్వర్, టైటానియం గోల్డ్

● ట్రెండ్

కెరీర్ క్యాట్‌ఫిషింగ్

తమ అలవాట్లు, సంప్రదాయ విరుద్ధ ధోరణులతో కార్పొరేట్ ప్రపంచంలో జెన్ జెడ్ వార్తల్లో నిలుస్తోంది. 'కెరీర్ క్యాట్‌ఫిషింగ్' అనే కొత్త ట్రెండ్‌తో హల్‌చల్ చేస్తోంది. చేరిన ఉద్యోగంలో మొదటి రోజు కనిపించనప్పుడు, సదరు ఆ వ్యక్తి ఎక్కడ ఉన్నాడో యజమానికి తెలియకపోవడాన్ని 'కెరీర్ క్యాట్‌ఫిషింగ్' అంటారు.



ఆన్‌లైన్ రెజ్యూమ్ ప్లాట్‌ఫామ్ 'సివిజెనియస్' నివేదిక ప్రకారం జెన్ జెడ్ ఉద్యోగులు జాబ్ ఆఫర్‌లను స్వీకరిస్తున్నప్పటికీ యజమానులకు తెలియజేయకుండా మొదటి రోజు హాజరు కావడంలో విఫలమవుతున్నారు. 27 ఏళ్లలోపు ఉద్యోగుల్లో ధిక్కారణ ధోరణి పెరుగుతుందని నివేదిక తెలియజేసింది.

నెలల తరబడి ఉద్యోగాల వేట, సుదీర్ఘమైన అప్లికేషన్‌లు, ఎన్నో ఇంటర్వ్యూలకు హాజరు కావడం....దీనికి సంబంధించి ఫ్రస్టేషన్స్ జెన్ జెడ్‌లో కనిపిస్తున్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన ఇరవై సంవత్సరాల రాస్పిన్‌కు 32 లక్షల(సంవత్సరానికి) జాబ్ ఆఫర్ వచ్చినా ఆఫర్‌ను తిరస్కరించడం సోషల్‌మీడియాలో సెన్సేషన్‌గా మారింది. 'ఈ జీతంతో నేను ఎలా బతకగలను? ఈ జీతంతో ఫుల్ టైమ్ ఉద్యోగమా!' అని ఆశ్చర్యపోతుంది ఆమె. ఈ ధిక్కారం ఒక తరం మార్పును నొక్కి చెబుతుంది. ఉద్యోగం లేదా జీవితం వారి అంచనాలకు అందని పరిస్థితి ఉన్నప్పుడు నిర్ద్వంద్వంగా తిరస్కరించే ధోరణి పెరగుతుంది. నచ్చని, అంచనాలకు తగని విధంగా ఉద్యోగం ఉన్నప్పుడు నిరుద్యోగిగా ఉండడానికే యువతలో ఎక్కువమంది ఇష్టపడుతున్నారు.

సాక్షి సినిమా

అదే విధి


● అజిత్

'తను నన్ను చూసినప్పుడు... యు నో దట్ మూమెంట్.. దట్ ఇమేజ్ జీవితాంతం మరువకూడదు' అంటూ త్రిష చెప్పే డైలాగ్‌తో 'పట్టుదల' మూవీ ట్రైలర్ ప్రారంభం అవుతుంది. అజిత్ కుమార్ హీరోగా రూపొందిన తమిళ చిత్రం 'విడాముయర్చి'. మగిళ్ తిరుమేని దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించారు. అర్జున్, రెజీనా, ఆరవ్, నిఖిల్ నాయర్ ఇతర పాత్రలు పోషించారు. సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 6న విడుదల కానుంది. తెలుగులో 'పట్టుదల' పేరుతో రిలీజవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ని గురువారం విడుదల చేశారు. 'అదే డెస్టినీ' (అదే విధి), 'ఐ యామ్ సో లాస్ట్', 'నాకు ఈ జనరేషన్ గురించి పెద్దగా తెలియదు కాయల్.. కానీ, మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు వాచ్ పాడైతే రిపేర్ చేయిస్తాం.. టీవీ పాడైనా రిపేర్ చేయిస్తాం.. తీసి పారేయం కదా?' అంటూ అజిత్ చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ''ఈ సినిమాలో అజిత్ కొత్త లుక్‌తో మెప్పిస్తారు. అజిత్, త్రిష మధ్య క్యూట్ కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● ప్రియా వడ్లమాని, రాజా గౌతమ్, బ్రహ్మానందం

అందుకే సినిమాలు తగ్గించాను

– బ్రహ్మానందం

''హాస్యనటుడిగా నాకు మంచి ఇమేజ్ ఉంది. దాన్ని నేను జాగ్రత్తగా కాపాడుకోవాలి. నేను చేసిన తరహా పాత్రలే మళ్లీ ఆఫర్ చేస్తున్నారు. నన్ను ఎప్పటికీ గుర్తుపెట్టుకోవాలంటే ఇలాంటి రోల్స్ రిపీట్ కాకుండా చూసుకోవాలి. చేసిన కామెడీ మళ్లీ చేస్తున్నాడన్న ఇమేజ్ వద్దనే సినిమాలు తగ్గించాను. అంతేకానీ సినిమాల్లో వేషాలు లేక కాదు, నాకు ఇవ్వక కాదు, నేను చేయలేక కాదు'' అని నటుడు బ్రహ్మానందం చెప్పారు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వంలో బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ప్రియా వడ్లమాని, ఐశ్వర్యా హోలక్కల్ హీరోయిన్లుగా నటించారు. సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పణలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో బ్రహ్మానందం మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో అందరూ గొప్పగా నటించారు. నా కామెడీ వారసత్వాన్ని కంటిన్యూ చేసే వారిలో 'వెన్నెల' కిశోర్ ఒకరు'' అని పేర్కొన్నారు. ''మా నాన్నగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఆనందంగా ఉంది'' అన్నారు రాజా గౌతమ్. ''బ్రహ్మ ఆనందం' సినిమాను బ్రహ్మానందంగారితో చేయడం మామూలు విషయం కాదు'' అని రాహుల్ యాదవ్ నక్కా చెప్పారు. ''బ్రహ్మానందంగారి కోసమే ఈ కథ రాశాను'' అని ఆర్వీఎస్ నిఖిల్ అన్నారు. ''ఈ చిత్రంలో నాకు మంచి పాత్ర ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు 'వెన్నెల' కిశోర్.

అన్నపూర్ణ స్టాఫ్‌ని ఫ్యామిలీలా భావిస్తాం

● అన్నపూర్ణ స్టూడియో 50 ఏళ్ల సందర్భంగా నాగార్జున



''రోడ్లు కూడా లేని రోజుల్లో నాన్నగారు (అక్కినేని నాగేశ్వరరావు) హైదరాబాద్ వచ్చి, ఇంత పెద్ద అన్నపూర్ణ స్టూడియోని ఎలా స్థాపించారో నాకు ఇప్పటికీ అర్థం కాదు. కానీ, ఒక్కటి మాత్రం తెలుసు... అన్నపూర్ణ స్టూడియోస్ ఎంతో మంది సాంకేతిక నిపుణులు, నూతన నటీనటులు, కొత్త డైరెక్టర్స్‌కు ఉపాధి కల్పించింది. ఎంతోమందికి ఏఎన్ఆర్ గారు స్ఫూర్తి'' అని అక్కినేని నాగార్జున అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఏర్పాటు చేసి 50 ఏళ్లయిన సందర్భంగా నాగార్జున ఓ ప్రత్యేక వీడియో విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ– ''అన్నపూర్ణ స్టూడియోస్‌కి 50వ ఏడాది మొదలైంది. ప్రతి మగాడి విజయం వెనక ఒక మహిళ ఉంటుందని నాన్నగారు నమ్మేవారు. ఆయన సక్సెస్ వెనక మా అమ్మ అన్నపూర్ణగారు ఉన్నారనేది ఆయన నమ్మకం. అందుకే ఈ స్టూడియోకి అన్నపూర్ణ స్టూడియోస్ అని పేరు పెట్టారు. ఈ స్టూడియోకి వచ్చినప్పుడల్లా అమ్మానాన్నలు ఇక్కడే ఉన్నారనిపిస్తుంటుంది. అన్నపూర్ణ స్టాఫ్‌ని మేం ఫ్యామిలీలా భావిస్తాం. స్టూడియో ఇంత కళకళలాడుతోందంటే దానికి అన్నపూర్ణ ఫ్యామిలీనే కారణం. ఈ సందర్భంగా వారికి థ్యాంక్స్. 50 ఏళ్ల క్రితం సంక్రాంతి పండక్కి అన్నపూర్ణ స్టూడియోస్ ఓపెన్ అయ్యింది. ఆ తర్వాత ప్రతి సంక్రాంతికి అమ్మానాన్నలు అన్నపూర్ణ ఫ్యామిలీతో కలసి బ్రేక్ ఫాస్ట్ చేసేవారు. ఆ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. బయట చాలా మందిని కలసినప్పుడు నాన్నగారి గురించి పాజిటివ్‌గా మాట్లాడతారు. ఆయన జీవితం పెద్ద స్ఫూర్తి అనడం హ్యాపీగా ఉంటుంది'' అన్నారు.


● పాయల్ రాజ్‌పుత్

పాన్ ఇండియా మూవీలో...

పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో ఓ పాన్ ఇండియా మూవీ రూపొందనుంది. ఈ చిత్రానికి ముని దర్శకత్వం వహించనున్నారు. సినిమా టికెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్–అర్జున్ ఆర్ట్స్‌పై రూపొందనున్న ఈ చిత్రం ఈ నెల 24న హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ''పాయల్ రాజ్‌పుత్ మరో వైవిధ్యమైన పాత్రలో నటించనున్న చిత్రమిది. ఆమె క్యారెక్టర్‌లో పలు భావోద్వేగాలు ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

బోల్డ్ కన్నన్


● విజయ్ సేతుపతి

బోల్డ్ కన్నన్‌గా మారిపోయారు హీరో విజయ్ సేతుపతి. ఆయన హీరోగా నటిస్తున్న కమర్షియల్ ఎంటర్‌టైనర్ మూవీ 'ఏస్'. అరుముగకుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న మూవీ ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో యోగిబాబు, బీఎస్ అవినాష్, దివ్య పిళ్లై, బబ్లు, రాజ్ కుమార్ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. జనవరి 16న విజయ్ సేతుపతి బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. అలాగే ఈ చిత్రంలో బోల్డ్ కన్నన్ పాత్రలో విజయ్ సేతుపతి నటిస్తున్నట్లుగా వెల్లడించారు. ఇంకా విజయ్ సేతుపతి హీరోగా చేస్తున్న మరో మూవీ 'ట్రైన్' గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు మేకర్స్. మిస్కిన్ దర్శకత్వంలో కలైపులి యస్. థాను నిర్మిస్తున్న ఈ చిత్రంలో నాజర్, కేఎస్ రవి కుమార్, శ్రుతీహాసన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఇలా బర్త్ డేకి డబుల్ ధమాకా ఇచ్చారు విజయ్ సేతుపతి.

లవ్ అని చెప్పు...

అక్షయ్, ఐశ్వర్య హీరో హీరోయిన్లుగా, మరో హీరోయిన్ మమితా బైజు కీలక పాత్రలో నటించిన చిత్రం 'డియర్ కృష్ణ'. దినేష్ బాబు దర్శకత్వంలో పీఎన్ బలరామ్ రచయితగా, నిర్మాతగా చేసిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్–నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. 'లైక్ ఎందుకు లవ్ అని చెప్పు', 'ఎల్లప్పుడూ విశ్వాసంతో నన్ను పూజిస్తుంటారో... వారికి నేనెప్పుడూ అండగా ఉంటాను' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''శ్రీ కృష్ణుడికి, కృష్ణ భక్తుడికి మధ్య జరిగిన ఒక మిరాకిల్ సంఘటనను ప్రేరణగా తీసుకొని ఈ చిత్రాన్ని రూపొందించాం. మొదటి వంద టికెట్లు బుక్ చేసిన వారిలో ఒకర్ని ఎంపిక చేసి, క్యాష్ బ్యాక్ కింద రూ. పదివేలు బహుమతి ఇవ్వడం జరుగుతుంది'' అని యూనిట్ పేర్కొంది.


● మమితా బైజు

ఓటీటీ ఇది చూడొచ్చు

పిల్లలకో పాఠం.. పెద్దలకో గుణపాఠం

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం వాళ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

'వాళ' తప్పనిసరిగా తమ పిల్లలతో కలిసి తల్లిదండ్రులు చూడవలసిన సినిమా. మనిషి జీవితంలో యవ్వన దశకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. పిల్లలకు మాత్రం బళ్లో, ఊళ్లో సరదాగా స్నేహితులతో గడిచిపోయే స్థితి అది. కానీ తల్లిదండ్రులకు మాత్రం తమ పిల్లల యవ్వన దశ అనేది కత్తి మీద సాములాంటిదే. పిల్లల భవిష్యత్తుపై ఆశతో అతి గారాబంగా తమ పిల్లలను చూసుకునేవారు కొందరైతే, తమ పిల్లలు దేనికీ పనికి రారని మరికొందరు వారి యవ్వన దశను వారికి అనుగుణంగా అనుభవించనీయకుండా చేస్తుంటారు. సరిగ్గా అలాంటి వారికే ఈ 'వాళ సినిమా. 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బాయ్స్' అన్నది దీని ట్యాగ్ లైన్. ఈ ట్యాగ్ లైన్ సినిమాకి సరిగ్గా సరిపోవడమే కాదు, నిజ జీవితంలో యవ్వన దశ దాటిన ప్రతి ఒక్కరికీ రిలేట్ అవుతుంది. ఈ సినిమాకి దర్శకుడు ఆనంద్ మీనన్. ప్రముఖ నటుడు బసిల్ జోసెఫ్ ఓ ప్రధాన పాత్రలో నటించారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే... తమ కెరీర్ పరంగా ఓడిపోయిన నలుగురు స్నేహితుల కథ ఇది. ఈ నలుగురూ తమ స్కూల్ నుండి కాలేజ్ వరకు చేసే ప్రయాణం చూసే ప్రతి ప్రేక్షకుడి యవ్వనాన్ని తప్పకుండా గుర్తు చేస్తుంది. ఈ నలుగురూ స్కూల్, కాలేజ్ అన్నింటిలోనూ ఫెయిలవుతారు. కానీ ఆ ఫెయిలైన వాళ్లు తమ తల్లిదండ్రులకు మాత్రం సినిమా ఆఖర్లో చక్కటి సందేశమిస్తూ అదే తల్లిదండ్రుల దృష్టిలో పాస్ అవుతారు. అసలు ఈ పిల్లలు ఎందుకు ఫెయిల్ అవుతారు, పరీక్షల్లో కాకుండా తల్లిదండ్రుల విషయంలో ఎలా పాస్ అవుతారన్నది మాత్రం ఈ సినిమాలోనే చూడాలి. తామొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు తమ పిల్లలు వాళ్ల కెరీర్‌ని ఎలా ఎంచుకుంటారు అన్నది వాళ్లకే వదిలేయాలి కానీ తమ ఆలోచనలను వాళ్ల మీద రుద్దకూడదన్న అంశం మీద తీసిన ఈ సినిమా నిజంగా అభినందనీయం. తీసుకున్న పాయింట్ సీరియస్‌దే అయినా సినిమా మొత్తాన్ని చక్కటి స్క్రీన్ ప్లేతో మంచి కామెడీని మేళవించి కుటుంబమంతా కలిసి చూసే విధంగా రూపొందించారు దర్శకుడు. మనం వినోదం కోసం ఎన్నో సినిమాలు చూస్తాం. కానీ కొన్ని సినిమాలు మనకు మార్గదర్శకమవుతాయి. అటువంటి సినిమానే ఈ 'వాళ... బయోపిక్ ఆఫ్ బిలియన్ బాయ్స్'... మస్ట్ వాచ్.



– ఇంటూరు హరికృష్ణ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
319	99
77,043	23,312

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	19,459	▼	52
డోజోన్స్	43,198	▼	23
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,392	▲	91
డాక్స్	20,655	▲	81
షాంఘై	3,236	▲	9
నికాయ్	38,573	▲	128

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	79,184
బంగారం (99.5 స్వచ్ఛత)	78,867
వెండి (కిలో)	91,784

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.12	87.14
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.30	107.10
€	యూరో	ఒకటి	87.92	90.53
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.21	55.55
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.53	54.72
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.95	65.62
SAR	సౌదీ రియాల్	పదియూనిట్లు	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	పదియూనిట్లు	22.62	24.41
¥	చైనా యువాన్	పదియూనిట్లు	10.91	12.73

ఇన్ఫీ భేష్!

- క్యూ3లో నికర లాభం 11.5 శాతం వృద్ధి
- రూ.6,806 కోట్లు
- ఆదాయం 7.6% అప్; రూ.41,764 కోట్లు
- 2024-25 ఆదాయ అంచనాలు పెంపు...
- ఆర్థిక సేవలు, తయారీ రంగాల దన్ను...



సలీల్ పరేఖ్, ఇన్ఫీ సీఈఓ

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. ఐటీ సేవలకు డిమాండ్ పుంజుకోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2024-25, క్యూ3)లో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 11.5 శాతం ఎగబాకి రూ.6,806 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ. 6,106 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం కూడా రూ.38,821 కోట్ల నుంచి రూ. 41,764 కోట్లకు పెరిగింది. 7.6 శాతం వృద్ధి చెందింది. ఆదాయంలో అత్యధికంగా ఆర్థిక సేవల నుంచి 27.8 శాతం సమకూరగా, తయారీ రంగం వాటా 15.5 శాతంగా నిలిచింది.

గైడెన్స్ రయ్: ఇన్ఫీ 2024-25 పూర్తి ఏడాది ఆదాయ అంచనాలను మళ్లీ పెంచింది. 4.5-5% వృద్ధి చెందొచ్చని లెక్కగట్టింది. క్యూ2లో గైడెన్స్ 3.75-4.5%గా పేర్కొంది. వరుసగా మూడో క్వార్టర్‌లోనూ కంపెనీ ఆదాయ అంచనాలను పెంచడం విశేషం. ఆర్థిక సేవలు, తయారీ రంగాల జోరు దీనికి దన్నుగా నిలుస్తోంది.

ఫలితాల నేపథ్యంలో ఇన్ఫీ షేరు 1.21% తగ్గి, రూ.1,926 వద్ద ముగిసింది.

క్యూ3 హైలైట్స్...

- ✔ 101 మంది క్లయింట్లు జతయ్యారు.
- ✔ కొత్తగా 5,591 మంది ఉద్యోగులు జతయ్యారు. మొత్తం సిబ్బంది సంఖ్య 3,23,379 మందికి చేరింది.
- ✔ ఈ ఆర్థిక సంవత్సరంలో నియామకాలు పుంజుకుంటాయని, 15,000 మందికి పైగా కొత్త ఉద్యోగులు జతయ్యే అవకాశం ఉందని కంపెనీ సీఎఫ్‌ఓ జయేశ్ సంఘ్రాజ్కా చెప్పారు. 2025-26లో 20,000 పైగా ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు వెల్లడించారు.
- ✔ అమెరికాలో ట్రంప్ సర్కారు వలసలపై కఠినంగా వ్యవహరించే అవకాశం ఉన్నందున కంపెనీపై దీని ప్రభావం గురించి మాట్లాడుతూ, ఇన్ఫీ గత కొన్నేళ్లుగా హెచ్1బీ వీసాలపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకున్నట్లు జయేశ్ పేర్కొన్నారు.

హిండెన్ 'బంద్'!

కంపెనీ మూసివేతకు వ్యవస్థాపకుడు నేట్ నిర్ణయం ■ ఇక సంస్థ మోడల్‌పై కంటెంట్ చేస్తానని వెల్లడి



వాషింగ్టన్: అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలతో మార్కెట్లు, రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన అమెరికన్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూతబడనుంది. మిగతావన్నీ వదిలేసి సంస్థ కార్యకలాపాలపైనే పూర్తి సమయం వెచ్చించాల్సిన ఒత్తిడి నెలకొనడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు నేట్ అండర్సన్ గురువారం తెలిపారు. 'దీనికి ఎవరి బెదిరింపులు గానీ నా ఆరోగ్య సమస్యలు గానీ, వ్యక్తిగత సమస్యలు గానీ కారణం కాదు. హిండెన్‌బర్గ్ నా జీవితంలో ఒక అధ్యాయంలాంటిదే తప్ప ఇదే నా జీవితం కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. తమ సంస్థ కొన్ని వ్యాపార సామ్రాజ్యాలను కుదిపేసిందని, హిండెన్‌బర్గ్ కారణంగా దాదాపు 100 మందిపై అభియోగాలు కూడా నమోదయ్యాయని అండర్సన్ పేర్కొన్నారు. ఇక వచ్చే ఆరు నెలల పాటు హిండెన్‌బర్గ్ పని విధానం గురించి మిగతా వారు తెలుసుకునేలా వీడియోలు, మెటీరియల్స్‌ను రూపొందించనున్నట్లు ఆయన వివరించారు. అదానీపై, సెబీ చీఫ్ మాధవి పురి బచ్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణలు అటు మార్కెట్లపరంగా, ఇటు రాజకీయంగా కూడా దుమారం రేపిన సంగతి తెలిసిందే. అమెరికా కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టే వేళ, ప్రసిద్ధ ఇన్వెస్టర్లు జార్జ్ సోరోస్‌తో లింకులు ఉన్న హిండెన్‌బర్గ్ మూతబడనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

అదానీపై గురి..: ఫైనాన్షియల్ ఫోరెన్సిక్ రీసెర్చ్ సేవల సంస్థగా 2017లో హిండెన్‌బర్గ్‌ను అండర్సన్ ప్రారంభించారు. బడా సంస్థల్లోని లొసుగులపై అధ్యయనం చేయడం, షార్ట్‌సెల్లింగ్ కార్యకలాపాల ద్వారా ఈ సంస్థ ఆదాయం ఆర్జించేది. అలా గురిపెట్టిన దిగ్గజాల్లో అదానీ గ్రూప్ కూడా ఒకటి. గ్రూప్ సంస్థల షేర్లు, అకౌంట్లలో అవకతవకలు జరుగుతున్నాయని 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ సంచలన ప్రకటనలతో అదానీ షేర్ల విలువ ఏకంగా 150 బిలియన్ డాలర్లు పతనమైంది.

గత టార్గెట్లు..

2020లో ఎలక్ట్రిక్ ట్రక్ తయారీ సంస్థ నికోలాపై హిండెన్‌బర్గ్ ఆరోపణల ప్రభావంతో .. ఆ సంస్థ వ్యవస్థాపకుడు మిల్టన్‌పై మోసం కేసులో శిక్ష పడింది. ఇవే కాకుండా లార్డ్స్‌టౌన్ మోటార్స్ కార్పొరేషన్ (అమెరికా), కాండీ (చైనా), క్లోవర్ హెల్త్ (అమెరికా), టెక్నోగ్లాస్ (కొలంబియా) మొదలైనవి కూడా హిండెన్‌బర్గ్ ప్రభావిత సంస్థల్లో ఉన్నాయి.

'మోదానీ'కి క్లీన్ చిట్ కాదు..

హిండెన్ బర్గ్ మూతబడటం అనేది 'మోదానీ'కి (మోదీ-అదానీ) క్లీన్ చిట్ ఇచ్చినట్లు కాదని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు. మరోవైపు, దేశాన్ని అస్థిరపర్చేందుకు ప్రయత్నించే హిండెన్‌బర్గ్ మూతబడుతుండటంతో, రాహుల్ గాంధీ గానీ ఆ కాం ట్రాక్కు తీసుకున్నారా అంటూ బీజేపీ నేత రవి శంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. భారీ వ్యాపారాలను ధ్వంసం చేయడం లక్ష్యంగా పని చేసే సొరోస్‌కి అమెరికా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోబోతున్న జో బైడెన్ ఆఖరు క్షణాల్లో అవార్డులు ఇవ్వడం, మరికొద్ది రోజుల్లో ట్రంప్ బాధ్యతలు చేపట్టనుండగా హిండెన్‌బర్గ్ మూతబడనుండటం అన్నీ కూడా ఒకదానితో ఒకటి ముడిపడినవై ఉంటాయని మార్కెట్ నిపుణుడు దేవేన్ చోక్సీ వ్యాఖ్యానించారు. హిండెన్‌బర్గ్ దాడులతో బాగా ఇబ్బందిపడిన అదానీ గ్రూప్ దీనిపై పరోక్షంగా స్పందించింది. 'ఎంతో మంది ఉద్దండులు వచ్చారు. ఎంతో మంది పోయారు' అంటూ గ్రూప్ సీఎఫ్‌వో జుగేషిందర్ రాబీ సింగ్.. ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

రిలయన్స్ లాభం అప్



- క్యూ3లో 18,540 కోట్లు
- ఆదాయం 2.43 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 7 శాతంపైగా వృద్ధితో రూ. 18,540 కోట్లను తాకింది. ప్రధానంగా టెలికం, రిటైల్ విభాగాలకుతోడు చమురు, పెట్రోకెమ్ బిజినెస్ నిలకడైన వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 17,265 కోట్లు ఆర్జించింది. ఈ ఏడాది జులై-సెప్టెంబర్(క్యూ2)లో ఆర్జించిన రూ. 16,563 కోట్లతో పోల్చినా నికర లాభం బలపడింది. మొత్తం ఆదాయం సైతం 7 శాతం అధికంగా రూ. 2.67 లక్షల కోట్లకు చేరింది. నిర్వహణ లాభం(ఇబిటా) 8 శాతం పుంజుకుని రూ.48,003 కోట్లకు చేరుకుంది.

రిటైల్, ఆయిల్ గుడ్...

రిటైల్ విభాగం రిలయన్స్ రిటైల్ వెంచర్స్ నికర లాభం క్యూ3లో 10 శాతం వృద్ధితో రూ. 3,458 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 9 శాతం పెరిగి రూ. 90,333 కోట్లయ్యింది. కొత్తగా 779 స్టోర్లను ఏర్పాటు చేయడంతో వీటి సంఖ్య 19,102కు చేరింది. జామ్‌నగర్ రిఫైనరీ, పెట్రోకెమికల్ ప్లాంట్లతోకూడిన ఆయిల్ టు కెమికల్స్ బిజినెస్ ఇబిటా 2 శాతం పుంజుకుని రూ. 14,402 కోట్లను తాకింది. ఇంధన రిటైల్ విభాగం జియో-బీపీ రికార్డ్ అమ్మకాలు(పెట్రోల్, డీజిల్) సాధించినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. కేజీ డీ6 బ్లాకు నుంచి తగ్గిన గ్యాస్ ఉత్పత్తి కారణంగా ఇబిటా 4 శాతం నీరసించి రూ. 5,565 కోట్లకు పరిమితమైంది. సగటున గ్యాస్ ఉత్పత్తి రోజుకి 28.04 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్లుకాగా.. 21,000 బ్యారళ్ల చమురు ఉత్పత్తిని సాధించింది.

యూఎస్ లగ్జరీ స్టోర్లు: ఫ్రాంచైజీ ఒప్పందం ద్వారా యూఎస్ లగ్జరీ రిటైలర్ 'శాక్స్ ఫిఫ్త్ ఎవెన్యూ' స్టోర్లకు దేశీయంగా తెరతీయనున్నట్లు రిలయన్స్ రిటైల్ పేర్కొంది. వెరసి అమెరికన్ లగ్జరీ డిపార్ట్‌మెంట్ స్టోర్లను దేశీయంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేసింది. ఇదేవిధంగా మదర్‌కేర్ పీఎల్‌సీతో జేవీని నెలకొల్పనున్నట్లు వెల్లడించింది. తద్వారా తల్లిదండ్రులు, పిల్లల ఉత్పత్తులందించే మదర్‌కేర్ బ్రాండును దేశీయంగా పరిచయం చేయనున్నట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో ఎన్‌ఎస్‌ఈలో ఆర్‌ఐఎల్ షేరు 2% లాభంతో రూ. 1,275 వద్ద ముగిసింది.



మూడో రోజూ ముందుకే..

మళ్లీ 77 వేల స్థాయిపైకి సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికాలో రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలకు తగ్గట్లు నమోదవడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై మరోసారి ఆశలు రేకెత్తాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(1%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (1.31%), ఐసీఐసీఐ బ్యాంకు (1%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 319 పాయింట్లు పెరిగి 77,043 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 99 పాయింట్లు బలపడి 23,312 వద్ద నిలిచింది.

■ అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ కార్యకలాపాలను మూసివేస్తున్నట్లు వ్యవస్థాపకుడు నేట్ అండర్సన్ ప్రకటనతో అదానీ గ్రూప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అత్యధికంగా ఎన్‌డీటీవీ 9% ర్యాలీ చేసింది. అంబుజా సిమెంట్స్ 4%, అదానీ గ్రీన్, సంఘీ ఇండస్ట్రీస్ 3%, అదానీ పవర్ 2.50% పెరిగాయి. గ్రూప్‌లోని మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.12.92 లక్షల కోట్లకు చేరింది.

■ రెండో రోజుల పాటు రికవరి దిశగా పయనించిన రూపాయి మళ్లీ నేలచూపులు చూసింది. డాలర్ మారకంలో గురువారం 21 పైసలు క్షీణించి 86.61 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మారుతీ సుజుకీ నుంచి చిన్న ఈవీ!	యాక్సిస్ బ్యాంక్ లాభం ఫ్లస్

జియో దూకుడు



ఆర్‌ఐఎల్ టెలికం విభాగం రిలయన్స్ జియో ఈ ఏడాది క్యూ3లో రూ. 6,477 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది క్యూ3లో సాధించిన రూ. 5,208 కోట్లతో పోలిస్తే 24 శాతం ఎగసింది. ప్రధానంగా టారిఫ్‌ల పెంపు ఇందుకు దోహదపడింది. మొత్తం ఆదాయం సైతం రూ. 25,368 కోట్ల నుంచి రూ. 29,307 కోట్లకు జంప్ చేసింది. త్రైమాసికవారీగా కస్టమర్ల సంఖ్య 47.88 కోట్ల నుంచి 48.21 కోట్లకు బలపడగా.. ఒక్కో యూజర్‌పై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ. 195.1 నుంచి రూ. 203.3కు ఎగసింది. టెలికం, డిజిటల్ విభాగాల జియో ప్లాట్‌ఫామ్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం 26 శాతం జంప్‌చేసి రూ. 6,861 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 19% అధికమై రూ. 38,750 కోట్లకు చేరింది.

సాక్షి స్పోర్ట్స్



హంపి, గుకేశ్‌లకు సత్కారం... నగదు పురస్కారం

ప్రపంచ చదరంగాన్ని ఏలుతున్న భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, కోనేరు హంపిలను అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) ఘనంగా సన్మానించింది. గత నెలలో చైనాకు చెందిన డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను కంగుతినిపించి 18 ఏళ్ల పిన్న వయసులోనే ప్రపంచ చెస్ చాంపియన్‌గా గుకేశ్ ఆవిర్భవించగా, ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా హంపి నిలిచింది. నెల వ్యవధిలో వరుస ప్రపంచ టైటిళ్లతో భారత చెస్ క్రీడాలోకం పండగ చేసుకుంది. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఏఐసీఎఫ్ ఇద్దరిని ఘనంగా సన్మానించింది. అలాగే విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ చెస్ కిరీటాన్ని దేశానికి తెచ్చిన గుకేశ్‌కు రూ. కోటి, ర్యాపిడ్ విజేత హంపికి రూ. 50 లక్షలు ప్రోత్సాహక బహుమతిని అందజేసింది. ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన ఆర్.వైశాలికి రూ. 20 లక్షలు నజరానా అందజేశారు.

భారత బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కొటక్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు కోచింగ్ బృందంలో మరో వ్యక్తి కొత్తగా చేరాడు. సౌరాష్ట్ర మాజీ కెప్టెన్ సితాన్షు కొటక్ టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. బుధవారం నుంచి ఇంగ్లండ్‌తో జరిగే టి20 సిరీస్ నుంచి అతను బాధ్యతలు చేపడతాడు. 52 ఏళ్ల సితాన్షు 2019 నుంచి జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో బ్యాటింగ్ కోచ్‌గా పని చేస్తున్నాడు. భారత 'ఎ' జట్టు పర్యటనల్లో పలు మార్లు కోచ్‌గా పని చేసిన సితాన్షు... సీనియర్ టీమ్‌కు వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లిన సిరీస్‌లలో అతనికి అసిస్టెంట్‌గా కూడా వ్యవహరించాడు. సితాన్షు లెవల్-3 క్వాలిఫైడ్ కోచ్ కూడా. తాజా ఎంపికతో భారత టీమ్‌లో అసిస్టెంట్ కోచ్‌ల సంఖ్య ఐదుకు చేరింది. గౌతమ్ గంభీర్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తుండగా ...మోర్నీ మోర్కెల్ (బౌలింగ్), టి.దిలీప్ (ఫీల్డింగ్)లతో పాటు అభిషేక్ నాయర్, టెన్ డస్కటేలకు కూడా ఇప్పటికే అసిస్టెంట్ కోచ్ హోదా ఉంది. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు ఓటమికి బ్యాటింగ్ వైఫల్యమే కారణమని బీసీసీఐ తాజా సమీక్షా సమావేశంలో చర్చ జరిగింది. దాంతో మన బ్యాటర్లను సాంకేతికంగా మరింత మెరుగుపర్చే క్రమంలో భాగంగానే కొత్త బ్యాటింగ్ కోచ్‌గా ఎంపిక చేసినట్లు సమాచారం. దశాబ్ద కాలానికి పైగా సాగిన దేశవాళీ కెరీర్‌లో సౌరాష్ట్ర టీమ్‌కు ప్రాతినిధ్యం వహించిన సితాన్షు 130 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లలో 41.76 సగటుతో 8061 పరుగులు చేశాడు. ఇందులో 15 సెంచరీలు, 55 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 89 లిస్ట్ 'ఎ' మ్యాచ్‌లు కూడా ఆడిన సితాన్షు 42.23 సగటుతో 3083 పరుగులు సాధించాడు.



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



సింధు సులువుగా...

క్వార్టర్ ఫైనల్లోకి భారత స్టార్
- కిరణ్ జార్జి కూడా ముందుకు
- కష్టపడి నెగ్గిన సాత్విక్-చిరాగ్ జోడీ

న్యూఢిల్లీ: ఈ ఏడాది బరిలోకి దిగిన తొలి టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో సింధు వరుసగా రెండో విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 16వ ర్యాంకర్ సింధు 21-15, 21-13తో ప్రపంచ 46వ ర్యాంకర్ మనామి సుజి (జపాన్)పై గెలిచింది. 46 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు ఆద్యంతం ఆధిపత్యం కనబరిచింది. తొలి గేమ్‌లో 11-6తో ఆధిక్యంలోకి వెళ్లిన సింధుకు ఆ తర్వాత కాస్త ప్రతిఘటన ఎదురైంది. జపాన్ ప్లేయర్ వరుస పాయింట్లు సాధించడంతో సింధు ఆధిక్యం 14-13తో ఒక పాయింట్‌కు చేరింది. ఈ దశలో సింధు చెలరేగి వరుసగా మూడు పాయింట్లు గెలిచి 17-13తో ముందంజ వేసింది. ఆ తర్వాత సింధు ఒక పాయింట్ చేజార్చుకొని ఆ వెంటనే మళ్లీ మూడు పాయింట్లు సాధించింది. అదే జోరులో తొలి గేమ్‌ను 21-15తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ సింధు దూకుడు కొనసాగింది. వరుసగా ఐదు పాయింట్లు నెగ్గిన భారత స్టార్ 5-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత సింధు ఆధిక్యం 13-3కు, 17-5కు పెరిగింది. సింధు స్మాష్‌లకు మనామి వద్ద సమాధానం లేకపోయింది. చివరకు రెండో గేమ్‌తోపాటు మ్యాచ్ కూడా సింధు వశమైంది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్ సింధు సత్తాకు పరీక్షగా నిలువనుంది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, ప్రపంచ నాలుగో ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా)తో సింధు ఆడనుంది. ముఖాముఖి రికార్డులో సింధు 9-3తో మరిస్కాపై ఆధిక్యంలో ఉంది. అయితే చివరిసారి వీరిద్దరు గతేడాది డెన్మార్క్ ఓపెన్‌లో తలపడగా మరిస్కా విజేతగా నిలిచింది. మరో భారత ప్లేయర్ అనుపమ ఉపాధ్యాయ్ పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. అనుపమ 6-21, 9-21తో టొమోకా మియజకి (జపాన్) చేతిలో ఓడిపోయింది.

ఆరు గేమ్ పాయింట్లు కాపాడుకొని...

పురుషుల సింగిల్స్‌లో బరిలో మిగిలిన ఏకైక భారత ప్లేయర్ కిరణ్ జార్జి సంచలన విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ 17వ ర్యాంకర్ అలెక్స్ లానీర్ (ఫ్రాన్స్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 38వ ర్యాంకర్ కిరణ్ జార్జి 22-20, 21-13తో గెలుపొందాడు. 46 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో కేరళకు చెందిన కిరణ్ తొలి గేమ్‌లో 14-20తో వెనుకబడ్డాడు. ఈ దశలో కిరణ్ అనూహ్యంగా విజృంభించి వరుసగా ఎనిమిది పాయింట్లు గెలిచి తొలి గేమ్‌ను దక్కించుకోవడం విశేషం. తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (ఇండోనేసియా)ను ఓడించిన అలెక్స్ ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌ను చేజార్చుకున్నాక గాడి తప్పాడు. రెండో గేమ్‌లో కిరణ్ ఆరంభం నుంచే జోరు ప్రదర్శించి విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో చైనా ప్లేయర్ హాంగ్ యాంగ్ వెంగ్‌తో కిరణ్ ఆడతాడు.



పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకునేందుకు తీవ్రంగా శ్రమించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జోడీ 20-22, 21-14, 21-16తో కెన్యా మిత్సుహాషి-హిరోకి ఒకమురా (జపాన్) జంటపై గెలిచింది. 72 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ తొలి గేమ్‌లో 20-19తో ఆధిక్యంలో ఉన్న దశలో వరుసగా మూడు పాయింట్లు సమర్పించుకొని గేమ్‌ను కోల్పోయారు. అయితే రెండో గేమ్ నుంచి భారత జోడీ అతి విశ్వాసం కనబర్చకుండా జాగ్రత్తగా ఆడింది. స్కోరు 15-13 వద్ద సాత్విక్-చిరాగ్ చెలరేగి వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 19-13తో ముందంజ వేశారు. అదే జోరులో గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచారు. నిర్ణాయక మూడో గేమ్ ఆరంభంలో భారత జోడీ 1-4తో వెనుకబడ్డా వెంటనే తేరుకుంది. నిలకడగా రాణించి 13-7తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని నిలబెట్టుకొని విజయాన్ని ఖరారు చేసుకుంది.

మహిళల డబుల్స్‌లో ముగిసిన పోరు

మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత పోరాటం ముగిసింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) 9-21, 21-23తో యుకీ ఫకుషిమా-మయు మత్సుమితో (జపాన్)లపై, రుతూపర్ణ-శ్వేతాపర్ణ (భారత్) 6-21, 7-21తో హా నా బేక్-సో హీ లీ (దక్షిణ కొరియా) చేతిలో... అశ్విని భట్-శిఖా గౌతమ్ (భారత్) 7-21, 10-21తో యి జింగ్ లీ-జు మిన్ లువో (చైనా) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో (భారత్) 18-21, 17-21తో హిరోకి మిదోరికవా-నత్సు సైతో (జపాన్) చేతిలో... అశిత్ సూర్య-అమృత (భారత్) 8-21, 11-21తో పో సువాన్ యాంగ్-లింగ్ ఫాంగ్ యు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి చవిచూశారు.

మెద్వెదెవ్‌కు షాక్

4 గంటల 49 నిమిషాల పోరులో క్వాలిఫయర్ లెర్నర్ టియెన్ సంచలన విజయం



మెద్వెదెవ్



లెర్నర్ టియెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో గురువారం పెను సంచలనం నమోదైంది. గత ఏడాది రన్నరప్, ప్రపంచ ఐదో ర్యాంకర్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. అమెరికాకు చెందిన 19 ఏళ్ల క్వాలిఫయర్ లెర్నర్ టియెన్ అసాధారణ పోరాట పటిమ కనబరిచి మెద్వెదెవ్‌ను ఓడించి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయం సాధించాడు. 4 గంటల 49 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 119వ ర్యాంకర్ లెర్నర్ టియెన్ 6-3, 7-6 (7/4), 6-7 (8/10), 1-6, 7-6 (10/7)తో ఐదో సీడ్, గతంలో మూడుసార్లు రన్నరప్‌గా (2021, 2022, 2024) నిలిచిన మెద్వెదెవ్‌పై గెలిచాడు. మ్యాచ్ మొత్తంలో మెద్వెదెవ్ 20 ఏస్‌లు సంధించినా... 9 డబుల్ ఫాల్ట్‌లు, 82 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. గత మూడేళ్లు యూఎస్ ఓపెన్‌లో ఆడిన లెర్నర్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. మొదటిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించిన లెర్నర్ టియెన్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఐదు సెట్‌లు ఆడి నెగ్గడం విశేషం. కామిలో కారాబెల్లి (అర్జెంటీనా)తో 3 గంటల 56 నిమిషాల పాటు జరిగిన తొలి రౌండ్‌లో లెర్నర్ టియెన్ 4-6, 7-6 (7/3), 6-3, 5-7, 6-4తో గెలుపొందాడు. మరోవైపు కాసిదిత్ సామ్‌రెజ్ (థాయ్‌లాండ్)తో 3 గంటల 8 నిమిషాలపాటు జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో మెద్వెదెవ్ 6-2, 4-6, 3-6, 6-1, 6-2తో గట్టెక్కాడు. రెండో రౌండ్‌లోనూ మెద్వెదెవ్ ఐదు సెట్‌లు పోరాడినా అమెరికన్ టీనేజర్ ఆటతీరుకు చేతులెత్తేశాడు. లెర్నర్, మెద్వెదెవ్ మ్యాచ్ ఆస్ట్రేలియా కాలమానం ప్రకారం తెల్లవారుజాము 2 గంటల 53 నిమిషాలకు ముగియడం గమనార్హం.

మూడో రౌండ్‌లో సినెర్

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్, నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. రెండో రౌండ్‌లో సినెర్ 2 గంటల 46 నిమిషాల్లో 4-6, 6-4, 6-1, 6-3తో స్కూల్‌కేట్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ స్వియాటెక్ (పోలాండ్), నాలుగో సీడ్ పావోలిని (ఇటలీ), ఎనిమిదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా), తొమ్మిదో సీడ్ కసత్కినా (రష్యా), పదో సీడ్ కొలిన్స్ (అమెరికా) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

రిత్విక్ జోడీ ఓటమి

తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న భారత ప్లేయర్, హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీకి నిరాశ ఎదురైంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రిత్విక్ (భారత్)-సెగర్‌మన్ (అమెరికా) జోడీ 6-7 (5/7), 1-6తో ఆరో సీడ్ హ్యారీ హెలియోవారా (ఫిన్‌లాండ్)-హెనీ ప్యాటెన్ (బ్రిటన్) జంట చేతిలో ఓడిపోయింది. శ్రీరామ్ బాలాజీ (భారత్)-వరేలా (మెక్సికో) ద్వయం రెండో రౌండ్‌కు చేరగా... జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్)... అనిరుధ్ చంద్రశేఖర్ (భారత్)-డ్రజెవ్‌స్కీ (పోలాండ్) జోడీలు తొలి రౌండ్‌లోనే ఓటమి పాలయ్యాయి.

వేళకాని వేళల్లో.. ఆహారంతో అనర్థం..

ఊబకాయంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం

కాలేయానికి, మెదడుకూ మధ్య కూడా ఓ బయలాజికల్ క్లాక్

'ఆకలి'కి సంబంధించిన సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం జరుగుతుందంటున్న తాజా అధ్యయనం

యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా శాస్త్రవేత్తల వెల్లడి



షిఫ్టుల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులూ, అడపాదడపా ప్రయాణాలు చేయాల్సిన అవసరం ఉన్నవారంతా వేళకాని వేళల్లో ఆహారం తీసుకోవడం చాలా సాధారణం. అయితే ఓ అధ్యయనం ప్రకారం ఇలాంటివారిలో ఊబకాయంతో పాటు మరెన్నో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలున్నట్టు తెలిసింది. జీర్ణాశయానికి, మెదడుకూ మధ్య సమాచార సమన్వయాలు జరుగుతున్న విషయాలు అనేక అధ్యయనాల్లో వెలుగు చూశాయి. కాలేయానికి, మెదడుకూ మధ్య కూడా బయటకు కనపడని కమ్యూనికేషన్స్ ఉంటాయని ఈ సరికొత్త అధ్యయనం తేల్చిచెబుతోంది. యూఎస్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని పెరల్మాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందాల పరిశోధనల్లో ఈ అంశాలు వెలుగుచూశాయి. - సాక్షి, హైదరాబాద్

కాలేయానికి, మెదడుకు మధ్య కూడా 'క్లాక్' లింకు పట్టపగలు పనిచేయడంతోపాటు రాత్రివేళల్లో నిద్రపోయేలా మెదడులోని బయలాజికల్ క్లాక్ నిర్దేశిస్తుందని, దీన్నే సర్కేడియన్ రిథమ్‌గా చెబుతారన్న విషయం తెలిసిందే. తాజాగా పరిశోధకులు చెబుతున్న దాని ప్రకారం.. కాలేయానికి, మెదడుకూ మధ్య కూడా ఓ బయలాజికల్ క్లాక్ ఉంటుంది. ఆకలి వేసినప్పుడూ, ఏం తినాలన్నది నిర్ణయం తీసుకునేటప్పుడూ వేగస్ నర్వ్ ద్వారా కాలేయం నుంచి మెదడుకూ, మెదడు నుంచి మళ్లీ కాలేయానికి సమాచారాలు ఇచ్చిపుచ్చుకోవడం జరుగుతుంటుంది. దాన్నిబట్టే ఓ వ్యక్తి తానెప్పుడు తినాలి? తినేటప్పుడు ఎలాంటి ఆహారాలను ఎంపిక చేసుకోవాలి వంటివి జరుగుతుంటాయి. ఈ కాలేయ, మెదడు క్లాక్ సమాచారాల రిథమ్‌లో ఏదైనా తేడా వస్తే.. అది జీవక్రియల్లో అంతరాయాలకు దారితీస్తుందని, దాంతో బరువు పెరగడం, అది అనేక ఆరోగ్య సమస్యలకు తావివ్వడం,అవి మరికొన్ని అనారోగ్యాలకు దారితీయడం.. ఇలా ఒక దానివెంట మరొక సమస్యకు దారితీస్తుంటాయి. ఎలుకల కాలేయంలోని 'రెవ్-ఎర్బ్స్' అనే కుటుంబానికి చెందిన జన్యువులపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. దేహంలోని సర్కేడియమ్ రిథమ్‌ను నిర్దేశించే బయలాజికల్ క్లాక్ నిర్వహణలో ఈ జన్యువులు కీలక భూమిక పోషిస్తాయి. రకరకాల జీవక్రియలు, హార్మోన్లు వెలువడేలా చూడటం వంటి అనేక వాటిలో అవి పాలు పంచుకుంటుంటాయి.

ఎలుకలు, మనుషుల జీవక్రియల పరిశీలన

ఈ అధ్యయనంలో పాల్గొన్న ముఖ్యుల్లో ఒకరూ అలాగే పెన్ మెడిసిన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్, ఒబిసిటీ అండ్ మెటబాలిజమ్ డైరెక్టర్ డాక్టర్ మిచెల్ లాజర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఎలుకలూ, మనుషులూ మెలకువతో ఉన్నప్పుడు తినే జీవులు కాబట్టి ఈ రెండు శరీరాల్లో జీవక్రియల పనితీరు పరిశీలించినప్పుడు కాలేయానికి, మెదడుకూ మధ్య ఉండే నిర్దేశిత సమాచారాల గురించిన వివరాలు తెలిశాయి. ఎలుకల్లో ఉండే 'రెవ్-ఎర్బ్స్' జన్యువులకు మెదడుతో ఉన్న కనెక్షన్ తొలగించినప్పుడు ఎలుకలు తాము చురుగ్గా లేని సమయంలోనూ ఇష్టం వచ్చినట్టుగా తినడం, అవసరమైన దానికంటే ఎక్కువగా తినేయడం మొదలుపెట్టాయి. ఈ తిండి ఎలా ఉందంటే... అచ్చం రాత్రి షిఫ్టుల్లో పనిచేసేవారు ఆకలితో నిమిత్తం లేకుండా మామూలు కంటే ఎక్కువగానే తినేయడంలా అనిపించింది. ఇంకా ఇదెలా ఉందంటే.. జెట్‌లాగ్ తర్వాత బయలాజికల్ క్లాక్‌లో అంతరాయం కలగడంతో వేళాపాళా లేకుండా ఇష్టమొచ్చినట్టు తినేయడంలా కనిపించింది.

ఈ పరిశోధనతో ఎంతో మేలు

దేహం తాలూకు ఓ పూర్తిస్థాయి సమన్వయ వ్యవస్థ (హోమియోస్టాటస్) అంతా చక్కగా కొనసాగుతూ జీవక్రియలన్నీ సక్రమంగా జరిగేలా చూడటానికి కాలేయం తాలూకు ఏఏ అంశాలు, ఏఏ జన్యువులు పాలుపంచుకుంటున్నాయో పరిశీలించి, ఆ వ్యవస్థల కారణంగా దేహంపై పడే ప్రతికూల ప్రభావాలూ, దాంతో వచ్చే అనర్థాలూ, అనారోగ్యాలకు అవసరమైన చికిత్సలను తెలుసుకునేందుకు ఈ పరిశోధన ఎంతగానో తోడ్పడుతుందన్నది పరిశోధకుల అభిప్రాయం. ఈ పరిశీలనల వెలుగులో ప్రజల ఆరోగ్య సంరక్షణలకు అసరమైన చర్యలూ, ప్రణాళికలు రూపొందించవచ్చన్నది అనేక ఆరోగ్య సంస్థలకు చెందిన అధికారులు, ప్రణాళికావేత్తల భావన.

వేగస్ నర్వ్ ద్వారా సమాచార మార్పిడి

ఎప్పుడు, ఎలా తినాలి అనే ఈ సమాచారాల ఇచ్చిపుచ్చుకోడాలు వేగస్ నర్వ్ అనే ఓ కీలక నరానికి చెందిన అత్యంత సంక్లిష్టమైన నర్వ్ ఫైబర్స్ ద్వారా జరుగుతుంటుంది. ఎప్పుడు ఆకలిగా అనిపించాలి, ఎప్పుడు ఎంత మొత్తంలో తినాలనే ఆదేశాలు కాలేయం ఈ నరం ద్వారానే మెదడుకు చేరవేస్తుంది. దాని ప్రకారమే మనుషులకూ లేదా జీవాలకు ఎప్పుడు ఆకలి వేయాలో అప్పుడు ఆకలిగా అనిపించడం, దాన్ని బట్టి ఎంత తినాలో అంత తినేశాక ఆకలి తీరడం వంటివన్నీ సర్కేడియన్ రిథమ్‌కు అనుగుణంగా జరుగుతుంటాయి.

డయాబెటిస్, గుండెజబ్బులు, పక్షవాతం

ప్రస్తుతం పనివేళల్లో గణనీయమైన మార్పులు రావడం, అర్ధరాత్రి, అపరాత్రీ అనే తేడాలు లేకుండా పనులు చేయాల్సి రావడం దుష్ప్రభావం చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు అధిక రక్తపోటు, మధుమేహం, రక్తంలో కొలెస్టరాల్ మోతాదులు పెరగడం, పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. చివరకు ఇవన్నీ టైప్-2 డయాబెటిస్, గుండెజబ్బులూ, పక్షవాతం వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తున్నాయని డాక్టర్ మిచెల్ లాజర్ చెబుతున్నారు. మనదేశంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్-ఇండియా డయాబెటిస్ (ఐసీఎమ్ఆర్-ఇండియాబ్) నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం భారత్‌లో 10.1 కోట్ల డయాబెటిస్ బాధితులు ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 83 కోట్ల మంది డయాబెటిస్ బాధితులు ఉండగా... అందులో 10.1 కోట్ల మంది కేవలం మన దేశం నుంచే ఉన్నారు. అంటే ప్రపంచంలోని ప్రతి 8 మంది డయాబెటిస్ బాధితుల్లో ఒకరు భారత్‌వాసి అన్నమాట. మన భారతీయ గణాంకాలను యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా పరిశోధనల ఫలితాలతో అనుసంధానించి చూస్తే నిద్రపోవాల్సిన సమయంలో పనిచేస్తూ, వేళగాని వేళల్లో భోజనం చేస్తున్నవారిలో ఈ జీవక్రియలకు సంబంధించిన జబ్బులైన డయాబెటిస్ వంటివి చాలా ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా... ఈ అధ్యయనం ప్రపంచవ్యాప్తంగా అనుసరించాల్సిన చికిత్స ప్రణాళికల ప్రాధాన్యాన్నీ నొక్కి చెబుతోంది. ఉదాహరణకు చాలా ఊబకాయంతో ఉన్న ఎలుకల తాలూకు వేగస్ నర్వ్‌ను కట్ చేసినప్పుడు... మళ్లీ అవి నార్మల్ ఎలుకల్లాగే తినడం, మితంగానే ఆహారం తీసుకోవడం వంటివి చేశాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
శుక్రవారం । 17-1-2025

పాస్‌పోర్ట్‌లో.. సింగపూర్ 'బాద్‌షా'



సాక్షి, హైదరాబాద్: విదేశీ పర్యటనలు, దేశ పౌరులుగా గుర్తింపు విషయంలో పాస్‌పోర్ట్ అనేది కీలక డాక్యుమెంట్‌గా నిలుస్తోంది. దేశ సరిహద్దుల్లో ఐడెంటీ, వలసదారులను రెగ్యులేట్ చేయడం లోనూ ఇది ముఖ్యమైన పత్రంగా మారిన విషయం తెలిసిందే. విదేశాలకు విద్య, వైద్యం, పర్యాటకం, తీర్థయాత్రలు, వ్యాపారం, ఇతర అవసరాల నిమిత్తం వెళ్లేందుకు, మళ్లీ స్వదేశాలకు తిరుగు ప్రయాణం అయ్యేందుకు పాస్‌పోర్ట్ కలిగి ఉండడం తప్పనిసరి. వివిధ అధికారిక లేక వ్యక్తిగత, కుటుంబపరమైన విధులు, అవసరాలకు కూడా ఇది అధికారిక గుర్తింపుగా ఉపయోగపడుతోంది. మొత్తంగా చూస్తే పాస్‌పోర్ట్ అనేది 'టికెట్ టు ద వరల్డ్'గా పరిగణిస్తున్నారు.

- సింగపూర్ అనే చిన్నదేశం ప్రపంచస్థాయిలో పాస్‌పోర్ట్‌ల గుర్తింపు, వాటి విలువ విషయంలో 'బాద్‌షా'గా నిలుస్తోంది. ఈ దేశ పాస్‌పోర్ట్ కలిగి ఉంటే వీసా లేకుండానే 195 దేశాలు సందర్శించే అవకాశం లభిస్తుంది. ఈ గుర్తింపు కారణంగా సింగపూర్ పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. గత ఐదేళ్లుగా సింగపూర్ ప్రథమ స్థానంలో కొనసాగుతుండడం ఓ విశేషం.
- పాస్‌పోర్ట్‌ల విలువ, గుర్తింపు విషయంలో ఆ తర్వాతి స్థానంలో జపాన్ నిలుస్తోంది. ఈ దేశ పాస్ట్‌పోర్ట్ ఉంటే 193 దేశాల్లో వీసా లేకుండానే పర్యటించే వీలుంది.
- ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, ఫిన్‌లాండ్, దక్షిణకొరియాల పాస్టిపోర్ట్ హోల్డర్లు వీసా లేకుండానే 192 దేశాలు సందర్శించొచ్చు.
- ఆ తర్వాతి స్థానాల్లో ఆస్ట్రియా, డెన్మార్క్, ఐర్లాండ్, లగ్జెమ్‌బర్గ్, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే దేశాల పాస్‌పోర్ట్‌లు కలిగిన వారు వీసా అవసరం లేకుండానే 191 దేశాల్లో పర్యటించొచ్చు.
- బెల్జియం, న్యూజిలాండ్, పోర్చుగల్, స్విట్జర్లాండ్, యూకే వంటి దేశాల పాస్‌పోర్ట్ హోల్డర్లకు 190 దేశాలకు వీసా లేకుండా వెళ్లేందుకు అనుమతి ఉంది.

'హెన్లే పాస్‌పోర్ట్ ఇండెక్స్'ఇలా...

ఒకదేశ పౌరుడు స్వేచ్ఛగా ఇతర దేశాల్లో విహరించడం ఆధారంగా... ప్రపంచవ్యాప్తంగా ఆయా దేశాలకు సంబంధించి జాబితాను 'హెన్లే పాస్‌పోర్ట్ ఇండెక్స్'విడుదల చేస్తోంది. ఇతర దేశాల పర్యటనలకు వెళ్లినప్పుడు...అక్కడకు చేరుకునేలోగా వీసా అవసరం లేకుండా వెళ్లగలిగే అవకాశం ప్రాతిపదికన వివిధ దేశాలకు చెందిన పాస్‌పోర్ట్‌లకు ఈ ఇండెక్స్ ద్వారా ర్యాంకింగ్‌లు ఇస్తారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల పౌరులు జరుపుతున్న పర్యటనలకు సంబంధించి ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఐఏటీఏ) సమకూర్చిన సమాచారం, వివరాలు, గణాంకాల ఆధారంగా ర్యాంకింగ్‌లను ఈ సంస్థ నిర్ధారిస్తోంది. వివిధ అంశాలతోపాటు, ఫలానా దేశ పాస్‌పోర్ట్ కలిగి ఉన్న పౌరుడు వీసా లేకుండానే ఏఏ దేశాలకు వెళ్లగలుగుతారు, ఆయా దేశాలతో ఈ పౌరుడి దేశానికున్న దౌత్యపరమైన సంబంధాలు, ఏ మేరకు అంతర్జాతీయ ఒప్పందాలు కలిగి ఉన్నాయనే దాని ప్రాతిపదికన సమగ్ర విధానాన్ని పాటించి పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లను సిద్ధం చేస్తున్నారు.

- ఆ దేశ పాస్‌పోర్ట్ ఉంటే వీసా లేకుండానే 195 దేశాలు సందర్శించే అవకాశం
- ఆ తర్వాత స్థానంలో జపాన్.. 193 దేశాలు వీసా లేకుండా విజిట్ చేసే ఛాన్స్...
- ప్రపంచర్యాంకుల్లో 85వ స్థానంలో నిలిచిన భారత్.. మన పాస్‌పోర్ట్‌తో వీసా లేకుండా 58 దేశాలకు వెళ్లొచ్చు...
- హెన్లే పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2025లో వివిధ అంశాలు వెల్లడి

మరింత దిగజారిన భారత్ ర్యాంకింగ్

హెన్లే పాస్‌పోర్ట్ ఇండెక్స్-2025 నివేదికను బట్టి చూస్తే...భారత్ ర్యాంకింగ్ మరో 5 ర్యాంకులు దిగజారి 85వ ర్యాంక్ (2024లో 80వ ర్యాంక్) వద్ద నిలిచింది. మన పొరుగు దేశాలైన పాకిస్తాన్ 103 స్థానంలో, బంగ్లాదేశ్ 100వ స్థానంలో ఉన్నాయి. అదే 2021లో ఇండియా 90వ ర్యాంక్ సాధించి మరింత అడుగున నిలిచింది. ఇదిలా ఉంటే 2006 భారత్ 71వ ర్యాంక్‌లో నిలిచి ఒకింత సత్తా చాటింది.

రంగుల వారీగా చూస్తే...

మొత్తంగా 84 దేశాలు నీలంరంగు (బ్లూరంగు షేడ్స్) పాస్‌పోర్ట్‌లతో అత్యధిక రంగులు ఉపయోగిస్తున్న దేశాలుగా ప్రథమస్థానంలో నిలిచాయి. 68 దేశాలు ఎరుపురంగు కలిగిన పాస్‌పోర్ట్‌లు కలిగి ఉంటే..40 దేశాల పాస్‌పోర్ట్‌లు ఆకుపచ్చ వర్ణంలో ఉన్నాయి. కేవలం ఏడు దేశాల పాస్ట్‌పోర్ట్‌లే నలుపు (బ్లాక్) రంగులో ఉండడం కొసమెరుపు.

నేడు సీఎంపీఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా పరిధిలోని తొమ్మిది బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల సీఎంపీఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరగనుంది. ఈ సమావేశానికి మినిస్ట్రీ ఆఫ్ కోల్ అడిషనల్ సెక్రటరీతోపాటు సీఎంపీఎఫ్ కమిషనర్, తొమ్మిది బొగ్గు పరిశ్రమల సీఎండీలు, సింగరేణి డైరెక్టర్లు హాజరుకానున్నారు. గతంలో కోలిండియా పరిధిలో ఆరు లక్షల మంది కార్మికులు ఉండగా, ప్రస్తుతం 3 లక్షల మంది మాత్రమే పనిచేస్తున్నారు. సింగరేణిలో 1.16 లక్షల మందికి ప్రస్తుతం 39 వేలమంది పనిచేస్తున్నారు. బొగ్గు పరిశ్రమల్లో నానాటికీ కార్మికుల సంఖ్య తగ్గి, పెన్షనర్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సీఎంపీఎఫ్ ఫండ్ తగ్గుముఖం పడుతోంది. ఈ నేపథ్యంలో ఈ మొత్తాన్ని పెంచేందుకు, సీఎంపీఎఫ్ ద్వారా కార్మికుల పెన్షన్ పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశంలో చర్చించనున్నారు.

పద..పదమంటూ 'పోచారం'

- నిధులు తేవడమే కాదు... దగ్గరుండి పనులూ చేయిస్తారు
- వారం, పదిరోజులకోసారైనా వెళ్లాల్సిందే...
- గుట్టా..పుట్టా అన్నీ చుట్టేస్తారు



అభివృద్ధి పనులు అడవిలో ఉన్నా సరే వెళ్లాల్సిందే..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఆయన డెబ్బై ఆరేళ్ల వయస్సులో కూడా నవ యువకుడిగా తిరుగుతూనే ఉంటారు. అడవి అయినా, గుట్ట, పుట్ట ఎక్కడికైనా సరే చలో అంటారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమే కాదు... పనులు పూర్తయ్యే దాకా కాంట్రాక్టర్ల వెంట పడతారు. తనే స్వయంగా ఆ పనులను పర్యవేక్షిస్తుంటాడు. ఆయనే బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి. మంత్రిగా స్పీకర్‌గా మూడు దశాబ్దాలకు పైగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికైన నాటి నుంచి ఇప్పటివరకు ఒకే రకమైన టెంపో కొనసాగిస్తున్నారు. అభివృద్ధి పనులకు నిధులు సాధించి వాటిని పూర్తి చేసేదాకా వెంటపడతారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల కాలంలో రూ.10 వేల కోట్లు తీసుకొచ్చాడని చెబుతారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా బాన్సువాడ నియోజకవర్గంలో 10 వేలకు పైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించడంలో ఆయన కృషి ఎంతో ఉందంటారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న తీరును ఆయన ఎన్నోసార్లు పర్యవేక్షించారు. రోడ్లు, ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, స్కూల్ భవనాలు... ఇలా ఏ పని అయినా సరే తను వెళ్లాల్సిందే. నియోజకవర్గ పరిధిలోని సిద్దాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న రిజర్వాయర్లకు శంకుస్థాపన చేసిన నాటి నుంచి ఇప్పటి దాకా ఆయన ప్రతి నెలలో ఒకటి రెండుసార్లు పరిశీలించారు. ఎంతదూరమైనా సరే, ఎంత లోపలకు ఉన్నా సరే వెళతారు. ఒకవేళ రోడ్డు మార్గం సరిగ్గా లేదని కార్లు వెళ్లే పరిస్థితి లేదంటే బైక్ మీద కూడా వెళ్లి వస్తారు. బాన్సువాడ పట్టణంలో జరిగే పనులను రెగ్యులర్‌గా పరిశీలిస్తారు. జోరువర్షం కురుస్తుందని అందరూ ఇళ్లలో ఉంటే తను మాత్రం బ్యాటరీ వాహనంలో ఊరంతా చుట్టేస్తారు. నీరు నిలిచిపోకుండా నాలాలను శుభ్రం చేయించమని ఆదేశిస్తారు. కాంట్రాక్టర్లు పనులు ఆపితే కారణాలు తెలుసుకొని బిల్లుల సమస్య అయితే ఉన్నతాధికారులతో మాట్లాడి బిల్లులు ఇప్పించి వారికి సహకరిస్తుంటారు. దీంతో అందరూ పోచారం స్టైలే వేరబ్బా అంటుంటారు. పెద్దాయనతో పోటీపడలేమని ఇతర ప్రజాప్రతినిధులు చెబుతుంటారు.

హనుమాన్ ముఖాకృతిలో శిల

వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రం శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి స్వయంభూగా వెలసిన నల్లరాతి గుట్టపై ఓ శిల హనుమాన్ ముఖాకృతిలో కనిపిస్తుండటంతో పలువురు ఆసక్తిగా చూస్తున్నారు. గురువారం స్వామివారి జాతర జరుగుతున్న సందర్భంగా రాజన్‌బాబు అనే వ్యక్తి ఈ ఆకృతిని తన కెమెరాలో చిత్రించారు.

- గీసుకొండ



కేటీఆర్‌ను కేసుల్లో ఇరికించే యత్నం

- ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నేతల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాజీ మంత్రికేటీఆర్‌ను కేసుల్లో ఇరికించే యత్నం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్‌ఎస్ నాయకులు దేవీప్రసాద్, తుల ఉమ ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ఫార్ములా-ఈ రేస్ కోసం అనేక దేశాలు పోటీ పడ్డాయన్నారు. కేటీఆర్ కృషి వల్లే ఈ కార్ రేస్ వచ్చిందన్నారు. కొన్ని చానళ్లు ప్రాసిక్యూషన్ చేస్తున్నట్లు, విచారణలో భాగమైనట్లు వ్యవహరిస్తూ సమాజాన్ని పక్కదారి పట్టించే కుట్రకు తెరలేపుతున్నాయని విమర్శించారు. ఈడీ విచారణకు కేటీఆర్ హాజరైన సందర్భంగా ఆయన వెంట కొందరు నాయకులు వస్తే వారిపై కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. బీఆర్‌ఎస్ నేతలపై అకారణంగా పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉనికిలో లేని భూములపై విచారణ అనవసరం

66 ఏళ్ల క్రితం నాటి సివిల్ కేసును పరిష్కరించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఉనికిలో లేని దివంగత నవాబ్ భూములపై విచారణ జరపడం అనవసరమని హైకోర్టు సీజే ధర్మాసనం అభిప్రాయపడింది. దివంగత నవాబ్ మోయిన్ ఉద్ దౌలా బహదూర్, ఉస్మాన్ జా బహదూర్ వారసుల మధ్య నెలకొన్న 66 ఏళ్ల క్రితం నాటి భూ వివాదాన్ని హైకోర్టు పరిష్కరించింది. 1958లో దాఖలైన కేసులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. 1970లో హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సమరించింది. రాయదుర్గం, శివరాంపల్లి, షంషిగూడ, సోమాజిగూడ, బాలాపూర్‌తో పాటు 25 మక్తాలకు సంబంధించి ఏళ్లుగా వివాదం సాగుతోంది. వీటిపై తమకు హక్కులున్నాయని రెవెన్యూ శాఖ కూడా వాదిస్తోంది. దివంగత నవాబ్ మోయిన్ కుమార్తె సుల్తానా జహాన్ 1953లో తొలుత సిటీ సివిల్ కోర్టులో సూట్ దాఖలు చేయగా, అనంతరం ఆ పిటిషన్ హైకోర్టుకు బదిలీ అయ్యింది. నవాబ్ భూములకు సంబంధించిన కేసులను సివిల్ సూట్‌గా హైకోర్టు విచారిస్తోంది. 1959లో తొలుత ప్రాథమిక డిక్రీ జారీ చేసింది. మక్తాల నుంచి వచ్చే ఆదాయాన్ని వారసులందరికీ సమంగా పంపిణీ జరగాలని ఆదేశించింది. ఈ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే ఇదే అంశంపై మరికొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలోనే క్రమంగా మక్తాల పరిధిలోని భూములు ఉనికిలో లేకుండాపోయాయి. అయినా వివాదం కొనసాగుతూనే ఉంది. ప్రాథమిక డిక్రీ నాటికే ఆస్తులు సరిగా లేవని, వాటిపై ఇప్పుడు ఇంకా విచారణ అవసరం లేదంటూ సీజే ధర్మాసనం దావాను కొట్టివేసింది. 1970లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం తుది డిక్రీని రూపొందించాలని, దానిని స్టాంప్ పేపర్‌పై పొందుపరచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణపై ఇది ప్రభావం చూపదని పేర్కొంది.

తెలంగాణ ప్రజల సొమ్మును నీ దోస్తులకు దోచిపెట్టావ్

కేటీఆర్‌పై భువనగిరి ఎంపీ చామల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల డబ్బును కేటీఆర్ తన మిత్రుల కోసం దోచిపెట్టారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఫార్ములా ఈ ఆపరేషన్స్ తెలంగాణకు తలమానికం అని, అందుకే హెచ్‌ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు వెచ్చించానని గొప్పలు చెబుతూ డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం 'ఎక్స్'వేదికగా స్పందించారు. నిజానిజాలు తెలంగాణ ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. ఏస్ నెక్స్ జనరేషన్స్, గ్రీన్‌కో సంస్థ యాజమాన్యం అత్యంత దగ్గరి మిత్రులని, వారిని కాపాడేందుకు సీజన్ 1కి వాగ్దానం చేసిన రూ. 90 కోట్లు కాకుండా రూ. 30 కోట్లు చెల్లించారని పేర్కొన్నారు. మిగతా రూ. 60 కోట్లు చెల్లించని కారణంగా నోటీసులు జారీ చేసి కాంట్రాక్టు రద్దు చేస్తామని చెబితే, బాల్య మిత్రులను కాపాడేందుకు నిబంధనలకు విరుద్ధంగా అక్టోబర్ 2023లో హెచ్‌ఎండీఏ ద్వారా నిధులు బదిలీ చేశారన్నారు. తన వాళ్ల కోసం తీసుకున్న సొంత నిర్ణయాన్ని హైదరాబాద్‌ను కాపాడేందుకే అని లింకులు పెట్టి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు తెలంగాణకు తామే సర్వం అనుకొంటూ తండ్రీకొడుకులు నియంతలా పాలించారని చామల విమర్శించారు.

మీనం.. మరింత ప్రియం

- పండుగ వేళ.. భారీగా పెరిగిన ధరలు
- ఏపీ నుంచి భారీగా తగ్గిన చేపల రవాణా
- తెలంగాణలో ఉన్నది అంతంతే... అవి కూడా రాని వైనం



సాక్షి, హైదరాబాద్ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో చేపల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఒక వైపు మాంసం రూ. 800- రూ.1,000 వరకు ఉండగా, చేపలు తిందామన్న వారికి పెరిగిన ధరలు షాక్ కొట్టాయి. ఎప్పుడూ అందుబాటులో ఉండే చేపల ధరలు ఏకంగా రెట్టింపు అయ్యాయి. తెలంగాణలో కావాల్సినన్ని చేపలు అందుబాటులో లేకపోవడం, ఏపీ నుంచి తక్కువగా చేపల లోడ్లు రావడం ధరల పెరుగుదలకు కారణమైంది.

ఇక్కడ ఇప్పుడిప్పుడే....

తెలంగాణవ్యాప్తంగా ఉన్న చెరువుల్లో ఇప్పుడిప్పుడు పెరిగే దశలో చేపలు ఉన్నాయి. కొన్ని చెరువులు, రిజర్వాయర్లు, డ్యాంలలో మాత్రం పెద్దవి ఉన్నా, అవి అక్కడి ప్రాంత ప్రజలకే సరిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన చేప పిల్లలు ప్రస్తుతం పావు కిలో సైజు కూడా పెరగలేదు. మొత్తంగా చూస్తే రాష్ట్రానికి సరిపడా చేపలు లేవని చెప్పొచ్చు. ఇవన్నీ కిలో నుంచి రెండు కిలోల వరకు కావాలంటే మార్చి, మే నెల అవుతుంది. అప్పటి వరకు ఇతర రాష్ట్రాలపై ఆధారపడకతప్పని పరిస్థితి.

ఏపీపైనే భారం

ఏపీ, ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు చేపలు రావాలంటే ఖర్చులు తడిసిమోపెడు అవుతాయి. చేపల రవాణా, ప్యాకింగ్, ఐస్, టోల్, ఏపీ, తెలంగాణ సరిహద్దు ట్యాక్స్, ముషీరాబాద్ వ్యాపారులకు కమీషన్ ఇవ్వడం లాంటివి చేపల ధరలు రెట్టింపునకు కారణమవుతున్నాయి. మరో వైపు సంక్రాంతి కారణంగా అక్కడి మత్స్యకారులు ఎక్కువ సంఖ్యలో చేపల వేటకు వెళ్లకపోవడం, తక్కువ మొత్తంలో చేపలు రావడంతో ధరలు పెరిగాయని ముషీరాబాద్ వ్యాపారులు అంటున్నారు.

చేపల ధరలు ఇలా (రూ.లలో)

రకం	గతం	ఇప్పుడు
రవ్వ	120 నుంచి 150	200 నుంచి 250
బొచ్చ	130 నుంచి180	220 నుంచి 250
కొర్రమట్ట	350 నుంచి 500	500 నుంచి 600
రొయ్యలు	250 నుంచి 350	300 నుంచి 500
బోన్‌లెస్	250 నుంచి 300	450 నుంచి 500
పండుగప్ప	450 నుంచి 600	600 నుంచి 800
వంజరం	600 నుంచి 800	800 నుంచి 1,000



న్యూయార్క్‌లో బోనాల ఉత్సవాలు

- మంత్రి సీతక్కకు 'నైటా' ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: జూన్‌లో న్యూయార్క్‌లో నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్కను న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) కార్యవర్గం ఆహ్వానించింది. గురువారం ఈ మేరకు నైటా కార్యవర్గం మంత్రికి ఆహ్వానాన్ని అందించగా, ఈ కార్యక్రమంలో పాల్గొనే విషయంలో ఆమె సానుకూలత వ్యక్తంచేశారు. నైటా నూతన అధ్యక్షురాలిగా ఎంపికైన వాణి ఏనుగును, కొత్త కార్యవర్గాన్ని ఈ సందర్భంగా సీతక్క అభినందించారు. అమెరికాలోని ప్రధాన నగరం న్యూయార్క్‌లో తెలుగువారికి ఓ సంఘం ఏర్పాటు చేయటంతో పాటు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించేందుకు నైటా చేస్తున్న కృషిని మంత్రి ప్రశంసించారు. మహిళా శక్తికి ఆదర్శంగా నిలిచి, నైటా సేవలను మరింత విస్తృత పరచాలని సీతక్క సూచించారు. వాణితో పాటు వారి కుటుంబ సభ్యులను శాలువా కప్పి సన్మానించారు.

రేవంత్ నోరు తెరిస్తే అబద్ధాలే

- మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడతారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 13 నెలలుగా సీఎం రేవంత్ అబద్ధాలతోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. సోనియాగాంధీపై రేవంత్ గతంలో ఎన్నోరకాల విమర్శలు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో హామీలు అమలు చేస్తానని చెప్పిన రేవంత్.. నాలుగువందల రోజులైనా అమలు చేయడం లేదన్నారు. ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల సమయంలో ప్రజలు రేవంత్ మాటలు నమ్మలేదని, ఇప్పుడు మళ్లీ ఢిల్లీలో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు రేవంత్‌రెడ్డి తీరును గమనిస్తున్నారని అన్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా, బాధ్యత ఉన్న నాయకుడిగా కేటీఆర్ ఈడీ విచారణకు హాజరయ్యారని చెప్పారు. కేటీఆర్‌పై అక్రమ కేసు నమోదు చేశారని, ఈ ఫార్ములా కేసులో నయా పైసా అవినీతి జరగలేదని కేటీఆర్ మొదటినుంచీ చెబుతున్నారని వివరించారు. కక్షపూరితంగా ఆ కేసు నమోదు చేశారని ప్రజలకు కూడా తెలుసన్నారు. అయినప్పటికీ విచారణ సంస్థలకు కేటీఆర్ సహకరిస్తారని చెప్పారన్నారు. ఈడీ కార్యాలయం వద్ద పోలీసులు అత్యుత్సాహంతో బీఆర్‌ఎస్ నేతలను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. పోలీసులు రేవంత్‌రెడ్డి చెప్పినట్లు కాకుండా చట్టానికి లోబడి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్.. ఇవి ప్యాక్ చేసి పెట్టుకోండి

- 'ఎక్స్'లో ఎమ్మెల్యే రాజాసింగ్ పోస్ట్



సాక్షి, హైదరాబాద్: కర్మ ఎవరినీ వదిలిపెట్టదని, అది సరైన సమయం కోసం వేచిచూస్తుందంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఉద్దేశించి బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ గురువారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కేటీఆర్ జైలుకు వెళ్లే ముందు ప్యాక్ చేసి పెట్టుకోవాల్సిన చెక్‌లిస్ట్ అంటూ.. 'కటకటాల వెనుక కూడా ఫ్యాషనబుల్‌గా ఉండేందుకు నాలుగు సెట్ల దుస్తులు, జైలులో నిద్ర బాగా పట్టేందుకు మంచి దుప్పటి, పరిశుభ్రత కోసం టవల్, భావోద్వేగాల అదుపు కోసం రుమాలు, 'క్లీన్ ఇమేజ్'ను కొనసాగించేందుకు సబ్బు, జైలు భోజనం ఫైవ్‌స్టార్ స్థాయి కాదు కాబట్టి ఒక ప్యాకెట్ ఊరగాయ, ఒక స్వెట్టర్ సిద్ధం చేసుకోవాలి. ఇతరులను లక్ష్యంగా చేసుకోవడానికి అధికారాన్ని దుర్వినియోగం చేసేవారు చివరికి అనుభవించక తప్పదు' అని రాజాసింగ్ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

క్లుప్తంగా...

శతాధిక వృద్ధుల మృతి


మాదాసు రావమ్మ


ఆనందరావు

ఉండ్రాజవరం/తాళ్లరేవు: తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాళ్లరేవు మాధవరాయునిపేట గ్రామాల్లో ఇద్దరు శతాధిక వృద్ధులు గురువారం మృతి చెందారు. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన మాదాసు రావమ్మ (106) భర్త రత్తయ్య 25 ఏళ్ల క్రితం మృతి చెందారు. అప్పట్లో ఆయన రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారని మనవడు, ఆలిండియా చిరంజీవి యూత్ వైస్ ప్రెసిడెంట్ కటకం రామకృష్ణ తెలిపారు. రావమ్మకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు, 11 మంది మనవలు, 27 మంది మునిమనవలు, 58 మంది ముదిమనవలు ఉన్నారు. అలాగే, మండల కేంద్రమైన తాళ్లరేవు గ్రామంలోని మాధవరాయునిపేటకు చెందిన మృతుడు ఇరుసుమండ ఆనందరావు (105) చిన్నతనం నుంచీ కూలి పని చేసుకునేవాడు. తరువాత తాళ్ల తయారీ, చెప్పులు కుట్టే కార్మికుడిగా పని చేసేవాడు. బ్రహ్మచారిగా జీవనం సాగిస్తూ..అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు కుటుంబసభ్యులు నిర్వహించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

మంత్రి నాదెండ్ల

ఏలూరు టౌన్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో టీం స్పిరిట్‌తో పనిచేసి పేదలకు వైద్యసేవలు అందించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్ చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం ఏలూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక సేవలతోపాటు స్పెషాలిటీ చికిత్సలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులను కలిసి ఆరా తీశారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించి రోగులకు సేవలు అందించాలన్నారు.

వెంకటగిరి చర్చిలో జర్మనీ, అమెరికా దేశీయులు



వెంకటగిరి రూరల్: ఏసుక్రీస్తు మార్గంలో పయనించి ప్రజలకు సేవ చేయాలని అమెరికన్, జర్మనీ దేశస్తులు పిలుపునిచ్చారు. గురువారం తిరుపతికి చెందిన సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి ఆధ్వర్యంలో వెంకటగిరిలోని పలు చర్చిలను వారు పరిశీలించారు. చర్చి సంఘాలు అక్కడ చేస్తున్న సువార్త కార్యక్రమాలపై ఆరా తీశారు. 100 ఏళ్ల క్రితం వెంకటగిరి ప్రాంతంలో సువార్తను చాటిన అమెరికన్ సువార్తీకుడు స్టీవ్ సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నార్త్ ఈస్టన్ మినిస్ట్రీ సైనోడ్ ఈఎల్‌టీపీ బిషప్, అమే, ఓడిగ్రేన్, ఈఎల్‌పీఏ ఛాంపియన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ఆలీసోమ్‌రిఛాడ్, ఈఎల్‌సీఏ పాస్టర్ రెవరెండ్ ఎలీనా, గోములక, తిరుపతి సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి బిషప్ విజయభాస్కర్, వైస్ ప్రెసిడెంట్ కేపీ లూథర్‌బాబు, ఎల్ఎల్‌సీ కార్యదర్శి కేజే ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టు జారి పోతోంది!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కనిపించని మల్బరీ సాగు / నామమాత్రపు రాయితీలతో సాగుకు దూరంగా రైతులు / పట్టు గూళ్ల ధరల్లో కూడా పెరుగుదల శూన్యం / స్పందించని రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): మల్బరీ తోటల సాగుపై, పట్టు పురుగుల పెంపకంపై రైతులు అనాసక్తి చూపుతున్నారు. ప్రత్యామ్నాయంగా పొగాకు, మినుము వంటి పంటలు సాగు చేస్తున్నారు. గతంలో ఆదోని ప్రాంతంలోని దొడ్డనగేరి, జాలిమంచి, కోసిగి, ఇస్వీ ప్రాంతాల్లో గతంలో ఎటు చూసినా మల్బరీ తోటలు ఉండేవి. ఈ ప్రాంతంలో పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం ఉండేది. అయితే క్రమంగా ఈ ప్రాంతంలో మల్బరీ సాగు తగ్గుతూ వచ్చి నేడు పూర్తిగా కనుమరుగైంది. దీంతో ఈ ప్రాంతంలో ఉన్న పట్టుపరిశ్రమల శాఖ ఏడీ కార్యాలయాన్ని ప్యాపిలికి మార్చారు. అక్కడ కూడా మల్బరీ సాగు తగ్గడంతో కార్యాలయం కర్నూలుకు వచ్చింది. గతంలో వెల్దుర్తి మండలం బోయినపల్లి, సూదేపల్లి, కోడుమూరు మండలం లద్దగిరి గ్రామాలు మల్బరీ సాగుకు నెలవుగా ఉండేవి. నేడు ఈ ప్రాంతాల్లో మల్బరీ సాగు కనిపించడం లేదు. నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, ఆత్మకూరు మండలాల్లో 2,000 ఎకరాల్లో మల్బరీ సాగు ఉండేది. ఆత్మకూరులో ప్రత్యేకంగా అసిస్టెంటు డైరెక్టర్ కార్యాలయం కూడా ఉంది. అయితే నేడు పరిస్థితులు తారుమారు అయ్యాయి. ఆత్మకూరు ఏడీ పరిధిలో 50 ఎకరాల్లో కూడా మల్బరీ సాగు కనిపించడం లేదు.

ఎందుకు ఇలా?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మల్బరీ సాగు 80 శాతం పైగా పడిపోయినా సెరికల్చర్, సహాయ సెరికల్చర్ ఆఫీసర్లు, సాంకేతిక సహాయకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు లేకపోవడం, పట్టుగూళ్ల ధరల్లో పురోగతి లేకపోవడంతో రైతులు పట్టుకు ప్రత్యామ్నాయంగా పొగాకు, మినుము వంటి పంటలు సాగు చేస్తున్నారు.

పెరిగిన పెట్టుబడి వ్యయం

పట్టు సాగులో పెట్టుబడి వ్యయం పెరిగిపోయింది. పట్టు పురుగుల పెంపకానికి షెడ్ అత్యవసరం. ఇందుకు రూ.15 లక్షల వరకు ఖర్చు వస్తోంది. ప్రభుత్వం గతంలో ఇస్తున్న సబ్సిడీ రూ.3 లక్షలే ప్రస్తుతం అందిస్తోంది. రెండు ఎకరాల్లో మల్బరీ మొక్కలకు రూ.45 వేలు, వ్యాధి నిరోధకాలకు రూ.5000. సూట్‌కు రూ.40 వేలు, వరండాకు రూ.30 వేలు, నేత్రికలకు రూ.50 వేలు ప్రకారం సబ్సిడీలు ఉన్నాయి. సబ్సిడీలు పోను మొక్కలు నాటుకోవడానికి రైతులకు రూ.20 వేలు, వ్యాధి నిరోధకాలకు రూ.12 వేలు, సూట్‌కు రూ.1.50 లక్షలు, వరండాకు రూ.లక్ష, నేత్రికలకు రూ.10 వేలు, చాకి పురుగులకు ఏడాదికి రూ.50 వేల వరకు ఖర్చు వస్తోంది. మొత్తం పెట్టుబడి వ్యయం రూ.20 లక్షల వరకు ఉండగా.. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు రూ.4.80 లక్షలు సరిపోవడం లేదు. పట్టుగూళ్లకు హిందూపురం, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో మార్కెటింగ్ సదుపాయం ఉంది. ఉమ్మడి జిల్లాలో మార్కెటింగ్ సదుపాయం లేదు. దీంతో రైతులకు నికరాదాయం రావడం లేదు.


మల్బరీ తోట

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మల్బరీ సాగు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. పెట్టుబడి వ్యయం రెట్టింపు అవుతున్నా రైతులకు సబ్సిడీలు అందడం లేదు. గతంలో కిలో పట్టుగూళ్లకు రూ.400 నుంచి రూ.500 వరకు వస్తుంటే నేడు కూడా అదే ధర పలుకుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పట్టుగూళ్ల మార్కెటింగ్ సదుపాయం లేదు. నష్టాలు ఎక్కువగా ఉండటంతో రైతులు మల్బరీ సాగుకు దూరమవుతున్నారు.


పట్టు పురుగుల పెంపకం

పట్టుపురుగులపై పురుగుమందుల ప్రభావం

ఏడెనిమిదేళ్లుగా కంది, పత్తి, మినుము, మిర్చి, మొక్కజొన్న, వరి తదితర పంటల్లో పురుగు మందుల వాడకం భారీగా పెరిగింది. ఈ ప్రభావం చుట్టుపక్కల ఉన్న పట్టు పురుగులపై పడుతోంది. పట్టు పురుగులు చాలా సున్నితంగా ఉంటాయి. గాలి వాటంగా వస్తున్న పురుగుమందుల ప్రభావానికి లోనై మరణిస్తున్నాయి. డోన్ మండలంలోని ఉడుములపాడు గ్రామం పరిసరాల్లో రెండు, మూడేళ్ల క్రితం పెస్టిసైడ్ కంపెనీ ఏర్పాటు అయింది. దీని ప్రభావం వెల్దుర్తి మండలం సూదేపల్లిలో సాగు చేస్తున్న పట్టు పరిశ్రమపై పడుతోంది. ఉమ్మడి జిల్లాలో పట్టు పరిశ్రమ మనుగడ కోల్పోతుండటానికి పురుగు మందుల పిచికారీ ప్రభావం కూడా ఎక్కువగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సాగుకు స్వస్తి పలికాం



పట్టు సాగులో విశేషంగా రాణిస్తున్నందుకు నాకు గతంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ రైతు అవార్డు వచ్చింది. బైవోల్టెన్ పట్టు గూళ్ల ఉత్పత్తికి గతంలో కిలోకు రూ.50 ఇంటెన్సివ్ లభించేది. ప్రస్తుతం రైతులకు ఇది లేకుండా పోయింది. పెట్టుబడి వ్యయం ఎక్కువవుతున్నా సబ్సిడీలు పెరగడం లేదు. పట్టు గూళ్ల ధరలు పెరగకపోవడంతో పట్టు సాగుకు స్వస్తి పలికి పొగాకు, మినుము తదితర వాటిపై ఆసక్తి చూపుతున్నాం. – భాస్కరరెడ్డి, ఆత్మకూరు

నష్టాలు మూట కట్టుకుంటున్నాం



పట్టులో ఏడాదికి 5 నుంచి 8 పంటలు తీయవచ్చు. ప్రస్తుతం ఈ పరిస్థితి లేదు. మూడు, నాలుగు పంటలే గగనం అవుతున్నాయి. ఒక్కోపంటకు రూ.80 వేలకుపైగా ఖర్చు వస్తోంది. పెట్టుబడి వ్యయం రూ.2.50 లక్షలు అయ్యింది. మూడు పంటలపై వచ్చిన పట్టుగూళ్లను అమ్మగా కేవలం రూ.1.90 లక్షలు మాత్రమే వచ్చింది. నష్టాలు మూట గట్టుకున్నాం.
– మధుసూదన్, రామసముద్రం, జూపాడుబంగ్లా మండలం

ఫిర్యాదులు వస్తున్నాయి



డోన్ మండలం ఉడుములపాడు సమీపంలో ఉన్న కెమికల్స్ ఫ్యాక్టరీ ప్రభావం సూదేపల్లి సాగు చేస్తున్న మల్బరీపై పడుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏడాదికేడాది పురుగు మందుల వినియోగం పెరుగుతోంది. దీంతో మల్బరీ సాగు నుంచి కొంతమంది రైతులు దూరం అవుతున్నారు. మల్బరీ సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
– విజయకుమార్, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి, కర్నూలు

వాస్తవాలను ప్రతిబింబిచేవే నాటికలు

బాపట్ల జిల్లా అనంతవరంలో రెండో రోజు ఆకట్టుకున్న నాటికలు

యద్దనపూడి: సమాజంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించేవే నాటికలని రచయిత, దర్శకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. గురువారం మండలంలోని అనంతవరం గ్రామంలో రెండో రోజు ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో ముఖ్య అతిథులుగా వేదిక చైర్మన్ ముత్తవరపు సురేష్‌బాబు, గుంటూరు కళాపరిషత్ అధ్యక్షులు పీవి మల్లికార్జున రావు, సినీ, టీవి నటుడు, దర్శకుడు నాయుడు గోపి పాల్గొన్నారు. కందిమళ్ల మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపించటంలో నాటికల పాత్ర కీలకమన్నారు. భాష ఉన్నతికి చిరునామాగా, సామాజిక హితాన్ని కాంక్షిస్తూ ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని వాస్తవ పరిస్థితులను పంచే నాటికలకు పూర్వవైభవం రావాలని ఆకాంక్షించారు. వేదిక చైర్మన్ ముత్తవరపు సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రేక్షకుల నాడి పట్టుకున్న కళలకు ఎప్పటికీ ఆదరణ ఉంటుందని, కళాకారులు, రచయితలు కూడా మారే కాలంతోపాటే మరిన్ని నాటికలను ఆవిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సన్మాన గ్రహీత నాయుడు గోపి మాట్లాడుతూ కళాపరిషత్‌లే కాక ప్రభుత్వాలు, ప్రైవేట్ టీవి చానల్స్, ఆధ్యాత్మిక సంస్థలు కూడా నాటికలకు ప్రోత్సాహం అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. పీవి మల్లికార్జునరావు మాట్లాడుతూ భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అనేక వివక్షలను నాటకం, నాటికలు ఎండగట్టాయని, సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా నాటిక ప్రదర్శనలు ఓ ఉద్యమమే చేసిందన్నారు. అలాంటి కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.


బ్రహ్మస్వరూపం నాటికలోని సన్నివేశాలు

కార్యక్రమంలో అనంతవరం కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, గుదే తారకరామారావు, మద్దినేని జయరామకృష్ణ, పెడవల్లి శ్రీనివాసరావు, పోపూరి శివసుబ్బారావు, నిమ్మల సాంబశివరావు, పెడవల్లి వెంకటేశ్వర్లు, మండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంచితనం వికసించినప్పుడు..

1వ నాటికగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మస్వరూపం నాటికలో మంచితనం వికసించినప్పుడు అందరూ మంచివాళ్లే కనిపిస్తారు. పరిపూర్ణమైన మనసుతో చూడగలిగితే మనకు నచ్చిన జీవితం మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది. కఠినమైన సందర్భాల్లో విధి విరోధిగా మారిన వేళల్లో మనం నిస్సహాయులుగా మిగిలిపోతున్నప్పుడు సాక్షాత్తూ ఆ బ్రహ్మస్వరూపమే ఆవహించి ధర్మాన్ని చెప్తుందంటూ ఇతివృత్తంగా నాటిక సాగింది.

గెలిచేదంతా నిజం కాదు..

2వ నాటికగా యంగ్ థియేటర్ విజయవాడ వారి 27వ మైలురాయి నాటికలో.. నిజం గెలుస్తుంది అన్నది నిజమే కానీ, గెలిచేదంతా నిజం మాత్రం కాదు. ఇప్పుడున్న చాలా మంది న్యాయవాదులు తమ క్లయింట్లను గెలిపించుకునేందుకు అడ్డమైన కేసులు వాదిస్తున్నారు. సమాజానికి కీడు చేసే కేసులు వాదించకుండా ఉండటమే ఉత్తమమం అనే ప్రధానాశంగా రాయబడ్డ నాటిక 27వ మైలురాయి.

కోరికలే శత్రువులుగా..

3వ నాటికగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి నిశి నాటికలో మదిని తొలిచే కోరికలు మనిషిని ఒక పట్టాన నిలవనియ్యవు. కోరికల మత్తులో ఏమాత్రం భయం లేకుండా అక్రమసంబంధాలకు పాల్పడతారు. ఏదో ఒక రోజు తమ తప్పులను కప్పి పుచ్చుకోవటానికి తాను చేసే ప్రయత్నాల్లో విచక్షణ కోల్పోయి తప్పులు చేస్తాడు. ఇలాంటి ఘటనలు ఎలా జరుగుతాయి వాటికి కారణాలేంటి, జరిగాక వాటి ప్రతిఫలం ఏంటి అనేదే నిశి నాటిక సారాంశం.

అండర్-14 జట్టుకు బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఎంపిక

విద్యా సమాచారం



బాపట్ల: అండర్-14 క్రికెట్ ఆంధ్ర జట్టులో బాపట్ల విద్యార్థి అబ్దుల్ సాద్ ఉనైస్‌కు అవకాశం దక్కింది. గత నెలలో జరిగిన అండర్-14 జిల్లాస్థాయి ఎంపికల్లో తొలిసారిగా పాల్గొని గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. కృష్ణా, చిత్తూరు, నెల్లూరు, విజయనగరం, శ్రీకాకుళం, అనంతపూర్, విశాఖపట్నం జిల్లాలతో జరిగిన పోటీల్లో తన ప్రతిభ కనబర్చాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది క్రీడాకారుల్లో సాద్ స్థానం దక్కించుకున్నాడు. చివరిగా విజయనగరంలో జరిగిన జోనల్ పోటీల్లో 17 మందితో కూడిన ఆంధ్ర అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. అందులో అబ్దుల్ సాద్ కూడా ఒకరు కావడం విశేషం. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-14 పోటీల్లో అబ్దుల్ సాద్ పాల్గొనబోతున్నారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన అబ్దుల్ సాద్‌ను ఉత్తమ క్రీడాకారుడుగా తీర్చిదిద్దటంలో కృషిచేసిన కోచ్ అమీర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్, స్టాన్లీ విమల్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అబ్దుల్ సాద్‌కు పలువురు క్రీడాకారులు, పుర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

శ్రీవారి క్షేత్రం భక్తులతో కిటకిట

ఆధ్యాత్మిక సమాచారం



ద్వారకాతిరుమల: సంక్రాంతి పండుగ ముగిసింది.. సంప్రదాయ క్రీడలకు.. ఆట, పాటలకు తెరపడింది. దాంతో గురువారం ఉభయ గోదావరి జిల్లాల నుంచి సొంత ఊళ్లకు పయనమైన వారంతా మార్గమధ్యలోని ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల క్షేత్రాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి అతిథులతో శ్రీవారి ఆలయం కళకళలాడింది. మళ్లీ సంక్రాంతికి వస్తాం స్వామీ.. అంటూ వారంతా చినవెంకన్నను దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపంలో భక్తులు పోటెత్తారు. శ్రీవారిని దర్శించిన వారిలో ఎక్కువగా తెలంగాణ రాష్ట్రానికి వెళ్లే వారే కనిపించారు. వారి వాహనాలే ఎక్కువగా కొండపైకి వచ్చాయి. దాంతో టోల్‌గేట్ ప్రాంతంలో పెద్ద ఎత్తున వాహనాలు బారులు తీరాయి.

బాలలకు నవోదయం

ప్రవేశ పరీక్ష తేదీ:	18-1-2025
ప్రవేశం:	6వ తరగతి
పరీక్షా కేంద్రాలు:	26
సమయం:	ఉదయం 11.30 - మధ్యాహ్నం 1.30 గంటల వరకు
దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు:	5058
సీట్లు:	రాజంపేటలో 80, మదనపల్లెలో 80

పరీక్ష రకం	ప్రశ్నలు	మార్కులు	కాలవ్యవధి
మేధాశక్తి	40	50	60 నిమిషాలు
అంక గణితం	20	25	30 నిమిషాలు
భాషా పరీక్ష	20	25	30 నిమిషాలు



మదనపల్లెలోని నవోదయ విద్యాలయం


కంప్యూటర్ తరగతులకు హాజరైన విద్యార్థులు

ఈ నెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహణ

సీటు సాధించాలంటే మెలకువలు తప్పనిసరి

మదనపల్లె సిటీ: గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థుల జీవితానికి జవహర్ నవోదయ విద్యాలయం విజ్ఞాన వారధిగా నిలుస్తోంది. విలువలతో కూడిన విద్య, నైపుణ్యాలు, దేశభక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఎన్‌సీసీ ఇలా అన్నింటికి నవోదయ విద్యాలయం ప్రసిద్ధి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సామాన్య, బడుగు, బలహీనవర్గాల పేద విద్యార్థులకు విద్యనందిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె సమీపంలోని వలసపల్లెలోని నవోదయ విద్యాలయం, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని రాజంపేట నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 18న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో ఇందులో సీటు సాధించేందుకు మెలకువలను అక్కడి ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. ఒకే బుక్‌లెట్‌లో (ప్రశ్నపత్రం) మూడు భాగాలుంటాయి.

అంకగణితం పరీక్ష



ప్రవేశ పరీక్షలో అంకగణితంలోని 23 చాప్టర్ల నుంచి ఒక లెక్క వస్తుంది. సరాసరి, సంఖ్యల మీద మూల ప్రక్రియ, దశాంశాలను భిన్నంకాలుగా మార్చడం, భిన్నాంకాలను దశాంశాలుగా మార్చడం, వివిధ రకాల కొలతలు, పొడవులు, శక్తి, కాలం, ధనం మొదలైన వాటితో సంఖ్యతో వినియోగం, చిన్న సంఖ్యలు భిన్నంతో కూడిక, తీసివేత, గుణకారం,శాతాన్ని లెక్కించడం, లాభం, నష్టం (శాతం లెక్కింపు లాభం, నష్టం అంశం నుంచి వినహాయింపు) చుట్టుకొలత, ప్రాంతం-బహుభుజి, దీర్ఘచతురస్రం, త్రిభుజాలు వస్తాయి. వీటిపై ఎక్కువ సాధన చేయాలి. కోణం రకాలు, బార్ రేఖాచిత్రం తప్పకుండా వస్తుంది.
–చలపతినాయుడు, గణిత ఉపాధ్యాయుడు, మదనపల్లె

విద్యార్థి సామర్థ్యం అంచనా



విద్యార్థి పఠనాశక్తిని అంచనా వేయడానికి పరీక్ష ఉంటుంది. సొంతంగా గద్యభాగం ఇస్తారు. ప్రతి అంశానికి ఐదు ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా చదివి ప్రశ్నలకు జవాబులను సమాధానపత్రంలో గుర్తించాలి. కింద ఒక గద్యాంశం, దానికి కొన్ని ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థి దీనిని ఒక నమునాగా గ్రహించాలి. గద్యభాగం అర్థం, తెలుగుకు సంబంధించిన గద్యభాగాలను ఎక్కువగా ఇస్తారు. చిన్న పిల్లలకు ఇచ్చే పుస్తకాల్లో ఏదైనా ఒక కథ అంశాన్ని ఎంచుకుని ఇస్తారు. తెలుగు వాచకంలో ఎక్కడ ఉండవు. వీటికి మంచి మార్కులు తెచ్చుకుంటే సీటు సాధించవచ్చు. –క్రిష్ణయ్య, ఉపాధ్యాయుడు, మదనపల్లె

పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశాం. 26 కేంద్రాలకు సిబ్బంది,ప్రత్యేక స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఉంటారు. ప్రవేశపరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి నేరుగా సీట్లు కేటాయిస్తాం. ఇక్కడ సీటు వస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అన్ని వసతులు ఉంటాయి. ఒత్తిడి చేయడం, ప్రయోగ పూర్వకంగా బోధిస్తాం. ప్రతి రోజూ ఆయా తరతగతుల ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది.
–వేలాయుధన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ, మదనపల్లె



● నాగచైతన్య



● బ్రహ్మానందం



● సుధీర్ బాబు



● ఎన్టీఆర్



● నితిన్

ఫిబ్రవరి అంటే వెంటనే... సినిమా లవర్స్‌కు ప్రపంచ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రిలీజ్ అయ్యే సినిమాలు గుర్తొస్తాయి. ముఖ్యంగా ప్రేమ నేపథ్యంలో వచ్చే చిత్రాలను విడుదల చేయడానికి దర్శక-నిర్మాతలు ప్రయత్నిస్తే, ప్రేక్షకులు కూడా లవ్ మూవీస్‌ని ఆశిస్తారు. దానికి తగ్గట్టే ఫిబవరిలో అరడజను ప్రేమకథా చిత్రాలు థియేటర్స్‌లోకి రానున్నాయి. వీటితో పాటు యాక్షన్, ఎమోషనల్ మూవీ చిత్రలు కూడా ఉన్నాయి. ఇలా వచ్చే ఫిబ్రవరి నెలలో సినిమాల సందడి మరింత పెరగనుంది.

ఫిబ్రవరిలో సినీ జాతర

● ప్రేమకథా చిత్రాలే ఎక్కువ ● లవర్స్ డేకి ఐదు సినిమాలు?



● సందీప్ కిషన్



● విశ్వక్‌సేన్

రాజుగాడి లవ్‌స్టోరీ

'లవ్‌స్టోరీ' చిత్రం తర్వాత హీరో నాగ చైతన్య, హీరోయిన్ సాయిపల్లవి జోడీగా నటించిన సినిమా 'తండేల్'. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ ఇంటెన్స్ లవ్‌స్టోరీ ఫిల్మ్‌ను దర్శకుడు చందు మొండేటి తెరకెక్కించారు. ఈ చిత్రంలో రాజు అనే జాలరి పాత్రలో నాగ చైతన్య, సత్య పాత్రలో సాయిపల్లవి నటించారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఇక ఈ చిత్రకథ విషయానికొస్తే... ఉత్తరాంధ్ర మత్స్యకారులు జీవనోపాధి కోసం గుజరాత్‌కు వెళ్తారు. అక్కడి సముద్ర తీరంలో తెలియక ఇండియన్ బోర్డర్ దాటి, పాకిస్తాన్ కోస్టు గార్డులకు బంధీలుగా చిక్కుతారు. వీరందరి జీవితాలు ఏమయ్యాయి? అన్నదే 'తండేల్' సినిమా కథ అని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ సినిమాలోని రాజు పాత్ర కోసం నాగచైతన్య, ఉత్తరాంధ్రకు వెళ్లి అక్కడి ప్రజలతో మాట్లాడారు. ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఉత్తరాంధ్ర యాస నేర్చుకున్నారు. ఇక 'ఒక పథకం ప్రకారం' అంటూ ఇదే రోజు థియేటర్స్‌లోకి వచ్చేందుకు రెడీ అవుతున్నారు హీరో సాయిరామ్ శంకర్. '143, బంపర్ ఆఫర్' వంటి సినిమాల్లో నటించిన సాయిరామ్ శంకర్ నటించిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఒక పథకం ప్రకారం'. క్రైమ్ మిస్టరీగా రానున్న ఈ మూవీలో సాయిరామ్ శంకర్ అడ్వొకేట్ పాత్రలో, సముద్ర ఖని పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. గార్లపాటి రమేష్‌తో కలిసి ఈ చిత్రదర్శక-నిర్మాత వినోద్ కుమార్ విజయన్ నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరి 7న రిలీజ్ కానుంది. శ్రుతీ సోధి, ఆషిమా నర్వాల్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. రాహుల్ రాజ్ సంగీతం అందించిన ఈ సినిమాకు మరో మ్యూజిక్ డైరెక్టర్ గోపీసుందర్ ఆర్ఆర్ అందించారు. ఇక ఈ సినిమాల కంటే ముందు అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన 'రాచరికం' సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది. దర్శక-ద్వయం సురేష్ లంకపల్లి, ఈశ్వర్ వాసె దర్శకత్వంలో ఈ మూవీని ఈశ్వర్ నిర్మించగా, ఈ చిత్రం ఫిబ్రవరి 1న రిలీజ్‌కు సిద్ధం అవుతోంది.

ఇటు ప్రేమ... అటు సంఘర్షణ

విశ్వక్ సేన్ హీరోగా నటించిన యూత్ ఫుల్ లవ్‌స్టోరీ మూవీ 'లైలా' ఫిబ్రవరి 14న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో మోడల్ సోనూగా, అమ్మాయి లైలాగా డిఫరెంట్ వేరియేషన్స్ ఉన్న రోల్స్‌లో నటిస్తున్నారు విశ్వక్ సేన్. రామ్ నారాయణ్ డైరెక్షన్‌లో సాహు గారపాటి ఈ మూవీని నిర్మించారు. ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాకు లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. మరో వైపు ఇటీవలే 'క'తో ఓ మంచి హిట్ అందుకున్న కిరణ్ అబ్బవరం లవర్స్ డే రోజున 'దిల్ రూబా' అనే లవ్ అండ్ యాక్షన్ మూవీతో థియేటర్స్‌లోకి వస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరి 14న రిలీజ్ కానుంది. రుక్సార్ థిల్లాన్ హీరోయిన్‌గా, నాజియా డేవిసన్ మరో కీలక పాత్రలో నటించిన ఈ మూవీకి సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. ఆల్రెడీ లవ్ ఫెయిల్యూర్ అయిన ఓ అబ్బాయి, మరోసారి మరో అమ్మాయితో ప్రేమలో పడితే ఏమైంది? అనే కథాంశంతో ఈ మూవీ తెరకెక్కినట్లుగా తెలిసింది. ఈ రెండు సిటీ లవ్‌స్టోరీ మూవీస్‌తో పాటు ఓ గ్రామీణ లవ్‌స్టోరీ కూడా ఇదే రోజున థియేటర్స్‌లోకి రానుంది. 'నీది నాది ఒకే కథ', 'విరాట పర్వం' సినిమాలు తీసిన దర్శకుడు వేణు ఊడుగుల నిర్మాతగా మారి, మరో నిర్మాత రాహుల్ మోపిదేవితో కలిసి 'రాజు వెడ్స్ రాంబాయి' అనే తెలంగాణ గ్రామీణ ప్రేమకథ తీశారు. ఖమ్మం- వరంగల్‌ల సరిహద్దు నేపథ్యంలో వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీతో సాయిలు కంపాటి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గత ఏడాది నవంబరులో జరిగిన 'రాజు వెడ్స్ రాంబాయి' గ్లింప్స్ వీడియోలో ఈ మూవీని ఫిబ్రవరి 14న థియేటర్స్‌లో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ సినిమా నటీనటులు సాంకేతిక నిపుణులపై మరోసారి స్పష్టత రావాల్సి ఉంది.

తాతా మనవడు... తండ్రీకొడుకు

ఈ ప్రేమికుల దినోత్సవం రోజున లవ్ స్టోరీ మూవీస్ మాత్రమే కాదు.. ఎమోషనల్ చిత్రాలు కూడా థియేటర్స్‌లోకి వస్తున్నాయి. ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్, 'వెన్నెల' కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించిన వినోదాత్మక చిత్రం 'బ్రహ్మ ఆనందం'. నిజ జీవితంలో తండ్రీకొడుకులైన బ్రహ్మానందం, రాజా గౌతమ్ 'బ్రహ్మ ఆనందం' మూవీలో మాత్రం తాతా మనవళ్లుగా నటించారు. ప్రియా వడ్లమాని, ఐశ్వర్యా హోలక్కల్, సంపత్, రాజీవ్ కనకాల ఈ సినిమాలోని ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, శాండిల్య పీసపాటి సంగీతం అందిస్తున్నారు. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. కానీ గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసి, ఈ మూవీని ఫిబ్రవరి 14న రిలీజ్ చేయనున్నట్లుగా వెల్లడించారు. ఇక నటుడు ధన్‌రాజ్ నటించి, దర్శకత్వం వహించిన 'రామం రాఘవం' మూవీ కూడా ఫిబ్రవరి 14నే రిలీజ్ కానుంది. తండ్రి పాత్రలో సముద్ర ఖని, తనయుడి పాత్రలో ధన్‌రాజ్ కనిపిస్తారు. తండ్రీ కొడుకుల ఎమోషన్స్ నేపథ్యంలో సాగే ఈ మూవీని గత ఏడాదే రిలీజ్ చేయాలనుకున్నారు. కుదరకపోవడంతో ఫిబ్రవరి 14న రిలీజ్ చేసేందుకు చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోంది. కొడుకు ప్రయోజకుడైతే చూడాలనుకునే తండ్రి, తనను తన తండ్రి సరిగా అర్థం చేసుకోవడం లేదనుకునే ఓ కొడుకు మధ్య సాగే భావోద్వేగ సంఘర్షణల నేపథ్యంలో ఈ 'రామం రాఘవం' మూవీ రానుంది.



● కిరణ్ అబ్బవరం



● సాయిరామ్ శంకర్


శివరాత్రికి...

గత ఏడాది ఫిబ్రవరిలో 'ఊరి పేరు భైరవకోన' అనే ఓ హారర్ మూవీతో మంచి హిట్ అందుకున్నారు సందీప్ కిషన్. ఈ సెంటిమెంట్‌ను కంటిన్యూ చేయాలనుకుంటున్నారేమో. ఈ ఏడాది ఫిబ్రవరిలో 'మజాకా' మూవీతో సందీప్ కిషన్ వస్తున్నారు. సందీప్ కిషన్, రీతూ వర్మ హీరో హీరోయిన్లుగా, రావు రమేశ్, 'మన్మధుడు' ఫేమ్ నటి అన్షు ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ 'మజాకా'. 'నేను లోకల్, ధమాకా' చిత్రాల ఫేమ్ నక్కిన త్రినాథరావు ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సందీప్ కిషన్, రావు రమేశ్ తండ్రీ కొడుకులుగా నటించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేశ్ దండా నిర్మించిన ఈ 'మజాకా' చిత్రం ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఇక ఫిబ్రవరి చివర్లో అంటే శివరాత్రికి 'తమ్ముడు'గా థియేటర్స్‌లోకి రానున్నారు నితిన్. వేణు శ్రీరామ్ దర్శకత్వంలో నితిన్ హీరోగా 'తమ్ముడు' అనే మూవీ రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీని 'దిల్' రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మహాశివరాత్రి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా ఆల్రెడీ మేకర్స్ ప్రకటించారు. ఇక సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న మూవీ 'జటాధర'. శాస్త్రీయ, పౌరాణిక అంశాలతో ఈ మూవీకి వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను ప్రేరణా అరోరా, సివిన్ నారం, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ నిర్మిస్తున్నారు. గత ఏడాది ఆగస్టులో ఈ సినిమా ఫస్ట్ లుక్స్‌ను రిలీజ్ చేశారు. ఆ సమయంలో 'జటాధర' మూవీని మహాశివరాత్రి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. అయితే 'తమ్ముడు, జటాధర' రిలీజ్ డేట్స్‌పై మరోసారి స్పష్టత రావాల్సి ఉంది. అలాగే ఫిబ్రవరి 28న థియేటర్స్‌లో ఆది పినిశెట్టి 'శబ్దం' చేయనున్నారు. 'ఈరమ్' (తెలుగులో 'వైశాలి') తర్వాత హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా మూవీ 'శబ్దం'. సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లే, ఎం.ఎస్. భాస్కర్ ఇతర కీలక పాత్రల్లో ఈ మూవీని 7జీ శివ నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీని ఫిబ్రవరి 28న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించారు. అయితే ఫిబ్రవరి నెల ఆరంభానికి ఇంకా సమయం ఉంది. కాబట్టి ఫిబ్రవరి నెలలో రిలీజ్ అయ్యేందుకు మరికొన్ని సినిమాలు బరిలోకి రావొచ్చు లేదా ఆల్రెడీ ఫిబ్రవరి రిలీజ్‌కు రెడీ అయిన సినిమాల్లో విడుదల వాయిదా పడే అవకాశం లేకపోలేదు. మరి... ఫిబ్రవరిలో ఫైనల్ రిలీజ్ బెర్త్‌లు ఖరారు చేసుకున్న సినిమాలేవో తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.

అనువాదాలు ఉన్నాయి

అజిత్ హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'విడాముయర్చి'. తెలుగులో 'పట్టుదల' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో త్రిష హీరోయిన్‌గా నటిస్తుండగా, మరో కీలక పాత్రలో అర్జున్ నటించారు. మగిళ్ తిరుమేని దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ యాక్షన్ చిత్రం ఫిబ్రవరి 6న రిలీజ్ కానుంది. ఇక అనిఖా సురేంద్రన్, పవిష్, ప్రియా ప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్, వెంకటేశ్ మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ రొమాంటిక్ అండ్ లవ్ ఎంటర్‌టైనర్ మూవీ 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబం'. ధనుష్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ మూవీ ఫిబ్రవరి 7న రిలీజ్ కానుంది. అయితే ఈ సినిమాను తెలుగులో కూడా రిలీజ్ చేయాలని, ఫిబ్రవరిలోనే రిలీజ్ ఉండొచ్చనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. 2022లో విడుదలైన 'లవ్ టుడే' మూవీ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ హీరో ప్రదీప్ రంగనాథన్ తెలుగు ప్రేక్షకులకు నటుడిగా దగ్గరయ్యారు. ఈ కుర్ర హీరోగా నటించిన తమిళ చిత్రం 'డ్రాగన్' ఫిబ్రవరిలో రిలీజ్ కానుంది. తమిళంలో లవర్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అనుపమా పరమేశ్వరన్, కయాదు లోహర్ హీరోయిన్లుగా, కేఎస్ రవికుమార్, మిస్కిన్, వి.జె. సిద్ధు, హర్షద్ ఖాన్‌లు ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. తెలుగులోనూ ఈ మూవీని ఫిబ్రవరిలోనే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

- ముసిమి శివాంజనేయులు



● వెట్రి మారన్, కలైపులి ఎస్. థాను, సూర్య

ఇక షురూ!

సూర్య హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో 'వాడివాసల్' అనే ఓ పీరియాడికల్ డ్రామా రూపుదిద్దుకోనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను నాలుగేళ్ల క్రితమే ప్రకటించినా వివిధ కారణాల వల్ల సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈ ఏడాది సినిమా సెట్స్‌పైకి వెళ్లే చాన్సెస్ ఉన్నాయని కోలీవుడ్ సమాచారం. 'వాడివాసల్' సినిమాను ఉద్దేశిస్తూ, సూర్య-వెట్రిమారన్ ఉన్న ఫోటోను ఈ చిత్ర నిర్మాత కలైపులి ఎస్.థాను 'ఎక్స్'లో షేర్ చేశారు. దీంతో ఈ ఏడాదే 'వాడివాసల్' చిత్రం చిత్రీకరణ షురూ అవుతుందని కోలీవుడ్ టాక్. ఆల్రెడీ ఈ సినిమా గ్రాఫిక్స్ వర్క్స్ విదేశాల్లో జరుగుతున్నాయట. జల్లికట్టు నేపథ్యంతో 'వాడివాసల్' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న సినిమాతో సూర్య బిజీగా ఉన్నారు. త్రిష హీరోయిన్‌గా చేస్తున్న ఈ మూవీ చిత్రీకరణ ఆల్రెడీ మొదలైంది. కోర్టు రూమ్ డ్రామాగా రానున్న ఈ మూవీ ఈ ఏడాదే రిలీజ్ కానుందనే టాక్ వినిపిస్తోంది. అలాగే సూర్య హీరోగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో 'రెట్రో' అనే పీరియాడికల్ యాక్షన్ డ్రామా రూపుదిద్దుకుంది. ఈ సినిమా మే 1న రిలీజ్ కానుంది.

ఎమర్జెన్సీ @ రూ. 99

థియేటర్లలో నేటి నుంచి 'ఎమర్జెన్సీ' విధించనున్నారు నటి, ఎంపీ కంగనా రనౌత్. ఆమె లీడ్ రోల్‌లో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. జీ స్టూడియోస్‌తో కలిసి మణికర్ణిక ఫిల్మ్స్‌పై కంగనా రనౌత్ నిర్మించిన ఈ చిత్రం నేటి నుంచి థియేటర్లలో సందడి చేయనుంది. ఇదిలా ఉంటే... ఈ సినిమా విడుదల సందర్భంగా శుక్రవారం ఈ మూవీ టికెట్ ధర రూ. 99గా నిర్ణయించినట్లు కంగనా రనౌత్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ద్వారా ఆమె అందుకు సంబంధించిన పోస్టర్‌ను షేర్ చేశారు. భారతదేశ ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ ఉన్న సమయంలో 1975 నుంచి 1977 వరకు 21 నెలల పాటు విధించిన ఎమర్జెన్సీ టైమ్‌లో జరిగిన ఘటనలతో 'ఎమర్జెన్సీ' రూపొందింది. ఈ చిత్రంలో ఇందిరా గాంధీ పాత్రలో నటించారు కంగనా రనౌత్. అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి, మిలింద్ సోమన్, శ్రేయాస్ తల్పాడే, విశాక్ నాయర్, మిలింద్ సోమన్, సతీష్ కౌశిక్ ఇతర పాత్రల్లో నటించారు.



● 'ఎమర్జెన్సీ'లో కంగనా రనౌత్...

లుక్ సంతృప్తినిచ్చింది

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఓ పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్) తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. మార్చి 27న రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా 'పెద్ది' సినిమా టీజర్‌ను విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట చిత్రయూనిట్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో జగపతిబాబు కీలక సన్నివేశాల చిత్రీకరణలో పాల్గొంటున్నారు. కాగా ఈ సినిమాలో ఓ మంచి పాత్ర చేస్తున్నానని, ఈ మూవీలో తన లుక్ తనకెంతో సంతృప్తినిచ్చిందని, సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను షేర్ చేశారు జగపతిబాబు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'పెద్ది' సినిమా ఈ ఏడాది అక్టోబరులో దీపావళి సందర్భంగా విడుదల కానుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



● 'పెద్ది' లొకేషన్‌లో జగపతిబాబు

బిజినెస్ రీల్

ఇండియన్ బ్యాంక్ సీఈవోగా బినోద్ బాధ్యతలు

చెన్నై: ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (ఎండీ, సీఈఓ) బినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. శాంతి లాల్ జైన్ స్థానంలో ఆయన నియామకం జరిగింది. తాజా బాధ్యతలకు ముందు బినోద్ కుమార్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. కార్పొరేట్ బ్యాంకింగ్, ట్రెజరీ డివిజన్, అంతర్జాతీయ బ్యాంకింగ్, ఫైనాన్స్, డేటా అనలిటిక్స్, డేటా వేర్‌హౌసింగ్‌ల విభాగాలను ఆయన పర్యవేక్షించారు. ఆయనకు మూడు దశాబ్దాల సుదీర్ఘ బ్యాంకింగ్ అనుభవం ఉంది.

కైలాక్‌కు భారత్ ఎన్‌సీఏపీ రేటింగ్

ముంబై: వాహన రంగంలో ఉన్న స్కోడా ఆటో ఇండియా తయారీ కైలాక్ ఎస్‌యూవీ తాజాగా భారత్ ఎన్‌సీఏపీ 5-స్టార్ సేఫ్టీ రేటింగ్ దక్కించుకుంది. స్కోడా నుంచి ఈ రేటింగ్ పొందిన తొలి మోడల్ ఇదే. స్కోడా కుషాక్, స్లావియా ఇప్పటికే గ్లోబల్ ఎన్‌సీఏపీ సేఫ్టీ రేటింగ్ పొందాయి. 'స్కోడా డిజైన్‌లో భద్రత ఒక భాగం. 2008 నుండి ప్రతి స్కోడా కారు ప్రపంచవ్యాప్తంగా, అలాగే భారత్‌లో 5-స్టార్ సేఫ్టీ రేటింగ్‌తో క్రాష్-టెస్ట్ జరిగింది. భారత్‌లో 5-స్టార్ సేఫ్టీ-రేటెడ్ కార్ల సముదాయంతో భద్రతపై కంపెనీ ప్రచారంలో ముందుంది' అని స్కోడా తెలిపింది.

భారత్‌లో జేవీసీ రీ-ఎంట్రీ

న్యూఢిల్లీ: కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న జపాన్ బ్రాండ్ జేవీసీ భారత టీవీ విపణిలో రీఎంట్రీ ఇచ్చింది. ఇందుకోసం నోయిడాకు చెందిన సూపర్ ప్లాస్ట్రానిక్స్‌తో బ్రాండ్ లైసెన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రీమియం స్మార్ట్ క్యూఎల్ఈడీ టీవీలను తాజాగా ప్రవేశపెట్టింది. ధర రూ.11,999 నుంచి ప్రారంభం. ఇవి అమెజాన్‌తో ప్రత్యేకంగా లభిస్తాయి. థామ్సన్, కొడాక్, బ్లాపంక్ట్, వైట్-వెస్టింగ్‌హౌజ్ (ఎలక్ట్రోలక్స్) బ్రాండ్ల ఉత్పత్తులను సూపర్ ప్లాస్ట్రానిక్స్ ఇప్పటికే తయారు చేస్తోంది. ఫిలిప్స్ బ్రాండ్ కోసం షెంజెన్ స్కైవర్త్ డిజిటల్‌తో కంపెనీ ఒప్పందం చేసుకోనున్నట్టు తెలుస్తోంది. 2019లో వీరా గ్రూప్‌తో చేతులు కలిపిన జేవీసీ కంజ్యూమర్ డ్యూరబుల్స్ మార్కెట్లోకి ప్రవేశించింది.

బోర్డు సమావేశాలు

విప్రో, జియో ఫైనాన్షియల్, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, ఏథర్ ఇండస్ట్రీస్, స్టెరిలైట్ టెక్నాలజీస్, ర్యాలీస్ ఇండియా, 5పైసా క్యాపిటల్, కాంకర్డ్ ఎన్విరో, హాట్సన్ ఆగ్రో, ఇండియన్ హోటల్స్, మమతా మెషీనరీ, మంగళం ఇండస్ట్రీస్, రామకృష్ణ ఫోర్జ్, సనాతన్ టెక్స్‌టైల్, స్వరాజ్ ఇంజిన్స్, సుప్రీం పెట్రోటెక్, గణేష్ హౌసింగ్ కార్పొరేషన్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-1-2025	
విశాఖ	500-00
చిత్తూరు	503-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	470-00
వరంగల్	472-00
రిటైల్ ధర	5.30

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	641.7	7.99
BEL	277.5	3.6
SBILIFE	1,515.35	2.89
SHRIRAMFIN	546.95	2.58
ADANIPORTS	1,154.05	2.23

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,230.00	-2.51
DRREDDY	1,307.00	-2.26
HCLTECH	1,790.15	-1.95
TATACONSUM	938	-1.84
INFY	1,920.05	-1.52

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,108
ఎన్ఎస్ఈ	95,671
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,59,450
ఎఫ్ఐఐ	- 4,342
డీఐఐ	+ 2,929

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	77.56	$ 78.71
బ్రెంట్	81.08	$ 82.03

మారుతీ సుజుకీ నుంచి చిన్న ఈవీ!

తయారీలో గ్లోబల్ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దుతాం
- దేశంలో చిన్న కార్లకు ఇప్పటికీ డిమాండ్ ఉంది
- సుజుకీ మోటార్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ



న్యూఢిల్లీ: పరిమాణం, మార్కెట్ వాటాలో భారత్‌లో అతిపెద్ద కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) విభాగంపై దృష్టి సారిస్తోంది. దేశీయ ఈవీ మార్కెట్లో కంపెనీ ఎంట్రీ కాస్త ఆలస్యం అయిన సంగతి తెలిసిందే. 'ఈవీ మార్కెట్‌ను అధ్యయనం చేస్తున్నాం. మా పోటీదారుల ఉత్పత్తులు ఎలా పని చేశాయో చూశాం. భారతీయ మార్కెట్‌కు ఏమి అవసరమో మాకు తెలుసు. అంతర్జాతీయంగా సుజుకీ కార్పొరేషన్‌కు ఎలక్ట్రిక్ వెహికిల్స్‌తోపాటు ఇతర అన్ని మోడళ్లకు ఉత్పత్తి కేంద్రంగా భారత్ ఉంటుంది. ఉత్పత్తిలో దాదాపు 50 శాతం జపాన్, యూరప్‌కు ఎగుమతి చేస్తాం' అని సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, రిప్రజెంటేటివ్ డైరెక్టర్ తొషిహిరో సుజుకీ గురువారం వెల్లడించారు. భారత్ మొబిలిటీ ఎక్స్‌పో నేటి (జనవరి 17) నుంచి ప్రారంభం అవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

చిన్న ఎలక్ట్రిక్ కార్లు..

ఎస్‌యూవీలపై ప్రధానంగా దృష్టి సారిస్తూ భారత ప్యాసింజర్ వాహన మార్కెట్లో 50 శాతం మార్కెట్ వాటాను.. అలాగే ఈవీ విపణిలో అగ్రశ్రేణి వాటాను పొందాలని చూస్తున్నట్లు తొషిహిరో సుజుకీ వెల్లడించారు. ఎస్‌యూవీలను కస్టమర్లు డిమాండ్ చేస్తున్నందున భారతీయ మార్కెట్లో ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈ-విటారాతో ఈవీ ప్రయాణం ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. వినియోగానికి కాంపాక్ట్ ఈవీలు ఉత్తమంగా సరిపోతాయని సుజుకీ అన్నారు. ఈవీ విభాగంలో కంపెనీ నుంచి తదుపరి మోడల్ చిన్న కారు వచ్చే అవకాశం ఉందని ఆయన మాటలనుబట్టి సుస్పష్టం అవుతోంది. కస్టమర్ అవసరాలను అధ్యయనం చేస్తున్నామని, ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ కార్లు ట్యాంక్ ఇంధనంతో దాదాపు 500 కిలోమీటర్ల పరిధిని ఇస్తాయని సుజుకీ తెలిపారు. ఈ దూరాన్ని ఆచరణ సాధ్యం చేయడానికి ఈ-విటారాను సన్నద్ధం చేస్తున్నట్టు చెప్పారు. భారత్ మండపం వేదికగా ఈ-విటారాను కంపెనీ శుక్రవారం (నేడు) ఆవిష్కరిస్తోంది. టాటా నెక్సాన్ ఈవీతో పాటు హ్యుండై క్రెటా ఎలక్ట్రిక్, ఎంజీ జడ్ఎస్ ఈవీలకు ఈ-విటారా పోటీ ఇవ్వనుంది.

ఇంకా డిమాండ్ ఉంది..

అమ్మకాలు క్షీణిస్తున్నప్పటికీ భారత్‌లో చిన్న కార్లు నిలిచిపోవని సుజుకీ అన్నారు. 'సుజుకీ కార్పొరేషన్ అనుబంధ సంస్థ మారుతీ సుజుకీ ఇండియా భారత్‌లో మార్కెట్ లీడర్‌గా ఉంది. ద్విచక్ర వాహనాల నుండి నాలుగు చక్రాల వాహనాలకు అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉన్న 100 కోట్ల మంది ప్రజలకు భవిష్యత్తులో ఇంకా సరసమైన చిన్న కార్లు అవసరం అని విశ్వసిస్తున్నాం. ఈ-విటారా పట్ల కస్టమర్ల నుండి అభిప్రాయాన్ని, ప్రతిస్పందనను అర్థం చేసుకుంటాం. ఆ తర్వాతే చిన్న ఎలక్ట్రిక్ కార్ల ప్రణాళికలతో ముందుకు సాగుతాం' అని వివరించారు. కాగా, మారుతీ సుజుకీ ఇండియా 2024లో 3.24 లక్షల యూనిట్లను ఎగుమతి చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం.

ఎలక్ట్రిక్ యాక్సెస్ సైతం..


సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా ఎలక్ట్రిక్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో సందర్భంగా ఆవిష్కరిస్తోంది. సుజుకీ ఇప్పటికే భారత్‌లో పెట్రోల్ వర్షన్ యాక్సెస్-125 విక్రయిస్తోంది.

భారతీయుడు కూడా సుజుకీ మోటార్ ప్రెసిడెంట్ కావచ్చు..

మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో ఎవరైనా కావొచ్చని, ఇక్కడ జాతీయత ఒక అంశం కాదని తొషిహిరో సుజుకీ అన్నారు. భారతీయుడు కూడా సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ పదవి చేపట్టవచ్చని స్పష్టం చేశారు. తన తండ్రి దివంగత ఒసాము సుజుకీ 40 సంవత్సరాల క్రితం భారత్ వచ్చారని, ఈ మార్కెట్ యొక్క అసలైన సామర్థ్యాన్ని ఎవరూ ఊహించలేదని వివరించారు. అయినప్పటికీ భారతదేశం మరియు ఇక్కడి ప్రజలపై ఆయనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. నేడు భారతీయ ఆటోమోటివ్ పరిశ్రమ ప్రపంచంలో మూడవ అతిపెద్ద మార్కెట్‌గా అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. 2003లో లిస్టింగ్ అయినప్పటి నుండి మారుతీ సుజుకీ ఇండియా చైర్మన్ అలాగే ఎండీ, సీఈవో పదవులను భారతీయ, జపాన్ ఎగ్జిక్యూటివ్‌లు అలంకరిస్తున్నారు.

2024-25 ఎకానమీ వృద్ధికి 0.6 శాతం ఫిక్కీ కోత

6.4 శాతానికి పరిమితం అవుతుందని అంచనా




న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ 2024-25 ఆర్థిక సంవత్సరం అంచనాలకు పారిశ్రామిక మండలి- ఫిక్కీ 60 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) కోత పెట్టింది. దీనితో ఈ అంచనా వృద్ధి రేటు 7 శాతం నుంచి 6.4 శాతానికి తగ్గింది. ఈ మేరకు ఫిక్కీ ఎకనమిక్ అవుట్‌లుక్ సర్వే విడుదలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎకానమీ వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంటుందని జాతీయ గణాంకాల విభాగం ఇటీవలే అంచనాలను వెలువరించిన సంగతి తెలిసిందే. ట్రంప్ పాలనా కాలంలో భారత్‌కు సంబంధించి స్వల్ప కాలిక ఇబ్బందులు తప్పవని సర్వే అభిప్రాయపడింది. ఎగుమతులు, విదేశీ మూలధన పెట్టుబడులు, ముడి పదార్థాల వ్యయాల వంటి అంశాలను ఈ సందర్భంగా నివేదిక ప్రస్తావించింది. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు ప్రపంచ వ్యాప్తంగా సరఫరాల చైన్‌కు సమస్యలు తెచ్చే వీలుందని అవుట్‌లుక్ పేర్కొంది. భారత్ ఎకానమీలో ప్రైవేటు వినియోగం కీలక అంశమని తెలిపింది. అగ్రి ఉత్పాదకత, గ్రామీణ మౌలిక పరిస్థితులు, కోల్డ్ స్టోరేజీ సదుపాయాలు పెంపుపై దృష్టి పెట్టాలని సర్వే సూచించింది. దేశంలో ద్రవ్యోల్బణం దిగిరావచ్చని, ఇది వడ్డీరేట్లు దిగిరావడానికి దోహదపడుతుందని విశ్లేషించింది.

రియల్టీలో పీఈ పెట్టుబడులు ప్లస్

9 నెలల్లో 2.82 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి తొమ్మిది నెలల్లో రియల్టీ రంగంలోకి ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) పెట్టుబడులు 6 శాతం పెరిగాయి. ఏప్రిల్-డిసెంబర్‌లో 2.82 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రధానంగా ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ పార్కులు పెట్టుబడులను ఆకట్టుకున్నాయి. రియల్టీ కన్సల్టెంట్ అనరాక్ గణాంకాల ప్రకారం గతేడాది(2023-24) ఇదే కాలంలో 2.66 బిలియన్ డాలర్ల పీఈ పెట్టుబడులు లభించాయి. అయితే డీల్స్ 24కు పరిమితమయ్యాయి. గతేడాది 30 లావాదేవీలు నమోదయ్యాయి. మొత్తం పీఈ పెట్టుబడుల్లో విదేశీ ఫండ్స్ వాటా 82 శాతంకాగా.. దేశీయంగా 18 శాతం నిధులు లభించాయి. ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ విభాగం అత్యధికంగా 62 శాతం పెట్టుబడులను సమకూర్చుకుంది. ఈ బాటలో హౌసింగ్ 15 శాతం, ఆఫీస్ విభాగం 14 శాతం, మిక్స్‌డ్ వినియోగ ప్రాజెక్టులు 9 శాతం పెట్టుబడులను ఆకర్షించాయి.



టాప్-10 డీల్స్ హవా

తొలి 9 నెలల మొత్తం పీఈ లావాదేవీలలో టాప్-10 డీల్స్ వాటా 93 శాతమని అనరాక్ క్యాపిటల్ సీఈవో శోభిత్ అగర్వాల్ వెల్లడించారు. 1.54 బిలియన్ డాలర్ల విలువైన రిలయన్స్, ఏడీఐఏ, కేకేఆర్ వేర్‌హౌసింగ్ డీల్‌ను అతిపెద్ద లావాదేవీగా పేర్కొన్నారు. దీనితోపాటు 20.4 కోట్ల డాలర్ల విలువైన బ్లాక్‌స్టోన్, లోగోస్ ఈక్విటీ డీల్.. లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ రంగానికి ప్రోత్సాహాన్నిచ్చినట్లు తెలియజేశారు. ఈ రంగం మొత్తం పీఈ పెట్టుబడుల్లో 62 శాతం వాటాను ఆక్రమించుకున్నట్లు వెల్లడించారు.

ఏబీ ఫ్యాషన్ నిధుల సమీకరణ

క్విప్ ద్వారా రూ. 4,789 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ నిధుల సమీకరణ చేపట్టనుంది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్), ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా మొత్తం రూ. 4,789 కోట్లు అందుకునే యోచనలో ఉంది. వృద్ధి వ్యూహాలకు పెట్టుబడులను సమకూర్చుకునే ప్రణాళికలో భాగంగా బోర్డు ఇందుకు ఆమోద ముద్ర వేసినట్లు కంపెనీ పేర్కొంది. దీనిలో భాగంగా ప్రమోటర్ సంస్థ పిలానీ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌కు రూ. 1,298 కోట్లు, ఫిడిలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు రూ. 1,081 కోట్లు విలువైన ప్రిఫరెన్షియల్ షేర్ల జారీకి బోర్డు అనుమతించినట్లు వెల్లడించింది. అంతేకాకుండా క్విప్ ద్వారా మరో రూ. 2,500 కోట్ల సమీకరణకు సైతం బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2024 సెప్టెంబర్ 19న నిర్వహించిన సాధారణ వార్షిక సమావేశంలో వాటాదారులు అనుమతించిన నిధుల సమీకరణ ప్రతిపాదనకు తాజాగా బోర్డు మరోసారి ఆమోద ముద్ర వేసింది. ఈ ఏడాది చివరిలోగా కంపెనీ మదురా ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ బిజినెస్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన ఆదిత్య బిర్లా లైఫ్‌స్టైల్ బ్రాండ్స్‌కింద విడదీయనుంది.

ఏబీ ఫ్యాషన్ షేరు బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 266 వద్ద ముగిసింది.

క్యూ3 ఫలితాలు

యాక్సిస్ బ్యాంక్ లాభం ప్లస్

రూ. 6,304 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో స్టాండెలోన్ నికర లాభం 4 శాతం పుంజుకుని రూ. 6,304 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 6,071 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 33,516 కోట్ల నుంచి రూ. 36,926 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 27,961 కోట్ల నుంచి రూ. 30,954 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం 9 శాతం వృద్ధితో రూ. 13,483 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.08 శాతం తగ్గి 3.93 శాతానికి చేరాయి. ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ. 1,028 కోట్ల నుంచి రూ. 2,156 కోట్లకు ఎగశాయి. స్థూల స్లిప్పేజీలు రూ. 4,923 కోట్ల నుంచి రూ. 5,432 కోట్లకు పెరిగాయి. దీంతో స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.44 శాతం నుంచి 1.46 శాతానికి స్వల్పంగా పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 17.01 శాతంగా నమోదైంది. కాగా.. క్యూ3లో కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 6,491 కోట్ల నుంచి రూ. 6,742 కోట్లకు పుంజుకుంది.

యాక్సిస్ బ్యాంక్ షేరు ఎన్ఎస్ఈలో 1.7 శాతం లాభంతో రూ. 1,044 వద్ద ముగిసింది.

హావెల్స్ లాభం డీలా

రూ. 278 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రికల్ గూడ్స్ దిగ్గజం హావెల్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 3 శాతంపైగా క్షీణించి రూ. 278 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 288 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం 11 శాతం ఎగసి రూ. 4,953 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 4,414 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు 12 శాతం పెరిగి రూ. 4,576 కోట్లకు చేరాయి.

బీఎస్ఈలో హావెల్స్ షేరు 2 శాతం బలపడి రూ. 1,557 వద్ద ముగిసింది.

స్పెన్సర్స్ రిటైల్‌కు తగ్గిన నష్టాలు

మూడో త్రైమాసికంలో రూ. 47 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్ సంస్థ స్పెన్సర్స్ రిటైల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికంలో మరోసారి నష్టాలు చవిచూసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో రూ. 47 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే గతేడాది(2023-24) ఇదే కాలంలో నమోదైన రూ. 51 కోట్లతో పోలిస్తే నష్టాలు 8 శాతంపైగా తగ్గాయి. మొత్తం ఆదాయం సైతం 21 శాతం క్షీణించి రూ. 517 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో రూ. 654 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు 20 శాతం తగ్గి రూ. 567 కోట్లకు చేరాయి. కాగా.. జీఫీ బ్రాండుతో క్విక్‌కామర్స్‌లోకి ప్రవేశించినట్లు కంపెనీ వెల్లడించింది. పశ్చిమబెంగాల్‌లో కార్యకలాపాలు ప్రారంభించినట్లు పేర్కొంది. తదుపరి దశలో యూపీలో విస్తరించనున్నట్లు తెలియజేసింది. అనుబంధ సంస్థ ప్రీమియం రిటైల్ చైన్ నేచర్స్ బాస్కెట్‌ను పునర్వ్యవస్థీకరించే యోచనేమీ లేదని చైర్మన్ శాశ్వత్ గోయెంకా స్పష్టం చేశారు. నష్టాలు నమోదు చేస్తున్న కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మార్కెట్ల నుంచి వైదొలగినట్లు తెలియజేశారు.

స్పెన్సర్స్ షేరు ఎన్ఎస్ఈలో దాదాపు 8 శాతం పతనమై రూ. 86 దిగువన ముగిసింది.

డీబీ కార్ప్ లాభం నేలచూపు

రూ. 118 కోట్లకు డౌన్



న్యూఢిల్లీ: మీడియా రంగ దిగ్గజం డీబీ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 5 శాతం క్షీణించి రూ. 118 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2023-24) ఇదే కాలంలో రూ. 124 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం నామమాత్ర క్షీణతతో రూ. 643 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 645 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు సైతం రూ. 497 కోట్ల నుంచి రూ. 496 కోట్లకు స్వల్పంగా తగ్గాయి. ప్రింటింగ్, పబ్లిషింగ్ తదితర విభాగాల ఆదాయం యథాతథంగా రూ. 594 కోట్లుగా నమోదైంది. అయితే రేడియో బిజినెస్ 5 శాతం బలపడి రూ. 49 కోట్లకు చేరింది. సంస్థ దైనిక్ భాస్కర్, సౌరాష్ట్ర సమాచార్, దివ్య మరాఠీ తదితర ఐదు వార్తా పత్రికలను ప్రచురించే సంగతి తెలిసిందే.

బీఎస్ఈలో డీబీ కార్ప్ షేరు 1 శాతం క్షీణించి రూ. 267 వద్ద ముగిసింది.

ఎల్‌టీఐమైండ్‌ట్రీ లాభం డౌన్

క్యూ3లో రూ. 1,085 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ సొల్యూషన్ల దిగ్గజం ఎల్‌టీఐమైండ్‌ట్రీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 7 శాతం క్షీణించి రూ. 1,085 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,169 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 7 శాతం పుంజుకుని రూ. 9,661 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 9,017 కోట్ల టర్నోవర్ సాధించింది. విభిన్న ఏఐ వ్యూహాల నేపథ్యంలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 1.68 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు అందుకున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ దేవశిష్ చటర్జీ వెల్లడించారు. నూతన భాగస్వామ్యాలు, స్పెషలైజేషన్లు, ఏఐలపై కొనసాగుతున్న పెట్టుబడులు కొత్త ఏడాదిలోనూ వృద్ధికి దన్నుగా నిలవనున్నట్లు తెలియజేశారు. 2024 డిసెంబర్31కల్లా 742 యాక్టివ్ క్లయింట్లను కలిగి ఉంది. ఈ కాలంలో 2,362 మందికి ఉపాధి కల్పించడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 86,800ను తాకింది.

బీఎస్ఈలో ఎల్‌టీఐమైండ్‌ట్రీ షేరు 2.5 శాతం ఎగసి రూ. 5,979 వద్ద ముగిసింది.

బడ్జెట్‌లో పన్ను లాభాలు కల్పించాలి

- ఆర్థిక శాఖకు బీమా సంస్థల వినతులు
- జీ 20 దేశాలలో భారత్ వేగవంత వృద్ధి



న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక బడ్జెట్‌లో పన్ను లాభాలు, ప్రోత్సాహకాలు కల్పించవలసిందిగా దేశీ బీమా రంగ కంపెనీలు ఆర్థిక శాఖను కోరుతున్నాయి. బీమా పాలసీల కొనుగోలుదారులకు పన్ను లాభాలు, విక్రయ సంస్థలకు పన్ను ప్రోత్సాహకాలు ప్రకటించవలసిందిగా అభ్యర్థిస్తున్నాయి. భారత బీమా అభివృద్ధి, అధికారిక నియంత్రణ సంస్థ(ఐఆర్‌డీఏఐ) గణాంకాల ప్రకారం 2023-24లో దేశీయంగా బీమా విస్తృతి 3.7 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022-23)లో నమోదైన 4 శాతంతో పోలిస్తే స్వల్పంగా క్షీణించింది. జీవిత బీమా రంగంలో 3 శాతం నుంచి 2.8 శాతానికి వెనకడుగు వేయగా.. ఇతర బీమా పరిశ్రమలో విస్తృతి యథాతథంగా 1 శాతంగానే నమోదైంది.

జీ20 దేశాలలో భారత్ భేష్

బీమా రంగంలో జీ 20 దేశాలలోకెల్లా భారత్ వేగవంత వృద్ధి సాధిస్తున్న మార్కెట్‌గా నిలుస్తున్నట్లు స్విస్ రే నివేదిక అంచనా వేసింది. 2025-29 మధ్య కాలంలో వార్షికంగా సగటున ప్రీమియంలో 7.3 శాతం పురోగతితో ముందు నిలవగలదని అభిప్రాయపడింది. రానున్న ఐదేళ్లలో నిజ ప్రాతిపదికన(ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించి) జీవిత బీమా, ఇతర బీమా కలిపి మొత్తం ప్రీమియం పరిమాణం సగటున ఏటా 7.3 శాతం పుంజుకోవచ్చని అంచనా వేసింది. జీవిత బీమా ప్రీమియంలు 6.9 శాతం, నాన్‌లైఫ్ ప్రీమియంలు 7.3 శాతం చొప్పున వృద్ధి సాధించగలవని అభిప్రాయపడింది. కాగా.. ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలకు బడ్జెట్లో తిరిగి పెట్టుబడులు ప్రకటిస్తే సానుకూల పరిణామంకాగలదని ఇక్రా లిమిటెడ్ ఫైనాన్షియల్ రంగ రేటింగ్స్ విభాగం హెడ్ నేహా పారిఖ్ అంచనా వేశారు. వీటి బలహీన సాల్వెన్సీ పరిస్థితుల నేపథ్యంలో ఇది ప్రయోజనకరంగా నిలవగలదని పేర్కొన్నారు. బీమా రంగానికి ప్రోత్సాహకాలు ప్రకటిస్తే ప్రధానంగా తక్కువ విలువగల పాలసీలకు బూస్ట్ లభిస్తుందని తెలియజేశారు. ఇది బీమా విస్తృతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

కొత్త తరహా పాలసీలతో

బీమా పరిశ్రమకు ప్రోత్సాహకాలివ్వడం ద్వారా మరింతమంది కొత్త కస్టమర్లను ఆకట్టుకునేందుకు బీమా సంస్థలకు వీలుంటుందని జోపర్ సహవ్యవస్థాపకుడు, సీవోవో మయాంక్ గుప్తా పేర్కొన్నారు. కొత్తతరహా పాలసీల సృష్టి, పంపిణీలో టెక్నాలజీ వినియోగానికి బీమా కంపెనీలను అనుమతించవలసి ఉన్నదని అభిప్రాయపడ్డారు. విభిన్న బీమా పాలసీలతోపాటు.. ఫైనాన్షియల్ ప్రొడక్టులను సైతం విక్రయించేందుకు వీలు కల్పిస్తే పంపిణీ వ్యయాలు తగ్గుతాయని తెలియజేశారు. అంతేకాకుండా పాలసీలు, ప్రొడక్టులు మరింత అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ద్వారా జీవిత బీమా మరింతమందికి అందుబాటులోకి వచ్చే వీలున్నట్లు రీన్యూబయ్ సహవ్యవస్థాపకుడు, సీఈవో బాలచందర్ శేఖర్ పేర్కొన్నారు. బీమా పాలసీల కొనుగోలులో పన్ను మినహాయింపులు ప్రకటించడం ద్వారా ప్రోత్సాహన్నిందించాలని కోరారు. తద్వారా భద్రత, దీర్ఘకాలిక మూలధనానికి వీలుంటుందని తెలియజేశారు. అతితక్కువ విస్తృతిగల గ్రామీణ ప్రాంతాలలో బీమాకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తే ప్రభావవంతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. బీమా రంగంలో అత్యధిక సంస్కరణలకు వీలున్నట్లు ఫ్యూచర్ జనరాలి ఇండియా ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో అనుప్ రావు పేర్కొన్నారు. ఐఆర్‌డీఏఐ ఇప్పటికే '2047కల్లా అందరికీ బీమా' పేరుతో భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ప్రస్తావించారు. వెరసి బీమా కంపెనీలు అందుబాటులో కొత్తతరహా పాలసీలకు రూపకల్పన చేయవలసి ఉన్నట్లు తెలియజేశారు.

దేశీయంగా

దేశీయంగా 26 జీవిత బీమా కంపెనీలు, 25 సాధారణ బీమా సంస్థలకుతోడు స్టాండెలోన్ ఆరోగ్య బీమా సంస్థలు 8 కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అంతేకాకుండా 2024 మార్చి31కల్లా.. 12 రీఇన్సూరెన్స్, విదేశీ రీఇన్సూరెన్స్ బ్రాంచీలు, రెండు ప్రత్యేక సంస్థలు రిజిస్టరై ఉన్నాయి.

ఫిబ్రవరి 14 నుంచి డబ్ల్యూపీఎల్ టోర్నీ

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2025 టి20 క్రికెట్ టోర్నమెంట్ ఫిబ్రవరి 14వ తేదీన మొదలవుతుంది. బరోడా, బెంగళూరు, ముంబై, లక్నో నగరాల్లో ఈ టోర్నీ మ్యాచ్‌లు జరుగుతాయి. బరోడా వేదికగా ఫిబ్రవరి 14న జరిగే తొలి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తలపడుతుంది. మార్చి 15న ముంబైలో జరిగే ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది. గుజరాత్, బెంగళూరు జట్లతోపాటు ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్ ఈ టోర్నీలో పోటీపడనున్నాయి.



ఐర్లాండ్ మహిళల జట్టుకు జరిమానా

భారత్‌తో ఆఖరి పోరులో ‘స్లో ఓవర్ రేట్’



రాజ్‌కోట్: భారత పర్యటనలో ఐర్లాండ్ మహిళల క్రికెట్ జట్టుపై జరిమానా పడింది. భారత మహిళల జట్టుతో బుధవారం జరిగిన ఆఖరి వన్డేలో ఐర్లాండ్ జట్టు మందకొడిగా బౌలింగ్ చేసింది. దీంతో జట్టు ప్లేయర్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయింది. రెండు ఓవర్లు ఆలస్యం కావడంతో మ్యాచ్ రిఫరీ జి.ఎస్.లక్ష్మి... ఐర్లాండ్ కెప్టెన్ గాబీ లూయిస్ వివరణ అనంతరం జరిమానా ఖరారు చేసింది. ‘అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నియమావళిలోని 2.22 ఆర్టికల్ ప్రకారం, కోటా ఓవర్లు పూర్తి చేయలేకపోతే ఓవర్‌కు 5 శాతం చొప్పున మొత్తం పదిశాతం మ్యాచ్ ఫీజులో కోత విధించాం’ అని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. మూడు వన్డేల సిరీస్‌ను స్మృతి మంధాన నేతృత్వంలోని భారత జట్టు 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి పోరులో అయితే అమ్మాయిలు ఆకాశమే హద్దుగా చెలరేగి ఏకంగా 435/5 భారీస్కోరు చేసింది. ఓపెనర్లు మంధాన, ప్రతీకలిద్దరు శతకాలతో కదంతొక్కారు. ఐర్లాండ్‌ను భారత బౌలర్లు 31.4 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూల్చడంతో టీమిండియా 304 పరుగుల భారీ తేడాతో రికార్డు విజయాన్ని నమోదు చేసింది.

పట్నా పైరేట్స్ హెడ్ కోచ్‌గా అనూప్



ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లోని పట్నా పైరేట్స్ ఫ్రాంచైజీ తమ హెడ్ కోచ్‌గా అనూప్ కుమార్‌ను నియమించింది. నాలుగో టైటిల్ వేటకు అర్హత సాధించినప్పటికీ అమీతుమీలో హరియాణా స్టీలర్స్ చేతిలో బోల్తా పడటంతో కోచ్ నరేందర్ రేధును యాజమాన్యం తప్పించింది. ఆయన స్థానంలో భారత కబడ్డీ జట్టు మాజీ కెప్టెన్, 41 ఏళ్ల అనూప్ కుమార్‌కు కోచింగ్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు గురువారం ఫ్రాంచైజీ వర్గాలు తెలిపాయి. 2010, 2014లలో జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న అనూప్ 2016లో కబడ్డీ ప్రపంచకప్‌లోనూ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ప్రేక్షకుల ఆదరణ చూరగొన్న ఫ్రాంచైజీ లీగ్ టోర్నీ పీకేఎల్‌లో యు ముంబాకు ఐదేళ్లపాటు ఆడాడు. తర్వాత జైపూర్ పింక్‌పాంథర్స్‌కు ఆడిన అనూప్ 2018 డిసెంబర్లో తన 15 ఏళ్ల కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అతని ప్రదర్శనకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ‘అర్జున అవార్డు’ (2012)ను ప్రదానం చేసింది.



‘అత్యుత్తమ ఆల్‌రౌండర్ కావడమే లక్ష్యం’

- జాతీయ జట్టు నుంచి తప్పించడం ఆశ్చర్యపర్చింది
- బౌలింగ్‌లో పదును పెంచడంపైనే దృష్టి
- హైదరాబాద్ మహిళా క్రికెటర్ అరుంధతి రెడ్డి మనోగతం

న్యూఢిల్లీ: భారత్ పేస్ బౌలర్ అరుంధతి రెడ్డి 2024లో 5 వన్డేలు ఆడి 8 వికెట్లు పడగొట్టింది. వాటిలో పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన పోరులో 26 పరుగులకే 4 వికెట్లు తీసి సత్తా చాటిన మ్యాచ్ కూడా ఉంది. ఇదే ఏడాది 7 టి20ల్లో కేవలం 6.50 ఎకానమీతో 10 వికెట్లు పడగొట్టింది. ఇందులో వరల్డ్ కప్‌లో తీసిన 7 వికెట్లు కూడా ఉన్నాయి. ఎలా చూసినా భారత మహిళల జట్టు కోణంలో ఇది మెరుగైన ప్రదర్శనే. కానీ అనూహ్యంగా సెలక్టర్లు ఆమెపై వేటు వేశారు. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన వన్డే, టి20 సిరీస్‌లతో పాటు ఇటీవల ఐర్లాండ్‌తో ముగిసిన వన్డే సిరీస్‌లో కూడా అరుంధతిని ఎంపిక చేయలేదు. హైదరాబాద్‌కు చెందిన 27 ఏళ్ల అరుంధతిపై వేటు పడటం అందరినీ ఆశ్చర్యపర్చింది. అయితే ఇలాంటివన్నీ తన చేతుల్లో లేవని... తన వైపు నుంచి అత్యుత్తమ ఆటతీరు కనబర్చడమే తాను చేయగలిగిందని ఆమె వ్యాఖ్యానించింది. ‘ఆస్ట్రేలియాతో సిరీస్ తర్వాత సరిగ్గా ఏం జరిగిందో నాకూ తెలీదు. అయితే ఈ విషయంలో నేను చేయగలిగిందేమీ లేదు. క్రికెట్ బాగా ఆడటం మాత్రమే నాకు తెలిసిన విద్య. కాబట్టి భారత్ తరఫున ఎప్పుడు అవకాశం దక్కినా అదే చేసి చూపిస్తా. ఏ స్థాయిలో ఏ జట్టు తరఫున ఆడినా మైదానంలోకి దిగగానే జట్టును గెలిపించేందుకే ప్రయత్నిస్తా. మొదటినుంచి నేను క్రికెట్‌ను ఇలాగే ఆడాను’ అని అరుంధతి పేర్కొంది.

కోచ్ అండతో...

భారత జట్టులో స్థానం కోల్పోయిన తర్వాత ఆడిన చాలెంజర్ ట్రోఫీ తనకు కూడా తగిన సవాల్ విసిరిందని... కీలక సమయాల్లో ఒత్తిడిని అధిగమించి తన జట్టు (టీమ్ ‘ఎ’)ను ఫైనల్ చేర్చడం సంతృప్తిగా ఉందని ఆమె వెల్లడించింది. అయితే ఆటలో ఉండే అనిశ్చితిని ఎదుర్కోవడం అంత సులువు కాదని అరుంధతి అంగీకరించింది. జట్టులో స్థానం కోల్పోయిన సమయంలో తాను మానసికంగా నిరాశకు లోను కాకుండా తన కోచ్ అర్జున్ దేవ్ అండగా నిలిచారని అరుంధతి గుర్తు చేసుకుంది. బెంగళూరులోని ఎన్ఐసీఈ అకాడమీలో అర్జున్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ‘భారత జట్టుకు ఆడినా ఆడకపోయినా... వేరే ఏ టీమ్‌కు ఆడినా ప్రపంచంలో అత్యుత్తమ ఆల్‌రౌండర్‌గా మారాలనే పట్టుదలతో సాధన చేయి అని ఆయన నాకు చెప్పారు. నేను మళ్లీ భారత్‌కు ఆడగలనా లేదా అంటే జవాబివ్వలేను. ప్రస్తుతం ఉండే అనిశ్చితిలో ఏ ప్లేయర్‌కు కూడా అది సాధ్యం కాదు. కానీ ఈ ప్రపంచంలో నువ్వే అత్యుత్తమ క్రికెటర్‌వు అంటూ ప్రతీ రోజు నన్ను నేను ప్రోత్సహించుకుంటూ ఉంటాను. అదే నన్ను నడిపిస్తుంది’ అని ఈ హైదరాబాదీ తన మనసులో మాటను చెప్పింది.

ఎక్కడైనా ఆట ఒక్కటే...

ఇన్నేళ్ల తర్వాత వచ్చిన అనుభవంతో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని ఆమె వెల్లడించింది. ‘పరిస్థితులను అర్థం చేసుకోగలిగే ప్రస్తుతం నాకు వచ్చిందని చెప్పగలను. ఇప్పుడు ఏ టీమ్‌కు ఆడినా సీనియర్లలో ఒకరిగా ఉంటున్నాను. ఇది నాకు ఎంతో మేలు చేస్తోంది. జూనియర్ అమ్మాయిలకు కొన్ని విషయాలు నేర్పించే క్రమంలో నేను కూడా చాలా నేర్చుకుంటాను. నా నుంచి మరింత మెరుగైన ప్రదర్శన కూడా వస్తుంది. కాబట్టి ఎక్కడ ఆడుతున్నాను. ఏ జట్టు కోసం ఆడుతున్నాను అనేది పట్టించుకోకుండా దీనిపైనే దృష్టి పెడుతున్నాను’ అని ఆమె స్పష్టం చేసింది.

జట్టు మార్పుతో...

దేశవాళీ క్రికెట్‌లో ఐదేళ్ల పాటు రైల్వేస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తర్వాత రెండేళ్ల క్రితం అరుంధతి రెడ్డి కేరళ జట్టుకు మారింది. ఈ నిర్ణయం తీసుకునే ముందు ఆమె ఎన్నో విధాలా ఆలోచించాల్సి వచ్చినా చివరకు ధైర్యం చేసింది. అయితే కేరళకు మారిన తర్వాత అటు బౌలింగ్ మాత్రమే కాకుండా బ్యాటింగ్‌లో కూడా ఆమె ఎంతో మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ‘సుదీర్ఘ కాలంగా దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాను. అయితే గత రెండేళ్లుగా నా ఆటలో ఎంతో మార్పు వచ్చిందనేది వాస్తవం. కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పలేదు. కానీ అవి నాకు మేలు చేశాయి. ఇప్పుడు నా ఆటపై నాకు మరింత స్పష్టత రావడంతో టోర్నీలకు సరైన రీతిలో సిద్ధమవుతున్నా. ఆపై ఎలాంటి తడబాటు లేకుండా స్వేచ్ఛగా ఆడగలుగుతున్నా. ఇప్పుడు నాలో ఓటమిభయం కూడా తగ్గింది’ అని అరుంధతి వివరించింది.

‘అటాకింగ్’పై దృష్టి...

ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న అరుంధతి... స్వదేశంలో జరిగే వన్డే వరల్డ్ కప్ కోసం తిరిగి భారత జట్టులో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా పని చేస్తోంది. తన బౌలింగ్‌లో పలు మార్పులు చేసుకుంది. ముఖ్యంగా ఆమె బౌలింగ్‌లో ‘అటాకింగ్’ పెరిగింది. గతంలో బ్యాటర్‌ను ఆడకుండా చేసే లక్ష్యంతో ఆఫ్‌స్టంప్ బయటే వరుసగా బంతులు వేసేది. ఇప్పుడు నేరుగా స్టంప్స్‌పైకే బంతులు గురి పెడుతూ బౌలింగ్ చేస్తోంది. కొన్ని సందర్భాల్లో బ్యాటర్లు ఎదురు దాడి చేసే అవకాశం ఉన్నా...ఈ తరహా బౌలింగే ప్రస్తుతం తన బలంగా మారిందని ఆమె స్పష్టం చేసింది.



2018లో టి20 అరంగేట్రం మ్యాచ్‌లో భారత జట్టు కెప్టెన్ మిథాలీ రాజ్ నుంచి క్యాప్ అందుకుంటున్న అరుంధతి



నేటి నుంచి పాక్, విండీస్ తొలి టెస్టు

ఉదయం గం. 11 నుంచి ఫ్యాన్ కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



ముల్తాన్: పాకిస్తాన్ పర్యటనలో వెస్టిండీస్ రెండు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్ ఆడేందుకు సిద్ధమైంది. నేటి నుంచి ముల్తాన్ వేదికగా ఇరు జట్ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. స్పిన్ ట్రాక్‌పై కరీబియన్స్‌ను ఎదుర్కొనేందుకు ఆతిథ్య జట్టు కసరత్తు చేస్తోంది. ఇంగ్లండ్‌తో గత అక్టోబర్‌లో వాడిన స్పిన్ పిచ్‌నే ఈ మ్యాచ్‌కు సిద్ధం చేశారు. అప్పుడు సాజిద్ ఖాన్, నోమన్ అలీ తిప్పేశారు. ఈ తాజా సిరీస్‌లోనూ వాళ్లిద్దరిపై పాకిస్తాన్ గంపెడాశలు పెట్టుకుంది. సొంతగడ్డ అనుకూలతలతో వెస్టిండీస్‌తో తలపడతామని పాక్ కెప్టెన్ షాన్ మసూద్ చెప్పాడు. స్వదేశంలో 2–1తో ఇంగ్లండ్‌ను ఓడించిన పాక్... దక్షిణాఫ్రికా పర్యటనలో 0–2తో ఓడిపోయింది. అయితే మరోవైపు వెస్టిండీస్ ఈ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) రెండేళ్ల సైకిల్‌లో అసలు ఒక్క సిరీస్ కూడా గెలుపొందలేకపోయింది. భారత్ సహా ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాల చేతిలో ఓడిన విండీస్... గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను 1–1తో డ్రాతో నిలువరించింది. కానీ బంగ్లాదేశ్‌తో కూడా 1–1తో సిరీస్‌ను ‘డ్రా’ చేసుకోవడంతో డబ్ల్యూటీసీలో కరీబియన్ జట్టు అట్టడుగున నిలిచింది. అయితే గత ఫలితాలతో సంబంధం లేకుండా ఈ డబ్ల్యూటీసీ సైకిల్‌ను విజయంతో ముగించేందుకే పాకిస్తాన్ పర్యటనకు వచ్చినట్లు వెస్టిండీస్ కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ చెప్పాడు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ప్రధాన వేదికలైన కరాచీ, లాహోర్‌లలో నవీకరణ పనులు జరుగుతుండటంతో రెండో టెస్టు కూడా ముల్తాన్‌లోనే ఈ నెల 25 నుంచి జరుగుతుంది.

విదర్భ వీరవిహారం

రెండో సెమీఫైనల్లో మహారాష్ట్రపై 69 పరుగుల తేడాతో విజయం

- తొలిసారి విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్లోకి ప్రవేశం
- ధ్రువ్ షోరే, యశ్ రాథోడ్ సెంచరీలు
- కరుణ్ నాయర్ మరో మెరుపు ఇన్నింగ్స్
- రేపు జరిగే టైటిల్ పోరులో కర్ణాటకతో ‘ఢీ’

వడోదర: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ జట్టు తొలిసారి ఫైనల్లోకి అడుగు పెట్టింది. గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగిన విదర్భ తుది పోరుకు అర్హత సాధించింది. సెమీస్‌లో విదర్భ 69 పరుగుల తేడాతో మహారాష్ట్రపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విదర్భ 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 380 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ యశ్ రాథోడ్ (101 బంతుల్లో 116; 14 ఫోర్లు, 1 సిక్స్), ధ్రువ్ షోరే (120 బంతుల్లో 114; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో సత్తా చాటారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 34.4 ఓవర్లలో 224 పరుగులు జోడించారు. అనంతరం అత్యద్భుత ఫామ్‌లో ఉన్న కెప్టెన్ కరుణ్ నాయర్ (44 బంతుల్లో 88 నాటౌట్; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) మరో దూకుడైన ఇన్నింగ్స్‌తో చెలరేగగా... జితేశ్ శర్మ (33 బంతుల్లో 51; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా ధాటిగా ఆడాడు. 40 ఓవర్లు ముగిసేసరికి విదర్భ స్కోరు 254 కాగా... చివరి 10 ఓవర్లలో ఆ జట్టు ఏకంగా 126 పరుగులు సాధించింది! ముఖ్యంగా ముకేశ్ వేసిన 47వ ఓవర్లో 3 ఫోర్లు, సిక్స్ కొట్టిన కరుణ్ నాయర్... రజనీశ్ గుర్బానీ వేసిన ఆఖరి ఓవర్లో వరుసగా 4, 0, 6, 4, 4, 6 బాదాడు. ఒకదశలో 35 బంతుల్లో 51 వద్ద ఉన్న కరుణ్ తర్వాతి 9 బంతుల్లో 37 పరుగులు రాబట్టాడు. అనంతరం మహారాష్ట్ర కొంత పోరాడగలిగినా చివరకు ఓటమి తప్పలేదు. 50 ఓవర్లలో మహారాష్ట్ర 7 వికెట్లకు 311 పరుగులు చేసింది. అర్షిన్ కులకర్ణి (101 బంతుల్లో 90; 8 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేజార్చుకోగా... అంకిత్ బావ్నే (49 బంతుల్లో 50; 5 ఫోర్లు), నిఖిల్ నాయక్ (26 బంతుల్లో 49; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. దర్శన్ నల్కండే, నచికేత్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. కర్ణాటక జట్టు ఇప్పటికే నాలుగుసార్లు విజయ్ హజారే ట్రోఫీని గెలుచుకుంది. ఈ నాలుగు సందర్భాల్లోనూ కర్ణాటక జట్టులో కరుణ్ నాయర్ సభ్యుడిగా ఉన్నాడు. ఇప్పుడు అతను ఫైనల్లో ప్రత్యర్థి జట్టు విదర్భ కెప్టెన్‌గా తన పాత జట్టుపై సమరానికి సిద్ధమయ్యాడు. టోర్నీలో ఇప్పటి వరకు ఆడిన 7 ఇన్నింగ్స్‌లలో 5 సెంచరీలు, 1 అర్ధ సెంచరీతో ఏకంగా 752 పరుగులు సాధించిన నాయర్ తన టీమ్‌ను విజేతగా నిలుపుతాడా అనేది ఆసక్తికరం!



ధ్రువ్ షోరే



యశ్ రాథోడ్



కరుణ్ నాయర్

టెస్టులకు ముందు ‘లయన్స్’తో పోరు

ఇంగ్లండ్‌లో 3 మ్యాచ్‌లు ఆడనున్న టీమిండియా



న్యూఢిల్లీ: భారత జట్టు ఇటీవల బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో ఓటమితో పాటు అంతకు ముందు సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్‌లో క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఈ రెండు సార్లూ మన బ్యాటింగే పెద్ద బలహీనతగా కనిపించింది. ఈ నేపథ్యంలో వచ్చే జూన్‌లో ఇంగ్లండ్‌లో జరిగే టెస్టు సిరీస్‌కు ముందుగా టీమిండియా సన్నద్ధత మెరుగ్గా ఉండాలని బీసీసీఐ భావిస్తోంది. భారత టెస్టు జట్టు సభ్యులంతా రంజీ ట్రోఫీలో ఆడేందుకు సిద్ధమైనా... ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఉండటంతో ఒకటికి మించి రంజీ మ్యాచ్ ఆడే అవకాశం కనిపించడం లేదు. ఆ తర్వాత ఐపీఎల్ మొదలైతే ఎరుపు బంతితో సాధన అసాధ్యం! దాంతో ఇంగ్లండ్‌కు వెళ్లి అక్కడే నాలుగు రోజులు మ్యాచ్‌లు ఆడాలని బోర్డు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇంగ్లండ్ యువ జట్టు ‘లయన్స్’తో భారత్ నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడనుంది. ఐపీఎల్ ముగిసే మే 25 నుంచి తొలి టెస్టు ప్రారంభమయ్యే జూన్ 20 మధ్య ఉన్న సమయంలో టీమిండియా మూడు మ్యాచ్‌లు ఆడుతుంది. అక్కడి వాతావరణం, పరిస్థితులకు అలవాటు పడి బ్యాటింగ్ మెరుగుపర్చుకోవడం మాత్రమే కాకుండా టెస్టు టీమ్‌లో స్థానాన్ని ఆశించే ఆటగాళ్లు కూడా తమ సత్తాను చాటేందుకు ఈ మూడు మ్యాచ్‌లు ఉపకరిస్తాయని బోర్డు ఆశిస్తోంది. ఆసీస్‌తో సిరీస్‌లో విఫలమైన రోహిత్, కోహ్లిలతో పాటు ఇతర ఆటగాళ్లంతా ఈ మ్యాచ్‌లలో బరిలోకి దిగనున్నారు.



ప్రొ లీగ్‌తో భారత హాకీ జట్ల ఆట షురూ

పురుషుల ప్రత్యర్థి స్పెయిన్ | మహిళల పోరు ఇంగ్లండ్‌తో | వచ్చే నెల 15 నుంచి ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్

భువనేశ్వర్: భారత హాకీ జట్లు ఈ సీజన్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌తో ప్రారంభించనున్నాయి. భారత్ అంచె పోటీలు వచ్చేనెల 15 నుంచి భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో జరుగుతాయి. ఇందులో తొలిరోజు భారత పురుషుల జట్టు స్పెయిన్‌తో పోటీపడనుండగా, మహిళల జట్టు ఇంగ్లండ్‌ను ‘ఢీ’ కొట్టనుంది. ప్రస్తుతమైతే భారత జాతీయ క్రీడాకారులంతా (మహిళలు, పురుషులు) హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)తో బిజీగా ఉన్నారు. రూర్కేలా, రాంచీలలో జరుగుతున్న ఫ్రాంచైజీ లీగ్ టోర్నీలో భారత ప్లేయర్లు ఆయా ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అనంతరం ఫిబ్రవరిలో భారత జట్ల అంతర్జాతీయ సీజన్ ఆరంభం కానుంది. వచ్చే నెల 15 నుంచి 25 వరకు జరిగే భారత్ అంచె ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ పోటీల్లో పురుషుల జట్టు స్పెయిన్, ఇంగ్లండ్, జర్మనీ ఐర్లాండ్‌లతో ముఖాముఖి పోటీల్లో తలపడుతుంది. అమ్మాయిల జట్టు ఇంగ్లండ్‌తో పాటు జర్మనీ, నెదర్లాండ్స్, స్పెయిన్‌లతో పోటీ పడుతుంది. ఒక్కో జట్టుతో రెండేసి లీగ్ మ్యాచ్‌లు ఆడుతుంది. మ్యాచ్‌లన్నీ కళింగ స్టేడియంలోనే నిర్వహిస్తారు.

భారత్ అంచెకంటే ముందు ఆస్ట్రేలియాలో ఎఫ్ఐహెచ్ తొలి అంచె మొదలవుతుంది. సిడ్నీలో ఫిబ్రవరి 4 నుంచి 9 వరకు జరిగే ఆసీస్ అంచె పోటీల్లో భారత జట్లకు మ్యాచ్‌ల్లేవు. ‘ఆస్ట్రేలియాలో మ్యాచ్‌లు ముగిసిన వెంటనే రోజుల వ్యవధిలోనూ భారత్ అంచె పోటీలు మొదలవుతాయి. హాకీని ఆదరించే భారత్‌లో ఈ పోటీలు రసవత్తరంగా సాగుతాయి. 11 రోజుల పాటు 24 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇది ముగిసిన తర్వాత తుది అంచె పోటీలు సాంటియాగో డెల్ ఈస్టెరోలో జరుగుతాయి. దీంతో అన్ని జట్లకు ఎనిమిదేసి మ్యాచ్‌లు పూర్తవడంతో ఫైనల్స్‌కు చేరే నాకౌట్ జట్లేవే తేలిపోతాయి. గత సీజన్‌లో ఆస్ట్రేలియా పురుషుల జట్టు, నెదర్లాండ్స్ మహిళల జట్టు ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ టైటిల్స్ నెగ్గాయి.





గురువారం ఐఎస్ఎస్ వెలుపల పనుల్లో నిమగ్నమైన సునీతా విలియమ్స్. (ఇన్‌సెట్‌లో) సునీతా విలియమ్స్. ఈ చిత్రాలను అమెరికా అంతరిక్ష సంస్థ నాసా విడుదల చేసింది.

ఏడు నెలల తర్వాత సునీత స్పేస్‌వాక్

కేప్ కెనవెరాల్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి, స్టేషన్ కమాండర్ సునీతా విలియమ్స్ దినచర్య గురువారం కాస్త మారింది. దాదాపు ఏడు నెలలపాటు వివిధ శాస్త్రీయ ప్రయోగాలతో గడిపిన ఈమె గురువారం ఐఎస్ఎస్ వెలుపలికి వచ్చి స్పేస్‌వాక్ చేశారు. నాసాకే చెందిన మరో వ్యోమగామి నిక్ హేగ్‌తో కలిసి ఆమె ఐఎస్ఎస్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టారు. ఆ సమయంలో ఐఎస్ఎస్ తుర్క్‌మెనిస్తాన్‌కు సరిగ్గా 260 మైళ్ల ఎత్తులో ఉందని నాసా తెలిపింది. అంతకుముందు కూడా పలుమార్లు ఐఎస్ఎస్‌లోకి వచ్చిన సునీతకు తాజా స్పేస్‌వాక్ ఎనిమిదోది కావడం గమనార్హం. గతేడాది జూన్‌లో బోయింగ్ సంస్థకు చెందిన స్టార్ లైనర్‌లో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. వారం పాటు మాత్రమే వారు అక్కడ గడపాల్సి ఉంది. అయితే, స్టార్ లైనర్‌లో సమస్యలు తలెత్తడంతో అప్పటి నుంచి వారి తిరుగు ప్రయాణం వాయిదా పడుతూ వస్తోంది. వచ్చే వారం సునీత, విల్మోర్‌ను తిరిగి తీసుకు వచ్చేందుకు నాసా ప్రయత్నాలు చేస్తోంది.



ఆ ఘనత నాదే.. కాదు నాదే..!

ఇజ్రాయెల్–హమాస్ ఒప్పందంపై బైడెన్, ట్రంప్‌ల పోటాపోటీ ప్రకటనలు

వాషింగ్టన్/న్యూఢిల్లీ: కాల్పుల విరమణ, బందీల విడుదల లక్ష్యంగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య బుధవారం కుదిరిన ఒప్పందం ఘనత తమదేనని చెప్పుకునేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోటీ పడ్డారు. ఒప్పందం కుదిరిన విషయం ప్రకటించిన మరుక్షణమే ట్రంప్..' గత నవంబర్‌లో మేం సాధించిన ఘన విజయం కారణంగానే ఈ చారిత్రక ఒప్పందం సాధ్యమైంది. అమెరికన్లతోపాటు మిత్ర దేశాల పౌరుల భద్రతతోపాటు ప్రపంచ శాంతికి మా ప్రభుత్వం కృషి చేస్తుందనేందుకు ఇదే ఒక ఉదాహరణ'అని తన సొంత ట్రూత్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. హమాస్ చెర నుంచి విడుదలయ్యే అమెరికన్, ఇజ్రాయెల్ బందీలు తమ కుటుంబాలను, ఆత్మీయులను కలుసుకోబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ చర్చల్లో పాలుపంచుకున్న కాబోయే పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ ముమ్మందు కూడా తన విధులను ఇలాగే కొనసాగించి, గాజా ఉగ్రవాదులకు నిలయంగా మారకుండా చూస్తారని ఆయన తెలిపారు. దీనిపై అధ్యక్షుడు బైడెన్ తనదైన శైలిలో స్పందించారు. ఒప్పందం తమ విజయమంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మీడియా ప్రశ్నించగా 'ఇది జోకా?'అంటూ ప్రశ్నించారు. గత మే నెల నుంచి చేస్తున్న తమ ప్రభుత్వం చేస్తున్న తీవ్ర ప్రయత్నాల వల్లే ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఒప్పందం సాధ్యమైందన్నారు. హమాస్‌పై తీసుకువచ్చిన ఒత్తిడులు, లెబనాన్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం, ఇరాన్ బలహీనమవడం వంటి పరిణామాల మధ్య కార్యరూపం దాల్చిందని వివరించారు.


ఒబామా దంపతులు విడిపోనున్నారా?

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్, ఆయన భార్య మిచెల్ ఒబామా(60) తమ వివాహ బంధానికి ముగింపు పలకనున్నారా? సోమవారం అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బరాక్ ఒబామా ఒక్కరే హాజరురవుతారంటూ ఈ దంపతుల కార్యాలయం చేసిన ప్రకటనలే ఇందుకు బలం చేకూరుస్తోంది. అధికార కార్యక్రమానికి భర్త బరాక్ ఒబామాతో కలిసి మాజీ ప్రథమ మహిళ మిచెల్ గైర్హాజరవడం నెల రోజుల వ్యవధిలో ఇది రెండోసారి. ఇటీవల జరిగిన మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ నివాళి కార్యక్రమంలో సైతం మిచెల్ పాల్గొనలేదు. అమెరికా అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ అధ్యక్షులు సతీ సమేతంగా పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ అధ్యక్షుడు జార్జి బుష్, లారా బుష్ దంపతులు హాజరుకానున్నారు. కాగా, ఒబామా దంపతుల మధ్య విభేదాలు తలెత్తినట్లు కొన్ని నెలలుగా వార్తలు వెలువడుతున్నాయి. జిమ్మీ కార్టర్ నివాళి, ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు అందుకు ఆజ్యం పోశాయి. సామాజిక మాధ్యమ వేదికల్లోనూ వీరు విడిపోయారంటూ రూమర్లు గుప్పుమంటున్నాయి. 1989లో డేటింగ్ ప్రారంభించిన బరాక్, మిచెల్‌లు 1992లో వివాహ బంధం ద్వారా ఒక్కటయ్యారు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు.

కుంభ మేళాకు బాబా @100 ఏళ్లు

క్రమం తప్పకుండా వస్తోన్న స్వామి శివానంద

మహాకుంభ్ నగర్: యూపీలోని ప్రయాగరాజ్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న మహా కుంభ మేళాకు కోట్లాదిగా జనం తరలివస్తున్నారు. ఈ క్రతువులో బయటి ప్రపంచంలోకి అరుదుగా అడుగుపెట్టే సాధువులు, మునులు సైతం పాలుపంచుకోవడం తెలిసిందే. అలాంటి కోవకు చెందిన వారే పద్మ శ్రీ అవార్డు గ్రహీత, యోగ సాధకుడు స్వామి శివానంద బాబా. 1896లో జన్మించిన స్వామి శివానంద బాబా గత వందేళ్లుగా ప్రయాగరాజ్, నాసిక్, ఉజ్జయిని, హరిద్వార్‌లలో జరిగే ప్రతి కుంభ మేళాలోనూ హాజరవుతున్నారు. తాజాగా, మహాకుంభమేళాకు సైతం వచ్చారు. సంగంలోని 16వ నంబర్ సెక్టార్‌లోని టెంట్‌లో ఈయన బస చేస్తున్నారు. టెంట్ బయట బాబా ఆధార్ కార్డు, పుట్టిన రోజు సర్టిఫికెట్ కాపీని ఆయన శిష్యులు ప్రదర్శనకు ఉంచారు. బాబా శిష్యుడు, బెంగళూరుకు చెందిన ఫల్గుణ్ భట్టాచార్య వారిలో ఒకరు. 'బాబా బిచ్చగాళ్ల కుటుంబంలో పుట్టారు. ఆయన తల్లిదండ్రులు సాధువుల బోధనలకు తరచూ వెళ్లేవారు. ఆ క్రమంలోనే వారు నాలుగేళ్ల వయస్సులో బాబాను సాధువులకు అప్పగించేశారు. ఆరేళ్ల వయస్సులో బాబా తిరిగి సొంతింటికి చేరుకున్న కొన్ని రోజులకే ఆయన సోదరి మరణించింది. మరికొద్ది రోజులకు తల్లిదండ్రులు సైతం తనువు చాలించారు. వారి కర్మకాండలు పూర్తయ్యాక బాబా ఒంటరయ్యారు'అని భట్టాచార్య వివరించారు. 'అప్పటి నుంచి జీవితమే మారిపోయింది. రాత్రి 9 గంటలకు పడుకుని, వేకువజామున 3 గంటలకే నిద్ర లేవడం మిగతా దినమంతా యోగా, ధ్యానంలోనే గడపడం దినచర్యంగా మార్చుకున్నారు'అని తెలిపారు. ఇప్పటి వరకు ఆయన అనారోగ్యం బారిన పడిన దాఖలాలు లేవన్నారు. కానుకలు స్వీకరించరని చెప్పారు. పాలు, పాల ఉత్పత్తులకు దూరంగా ఉంటారని, ఉడికిన ఆహారాన్ని ఉప్పు, నూనె లేకుండానే తీసుకుంటారని తెలిపారు. వారణాసిలోని దుర్గాకుండ్ ప్రాంతం కబీర్ నగర్‌లోని ఆశ్రమంలో ఉంటున్నారని తెలిపారు. 2022 మార్చి 21వ తేదీన అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మ శ్రీ అవార్డును స్వీకరించారు. బాబా వయస్సు 125 ఏళ్లని రాష్ట్రపతి భవన్ అప్పట్లో పేర్కొంది. కాగా, ప్రజల ఇబ్బందులకు అనారోగ్యకర అలవాట్లు, శారీరక శ్రమే కారణమన్నది స్వామి శివానంద బాబా అభిప్రాయం. అందుకే, ఉదయాన్నే మేల్కొనడం, కాసేపు నడక, కనీస అరగంటపాటు యోగ సాధనతోపాటు సరైన ఆహార నియమాలతో జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని ఆయన సూచిస్తున్నారని ఫల్గుణ్ భట్టాచార్య తెలిపారు.



సంపన్నుల ఆధిపత్యం ఆందోళనకరం

కొందరే దేశాన్ని శాసించడం ప్రజాస్వామ్యానికి ముప్పే

వీడ్కోలు ప్రసంగంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్

వాషింగ్టన్: అమెరికాలో సంపన్నుల ఆధిపత్యం నానాటికీ పెరిగిపోతోందని, ఇది నిజంగా ప్రమాదకరమైన పరిణామం అని అధ్యక్షుడు జో బైడెన్ ఆందోళన వ్యక్తంచేశారు. కొందరు ధనవంతులు దేశాన్ని శాసించే పరిస్థితి రావడం సరైంది కాదని అన్నారు. దేశ ప్రజాస్వామ్యం భద్రంగా ఉండాలంటే బడాబాబులు పెత్తనం సాగించే అవకాశం ఉండొద్దని చెప్పారు. బైడెన్ పదవీ కాలం ముగియనుంది. ఈ నెల 20వ తేదీన ఆయన అధ్యక్ష పగ్గాలను డొనాల్డ్ ట్రంప్‌కు అప్పగించబోతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం శ్వేతసౌధంలో బైడెన్ వీడ్కోలు ప్రసంగం చేశారు. బైడెన్ భార్య జిల్ బైడెన్, కుమారుడు హంటర్ బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. దేశ ప్రజలను ఉద్దేశించి ఈ సందర్భంగా ఓవల్ ఆఫీసు నుంచి జో బైడెన్ ప్రసంగించారు. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలినప్పటికీ శిక్ష నుంచి తప్పించే అవకాశం ప్రస్తుతం ఉందని, ఈ పరిస్థితి కచ్చితంగా మారాలని, ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేయాలని సూచించారు. ట్రంప్‌పై ఉన్న క్రిమినల్ కేసులు, ఆయన దోషిగా తేలిన సంగతిని పరోక్షంగా ప్రస్తావించారు. శిక్ష నుంచి తప్పించుకొనే అవకాశం అధ్యక్షుడికి ఇవ్వొద్దని పేర్కొన్నారు. పిడికెడు మంది సంపన్నులు, బలవంతుల చేతుల్లో అధికారం కేంద్రీకృతం కావడం ప్రమాదకరమని వెల్లడించారు. వారు అధికార దుర్వినియోగానికి పాల్పడితే ఊహించని ఉపద్రవాలు ఎదురవుతాయని హెచ్చరించారు. అందుకే అలాంటివారిని నియంత్రించే వ్యవస్థ ఉండాలని అభిప్రాయపడ్డారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలను అపర కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రభావితం చేసినట్లు విమర్శలు వస్తున్న నేపథ్యంలో బైడెన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

సోషల్ మీడియాను జవాబుదారీగా మార్చాలి

సమాజంపై సోషల్ మీడియా ప్రభావం విపరీతంగా పెరుగుతుండడం పట్ల బైడెన్ స్పందించారు. సోషల్ మీడియా కంపెనీల ఆధిపత్యం వల్ల దేశానికి చాలా నష్టం వాటిల్లుతుందని వ్యాఖ్యానించారు. తప్పుడు సమాచారం, అసత్య ప్రచారం అనే ఊబిలో అమెరికా కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుత మీడియా అనేది కనుమరుగు అవుతోందని, ఎడిటర్లు అనేవారు కనిపించడం లేదని అన్నారు. సోషల్ మీడియాలో నిజ నిర్ధారణ అనేది లేకపోవడం బాధాకరమని వెల్లడించారు. అసత్యాల వెల్లువలో సత్యం మరుగునపడడం ఆవేదన కలిగిస్తోందన్నారు. కొందరు స్వార్థపరులు అధికారం, లాభార్జన కోసం సోషల్ మీడియాను విచ్చలవిడిగా ఉపయోగించుకుంటున్నారని బైడెన్ ఆరోపించారు. మన పిల్లలను, మన కుటుంబాలను కాపాడుకోవడానికి, అధికార దుర్వినియోగం నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి సోషల్ మీడియాను జవాబుదారీగా మార్చాలని స్పష్టంచేశారు. తగిన నిబంధనలు, రక్షణలు అమల్లో లేకపోతే కృత్రిమ మేధ(ఏఐ) కోరలు మరింతగా విస్తరిస్తాయని, మానవ హక్కులకు, గోప్యతకు భంగం వాటిల్లుతుందని హెచ్చరించారు. తమ నాలుగేళ్ల పాలనలో సాధించిన ఘనతను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాము విత్తనాలు నాటామని, వాటి ఫలితాలు తర్వాత కనిపిస్తాయని జో బైడెన్ తేల్చిచెప్పారు.

ద.కొరియా అధ్యక్షుడికి కోర్టులో చుక్కెదురు

అరెస్టును సమర్థించిన కోర్టు

సియోల్: దేశంలో అత్యయక స్థితి(మార్షల్ లా)ను ప్రకటించి దేశంలో కల్లోలానికి కారకులయ్యారన్న ఆరోపణలపై పార్లమెంట్‌లో అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు న్యాయస్థానంలో ఊరట లభించలేదు. ఈయనను అన్యాయంగా అరెస్టుచేశారన్న యూన్ తరఫు లాయర్ల వాదనను గురువారం సియోల్‌లోని సియోల్ సెంట్రల్ జిల్లా కోర్టు తిరస్కరించింది. విడుదల చేసేందుకు ఒప్పుకోలేదు. దీంతో ఆయన డెటెన్షన్ కేంద్రానికే పరిమితమయ్యారు. అధ్యక్ష భవనం వద్ద అడ్డుగా ఉంచిన బస్సులు, బ్యారికేడ్లను నిచ్చెనల సాయంతో దాటేసి, గోడలు దూకేసి లోపలికి వచ్చిన దర్యాప్తు బృంద పోలీసులు అక్కడి అధ్యక్షభవన భద్రతాబలగాలతో ఘర్షణకు దిగిమరీ ఎట్టకేలకు యూన్‌ను అరెస్టుచేయడం తెల్సిందే. తర్వాత అత్యున్నత స్థాయి అధికారు అవినీతి నిరోధక శాఖ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లి గంటల తరబడి ప్రశ్నించారు. అయినాసరే ఆయన నోరు మెదపలేదని సమాచారం. దేశవ్యతిరేక కార్యకలాపాలపై దేశాధ్యక్షుడిపై వెస్టర్న్ జిల్లా కోర్టుకు అరెస్టు వారెంట్ జారీచేసే అధికారం ఉండదని యూన్ తరఫు లాయర్లు వాదించినా సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు ధర్మాసనం వినిపించుకోలేదు.

కోడి మెదడు నేతలొద్దు: ట్రంప్

తన బృందంలో మెరికల్లాంటి 1000 మంది ఉన్నారని వెల్లడి

వాషింగ్టన్: గతంలో తన పార్టీలో, తన ప్రభుత్వంలో కలిసి పనిచేసిన అసమర్థులను కొత్త ప్రభుత్వంలో పదవుల కోసం ఎవ్వరూ సిఫార్సు చేయొద్దని కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. తనను మెచ్చని, తన విధానాలు నచ్చని వ్యక్తులను 'కోడి మెదడు'వ్యక్తులుగా ట్రంప్ అభివర్ణించారు. మరో 3 రోజుల్లో అధ్యక్ష పీఠాన్ని అధిష్టించనున్న ట్రంప్ బుధవారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. బర్డ్ బ్రెయిన్ నిక్కీ హేలీ, మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్‌లాంటి వ్యక్తులు తనకు అవసరం లేదన్నారు. రిపబ్లికన్ ప్రత్యర్థులను, విమర్శకులను పరిగణించబోనని, అత్యుత్తమమైన వేయి మందిని తన బృందంలోకి తీసుకుంటున్నానని సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ వెల్లడించారు. ''అమెరికా కోసం ట్రంప్ ప్రభుత్వం 1,000కి పైగా ఉద్యోగులను నియమించుకుంటోంది. వారు అన్ని విధాలుగా అద్భుతమైన వ్యక్తులు. వారి శ్రమ ఫలితాలను రాబోయే రోజుల్లో అమెరికా చూడబోతోంది. త్వరలో మేం అమెరికాను మళ్లీ గొప్పగా మారుస్తాం''అని ట్రంప్ పేర్కొన్నారు. సమయం, శ్రమ, డబ్బు ఆదా చేస్తారంటూ అసమర్థులను తనకు రిఫర్ చేయొద్దంటూ ఒక జాబితాను ట్రంప్ విడుదల చేశారు. తనను ఇష్టపడని, పరిపాలనా శైలి నచ్చని వ్యక్తుల పేర్లను ఆ జాబితాలో ట్రంప్ ప్రస్తావించారు.

కిందపడిన పోప్

కుడి చేతికి గాయం

రోమ్: క్రైస్తవుల అత్యున్నత పీఠాధిపతి పోప్ ఫ్రాన్సిస్ మళ్లీ గాయాలపాలయ్యారు. ఈసారి కుడి చేతికి గాయమైంది. ఇటీవల దవడకు గాయమై కోలుకున్న పోప్ మళ్లీ కిందపడటంతో కుడి చేతికి గాయమైందని వాటికన్ సిటీ 'హోలీ సీ'ప్రెస్ కార్యాలయం గురువారం ప్రకటించింది. 88 ఏళ్ల పోప్ తన అధికార నివాసం గురువారం ఉదయం పడ్డారని, అయితే ఎముక విరగకపోయినా ముందు జాగ్రత్త చర్యగా పైకి ఎత్తి కట్టామని వాటికన్ సిటీ అధికార వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ ఏడో తేదీన రాత్రిపూట పడక గదిలో పొరపాటున పక్కన ఉన్న టేబుల్‌కు తగలడంతో దవడకు పెద్ద గాయమైంది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పోప్ గత రెండేళ్లుగా మోకాలి నొప్పుల కారణంగా ఎక్కువగా వీల్‌చైర్‌కే పరిమితమవుతున్నారు. అనారోగ్యంతో ఆయన పోప్ బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు వస్తున్న వార్తలనూ ఆయన గతంలోనే ఖండించారు.

రాజకీయాలకు టాటా!

• వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోను: ట్రూడో



ఒట్టావా: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాల నుంచి వైదొలగుతున్నాననిబుధవారం ప్రకటించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. ''రాజకీయాల నుంచి నిష్క్రమించాక ఏం చేస్తానో ఇంకా ఆలోచించలేదు. కెనడియన్లు నన్ను ఎందుకు ఎన్నుకున్నారో ఆ అసాధారణ పనిని పూర్తి చేయడంపై ఈ కీలక సమయంలో దృష్టి పెట్టాను''అని మీడియాకు తెలిపారు. మంత్రులు, వివిధ ప్రావిన్సుల అధినేతలు, అమెరికాలో కెనడా రాయబారితో సమావేశమైన అనంతరం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ''కెనడా చుట్టూ ఎప్పుడూ చాలా రాజకీయాలు జరుగుతున్నాయి. జాతి ప్రయోజనాల కోసం ఎప్పుడు ఎలాంటి అడుగు వేయాలో తెలుసుకోవడమే కెనడియన్లు కోరుకునేది. సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆ విషయం తెలుసు''అని ట్రూడో అన్నారు. లిబరల్ పార్టీ నాయకుడిని ఎన్నుకున్న తరువాత ప్రధాని పదవి నుంచి దిగిపోతానని ట్రూడో ఇటీవల ప్రకటించారు. ఎన్నికైన నేత ఆగస్టులో ఎన్నికలు జరిగేవరకు ప్రధానిగా ఉంటారు. అయితే ట్రూడో ఎన్నికలు జరిగే వరకూ పార్లమెంటు సభ్యుడిగా కొనసాగుతారు. దశాబ్ద కిందట యువకుడిగా, శక్తివంతమైన నాయకుడిగా ట్రూడో తన కెరీర్‌కు ఊహించని ముగింపు పలకడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఆయన నేతృత్వంలో లిబరల్ పార్టీ తీవ్ర అపప్రదకు గురైంది. అమెరికా, భారత్‌లాంటి దేశాలతో సంబంధాలు క్షీణించాయి. వలసలు, ద్రవ్యోల్బణం, ఉపాధి, గృహనిర్మాణం సహా అనేక అంశాల్లో ట్రూడో ప్రభుత్వం విఫలమైందని కెనడియన్లు భావిస్తున్నారు.

చరిత్రను వక్రీకరించే ప్రయత్నం

భగవత్ వ్యాఖ్యలపై మండిపడ్డ మమత



కోల్‌కతా: అయోధ్యలో రామమందిర నిర్మాణం భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యమన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలపై తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ మండిపడ్డారు. ఇవి జాతి వ్యతిరేకమైన ప్రమాదకర వ్యాఖ్యలన్నారు. గురువారం కోల్‌కతాలోని రాష్ట్ర సచివాలయంలో ఆమె మాట్లాడారు. భగవత్ వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని, అందుకు ప్రాణాలైనా త్యాగం చేయడానికి సిద్ధమని చెప్పారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ సైతం ఖండించింది. ఆయన వ్యాఖ్యలు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, త్యాగాలు చేసిన వారిని అవమానించాలని ఉన్నాయని మండిపడింది.

చెత్తగా రోడ్లేస్తే జైలుకే

రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: రహదారులను నాణ్యతా లోపంతో నిర్మిస్తే నాన్ బెయిలబుల్ కేసులు తప్పవని కేంద్ర రోడ్డు రవాణా హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే కాంట్రాక్టర్లు, ఇంజనీర్లను జైలు పంపుతామని హెచ్చరించారు. గురువారం ఆయన సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంలోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 2023లో దేశ వ్యాప్తంగా చోటుచేసుకున్న 5 లక్షల ప్రమాదాల్లో 1.72 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన వివరించారు. మృతుల్లో 10వేల మంది చిన్నారులుండగా, 18–45 ఏళ్ల వయస్కులు 1.14 లక్షల మంది ఉన్నారన్నారు. మొత్తం మరణాల్లో 55 వేలు హెల్మెట్ లేని కారణంగా, మరో 30 వేల సీట్ బెల్టు ధరించని కారణంగానే చోటుచేసుకున్నాయని చెప్పారు. 2030 నాటికి రహదారులపై ప్రమాదాలను సగానికి సగం తగ్గించడమే తమ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారులపైన జరిగే ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను సరి చేసేందుకు తమ శాఖ రూ.40 వేల కోట్లను వెచ్చించనుందని తెలిపారు.

నల్లపెట్టె మౌనరాగం!

నల్ల రంగులో ఉండదు. పేరు మాత్రం బ్లాక్ బాక్స్. 'డెత్ కోడ్'ను తనలో గోప్యంగా దాచుకుంటుంది. నిజానికిది ఒక్క బాక్సు కూడా కాదు. రెండు పెట్టెలు! విమానం కూలిందంటే అందరి కళ్లూ దానికోసమే చూస్తాయి. రికవరీ బృందాలు దాని వేటలో నిమగ్నమవుతాయి. అది దొరికితే ప్రమాద కారణాలు తెలిసినట్టే. కానీ ఇటీవల బ్లాక్‌బాక్సులు తరచూ విఫలమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

విమాన ప్రమాదాల్లో మూగవోతున్న బ్లాక్ బాక్స్ • క్లిష్టంగా మారుతున్న దర్యాప్తులు



గాలిలో ప్రయాణం ఎప్పుడూ గాల్లో దీపమే. రన్ వే నుంచి ఎగిరిన విమానం క్షేమంగా కిందికి దిగేదాకా టెన్షనే. వైమానిక దుర్ఘటనలకు కచ్చితమైన కారణాలు తెలియాలంటే బ్లాక్ బాక్స్ చిక్కాలి. అందులో ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్డీఆర్), కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్) అని రెండు భాగాలుంటాయి. వీటిని ఫ్లైట్ రికార్డర్స్ అంటారు. సులభంగా గుర్తుపట్టేందుకు వీలుగా అవి ప్రకాశవంతమైన ఆరెంజ్ రంగులో ఉంటాయి. బ్లాక్ బాక్స్ సురక్షితంగా ఉండేలా ప్రమాదాల్లో తక్కువ నష్టం జరిగే తోక భాగంలో అమర్చుతారు. ఎఫ్డీఆర్ సెకన్ల వ్యవధిలో దాదాపు వెయ్యి పరామితులను నమోదు చేస్తుంది. ప్రమాద సమయంలో విమానం ఎంత ఎత్తులో, ఎంత వేగంతో ఎగురుతోంది, ఇంజన్ పనితీరు, ప్రయాణ మార్గం, దిశ తదితరాలను రికార్డు చేస్తుంది. ఇక సీవీఆర్ పైలట్ల సంభాషణలు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు వారు పంపిన, స్వీకరించిన సమాచారం, కాక్‌పిట్ శబ్దాల వంటివాటిని నమోదు చేస్తుంది. కనుక విమాన ప్రమాదాలకు దారితీసిన కారణాలు, చివరి క్షణాల్లో మార్పులు తదితరాలను బ్లాక్ బాక్స్ మాత్రమే వెల్లడించగలదు. దాని డేటాను విశ్లేషించి ప్రమాద కారణంపై పరిశోధకులు అంచనాకు వస్తారు. ఇంత కీలకమైన ఈ 'నల్ల పెట్టె'ం ఇటీవల మొండికేస్తుంది. మూగనోము పడుతుంది. దక్షిణ కొరియాకు చెందిన 'జెజు ఎయిర్'విమానం గత నెల 29న కూలిపోయి ఇద్దరు మినహా 179 దుర్మరణం పాలవడం తెలిసిందే. కూలడానికి నాలుగు నిమిషాల ముందు నుంచే అందులోని ఫ్లైట్ రికార్డర్లు పని చేయడం మానేశాయి. దాంతో దర్యాప్తు క్లిష్టంగా మారింది.

వైఫల్యానికి కారణాలివీ...

బ్లాక్ బాక్సులోని రెండు రికార్డర్లు 4.5 కిలోలుంటాయి. గురుత్వశక్తి కంటే 3,400 రెట్లు అధిక శక్తితో విమానం కూలినా బ్లాక్ బాక్స్ తట్టుకోగలదు. వెయ్యి డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతనూ కాసేపటిదాకా భరించగలదు. సముద్రంలో కూలినా హై పిచ్ శబ్దాలతో 90 రోజులపాటు సంకేతాలు పంపగలదు. 20 వేల అడుగుల లోతులోనూ నెలపాటు పని చేయగలదు. దొరికాక కీలక డేటా, ఆడియో చెరిగిపోకుండా జాగ్రత్తగా వివరాలు సేకరిస్తారు. డేటాను డౌన్లోడ్ చేసి కాపీ చేస్తారు. దాన్ని డీకోడ్ చేసి గ్రాఫ్స్ రూపొందిస్తారు. అయితే...

- సర్క్యూట్ పాడవటం, సెన్సర్లు విఫలమవడం తదితర సాంకేతిక అవరోధాలు, సాఫ్ట్‌వేర్ లోపాలు తలెత్తినప్పుడు బ్లాక్ బాక్సు పనిచేయదు.
- ప్రమాద తీవ్రత విపరీతంగా ఉండి భౌతికంగా ధ్వంసమైనప్పుడు కూడా దానిపై ఆశ వదిలేసుకోవాల్సిందే.
- విమాన సిబ్బంది ఉద్దేశపూర్వకంగా డీ యాక్టివేట్ చేసినా బ్లాక్‌బాక్స్ పని చేయడం మానేస్తుంది.
- డేటా ఓవర్ లోడ్ అయినప్పుడు కూడా మొరాయిస్తుంది.
- కొన్ని పాత బ్లాక్ బాక్సుల్లో నిర్ణీత కాలం తర్వాత డేటా ఓవర్ రైట్ అయిపోతుంది. దాంతో వాటినుంచి ఎలాంటి సమాచారమూ లభించదు. నిరుడు జనవరిలో అలస్కా ఎయిర్ లైన్స్ బోయింగ్ విమానం ప్రయాణ సమయంలో తలుపు ఊడటంతో సీవీఆర్ పూర్తిగా ఓవర్ రైట్ అయింది. దాని నుంచి డేటా లభ్యం కాలేదు.
- అత్యుష్ణ, అత్యల్ప ఉష్ణోగ్రతలు, ఎక్కువ కాలం నీటిలో నానడం వల్ల కూడా ఫ్లైట్ రికార్డర్లు పాడవుతాయి.
- తేమ చేరి సున్నిత భాగాల్లో పరికరాలు దెబ్బతిని షార్ట్ సర్క్యూట్ కావడం, అత్యధిక ఎత్తుల్లో పీడనం, పక్షులు ఢీకొనడం, పిడుగుపాట్లు వంటి వాటి వల్ల కూడా బ్లాక్ బాక్సు పనిచేయకపోవచ్చు.

పదేళ్లుగా జాడ లేని మలేసియా విమానం!

నిజానికి ఫ్లైట్ రికార్డర్ల సామర్థ్యం పెంచాల్సిన అవసరం చాలా ఉంది. కానీ ఖర్చు, పరిమితుల దృష్ట్యా అది ఆలస్యమవుతోంది. అత్యవసర సందర్భాల్లో ఫ్లైట్ రికార్డర్లు పనిచేయాలంటే వాటికి విమానంలో ప్రత్యేక వ్యవస్థల నుంచి పవర్ సరఫరా తప్పనిసరి. రెండు ఇంజిన్లూ విఫలమైనప్పుడు విమానమంతటా ఎలక్ట్రికల్ పవర్ నిలిచిపోతుంది. 1999లో న్యూయార్క్ నుంచి కైరో వెళుతున్న 'ఈజిప్ట్ ఎయిర్'విమానం అట్లాంటిక్ మహాసముద్రంలో కూలి 217 మంది మరణించారు. ఎలక్ట్రికల్ పవర్ ఆగిపోగానే దాని ఫ్లైట్ రికార్డర్లు పని చేయడం మానివేశాయి. దాంతో, విమానం లోపల సాధారణ అవసరాల కరెంటుపై ఆధారపడకుండా ఫ్లైట్ రికార్డర్లు 10 నిమిషాలు అదనంగా రికార్డింగ్ చేయడానికి వీలుగా ప్రత్యామ్నాయ బ్యాకప్ పవర్ ఏర్పాట్లుండాలని అమెరికా జాతీయ రవాణా సేఫ్టీ బోర్డు సిఫార్సు చేసింది. బ్లాక్ బాక్సుల బ్యాకప్ బ్యాటరీల జీవితకాలం తక్కువ. కొన్ని సందర్భాల్లో పనే చేయవు. దక్షిణ కొరియా 'జెజు ఎయిర్'విమానంలోనూ విద్యుత్ వ్యవస్థ విఫలమై ఫ్లైట్ రికార్డర్లకు పవర్ అందక మూగవోయాయని భావిస్తున్నారు. సీవీఆర్ ఒక విడతలో రెండు గంటలపాటు మాత్రమే రికార్డు చేయగలదు. ఆ డేటానే రిపీట్ చేస్తుంది. రికార్డింగ్ నిడివిని 25 గంటలకు పెంచాలన్న డిమాండ్ కార్యరూపం దాలుస్తోంది. 2009లో ఎయిర్ ఫ్రాన్స్ విమానం బ్రెజిల్‌లోని రియో డి జెనీరో నుంచి పారిస్ వెళ్తూ అట్లాంటిక్ మహాసముద్రంలో కూలి 228 మంది చనిపోయారు. మలేసియా ఎయిర్‌లైన్స్ ఎంహెచ్ 370 విమానానిదైతే ఇప్పటికీ అంతు లేని వ్యథే! 2014లో కౌలాలంపూర్ నుంచి బీజింగ్ వెళ్తూ అకస్మాత్తుగా రాడార్ తెర నుంచి అదృశ్యమైంది. మొత్తం 239 మందీ మరణించారని భావిస్తున్నారు. విమానం ఎందుకు, ఎలా అదృశ్యమైందో ఇప్పటికీ అంతుచిక్కలేదు. వైమానిక చరిత్రలోనే ఇదో పెద్ద మిస్టరీ. విమానం దక్షిణ హిందూ మహాసముద్రంలో కూలిందని అనుమానిస్తున్నారు. దాని జాడ కోసం మళ్లీ అన్వేషణ చేపట్టాలని మలేసియా తాజాగా నిర్ణయించింది. 'ఎయిర్ ఫ్రాన్స్' దుర్ఘటన దరిమిలా మహా సముద్రాలను దాటి ప్రయాణించే విమానాల కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో 25 గంటల డేటా రికార్డింగ్ తప్పనిసరి చేయాలని ఫ్రాన్స్ సిఫార్సు చేసింది. అమెరికా కూడా దీన్ని చట్టంలో చేర్చింది. కానీ కొత్తగా తయారయ్యే విమానాల్లోనే ఈ మార్పులకు వీలుంది. పాతవాటిలో సాధ్యపడటం లేదు. ఇప్పుడు తిరిగే చాలా విమానాల జీవిత కాలం 40–50 ఏళ్లు!

కొత్త టెక్నాలజీతో బ్లాక్ బాక్సులు!

తాజా సవాళ్లు, మారిన సాంకేతికత నేపథ్యంలో అధునాతన రీతిలో సరికొత్త బ్లాక్ బాక్సుల కు పకల్పన జరుగుతోంది. ఎక్కువ గంటల రికార్డింగ్, అధిక డేటా స్టోరేజీ, బ్యాకప్ బ్యాటరీల జీవితకాలం పెంపు వంటివి వీటిలో ప్రధానాంశాలు. ప్రమాద తీవ్రత ఎంత ఎక్కువగా ఉన్నా సమర్థంగా పనిచేసే బ్లాక్ బాక్సులూ రానున్నాయి. సముద్రాల్లో కూలినప్పుడు తక్కువ శ్రమతో సత్వరం గుర్తించే అండర్ వాటర్ లొకేటర్ బీకాన్స్ అభివృద్ధి దశలో ఉన్నాయి. ముఖ్యంగా, డేటాను రియల్ టైమ్‌లో పంపే బ్లాక్ బాక్సులు రానున్నాయి. తద్వారా కీలక సమాచారం వెంటనే గ్రౌండ్ స్టేషనుకు చేరుతుంది కనుక ప్రమాదంలో బ్లాక్ బాక్స్ నాశనమైనా ఇబ్బంది ఉండబోదు.

– జమ్ముల శ్రీకాంత్

ప్రపంచంలోనే అతి ప్రాచీన గ్రంథం?

ఆర్యుల రాకతోనే భారతదేశంలో చారిత్రక యుగం ప్రారంభమైంది. ఈ కాలం నుంచే భారతదేశ చరిత్రకు సంబంధించిన లిఖిత ఆధారాలు లభిస్తున్నాయి. 'ఆర్య' అనేది భాషకు సంబంధించిన పదం. ఆర్య భాషను ఉపయోగించడం వల్ల వీరిని ఆర్యులనీ, వీరి నాగరికతను 'ఆర్య నాగరికత' అని అంటారు. ఈ నాగరికతకు ప్రధానాధారం వేద సాహిత్యం. అందువల్ల దీన్ని 'వేద నాగరికత' అంటారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

వైదిక నాగరికత

భారతదేశ చరిత్రలో క్రీ.పూ. 1500-600 మధ్య కాలాన్ని వైదిక యుగంగా పేర్కొంటారు. ఈ కాలంలో వైదిక నాగరికత విలసిల్లింది. ఈ నాగరికత నిర్మాతలు ఆర్యులు. ఈ నాగరికత కాలాన్ని రెండు దశలుగా విభజిస్తారు. క్రీ.పూ. 1500 నుంచి 1000 మధ్య కాలాన్ని 'తొలివేద నాగరికత' లేదా 'రుగ్వేద నాగరికత'గా, క్రీ.పూ. 1000 నుంచి 600 మధ్య కాలాన్ని 'మలివేద నాగరికత'గా వ్యవహరిస్తారు.

ఆర్యులు నార్డిక్ జాతికి చెందినవారు. వీరి జన్మస్థలంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దీనికి కారణం స్పష్టమైన ఆధారాలు లేకపోవడం. ఆర్యుల జన్మస్థలంపై ఉన్న వాదనల్లో ముఖ్యమైనవి..

1. **మధ్య ఆసియా వాదం:** ఇండో-యూరోపియన్ భాషల తులనాత్మక అధ్యయనం ఆధారంగా మాక్స్‌ముల్లర్ ఆర్యుల జన్మభూమి మధ్య ఆసియా అని పేర్కొన్నారు. మిగిలిన వాదనల కంటే ఇది అర్థవంతంగా ఉండటంతో అత్యధికుల ఆమోదం పొందింది.
2. **జర్మనీ వాదం:** ఆర్యుల జన్మభూమి జర్మనీ అని పెంకాతో పాటు ఇతర యూరోపియన్ చరిత్రకారులు వాదించారు.
3. **ఆర్కిటిక్ వాదం:** ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి భారతదేశానికి వలస వచ్చారని బాల గంగాధర్ తిలక్ అభిప్రాయపడ్డారు. దీనిపై ఆయన 'ఆర్కిటిక్ ది హోం ఆఫ్ ఆర్యన్స్' అనే గ్రంథాన్ని రాశారు.
4. ఆస్ట్రో-హంగేరీ ప్రాంతమే ఆర్యుల జన్మస్థలమని డాక్టర్ గైల్ అనే చరిత్రకారుడు వాదించారు.
5. **టిబెట్ వాదం:** ఆర్యుల జన్మభూమి టిబెట్ అని దయానంద సరస్వతి వాదన.
6. **స్వదేశీ వాదం:** ఆర్యులు భారతదేశంలోని సప్త సింధూ ప్రాంతానికి చెందిన స్థానికులే అని డాక్టర్ ఎ.సి.దాస్ అభిప్రాయం. ఆర్యులు విదేశీయులు, బయటి ప్రాంతాల నుంచి భారత్‌కు వలస వచ్చారు అనే వాదనలను ఆయన ఖండించారు.

ఆర్యుల సాహిత్యం

'వేదసాహిత్యం' భారతదేశంలో లభిస్తున్న అత్యంత ప్రాచీన సాహిత్యం. దీన్ని వెలువరించినవారు ఆర్యులు. వేద సాహిత్యాన్ని శ్రుతి సాహిత్యం, స్మృతి సాహిత్యం అని రెండు రకాలుగా విభజించారు.

1. **శ్రుతి సాహిత్యం:** ఇందులో నాలుగు వేదాలతో పాటు బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు ఉన్నాయి.

వేదాలు: వేదాలను 'అపౌరుషేయాలు' అంటారు. అంటే ఇవి మానవమాత్రులు రచించినవి కావు, దివ్యగ్రంథాలు అని అర్థం.

రుగ్వేదం: ఇది భారతదేశంలోనే కాకుండా మొత్తం ఇండో-యూరోపియన్ సాహిత్యంలోనే అతి ప్రాచీనమైంది. తొలి వేదకాలం గురించి తెలుసుకోవడానికి ఇది ప్రధాన ఆధారంగా ఉంది. ఇందులో మొత్తం 1028 శ్లోకాలున్నాయి. దీన్ని 10 మండలాలుగా విభజించారు. పదో మండలంలోని పురుష సూక్తంలో చాతుర్వర్ణ వ్యవస్థ తొలి ప్రస్తావన ఉంది. మూడో మండలంలో ప్రసిద్ధమైన గాయత్రి మంత్రం ఉంది.

సామవేదం: ఇందులో 1600కు పైగా శ్లోకాలున్నాయి. ఇది సంగీత ప్రధానమైంది. యజ్ఞాల సమయంలో పఠించే మంత్రాలకు అనువుగా ఈ సంగీతాన్ని రూపొందించారు. భారతీయ సప్త స్వరాలకు మూలం దీంట్లోనే ఉన్నట్లు చెబుతారు.

యజుర్వేదం: ఈ గ్రంథంలో యజ్ఞయాగాలు, క్రతువులు, కర్మకాండలు, బలిదానాలు తదితర సందర్భాల్లో పఠించే మంత్రాలు ఉన్నాయి. రాజులు నిర్వహించే రాజసూయ, వాజపేయ లాంటి యాగాలకు సంబంధించిన తొలి ప్రస్తావన ఇందులో కనిపిస్తుంది.తొలి రెండు వేదాలకు భిన్నంగా దీన్ని పద్య, గద్య శైలి రెండింటిలోనూ రాశారు. దీంట్లో సుమారు రెండువేల శ్లోకాలున్నాయి.

అధర్వణ వేదం: ఇది మంత్రతంత్రాలతో కూడిన గ్రంథం. దీన్ని ఆర్యేతరులకు సంబంధించిందిగా భావిస్తున్నారు. ఆర్యేతరుల ఆచారాలు, సాంప్రదాయాలు ఇందులో కనిపిస్తాయి. దీంట్లో దుష్టశక్తులను పారదోలడానికి, వ్యాధులను నివారించేందుకు ఉపయోగించే మంత్రతంత్రాలున్నాయి. ఇందులో మొత్తం 711 శ్లోకాలున్నాయి. దీన్ని రెండు భాగాలు గా విభజించారు. అవి: పైప్పలాద, సౌనక.

బ్రాహ్మణాలు: ఇవి పూజా ప్రార్థనలు, యజ్ఞ యాగాలు, బలిదానాలు, ఉత్సవాలకు సం బంధించిన గ్రంథాలు. నాలుగు వేదాలకు అనుబంధంగా మొత్తం ఏడు బ్రాహ్మణాలు ఉన్నాయి. ఇవి నాటి ప్రజల ఆచార వ్యవహారాలు, సామాజిక జీవితాలను ప్రతిబింబిస్తున్నాయి. వీటిలో అతి పురాతనమైంది 'తాండ్యమహా బ్రాహ్మణం'.అన్నిటికంటే ముఖ్యమైనది'శతపథ బ్రాహ్మణం'. ప్రతి బ్రాహ్మణం ఏదో ఒక వేదంతో అనుబంధమై ఉంది.

అరణ్యకాలు: వీటిని వేదాలు, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులకు మధ్య అనుసంధానాలుగా భావిస్తారు. బ్రాహ్మణాలు వేదాలకు అనుబంధంగా ఉంటే అరణ్యకాలు బ్రాహ్మణాల కు అనుబంధంగా ఉన్నాయి. ఇవి అడవుల్లో నివసించే రుషులను ఉద్దేశించినవి. వీటిలో ప్రధానాంశం సన్యాసవాదం. వీటిలో నైతిక విలువలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యమైన అరణ్యకాలు-ఐతరేయ, కౌసితాకి.

ఉపనిషత్తులు: యజ్ఞ యాగాలకు బదులుగా భక్తి, జ్ఞానానికి ప్రాధాన్యమిచ్చే తాత్విక గ్రం థాలివి. భారతీయ తత్వ శాస్త్రానికి మూలం ఇవేనని భావిస్తున్నారు. శంకరాచార్యులు, రామానుజాచార్యుల తత్వ సిద్ధాంతాలకు కూడా మూలం ఇవే. పునర్జన్మ సిద్ధాంతానికి సంబంధించిన ప్రస్తావన మొదటగా వీటిలోనే కనిపిస్తుంది. ఉపనిషత్తుల మొత్తం సంఖ్య 108. వీటిలో చాందొగ్య, బృహదారణ్యక, ముండక, జబల, ఐతరేయ, కౌసితాకి, శ్వేతాశ్వతార, కథ, కేన లాంటివి ముఖ్యమైనవి. జబల ఉపనిషత్తులో తొలిసారిగా నాలుగు ఆశ్రమాల ప్రస్తావన కనిపిస్తుంది. ముండకోపనిషత్తులో 'సత్యమేవ జయతే' అనే ప్రముఖ శ్లోకం కనిపిస్తుంది. ఉపనిషత్తులు కూడా నాలుగు వేదాలకు అనుబంధంగా ఉన్నాయి.

2. **స్మృతి సాహిత్యం:** ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంగా లభించిన సాహిత్యం కాబట్టి దీన్ని 'స్మృతి సాహిత్యం' అంటారు. ఇందులో వేదాంగాలు, సూత్రాలు, ఇతిహాసాలు, ఉపవేదాలు, పురాణాలు, షడ్దర్శనాలు ఉన్నాయి.

వేదాంగాలు: ఇవి మొత్తం ఆరు. మానవులు రచించినవే కాబట్టి వేదాల్లా ఇవి అపౌరుషేయాలు కావు.

- **శిక్ష:** ఇది ఉచ్చారణకు సంబంధించింది.
- **కల్ప:** ఇది వేదాంగాల్లో అతి ముఖ్యమైంది. క్రతువుల గురించి తెలియజేస్తుంది.
- **వ్యాకరణ:** భాషా వ్యాకారణానికి సంబంధించింది.
- **నిరుక్త:** పద వ్యుత్పత్తిని వివరిస్తుంది.
- **ఛందస్సు:** ప్రాస, లయలకు చెందింది.
- **జ్యోతిష:** ఖగోళ శాస్త్రానికి సంబంధించిన వేదాంగం.

సూత్రాలు: ఇవి మూడు రకాలు.

శ్రౌత సూత్రాలు: ఇవి యజ్ఞ యాగాలు, క్రతువులు, కర్మకాండల గురించి వివరిస్తాయి. సుళ్వ సూత్రాలు ఇందులో ఒక భాగం. సుళ్వ సూత్రాల్లో రేఖా గణిత శాస్త్ర మూలాలు ఉన్నాయి.

గృహ్య సూత్రాలు: గృహస్థు తన జీవిత కాలంలో ఆచరించాల్సిన క్రతువులు, కర్మకాండల గురించి తెలియజేస్తాయి. వీటి ప్రకారం ఒక మనిషి పుట్టుక నుంచి మరణం వరకు మొత్తం 16 క్రతువులు, కర్మకాండలను నిర్వహించాలి.

ధర్మసూత్రాలు: చట్టాలు, ప్రజల ఆచార వ్యవహారాల గురించి తెలియజేస్తాయి. న్యాయశాస్త్రాలకు వీటినే మూలంగా భావిస్తారు. మనుస్మృతి లాంటి వివిధ ధర్మ శాస్త్రాలకు ఇవి ప్రాతిపదికగా ఉన్నాయి. అందువల్ల ఇవి చరిత్రకారులకు అత్యంత ప్రధానమైనవి.

షడ్దర్శనాలు: ఇవి భారతీయ తత్వశాస్త్రానికి సంబంధించిన సిద్ధాంతాలు. ఇవి యజ్ఞయాగాలు, క్రతువులను నిరసిస్తాయి. సచ్ఛీలత, నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తాయి. వివిధ సిద్ధాంతాలు - ప్రవచించిన రుషుల వివరాలను కింద గమనించవచ్చు.

- సాంఖ్య దర్శనం – కపిల మహర్షి
- వైశేషిక – ఉలూక కనద రుషి
- న్యాయ – గౌతమ
- యోగ దర్శన – పతంజలి
- పూర్వ మీమాంస – జైమిని మహర్షి
- ఉత్తర మీమాంస – బాదరాయణుడు

ఉపవేదాలు: స్మృతి సాహిత్యంలో నాలుగు ఉపవేదాలున్నాయి. అవి:

1. **ఆయుర్వేదం:**వైద్య శాస్త్రానికి సంబంధించింది.
2. **గాంధర్వ వేదం:** గానం, సంగీతాలకు సంబంధించింది.
3. **శిల్పవేదం:** వాస్తు, శిల్పకళలను వివరిస్తుంది.
4. **ధనుర్వేదం:** ఇది యుద్ధ విద్యలకు ముఖ్యంగా ధనుర్విద్యకు సంబంధించింది.

పురాణాలు: స్మృతి సాహిత్యంలో భాగంగా ఉన్న మొత్తం 18 పురాణాలూ గుప్తుల అనంతర కాలానికి చెందినవే. కానీ వాటిలోని కథలు ప్రాచీనమైనవి. ఇవి ప్రధానంగా ప్రాచీన కాలానికి చెందిన రాజుల వంశానుక్రమాన్ని వివరిస్తాయి. ప్రపంచ సృష్టి, వినాశనం, పునఃసృష్టి, సూర్య, చంద్ర వంశీకుల చరిత్ర మొదలైన అంశాలపై వివరాలను అందిస్తున్నాయి.

ముఖ్యమైన పురాణాలు: వాయు, విష్ణు, బ్రహ్మ, శివ, గరుడ, భాగవత, భవిష్య, పద్మ, స్కంధ పురాణాలు. అష్టాదశ పురాణాల్లో అతి ప్రాచీనమైంది వాయు పురాణం.

ఇతిహాసాలు:

- **రామాయణం:** పురాణాల ప్రకారం దీన్ని క్రీ.పూ. 500 ఏళ్ల కిందట రచించారు. దీనికి తొలిరూపం ఇచ్చిన వారు వాల్మీకి. ఇందు లో మొత్తం 7 కాండాలున్నాయి. మొదటి, చివరి కాండాలు మినహా మిగిలినవి ప్రాచీనమైనవి.
- **మహాభారతం:** వేదవ్యాసుడు రచించారు. భగవద్గీత కూడా ఇందులో అంతర్భాగమే. మహాభారతాన్ని మొదట 'జయసంహిత' అని పిలిచారు. ఇందులో మొత్తం 18 పర్వాలున్నాయి.

ధర్మశాస్త్రాలు (స్మృతులు): మానవుడి జీవితాన్ని నియమబద్ధం చేసేందుకు వీటిని రచించారు. ఇవి చాతుర్వర్ణాలు, వర్ణాశ్రమ ధర్మాలు, షోడష కర్మలు, సంస్కారాలు, ఆచారాలు, వ్యవహారాలు, శిక్షలు లాంటి అనేక అంశాల గురించి వివరిస్తాయి.

ముఖ్యమైన స్మృతులు:

- **మనుస్మృతి:** అత్యంత ప్రాచీనమైన ధర్మశాస్త్రం . తర్వాతి కాలంలో వచ్చిన అనేక ధర్మశాస్త్రాలకు ఇది మూలంగా ఉంది.
- **యాజ్ఞవల్క్య స్మృతి:** యాజ్ఞ వల్క్య మహర్షి రచించారు. దీనిపై క్రీ.శ. 11వ శతాబ్దంలో విజ్ఞానేశ్వరుడు 'మితాక్షర' అనే వ్యాఖ్యానాన్ని రచించాడు.
- **పరాశర స్మృతి:** దీన్ని రచించినవారు పరాశర మహర్షి. ఇందులో కొంత ఆధునిక భావాలు కనిపిస్తాయి. దీన్ని కలియుగానికి అనువైందిగా భావిస్తారు.
- **నారద స్మృతి:** నారద మహర్షి రచించారు. వీటితోపాటు బృహస్పతి స్మృతి, కాత్యాయన స్మృతి కూడా ముఖ్యమైనవి.

మాదిరి ప్రశ్నలు

1. 'ఆర్య' అనేది జాతికి సంబంధించిన పదం అని వాదించిన విదేశీ చరిత్రకారుడు?
   1) పెంకా 2) సర్ విలియమ్ జోన్స్
   3) మాక్స్ ముల్లర్ 4) గైల్
2. రుగ్వేదంలోని గాయత్రీమంత్రం ఏ దేవతకు సంబంధించింది?
   1) అధితి 2) ఉషస్సు
   3) సావిత్రి 4) అరణ్యాని
3. వేదాలు - వాటి పురోహితులకు సంబంధించి కిందివాటిలో సరికాని జత?
   1) రుగ్వేదం- హోత్రి
   2) సామవేదం - ఉద్గాత్రి
   3) యజుర్వేదం - అధ్వర్యు
   4) అధర్వణ వేదం - గ్రామణుడు
4. 'కుటుంబ గ్రంథం' అని ఏ వేదాన్ని పిలుస్తారు?
   1) రుగ్వేదం 2) సామవేదం
   3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
5. సుప్రసిద్ధ 'తమసోమా జ్యోతిర్గమయ' శ్లోకం ఏ గ్రంథంలో ఉంది?
   1) ఐతరేయ బ్రాహ్మణం
   2) బృహదారణ్యక ఉపనిషత్తు
   3) యజుర్వేద సంహిత
   4) భాగవత పురాణం
6. ప్రపంచంలోనే అతి ప్రాచీన గ్రంథం?
   1) రుగ్వేదం 2) సామవేదం
   3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
7. అష్టాదశ పురాణాల్లో అతి ప్రాచీనమైనది?
   1) విష్ణు పురాణం 2) భాగవత పురాణం
   3) వాయుపురాణం
   4) గరుడ పురాణం

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 1; 5) 2; 6) 1; 7) 3.

సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ ఎక్కడ ఉంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. 'బయోటెక్నాలజీ' (జీవ సాంకేతిక శాస్త్రం) అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించినవారు?
   1) జాన్‌కోల్ రీటర్ 2) వాక్స్‌మెన్
   3) కార్ల్ ఎరికే 4) లీవెన్ హక్
2. కిందివాటిలో సరైన వాక్యాలు ఏవి?
   ఎ) 'డాలి'.. ప్రపంచంలో మొదటిసారిగా సృష్టించిన క్లోన్డ్ గొర్రెపిల్ల. దీన్ని 'రోసేలిన్ ఇన్‌స్టిట్యూట్' శాస్త్రవేత్త ఇయాన్ విల్మట్ సృష్టించారు
   బి) 'ఈవ్'.. మొదటి క్లోన్డ్ బేబీ. దీన్ని సృష్టించిన సంస్థ 'సియోల్ నేషనల్ యూనివర్సిటీ'
   సి) సంరూప, గరిమా అనే పెయ్య దూడలను సృష్టించింది నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్‌ఐ), కర్నాల్ (హర్యానా)
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
3. 'ఇంటర్‌ఫెరాన్'లను ప్రధానంగా ఏ జీవులు ఉత్పత్తి చేస్తాయి?
   1) అకశేరుకాలు 2) సకశేరుకాలు
   3) బ్యాక్టీరియాలు 4) శిలీంద్రాలు
4. ఇంటర్‌ఫెరాన్‌లను కనుగొన్నవారు?
   1) గిల్‌బర్ట్, వీస్‌మన్
   2) కోహ్లర్, మిల్‌స్టీన్
   3) నాథన్స్ 4) థామ్సన్
5. కిందివాటిలో జన్యు పరివర్తిత మొక్కకు ఉదాహరణ?
   1) వరిలో IR - 8 2) గోల్డెన్ రైస్
   3) సజ్జలో పూసా మోతి
   4) వేరుశనగలో TMV - 3
6. కిందివాటిలో 'బ్యాక్టీరియల్ పెస్టిసైడ్' ఏది?
   1) బాసిల్లస్ ఆంథ్రాసిస్
   2) బాసిల్లస్ పాలిమిక్సా
   3) క్లాస్ట్రీడియం బొట్యులినమ్
   4) బాసిల్లస్ థురింజియాన్సిస్
7. 'తైపేయి' అనేది ఏ పంట రకం?
   1) జొన్న 2) గోధుమ
   3) వరి 4) సజ్జ
8. 'గోల్డెన్ రైస్'ను ఏవిధంగా ఉత్పత్తి చేస్తారు?
   1) వరిలోని పూసా రకాన్ని IR-8 రకంతో సంకరణం చేయడం ద్వారా
   2) తైపేయి అనే వరి రకంలో 'విటమిన్-ఎ'ను ఉత్పత్తి చేసే మూడు జన్యువులను ప్రవేశపెట్టడం ద్వారా
   3) అధిక దిగుబడిని సాధించడానికి వరిలోని 'అనామిక' రకంలోకి జన్యువులను ప్రవేశపెట్టడం ద్వారా
   4) వరిలోని 'బీరాజ్' రకంలో ఉత్పరివర్తనాలను కలిగించడం ద్వారా
9. సూక్ష్మజీవులను ఉపయోగించి.. నేల లేదా నీటి నుంచి అనవసర వ్యర్థ పదార్థాలు, కాలుష్య కారకాలను తొలగించే పద్ధతిని ఏమంటారు?
   1) బయోఇన్ఫర్మేటిక్స్
   2) ప్రోటియోమిక్స్
   3) బయోరెమిడియేషన్ 4) జీనోమిక్స్
10. జున్ను ఉత్పత్తికి ఉపయోగించే జంతు ఎంజైమ్ ఏది?
    1) పెప్సిన్ 2) రెన్నెట్
    3) లైపాక్సిజినేజ్ 4) లైపేజ్
11. మాంసం మృదుత్వానికి, తోళ్లను మెత్తబరచడానికి ఉపయోగించే ఎంజైమ్‌లు వరసగా?
    1) పెప్సిన్, రెన్నెట్
    2) పెప్సిన్, ప్రోటియేజ్
    3) ప్రోటియేజ్, ట్రిప్సిన్
    4) రెన్నెట్, లైపేజ్
12. 'గోల్డెన్ రైస్'ను సృష్టించిన శాస్త్రవేత్త?
    1) కొహ్లార్ 2) నాథన్స్
    3) నార్మన్ బోర్లాగ్ 4) ఇంగోపాట్రికస్
13. కిందివాటిలో జన్యుపరివర్తిత మొక్కకు ఉదాహరణ?
    1) బంగారు వరి 2) బంగారు వేరుశనగ
    3) బి.టి. పత్తి 4) పైవన్నీ
14. కణజాలవర్ధనం (టిష్యూ కల్చర్) ప్రధానంగా ఏ సూత్రంపై ఆధారపడి పనిచేస్తుంది?
    1) కణ సిద్ధాంతం
    2) సెల్యులార్ టోటిపొటెన్సీ
    3) కణ వంశానుక్రమ సిద్ధాంతం
    4) ఆమ్నిస్ సెల్యులా - ఇ - సెల్యులా
15. 'సెల్యులార్ టోటిపొటెన్సీ' అంటే..?
    1) ఒక కణం క్షయకరణ విభజన చెందగలిగే శక్తి
    2) సరైన నియంత్రణ పరిస్థితుల్లో.. ఆక్సిన్ - సైటోకైనిన్‌లను ఉపయోగించి ప్రకాండ వ్యవస్థను ప్రేరేపించడం
    3) అతి శీతల అభిచర్య జరిపి ఒక మొక్కలో పుష్పోత్పత్తిని ప్రేరేపించడం
    4) అనుకూల పరిస్థితుల్లో కొత్త మొక్కను ఏర్పర్చగలిగే కణం అంతర్గత సామర్థ్యం
16. తొలిసారిగా 'టోటిపొటెన్సీ' అనే పదాన్ని ఉపయోగించినవారు?
    1) మోర్గాన్ 2) స్టీవార్డ్
    3) ముల్లర్ 4) హేబర్ లాండ్
17. 'కణజాలవర్ధన పితామహుడు' ఎవరు?
    1) ఎఫ్.సి. స్టీవార్డ్ 2) మోర్గాన్
    3) హేబర్ లాండ్ 4) ముల్లర్
18. కణజాలవర్ధనంలో యానకం pH విలువ ఏ విధంగా ఉండాలి?
    1) 3.0 - 5.0 2) 7.2 - 8.0
    3) 5.6 - 6.0 4) 6.3 - 7.4
19. కణజాలవర్ధనంలో ఎక్కువగా ఉపయోగించే యానకం ఏది?
    1) B.S. యానకం 2) S.M. యానకం
    3) M.S. యానకం 4) L.S. యానకం
20. మౌలిక (బేసిక్) యానకంలో లోపించేవి?
    1) సూక్ష్మ మూలకాలు 2) విటమిన్‌లు
    3) కార్బొహైడ్రేట్‌లు
    4) వృద్ధి నియంత్రకాలు
21. కణజాలవర్ధనంలో ఏర్పడే 'అవయవ విభేదనం' చెందని కణాల సముదాయాన్ని ఏమంటారు?
    1) కాలస్ 2) కాలోస్
    3) క్లోన్ 4) ఎక్స్‌ప్లాంట్
22. 'సోడియం ఆల్జినేట్'తో రక్షణ కవచాలను ఏర్పర్చి, గుళికలుగా మార్చే నిర్మాణాలను ఏమంటారు?
    1) ప్లాస్మిడ్‌లు 2) ప్లాస్టిడ్‌లు
    3) సంశ్లేషిత/ కృత్రిమ విత్తనాలు
    4) సైటోప్లాస్ట్‌లు
23. జతపరచండి.
    జాబితా - I
    a) సోడియం హైపోక్లోరైట్
    b) మెర్క్యురిక్ క్లోరైడ్
    c) సోడియం ఆల్జినేట్
    d) సాయిల్ రైట్
    జాబితా - II
    i) విత్తనాల ఉపరితలాన్ని సూక్ష్మజీవ రహితం చేయడం
    ii) వర్ధనం చేసిన మొక్కలను నాటడం
    iii) ఎక్స్‌ప్లాంట్‌ను సూక్ష్మజీవరహితం చేయడం
    iv) పిండాలను గుళికలుగా మార్చడం

	a	b	c	d
1)	iii	i	iv	ii
2)	iii	i	ii	iv
3)	iv	ii	iii	i
4)	i	iii	ii	iv

24. జతపరచండి.
    జాబితా - I
    a) సోమాక్లోనల్ వైవిధ్యాలు
    b) సూక్ష్మ వ్యాప్తి
    c) శాఖీయ పిండోత్పత్తి
    d) అక్లిమటైజేషన్ (వాతావరణానుకూలత)
    జాబితా - II
    i) కాలస్ నుంచి పిండాల లాంటి నిర్మాణాల అభివృద్ధి
    ii) కణజాలవర్ధనంలో ఏర్పడిన మొక్క ప్రదర్శించే వైవిధ్యాలు
    iii) కణజాలవర్ధనం ద్వారా పెద్దమొత్తంలో తక్కువ స్థలంలో మొక్కలను ఉత్పత్తి చేయడం
    iv) కణజాలవర్ధనం ద్వారా ఏర్పడిన మొక్కలు వాతావరణ అనుకూలతను ప్రదర్శించడం

	a	b	c	d
1)	ii	iii	iv	i
2)	ii	iii	i	iv
3)	i	ii	iii	iv
4)	ii	i	iii	iv

25. కిందివాటిలో సరైన వరస క్రమం ఏది?
    ఎ) బయోపెస్టిసైడ్ → బాసిల్లస్ థురింజియాన్సిస్ → మాంసం మృదుత్వానికి ఉపయోగపడుతుంది
    బి) బాక్యులో వైరస్ → ఎన్. పి. వి. → ఆర్థ్రోపాడ్ కీటకాలను వ్యాధిగ్రస్థం చేస్తుంది
    సి) వరిలో తైపేయి రకం → గోల్డెన్ రైస్ → విటమిన్-ఎ ను ఉత్పత్తి చేస్తుంది
    డి) బీటీ పత్తి → బీటీ విషపదార్థం → తోళ్లను మెత్తబరుస్తుంది
    1) ఎ, బి 2) సి, డి
    3) బి, సి 4) ఎ, డి
26. జతపరచండి.
    జాబితా - I
    a) బయోఇన్ఫర్మేటిక్స్
    b) బయోరెమిడియేషన్
    c) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
    d) జన్యు థెరపీ
    జాబితా - II
    i) సూక్ష్మజీవులను ఉపయోగించి కాలుష్యాన్ని తొలగించడం
    ii) నేరస్థులను, వ్యక్తి అసలైన తల్లిదండ్రులను గుర్తించడం
    iii) జన్యు సంబంధ వ్యాధుల నిర్ధారణ
    iv) జీవశాస్త్ర అధ్యయనానికి తోడ్పడే సమాచార సాంకేతిక శాస్త్రం

	a	b	c	d
1)	i	ii	iii	iv
2)	iv	i	ii	iii
3)	iv	i	iii	ii
4)	iii	ii	i	iv

సమాధానాలు

1) 3 2) 3 3) 2 4) 1 5) 2 6) 4 7) 3 8) 2 9) 3 10) 2 11) 2 12) 4 13) 4 14) 2 15) 4 16) 1 17) 3 18) 3 19) 3 20) 4 21) 1 22) 3 23) 1 24) 2 25) 3 26) 2

గతంలో అడిగిన ప్రశ్నలు

1. యాంటీబయాటిక్స్‌కు ప్రత్యామ్నాయంగా శాస్త్రవేత్తలు అభివృద్ధి పరచిన నూతన ఔషధం పేరు? (వీఆర్వో-2018)
   1) ఆర్‌బాక్టివ్ 2) డాల్వేన్స్
   3) సిక్సెర్‌ట్రో 4) స్టెఫ్‌ఎఫెక్ట్
2. బెరిబెరి అనే వ్యాధి ఏ విటమిన్ లోపం వల్ల వస్తుంది? (కానిస్టేబుల్-2016)
   1) C 2) D 3) B_1 4) B_5
3. జతపరచండి? (కానిస్టేబుల్-2016)
   జాబితా-1
   ఎ) ఫ్లావర్ - సేవర్ టమాట బి) గోల్డెన్ రైస్
   సి) రౌండ్ అప్ రెడి సోయా చిక్కుడు
   డి) Bt - పత్తి
   జాబితా-2
   i) కీటకాల ప్రతిరోధకత
   ii) గుల్మనాశకుల ప్రతిరోధకత
   iii) ఎక్కువ విటమిన్- A
   iv) పక్వతలో ఆలస్యం
   1) ఎ-iv, బి-iii, సి- i, డి- ii
   2) ఎ-ii, బి-iv, సి- iii, డి- i
   3) ఎ-iv, బి-iii, సి- ii, డి- i
   4) ఎ-ii, బి-iv, సి- i, డి- iii
4. అణు కత్తెరలుగా అభివర్ణించబడే ఎంజైమ్ ఏది? (కానిస్టేబుల్-2016)
   1) డీఎన్ఏ లైగేజ్ 2) డీఎన్ఏ పాలిమరేజ్
   3) రిస్ట్రిక్షన్ ఎండో న్యూక్లియేజ్
   4) రివర్స్ ట్రాన్స్‌క్రిప్టేజ్
5. విపరీతమైన, తీవ్రమైన శ్వాసకోస సిండ్రోమ్ (SARS) దేని వల్ల సంభవిస్తుంది? (హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్-2018)
   1) బాక్టీరియా 2) ఫంగి(శిలీంద్రాలు)
   3) ప్రోటోజోవాలు(ఏక కణ సూక్ష్మజీవులు)
   4) వైరస్
6. జతపరచండి? (ఎస్సై-2018)
   జాబితా-1
   ఎ) మైకాలజీ బి) పేలినాలజీ
   సి) అంకాలజీ డి) పేలియాంటాలజీ
   జాబితా-2
   i) పరాగ రేణువుల అధ్యయనం
   ii) క్యాన్సర్‌కి సంబంధించినది
   iii) శిలాజాల గురించి అధ్యయనం
   iv) శిలీంద్రాల గురించి అధ్యయనం
   1) ఎ-iii, బి-ii, సి- i, డి- iv
   2) ఎ-ii, బి-iii, సి- iv, డి- i
   3) ఎ-iv, బి-i, సి- ii, డి- iii
   4) ఎ-i, బి-ii, సి- iv, డి- iii
7. జతపరచండి? (ఎస్సై-2018)
   జాబితా-1(మొక్క)
   ఎ) బంగాళాదుంప బి) క్యారెట్
   సి) ఆపిల్ డి) కాబేజీ
   జాబితా-2(తిన యోగ్యమైన భాగం)
   i) ఉబ్బిన పుష్పాసనం ii) శాఖీయ మొగ్గ
   iii) రూపాంతరం చెందిన వేరు
   iv) రూపాంతరం చెందిన కాండం
   1) ఎ-iv, బి-iii, సి- i, డి- ii
   2) ఎ-iii, బి-ii, సి- i, డి- iv
   3) ఎ-ii, బి-i, సి- iv, డి- iii
   4) ఎ-ii, బి-iv, సి- i, డి- iii

సమాధానాలు

1) 4 2) 3 3) 3 4) 3 5) 4 6) 3 7) 1

డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్

డీఎన్ఏ అణువులోని నత్రజని క్షారాల వరస క్రమాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి, ఆ డీఎన్ఏ ఇతర ఏ వ్యక్తి డీఎన్ఏతో పోలి ఉంటుందో నిర్ధారించే పరీక్షను 'డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్' అంటారు. ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ యునివర్సిటీకి చెందిన అలెక్ జెఫ్రీస్ 'డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ప్రక్రియ'ను మొదటిసారిగా 1985లో రూపొందించాడు.

ఏ ఇద్దరు వ్యక్తుల డీఎన్ఏ వరస క్రమం కచ్చితంగా ఒకే విధంగా(సమరూప కవలల్లో తప్ప) ఉండదు. అయితే మానవుడి డీఎన్ఏ అణువులో ఉండే 3 బిలియన్ల న్యూక్లియోటైడ్‌లలో 99.9% ఇతర వ్యక్తుల డీఎన్ఏను పోలి ఉంటుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే వ్యక్తిగత వైవిధ్యాలు కేవలం 0.1 శాతం న్యూక్లియోటైడ్‌లలోమాత్రమే ప్రధానంగా కనిపిస్తాయి. ఈ విధంగా ఒక వ్యక్తి డీఎన్ఏలోని న్యూక్లియోటైడ్‌ల వరస క్రమంలోని వైవిధ్యం డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్‌కు మూలాధారం. డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్‌లో 4 రకాల డీఎన్ఏ మార్కర్‌లను ఉపయోగిస్తారు. అవి.. RFLP, VNTR, STR, SNP.

సేకరించే నమూనాలు: నేరం జరిగిన ప్రదేశంలో లభించే రక్తం(ముఖ్యంగా తెల్ల రక్త కణాలు), తల వెంట్రుకల మూలాలు, వీర్యం, యోని స్రావం, చర్మంలోని కొంత భాగం లేదా చాలా కాలం కిందట పూడ్చిపెట్టిన శవం ఎముకల నుంచి డీఎన్ఏను సేకరిస్తారు.

దోషిని గుర్తించే పద్ధతి

సేకరించిన డీఎన్ఏను పీసీఆర్ ప్రక్రియ ద్వారా అనేక వందల రెట్లు పెంచి ఆ నేరానికి సంబంధించిన అనుమానిత వ్యక్తి రక్తం నుంచి సేకరించిన డీఎన్ఏ స్వరూపంతో సరిపోల్చి నేరాన్ని నిర్ధారిస్తారు.

భారత్‌లో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్

మనదేశంలో ఈ పద్ధతిని మొదటిసారిగా ఉపయోగించి, వ్యాప్తిలోకి తెచ్చినవారు సీసీఎంబీ డైరెక్టర్ డా.లాల్జీసింగ్. ఈయన కేరళలోని న్యాయస్థానంలో దాఖలైన అత్యాచార కేసులో దోషిని గుర్తించడంలో ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. ఈ పరీక్ష జరిపే 'సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్' సంస్థను హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఏర్పాటు చేశారు.

అనువర్తనాలు

1. ఫోరెన్సిక్ విశ్లేషణ ద్వారా దొంగలు, హంతకులు, అత్యాచారం చేసినవారిని గుర్తించవచ్చు. తల్లిదండ్రులు - పిల్లల మధ్య ఉన్న రక్త సంబంధాన్ని నిర్ధారించవచ్చు. **2.** అంతరించిపోయే జాతుల సంరక్షణకు దీన్ని ఉపయోగిస్తున్నారు.
3. మెడికో, లీగల్ వివాదాల పరిష్కారాల్లో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ ద్వారా మాతృత్వం, పితృత్వాన్ని కచ్చితంగా కనుక్కోవచ్చు.
4. జంతువులు, మానవుల వర్గ వికాస చరిత్రను తెలుసుకోవచ్చు.

మొక్కలకు చాలా అవసరమైన మూలకం ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

మొక్కలు, జంతువుల సరైన పెరుగుదలకు నత్రజని అత్యంత ఆవశ్యక మూలకం. ప్రోటీన్ల నిర్మాణంలో ముఖ్యమైన మూలకం నైట్రోజన్. ఉగ్రవాదులు వాడే విస్ఫోటనకారుల్లోనూ నైట్రోజన్ ప్రముఖంగా ఉంటుంది. మెరుపులు, ధ్వని వేగం కంటే అధిక వేగంతో ప్రయాణించే సూపర్ సోనిక్ జెట్ విమానాల వల్ల నైట్రిక్ ఆక్సైడ్ వాతావరణంలోకి చేరుతుంది. ఇది 'ఓజోన్' పొరను క్షీణింపజేస్తుంది.



నత్రజని (Nitrogen)

గాలిలో సుమారు 80 శాతం నైట్రోజన్ ఉంటుంది. ఇది ఆక్సిజన్‌కు విలీనకారిగా పనిచేస్తుంది. మొక్కలు, జంతువులు వాతావరణంలోని నత్రజని వాయువును నేరుగా శోషించుకోలేవు. మొక్కలు నైట్రోజన్‌ను అమ్మోనియం లేదా నైట్రేట్ లవణాల రూపంలో భూమి పై పొరల నుంచి గ్రహిస్తాయి.

* **నత్రజని స్థాపన:** వాతావరణంలోని నైట్రోజన్ వాయువును మొక్కలకు ఉపయోగపడే అమ్మోనియం, నైట్రేట్ లవణాలుగా మార్చడాన్ని 'నైట్రోజన్ స్థాపన' అంటారు. ఇలా నైట్రేట్‌లుగా మార్చిన నైట్రోజన్‌ను మొక్కలు వేర్ల ద్వారా గ్రహించి ప్రోటీన్లను (పప్పు దినుసులు) తయారు చేస్తాయి. మేఘాల రాపిడి వల్ల మెరుపులు ఏర్పడినప్పుడు వాతావరణంలోని నైట్రోజన్, ఆక్సిజన్ వాయువులు కలిసి నైట్రిక్ ఆక్సైడ్‌ను ఏర్పరుస్తాయి. నైట్రిక్ ఆక్సైడ్ గాలిలోని ఆక్సిజన్‌తో చర్యనొంది నైట్రోజన్ డై ఆక్సైడ్‌ను ఇస్తుంది. ఇది నీటిలో కరిగి నైట్రికామ్లాన్ని ఏర్పరుస్తుంది. ఇలా ఏర్పడిన నైట్రికామ్లం భూమిని చేరి, భూమిలోని సోడియం, పొటాషియం, కాల్షియం తదితర లోహాలతో చర్య జరిపి వాటి నైట్రేట్లను ఏర్పరుస్తుంది.

హేబర్ పద్ధతి ద్వారా పారిశ్రామికంగా, వాతావరణంలోని నైట్రోజన్ వాయువును అమ్మోనియాగా మారుస్తారు. అమ్మోనియాను నైట్రికామ్లం తయారీలో వినియోగిస్తారు. ఇది నైట్రేట్ ఎరువుల ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.

బఠానీ, చిక్కుడు లాంటి 'లెగ్యుమినేసి' జాతి మొక్కల వేరుబుడిపెల్లో వాతావరణంలోని నైట్రోజన్‌ను.. నైట్రోజన్ సమ్మేళనాలుగా స్థిరీకరించగలిగే ప్రత్యేక రకమైన 'సహజీవన (Symbiotic)' బ్యాక్టీరియా ఉంటుంది.

* **నైట్రోజన్ వలయం:** వాతావరణంలోని నైట్రోజన్ వివిధ ప్రక్రియల ద్వారా భూమిని, దాని ద్వారా మొక్కలను చేరడం.. తిరిగి వాతావరణంలోకి చేరడం ఒక చక్రీయ క్రమంలో జరుగుతుంది. దీన్నే 'నైట్రోజన్ వలయం' అంటారు.

మెరుపులు, ఆమ్ల వర్షాలు, సహజీవన బ్యాక్టీరియా ద్వారా నైట్రోజన్ భూమిలోకి, అక్కడి నుంచి మొక్కలను చేరుతుంది. మొక్కలు, జంతువుల్లో ఉండే అత్యంత సంక్లిష్టమైన ప్రోటీన్లు (మాంసకృత్తులు) మొదట యూరియాగా.. చివరగా అమ్మోనియం లవణాలుగా మారుతాయి.

చనిపోయిన వృక్ష, జంతు కళేబరాలు, వాటి వ్యర్థ పదార్థాలు 'అమ్మోనిఫైయింగ్ బ్యాక్టీరియా' వల్ల అమ్మోనియా, అమ్మోనియం లవణాలుగా నిక్షిప్తమవుతాయి. వీటిలో కొంత భాగం 'నైట్రసోఫైయింగ్ బ్యాక్టీరియా' వల్ల నైట్రేట్లుగా మారుతుంది.

డీనైట్రిఫైయింగ్ బ్యాక్టీరియా అమ్మోనియం లవణాలను తిరిగి నైట్రోజన్‌గా మార్పు చెందిస్తుంది. ఈవిధంగా ఏర్పడిన నైట్రోజన్ వాతావరణంలోకి చేరుతుంది. తద్వారా వాతావరణంలో నైట్రోజన్ శాతం స్థిరంగా ఉంటుంది.

నైట్రోజన్ - ముఖ్యమైన అంశాలు

- నైట్రస్ ఆక్సైడ్ అనేది నైట్రోజన్ తటస్థ ఆక్సైడ్. దీన్నే 'లాఫింగ్ గ్యాస్' అంటారు.
- అమ్మోనియాను ఐస్ తయారీలో శీతలీకరణిగా ఉపయోగిస్తారు.
- ఓజోన్‌తో పాటు నైట్రిక్ ఆక్సైడ్, పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్లు (PAN) కాంతి రసాయన స్మాగ్‌కు కారణమవుతాయి. పొగ మంచు ఏర్పడినప్పుడు కళ్లలో మంటకు కారణం ఈ రసాయనమే.
- నైట్రేట్ల ఉనికిని 'బ్రౌన్ వలయ పరీక్ష' ద్వారా గుర్తిస్తారు.
- నైట్రోజన్ –210.5°C వద్ద ఘన పదార్థంగా మారుతుంది.
- నైట్రో గ్లిజరిన్, TNT, సెల్యూలోజ్ నైట్రేట్, అమ్మోనియం నైట్రేట్లు పేలుడు పదార్థాలు.
- 'అమ్మోటాల్' అనేది అమ్మోనియం నైట్రేట్, TNTల మిశ్రమం. అమ్మోనియం క్లోరైడ్, అల్యూమినియం పొడిల మిశ్రమం 'అమ్మోనాల్'. ఈ రెండూ పేలుడు పదార్థాలే.
- సల్ఫర్, బొగ్గుపొడి, పొటాషియం నైట్రేట్‌ల మిశ్రమం గన్ పౌడర్.
- పొటాషియం నైట్రేట్ (KNO_3)ని వేడి చేస్తే ఆక్సిజన్ విడుదలవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. నవ్వు పుట్టించే వాయువు ఏది? (గ్రూప్-1, 2012)
   1) నైట్రిక్ ఆక్సైడ్ 2) నైట్రోజన్ పెరాక్సైడ్
   3) నైట్రస్ ఆక్సైడ్
   4) నైట్రోజన్ పెంటాక్సైడ్
2. కృత్రిమ గర్భోత్పత్తికి ఉపయోగించే రేతస్సును ఎందులో భద్రపరుస్తారు? (గ్రూప్-2, 2005)
   1) ద్రవ నత్రజని 2) మంచుగడ్డ
   3) ద్రవ ఆక్సిజన్
   4) ద్రవ కార్బన్ డై ఆక్సైడ్
3. గన్‌కాటన్ పేరుతో పిలిచే శక్తివంతమైన విస్ఫోటనకారి ఏది? (గ్రూప్-1, 2012)
   1) పొటాషియం క్లోరేట్
   2) సెల్యూలోజ్ నైట్రేట్
   3) పొటాషియం నైట్రేట్
   4) సెల్యూలోజ్ ఎసిటేట్

సమాధానాలు: 1) 3; 2) 1; 3) 2.

మాదిరి ప్రశ్నలు

1. గాలిలో అయిదింట ఒక వంతు ఆక్సిజన్ ఉంటే మిగిలిన నాలుగు భాగాలు ఉండే వాయువు ఏది?
   1) హైడ్రోజన్ 2) కార్బన్ డై ఆక్సైడ్
   3) నైట్రోజన్ 4) హీలియం
2. కిందివాటిలో నత్రజని స్థాపన చేయగలిగే మొక్క ఏది?
   I. వెదురు II. బఠానీ
   III. చిక్కుడు IV. వరి
   1) I, IV 2) II, III
   3) I, II4) పైవన్నీ
3. వీర్యాన్ని ఎందులో నిల్వ చేస్తారు?
   1) ద్రవ హైడ్రోజన్ 2) పొడిమంచు
   3) ద్రవ హీలియం 4) ద్రవ నైట్రోజన్
4. నత్రజని సమ్మేళనాలను నైట్రోజన్‌గా మార్చే బ్యాక్టీరియా ఏది?
   1) డీనైట్రిఫైయింగ్ బ్యాక్టీరియా
   2) సహజీవన బ్యాక్టీరియా
   3) సాల్మొనెల్లా 4) నైట్రిఫైయింగ్
5. భూమిలో నైట్రోజన్‌ను స్థాపించే బ్యాక్టీరియా ఏది?
   1) సాల్మొనెల్లా 2) ఇ-కొలై
   3) సహజీవన బ్యాక్టీరియా
   4) నైట్రసోఫైయింగ్ బ్యాక్టీరియా
6. పేలుడు పదార్థమైన అమ్మోనాల్ వేటి మిశ్రమం?
   I. అమ్మోనియం క్లోరైడ్
   II. అల్యూమినియం పొడి
   III. టీఎన్‌టీ IV. పిక్రికామ్లం
   1) I, II 2) I, III
   3) III, IV 4) II, III
7. డ్రై సెల్‌లో ఎలక్ట్రోలైట్ ఏది?
   1) అమ్మోనియం క్లోరైడ్ (NH_4Cl)
   2) అమ్మోనియం నైట్రేట్ (NH_4NO_3)
   3) యూరియా
   4) కాల్షియం సయనమైడ్
8. లెగ్యుమినేసి మొక్కల వేరుబుడిపెల్లో ఉండే సహజీవన బ్యాక్టీరియా ఏది?
   1) రైజోబియం 2) సాల్మొనెల్లా
   3) అమ్మోనోబియం
   4) అమ్మోనిఫైయింగ్ బ్యాక్టీరియా
9. మొక్కలు, జంతువుల సరైన పెరుగుదలకు అవసరమయ్యే ముఖ్యమైన మూలకం?
   1) హైడ్రోజన్ 2) కార్బన్
   3) నైట్రోజన్ 4) ఆక్సిజన్
10. ద్రవ నైట్రోజన్‌తో పొందగలిగే ఉష్ణోగ్రత?
    1) 0°C (273 K)
    2) –4°C (269 K)
    3) –196°C (177 K)
    4) –273°C (0 K)
11. కిందివాటిలో ఉత్పతనం చెందే సమ్మేళనం?
    1) యూరియా 2) అమ్మోనియం క్లోరైడ్
    3) పొటాషియం నైట్రేట్
    4) టీఎన్‌టీ
12. మొక్కలకు చాలా అవసరమైన మూలకం ఏది?
    1) నైట్రోజన్ 2) కార్బన్
    3) క్లోరిన్ 4) పొటాషియం
13. కోడి ఈకలను కాల్చినప్పుడు వెలువడే వాయువు ఏది?
    1) నైట్రోజన్ 2) అమ్మోనియా
    3) ఆక్సిజన్ 4) హైడ్రోజన్
14. ఎరువుల గుట్ట నుంచి గాఢమైన (ఘాటైన) వాసనకు కారణమయ్యే వాయువు ఏది?
    1) అమ్మోనియా 2) హైడ్రోజన్ సల్ఫైడ్
    3) నైట్రస్ ఆక్సైడ్ 4) నైట్రిక్ ఆక్సైడ్
15. స్పృహతప్పిన మనిషికి స్పృహ తెప్పించడానికి ఉపయోగించే అమ్మోనియం లవణం (స్మెల్లింగ్ సాల్ట్) రసాయన నామం?
    1) అమ్మోనియం కార్బొనేట్
    2) అమ్మోనియం నైట్రేట్
    3) అమ్మోనియం సల్ఫేట్
    4) అమ్మోనియం క్లోరైడ్
16. కిందివాటిలో ఆమ్ల వర్షానికి కారణమైనవి?
    I. నైట్రోజన్ ఆక్సైడ్‌లు
    II. సల్ఫర్ ఆక్సైడ్‌లు
    III. ఫాస్ఫరస్ ఆక్సైడ్‌లు
    1) I మాత్రమే 2) I, II మాత్రమే
    3) III మాత్రమే 4) I, II, III

సమాధానాలు

1) 3; 2) 2; 3) 4; 4) 1;
5) 3; 6) 1; 7) 1; 8) 1;
9) 3; 10) 3; 11) 2; 12) 1;
13) 2; 14) 1; 15) 4; 16) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో మేనేజీరియల్ పోస్టులు

మాల్పే (కర్ణాటక) లోని ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో మేనేజిరియల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 05.

పోస్టుల వివరాలు: అసిస్టెంట్ జనరల్-01, మేనేజర్-01, డిప్యూటీ మేనేజర్(మెషినరీ ఔట్‌ఫిట్)-01, డిప్యూటీ మేనేజర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్)-01, డిప్యూటీ మేనేజర్(హల్)-01.

అర్హత: 60% మార్కులతో సంబంధిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 31.01.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: పవర్ పాయింట్ ప్రజెంటేషన్, పని అనుభవం, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.01.2025.

వెబ్‌సైట్: https://cochinshipyard.in/

సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ, హైదరాబాద్‌లో ఉద్యోగాలు

హైదరాబాద్ ఉప్పల్‌లోని సీఎస్ఐఆర్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌జీఆర్ఐ).. జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టుల సంఖ్య: 04.

అర్హత: పోస్టును అనుసరించి 10+2/ఇంటర్ లేదా తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి.

వయసు: కనీస వయసు జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 27 ఏళ్లు, ఎస్టీ అభ్యర్థులకు 32 ఏళ్లు ఉండాలి.

వేతనం: నెలకు రూ.52,100.

ఎంపిక విధానం: రాతపరీక్ష, ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.01.2025.

వెబ్‌సైట్: https://www.ngri.res.in

No healthier than do people exercising

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Halt an escalation of current tensions (1)/ and preventing mass atrocities from happening in Sudan again will require (2)/ cutting off the goods and services that combatants need (3)/ to perpetrate further violence. (4)/ No error (5)
2. Acquiring material wealth or rejecting its attractions (1)/ has often been (2)/ the base upon which writers (3)/ had developed interesting plots. (4)/ No error (5)
3. Science plays a significant role (1)/ in the origin of superhero stories precisely because (2)/ that stories are really an extension (3)/ of science fiction as a genre. (4)/ No error (5)
4. The article on the subject of Colombian drug lords (1)/ published in The Economist this morning neither alludes nor specifically describes (2)/ the methods that the police employ (3)/ in the fight against crime. (4)/ No error (5)
5. During the alumni meet, (1)/ the old students reflected (2)/ on the time (3)/ they have spent in college. (4)/ No error (5)

Directions (Q.No. 6- 8): Choose the set of words which are closest in meaning to the word provided.

6. Generic
   1) general, basic
   2) cheap, vital 3) fresh, pure
   4) elderly, cheaply
   5) standard, novice
7. Educe
   1) demand, stipulate
   2) elicit, extract
   3) ideal, idyllic
   4) unlawful, illicit
   5) prohibit, proscribe
8. Appall
   1) delirious, rambling
   2) covered, exposed
   3) dismay, consternation
   4) confuse, scandalize
   5) perplex, doubt

Directions (Q.No.9- 10): Choose the set of words which are opposite in meaning from the five options given in each question.

9. 1) rotund, plump
   2) brazen, defiant
   3) pique, soothe
   4) peaked, ruddy
   5) nadir, apex
10. 1) supercilious, meek
    2) approbate, sanction
    3) demur, hesitate
    4) fatuous, foolish
    5) quiescent, repose

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Foods that are rich in salt, likes potato chip, cheese and sauces contain high level of sodium levels that may lead to heart attacks and stroke.
    1) liked potato chip, cheese and sauces
    2) like potato chips, cheese and sauce
    3) like potato chips, cheese and sauces
    4) like potato chip, cheeses and sauce
    5) No correction required
12. Poor reading skills among students of inner-city schools have not resulted from failures in teaching but insufficiently supportive home environments.
    1) resulted not from failures in teaching but from
    2) resulted from failures not in teaching but
    3) resulted from failures not in teaching but have stemmed from
    4) resulted not from failures in teaching but have stemmed from
    5) No correction required
13. In a recent survey, *Physical Fitness Weekly* found that people exercising daily consider themselves no healthier than do people exercising three to five times a week.
    1) not any healthier than do people exercising
    2) not any healthier than do people who exercise
    3) no healthier than are people who are exercising
    4) not as healthy as are people who exercise
    5) No correction required
14. Many people discover a need for glasses in middle age, a consequence from sitting too close to the television screen for long periods of time.
    1) of sitting too close
    2) which resulted from sitting too close
    3) damaged from sitting too near
    4) damaged because they sat too close to
    5) No correction required
15. At one stage it appeared as if Indians will lost the match against Hongkong.
    1) will be losing the match
    2) will lost a match
    3) would lose the match
    4) would be losing the match
    5) No correction required

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Shortages of canned food in the British Army in 1917 led to the government issuing cigarettes and amphetamines to soldiers to suppress their appetites.

B) But by 1916, widespread boredom with cheap canned food amongst soldiers resulted in militaries purchasing better-quality food to improve morale and the complete meals in a can began to appear.

C) Demand for canned food skyrocketed during World War I, as military commanders sought vast quantities of cheap, high-calorie food to feed their millions of soldiers, which could be transported safely, survive trench conditions, and not spoil in transport.

D) After the war, companies that had supplied military canned food improved the quality of their goods for civilian sale.

E) Throughout the war, soldiers generally subsisted on low-quality canned foodstuffs, such as the British "Bully Beef" (cheap corned beef), pork and beans, canned sausages, and Maconochies Irish Stew.

F) In 1917, the French Army began issuing canned French cuisine, such as coq au vin, Beef Bourguignon and Vichyssoise while the Italian Army experimented with canned ravioli, spaghetti bolognese, Minestrone and Pasta e fagioli.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) F

Directions (Q.No. 21-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Residents can donate clothes, house hold items and other goods to the ____ store. The store then sells them and donates the amount to ____.
    1) Thrift, charities
    2) waft, aid 3) fluster, gifts
    4) heterogeneous, relievers
    5) assorted, donations
22. Everything about S. Russell Groves is just so, from his style of dress to his choice of words; nothing is ____.
    1) Lumber 2) superfluous
    3) garner 4) renovate
    5) encumber
23. The MLA was charged with criminal attempt to ____ a minor and criminal attempt to ____ the morals of a minor on Thursday.
    1) Entice, impair
    2) ambidextrous, blight
    3) ostentation, prejudice
    4) qualm, weaken
    5) worse, impeach
24. In order to consistently prevail you must be agreeable, amenable, and ____. These characteristics make it possible to gain trust, show compromise, and___deals.
    1) Contrite, reform
    2) malleable, restructure
    3) frenetic, simplify
    4) impugned, adjust
    5) remorseful, sort
25. There is a buzz about the sudden death of one of the artists, which cast a ____ on the opening ceremonies, ____, briefly.
    1) Attraction, though
    2) wither, although
    3) pall, albeit
    4) gloom, notwithstanding
    5) shadow, almost

Directions (Q.No. 26-35): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Cloud seeding is a type of weather modification that ____ (26) to change the amount or type of precipitation that falls from clouds by dispersing substances ____(27) the air that serve as cloud condensation or ice nuclei, which alter the microphysical processes within the cloud. The usual intent is to increase precipitation (rain or snow), but hail and fog suppression ____ (28) also widely practiced in airports, where harsh weather conditions are experienced. Cloud seeding over Kosciuszko National Park-a biosphere reserve-is problematic in that several rapid changes of environmental legislation ____ (29) made to enable the trial. Environmentalists are concerned ____ (30) the uptake of elemental silver in a highly sensitive environment affecting the pygmy possum ____ (31) other species as well as recent high level algal blooms in ____ (32) pristine glacial lakes. Research 50 years ____ (33) and analysis by the former Snowy Mountains Authority led to the cessation of the cloud seeding program in the 1950s with non-definitive results. Formerly, cloud seeding was rejected in Australia on environmental grounds ____ (34) of concerns about the protected species, the pygmy possum. Since silver iodide and not elemental silver is the cloud seeding material, the claims of negative environmental impact are disputed ____ (35) peer-reviewed research as summarized by the international Weather Modification Association.

26. 1) aim 2) aimed
    3) aims 4) was aimed 5) is aimed
27. 1) into 2) in 3) on
    4) along 5) among
28. 1) has 2) was 3) are
    4) is 5) had
29. 1) was 2) were 3) being
    4) been 5) has been
30. 1) during 2) from 3) for
    4) about 5) into
31. 1) through 2) between
    3) along 4) of course 5) among
32. 1) ones 2) once 3) prior
    4) farmer 5) early
33. 1) ahead 2) after 3) former
    4) ago 5) pristine
34. 1) because 2) as 3) when
    4) while 5) though
35. 1) with 2) from 3) froth
    4) for 5) by

KEY

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 1	7) 2	8) 3	9) 3	10) 1
11) 3	12) 2	13) 5	14) 1	15) 3
16) 5	17) 2	18) 4	19) 3	20) 4
21) 1	22) 2	23) 1	24) 2	25) 3
26) 3	27) 1	28) 3	29) 2	30) 4
31) 5	32) 2	33) 4	34) 1	35) 5